

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి : 35 సంచిక : 2

జనవరి-ఫిబ్రవరి 2012

వెల : రు 30 (290) పేజీలు : 100

సాయుధ బలగాల బీభత్సకాండ దృశ్యాలు

ప్రజలపై పాలకవర్గాల అన్యాయమైన యుద్ధాన్ని ప్రతిఘటిద్దాం !!

తెలంగాణపై నిర్బంధానికి వ్యతిరేకంగా జనవరి 9న జరిగిన బహిరంగ సభ దృశ్యాలు



(గుంటూరులో జరిగిన కామ్రేడ్ సూర్యం సంస్మరణ సభ దృశ్యాలు - రిపోర్టు గత సంచికలో వచ్చింది)

ఆర్.ఎస్.రావు సిద్ధాంత కృషిపై ఫిబ్రవరి 12న జరిగిన సదస్సు దృశ్యాలు

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

290 సంపుటి : 35 ◆ సంచిక : 2 ◆ జనవరి - ఫిబ్రవరి, 20112

సంపాదక లేఖ...

యాన్ మిర్దాల్ స్వీడన్‌కు చెందిన మార్క్సిస్టు మేధావి, జర్నలిస్టు. అరవై సంవత్సరాలకు పైగా రచయితగా, పత్రికా రచయితగా ఉన్నారు. అనేక దేశాలు పర్యటించారు. ఆయన 1950లలో కొద్ది కాలం ఢిల్లీలో ఉన్నారు. 1980లలో నక్సలైట్ ఉద్యమాన్ని పరిశీలిస్తూ దేశవ్యాప్తంగా పర్యటించారు. ఆ ప్రత్యామ్నాయ ఉద్యమం గురించి తన పరిశీలనలను 'ఇండియా వెయిట్స్' పుస్తకంలో వెలువరించారు. 2010 తొలి భాగంలో ఆయన దండకారణ్యానికి వెళ్ళి అక్కడి విప్లవోద్యమంతోనూ, అక్కడి జనతన సర్కార్‌లలో భాగమై ప్రత్యామ్నాయ చరిత్రను నిర్మాణం చేస్తున్న ఆదివాసులతోనూ సంభాషించారు. ఆ అనుభవాలకు, పరిశీలనలకు తన విశ్లేషణలు జోడించి 'రెడ్‌స్టార్ ఓవర్ ఇండియా' పుస్తకాన్ని రాశారు. 84 ఏళ్ళ వయస్సులోనూ అలుపెరుగని తన లక్ష్య శుద్ధిని చాటుతూ విప్లవోద్యమానికి మద్దతుగా, కార్మికవర్గ అంతర్జాతీయ స్ఫూర్తిని వ్యక్తం చేస్తూ గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటీ ఫిబ్రవరి 1న ఏర్పాటు చేసిన తన పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్నారు. భారతదేశంలో కొనసాగుతోన్న మావోయిస్టు ఉద్యమంతో తాను ఎంతో ప్రేరణను పొందినట్లు తెలియజేసారు. ఫిబ్రవరి 3న విరసం ఏర్పాటు చేసిన 'ఆదివాసీల జీవితం, పోరాటం - బుద్ధిజీవుల పాత్ర' అనే అంశంపై చర్చాగోష్ఠిలోనూ పాల్గొన్నారు. భారతదేశంలో కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమ వెలుగులు కేవలం భారత దేశానికే కాదనీ, యావత్ ప్రపంచానికే ఆ ఉద్యమం తన వెలుగులు పంచనున్నదని తన ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా 'ఏ సమాజాన్నయినా అర్థం చేసుకోవాలంటే ఆ సమాజ అట్టడుగు పొరల్లో జీవిస్తున్న ప్రజలను చదవాల'ని అన్న గోర్కీ మాటలు గుర్తుచేసారు. మావోయిస్టు ఉద్యమం ప్రజల్లో ఉన్న సున్నితమైన వైరుధ్యాలను అర్థం చేసుకొని వారితో అంతే సున్నితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రజలతో వారు వ్యవహరించే తీరు అధికారంతో కూడినది కాదని, గొప్ప స్నేహంతోనూ, సమానత్వ భావనలతోనూ కూడుకొని ఉందని అన్నారు. ఆ ఉద్యమంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాల్ని తిప్పి కొట్టాల్సిన అవసరం చాలా ఉందని అన్నారు. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులని సాగుతున్న ప్రచారం పెద్ద అబద్ధమని, నిజమైన ప్రత్యామ్నాయ అభివృద్ధి వారి నాయకత్వంలోని ఆదివాసీలు చేపట్టారని అన్నారు. ఇవాళ ఉద్యమ పక్షాన, అట్టడుగు వర్గాల పక్షాన, ఆదివాసీల పక్షాన నిలబడి పోరాడడమే బుద్ధిజీవుల, మేధావుల బాధ్యత అని ఆయన అన్నారు. ఉద్యమం విశాల ఐక్యతను, విస్తృత సంఘీభావాన్ని కూడగట్టాల్సి ఉందని అన్నారు. స్థానికంగానూ, దేశవిదేశాల్లోనూ మద్దతునూ, సంఘీభావాన్ని పెద్ద ఎత్తున కూడ గట్టకపోతే రాజ్యం తన బలంతో, క్రూర అణచివేత పద్ధతులతో ఉద్యమాన్ని అన్ని విధాల అణచివేసే ప్రమాదం ఉందని అన్నారు.

ఆదివాసీలను వెన్నంటి ఉన్న విప్లవోద్యమం - 'రాజ్యం ప్రకటించిన గ్రీన్ హంట్ యుద్ధాన్ని ఇప్పుడే, ఇక్కడే... అతి ప్రాచీన మానవ సమాజాలు నివసిస్తున్న, గొప్ప సాంస్కృతిక, పోరాట వారసత్వం గల ఆదివాసీ ప్రాంతాల్లోనే అడ్డుకోకపోతే, ఇప్పుడే గట్టిగా గొంతు విప్పకపోతే, ఈ గ్రీన్‌హంట్ దాడిని వెంటనే ఆపాలని నినదించకపోతే మన దేశాన్ని, మన సహజ సంపదల్ని మనం రక్షించుకోలేం. ఇది ఒక మాడ్ ప్రాంతంలో బతికే అనామక ఆదివాసుల అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు, మొత్తంగా దేశ భవిష్యత్తుతో ముడిపడిన ప్రశ్న కూడా. ఆదివాసీలు, అట్టడుగు వర్గాల ప్రజలు తమ చెమటనెత్తుర్లతో నిర్మించుకుంటున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు చేతులు చాచి ఆహ్వానం పలకండి. దానిని కాపాడడానికి మీ చేతుల్ని కూడా అడ్డం పెట్టండి' అని కోరుతోంది.

ఈ సందర్భాన్ని ఇదే కాలంలో చోటుచేసుకున్న అనేక పరిణామాలతో పోల్చి చూసుకుంటే బుద్ధిజీవుల, మేధావుల, ప్రజాస్వామిక వాదుల బాధ్యత మరింత పెరిగిపోయింది. చాల అప్రమత్తతో వ్యవహరించాల్సిన తరుణమిది. 'రచయితలారా మీరెటువైపు' అన్న ప్రశ్నను నిరంతరం మనసున పెట్టుకొని వ్యవహరించాల్సిన సంక్లిష్టమైన సందర్భం ఇది. జైపూర్ లిటరరీ ఫెస్టివల్ కావచ్చు, ప్రపంచ తెలుగు మహా సభలు కావచ్చు - వేదాంత, ఎస్సార్, పోస్కోలతో మొదలు పెట్టి రాంకి, జి.ఎం.ఆర్. వంటి అనేక కార్పోరేట్ సంస్థలు 'సాహిత్య సేవ'కు పూనుకుంటున్నాయి. సామ్రాజ్యవాద పెట్టుబడి అంతటా పరచుకొని తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది. మనం చాలా అప్రమత్తంగా మన అక్షరాలని కాపాడుకోవాల్సి ఉంది. ఆ అక్షరాలు ప్రజాపక్షంగా మాత్రమే నిలిచేలా, నినదించేలా, దారి చూపేలా నిబద్ధతను చాటాల్సి ఉంది. జాగురుకత వహించాల్సి ఉంది. ☆అ

సంపాదకుడు
చలసాని ప్రసాద్

వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామకృష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500040
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
* ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com
కూ రచనలు పంపవచ్చు

కొరియర్, రిజిస్టర్డ్ పోస్ట్ ల ద్వారా
రచనలు పంపితే...
టి. కృష్ణాబాయి
9-19-3, సి.బి.ఎం. కాంపౌండ్
విశాఖపట్నం - 530 003

చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360
సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా
పాణి
50-348, L 19 B II,
అరోరా నగర్, బి క్యాంప్, కర్నూల్ - 2

ఈ సంచిక వెల : రు. 30

ఈ సంచికలో...

సంపాదకీయం (5 - 6)
విశ్వాసాల విధ్వంసం - పాణి

నడుస్తున్న చరిత్ర (6 - 11)
దండకారణ్య మహిళా ఉద్యమకారులపై
పాశవిక దాడులు - వీరోచిత ప్రతిఘటన - అమన్

వ్యాసం (12 - 14)
పెట్టుబడి - ప్రకృతి - సమాజం - పి. వరలక్ష్మి

సందర్భం (15 -17)
రాజ్యహింసకు వ్యతిరేకంగా మార్చి 8ని ఎక్కుపెడుదాం!
- మిడ్కో

సీరియల్ (18 - 19)
సూర్యుడు - కె.వి. కూర్మనాథ్

వ్యాసం (20 - 22)
జల్ జమీన్ జంగల్‌మహల్ లాల్‌గడ్ - ఊ.సా.

కరపత్రం (23 - 25)
తెలంగాణ సకల జనుల సమ్మె... - విరసం

రిపోర్ట్ (26 - 26)
తెలంగాణపై నిర్బంధానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం
- చంద్రయ్య

రిపోర్ట్ (27 - 29)
కామ్రేడ్ ఆర్‌ఎస్‌రావు సిద్ధాంత కృషిపై విశ్లేషణా సదస్సు
- పి. వరలక్ష్మి

వ్యాసం (29 - 37)
అభివృద్ధి అంటే? - ముదునూరి భారతి

వ్యాసం (37 - 41)
ఆర్.ఎస్.రావుగారి తియ్యని జ్ఞాపకంలో... - డా. జి.బి.నాథ్

వ్యాసం (42 - 45)
అర్ధ భూస్వామ్య, అర్ధ వలస చట్రాన్ని అర్థం
చేసుకోవడానికి ఒక చిన్న ప్రయత్నం - పంకజ్ దత్

రిపోర్ట్ (46 - 47)
యాన్ మిర్డాల్‌తో చర్చాగోష్ఠి - కూర్మనాథ్

పుస్తక సమీక్ష (47- 49)
ముస్లిం స్త్రీల జీవిత పోరును చిత్రీకరించిన - 'పెహచాన్'
- మిడ్కో

లేఖ (50 - 52)
జైలు నుంచి దండకారణ్యానికి - రవి

కవిత్వం (52 - 63)
వేచి ఉండు; మా బడి - ఎం. రాఘవాచారి;
చైతన్య ప్రకాశ్ నాలుగు కవితలు - ఉక్కు నమ్మకాలపై ఉక్కు
పాదం; తెలంగాణ - ఒక చెరుకు సుధాకర్; మనకు మనమే;
నడక; సహచరి కవితలు రెండు - అమ్మా... ఆ శోకం నీది
కాదు!; అమరుల స్థూపం...; వాలుతున్న పొద్దు - మేడక
యుగంధరరావు; బంధు మిత్రుల స్మృతి -ఎస్.ఎస్.ఆర్.;
మల్లోజుల కోటేశ్వరన్నా - బల్ల సరస్వతి;
కవి ఇంకా జీవించే ఉన్నాడహో...! - జనజ్వాల;
మహమూద్ రెండు కవితలు - ఆకలి కుట్ర; జనని
మహమూద్ - నాలుగు పిట్టలు;

రిపోర్ట్ (64 - 75)
అనంతపురం కథావర్క్‌షాప్ విశేషాలు - పి. వరలక్ష్మి

పరిచయం (76 - 80)
వాస్తవికత, మనోవిశ్లేషణల మేలు కలయిక
లేర్మంతోవ్ నవల మనకాలం వీరుడు!
- ఎన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు

పుస్తక పరిచయం (80 - 81)
గతితార్కిక భౌతికవాదం - ఐరా గొలోబిన్.

కథలు (82 - 98)
శిక్ష - మిడ్కో
నిరీమిల - యామిని
చైతే - ఎన్.డి.

పెరిగిన ధరల వలన అరుణతార ఖర్చు కూడా చాలా పెరిగిపోయింది. తప్పని పరిస్థితిల్లో
అరుణతార విడి ప్రతి ధర అలాగే సంవత్సర చందా, దశాబ్ది చందాల ధరలు పెంచక తప్పడం లేదు.
ఎప్పటిలానే మీ హార్దిక, ఆర్థిక సహకారాలు మాకు అందిస్తారని ఆశిస్తున్నాం.
విడి సంచిక వెల : రు. 15; సంవత్సర చందా : రు. 160; దశాబ్ది చందా : రు. 1500

మొదటి కవర్ : దండకారణ్యంలో విధ్వంసం; **రెండవ కవర్ :** తెలంగాణపై నిర్బంధానికి వ్యతిరేకంగా సభ దృశ్యాలు, ఆర్.ఎస్. రావు సిద్ధాంత కృషిపై సదస్సు దృశ్యాలు; **ఫొటోలు :** పావని, రాంకి, భాస్కర్, తదితరులు

విశ్వాసాల విధ్వంసం

- పాణి

తెలుగు సాహిత్యంలో ధిక్కార పతాకాలెన్నో ఎగురుతున్న ఈ సమయంలో సాహిత్యకారుల గురించి మాట్లాడుకోవలసి రావడం విషాదమే. అయినా తప్పదు. చెప్పాల్సిన మాట చెప్పకపోవడం కూడా నేరమే. రాద్ధాంతమనిపించినా చెప్పక తప్పదు. సాహిత్యంలో కనిపించే ధిక్కారం సాహిత్యకారుల్లో పలుచన కావడం కంటే సంక్షోభం ఏమున్నది? సాహిత్యమంటే ధిక్కారమనీ, రచయిత అంటే నిత్య అసమ్మతిదారు అనీ చాలా మంది చెప్పారు. రచనలో వ్యవస్థపట్ల, దాని రీతి రివాజులపట్ల కనిపిస్తున్న అసమ్మతి రచయితల్లో లేకపోవడం బహుశా మన సమాజం ఎదుర్కొంటున్న సంక్షోభానికి నిదర్శనం కావచ్చు.

జనవరి మొదటివారంలో ఒంగోలులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన రచయితలు, కవులు తమనుతాము ఈ విషయంలో ప్రశ్నించుకోవలసి ఉన్నది. సకల వ్యవస్థలను ప్రశ్నిస్తున్న రచయితలు కూడా ప్రశ్నలకు అతీతమేంకాదు. ఇతరులు ప్రశ్నించడం, సమాధానం చెప్పడం అని కాకుండా తమను తామే ప్రశ్నించుకోవడం ఉచితం. తెలుగు రచయితలకు ఆ మాత్రం ఆత్మావలోకనం లేదని ఎందుకు సందేహించాలి?

సాహిత్యాన్ని రాజకీయాలనుంచి వేరు చేయలేమనే మాటను మార్క్సిస్టులే కాదు, అందరూ అంగీకరిస్తారు. ఎందుకంటే అన్ని రకాల రాజకీయవాదులకూ సాహిత్యం అవసరం ఏమిటో తెలుసు కాబట్టి. కానీ ఇప్పుడు సాహిత్యాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి వేరు చేసి చూడలేమని కూడా చెప్పాల్సిన దుస్థితి దాపురించింది. కార్పొరేట్ సంస్థలకు సాహిత్యంతో పని ఏమిటో నాబోటి వాళ్ల దగ్గర సమాచారం ఉండకపోవచ్చుగాని, రాంకీ ఫౌండేషన్‌కు మాత్రం సాహిత్యం మీద మోజు పుట్టింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో సహా అనేక భారీ వ్యవహారాలు నడిపే రాంకీ ఫౌండేషన్ విశాఖపట్నం జిల్లా పరవాడ దగ్గర ఫార్మా సిటీ నిర్మాణం చేపట్టింది. అక్కడ విడుదలయ్యే వ్యర్థాలతో పర్యావరణం విషతుల్యం అవుతోందని స్థానికులు ఆందోళనపడుతున్నారు. కార్పొరేట్ సంస్థల లోగుట్టు ఏదైనా బైటికి వచ్చినప్పుడు అట్లాగే ఉంటుందనడానికి రాంకీ ఫౌండేషన్ గురించి మనకు తెలిసిన చిన్న ఉదాహరణ చాలు.

ఈ సభల ఆహ్వానం అందుకున్న రచయితలు రైతుల గురించి, వ్యవసాయం గురించి, ఎన్నో పురస్కృతులను వెలికి తీసినవారే. రియల్ ఎస్టేట్‌తో సహా బహుళజాతి కంపెనీల విధ్వంసంలో పల్లెలు ఎట్లా కూలిపోతున్నాయో ఉద్వేగ పూరిత రచనలు చేసినవారే. తరతరాలుగా స్వస్థానాన్ని నమ్ముకొన్న బడుగు బతుకులు విస్థాపనకు గురికావడం గురించి ప్రసంగాలు చేసినవారే. అభివృద్ధి పథకాల పేరుతో పర్యావరణాన్ని నాశనం చేస్తున్న శక్తుల మీద కత్తిగట్టి కవిత్వం రాసినవారే.

వీరెవరికీ రాంకీ ఫౌండేషన్‌లాంటివి గాని, ప్రభుత్వం కానీ ఒక పద్ధతి ప్రకారం ఇవన్నీ చేస్తున్నాయని తెలియదనుకోవాలా? తెలిసీ ఈ సాహిత్య జాతరకు వెళ్లడమంటే తమ విశ్వాసాలను కూడా విధ్వంసం చేసుకోదలిచారని విచారించాలా? ఒక సందర్భంలో కుటుంబరావు - మన విశ్వాసాల మీద మనకు విశ్వాసం లేదని అంటారు. సరిగ్గా ఇప్పటి స్థితికి ఆ మాట సరిపోతుందని చెప్పడం విషాదంగా ఉంది.

ఇలాంటి చర్చ చేసినప్పుడల్లా పోటీగా .. ఏ వేదిక మీదైనా మేం చెప్పేదే చెప్తాం గదా? అనే సుభాషితం ముందుకు వస్తుంది. ఇది చాలా చైతన్యవంతంగా, విశాలమైన దృష్టిగా, నలుగురిని కలుపుకుపోతూనే ప్రజా ప్రయోజనాల కోసం అన్ని అవకాశాలను వాడుకోవడంగా కనిపిస్తుంది. అట్లాంటి పోటీ వాదనలు, సమర్థనలు చాలా ఉంటాయి. ఇతరులకు ఏం చెప్పాలని కాకుండా అక్షరాల్లో రాస్తున్నవాటికీ, చేస్తున్నవాటికీ పొంతన కుదిరితే చాలు. రచన పాఠకుల కోసం, సమాజం కోసమే అయినా మౌలికంగా రచన తన వ్యక్తీకరణ. రచయితలు తమలో తాము మాట్లాడు కుంటున్నట్టుగా రచన చేస్తారు. అందులోని అభిప్రాయాలన్నీ పూర్తిగా రచయిత వ్యక్తిత్వంలోంచి బైటికి వచ్చేవే. ఆ అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరించడం అంటే తమను తాము తక్కువ చేసుకోవడమే.

ఈ సభలకు వెళ్లినంత మాత్రాన మా ప్రజా పక్షపాతం వీడినట్టవుతుందా? అని సదరు రచయితలు అడుగుతారనడంలో సందేహం ఏమీ లేదు. ఏ వేదిక మీది నుంచైనా ఒకే మాట చెప్తామనవచ్చు. ఆ మాట చెప్పడానికి రాంకీ ఫౌండేషన్ అయినా పర్వాలేదనుకోవడమే అభ్యంతరం. ఈ చర్చ వాళ్ల ప్రజాపక్షపాతం గురించి కాదు. ప్రజాపక్షంలో ఉంటూ విలువైన సాహిత్యం రాస్తున్నందువల్లే వాళ్లు కార్పొరేట్ సంస్థల సాహిత్య సమ్మేళనానికి వెళ్లడం ఏమిటి? అనే ప్రశ్న.

ఎక్కడికి వెళ్లాలో వెళ్లకూడదో అందరికీ ఒకే లెక్క ఉండదు. అయితే కనీసంగా అయినా అలాంటి స్పృహ ప్రతివాళ్లకూ ఎంతో కొంత ఉండాలని ఆశించడం తప్పేమీ కాదు. రచనల్లోని విశ్వాసాలను స్వీకరించి కాపాడాల్సిన బాధ్యత పాఠకులకు, సమాజానికే కాదు, రచయితకు కూడా కొంచెమైనా ఉండాలనుకోవడం దోషం కాదు. అట్లా లేకుంటే ప్రపంచీకరణను వ్యతిరేకించడం, స్థానికతకు మూలాలకు పట్టం కడుతూ రచన

నడుస్తున్న చరిత్ర

దండకారణ్య మహిళా ఉద్యమకారులపై పాశవిక దాడులు - వీరోచిత ప్రతిఘటన

- అమన్

మావోయిస్టు ఉద్యమాన్ని దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద ప్రమాదంగా అభివర్ణిస్తున్న దేశ పాలకులు ప్రత్యేకించి 2009 నుండి ఒక క్రూరమైన అణచివేత యుద్ధాన్ని కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని ఆపరేషన్ గ్రీన్‌హంట్ అని ప్రకటించినప్పటికీ, కాదని బుకాయించినప్పటికీ ఇది నిజానికి ప్రజలపై యుద్ధమని, దీని అసలు లక్ష్యం దేశ వనరులన్నిటినీ సామ్రాజ్యవాదులకు, బడా పెట్టుబడిదార్లకు దోచి పెట్టడానికి ఏ అడ్డంకీ లేకుండా చేయడమని ఇప్పటికే పలువురు ప్రజాస్వామికవాదులు, దేశభక్తులైన రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, మేధావులు ఆధారాలతో చాటి చెప్పారు. ఈ అణచివేత యుద్ధానికి లేదా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు ఒక ముఖ్య కేంద్రంగా ఉన్న దండకారణ్యంలో ఆ పేరుకు తగినట్టుగానే పచ్చని పంట పొలాలపై, అడవులపై, ఆదివాసీ గూడాలపై, అడవి బిడ్డలపై విచ్చలవిడి దాడులు, హింస కొనసాగుతున్నాయి. ఇప్పుడు "శిక్షణ" పేరుతో బ్రిగేడ్ స్థాయిలో భారత సైన్యం కూడా దండకారణ్యంలోని అబూజ్‌మాడ్ ప్రాంతంలో తిష్ట వేయడంతో ఇది మునుముందు ఊహింపశక్యం గాని స్థాయికి చేరే ప్రమాదం ఉన్నది.

నాటి సల్వాజుడుంలో గానీ, నేటి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో గానీ ప్రత్యేకించి మహిళలు గతంలో ఎన్నడూ లేని స్థాయిలో రకరకాల హింసాదౌర్జన్యాలకు, అవమానాలకు గురవుతున్నారన్న వాస్తవాలు ఇప్పటికే పలు రిపోర్టుల ద్వారా బైటికి వచ్చాయి. ఈ మధ్య కాలంలో రమణ్ సింగ్ ప్రభుత్వం రహస్య హంతక ముఠాల ద్వారా, ప్రత్యేకించి ఉద్యమంలో చురుగ్గా పని చేస్తున్న మహిళా కార్యకర్తలను పట్టుకొని పాశవికంగా సామూహిక అత్యాచారానికి పాల్పడి హత్య చేయించే పచ్చి ఫాసిస్టు చర్యలకు పాల్పడుతున్నది. లాటిన్ అమెరికా నియంతలు కిరాయి హంతకుల్ని, ప్రైవేట్ హంతక గ్యాంగుల్ని పురికొల్పి చట్టవ్యతిరేక హత్యలకు పాల్పడినట్టుగానే, ప్రపంచంలోనే తమది అతి పెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకునే మన దేశ పాలకులు కూడా న్యాయమైన ప్రజా ఉద్యమాలను అణచడానికి ఇలాంటి చట్టవ్యతిరేక, నీతిబాహ్యమైన చర్యలకే పాల్పడుతున్నారు. ఇందులో భాగమే దండకారణ్యంలో ఇటీవల జరిగిన ఈ తరహా దాడులు, హత్యలు. "ఎన్‌కౌంటర్"లలో చంపినపుడు కనీసం మరణాలు నమోదయినా అవుతాయి కానీ ఇలాంటి హత్యలు మాత్రం ఎక్కడా నమోదు కూడా కావడం లేదు. ఈ హత్యలను ఖండిస్తూ మావోయిస్టు పార్టీ, ప్రజా సంఘాలు చేసే పత్రికా ప్రకటనలకు ఛత్తీస్‌గఢ్ మీడియా ఏ మాత్రం చోటివ్వకపోవడం కూడా ఈ గ్రీన్‌హంట్ దాడిలోని మరో ముఖ్యమైన పార్శ్వం.

నిజానికి ఈ రకం దాడులలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యమ మహిళలు ఏ నేపథ్యం గలవారు? ఉద్యమంలో వాళ్ల

చేయడం, మానవీయ విలువలను రచనలో పునఃసృష్టి చేయడం కేవలం సాహిత్యానికి పనికి వచ్చే దినుసుగా చూసినట్టుకాదా? ఈ ప్రశ్న ఎంత బాధాకరమైనది? ప్రకృతిని, ఆవాసాలను, వ్యవసాయాన్ని నాశనం చేసి కేవలం వ్యాపారం మాత్రమే తెలిసిన రాంకీ ఫౌండేషన్‌లాంటి సంస్థలకు సాహిత్యంపట్ల ప్రేమ పుడితే ప్రపంచీకరణకు వ్యతిరేకంగా అనేక సున్నిత భావనలు వెలుబుచ్చిన రచయితలు వెళ్లడంతో మన సమాజమెంత మొద్దుబారిపోయిందో సంకేతం ఉన్నది.

అనేక అస్తిత్వాలు తమ న్యాయమైన ఆకాంక్షలను వ్యక్తీకరించే క్రమంలో సామాజిక నిర్మాణంలోని వైరుధ్యాల వల్ల, వ్యవస్థా దుర్మార్గాల వల్ల పరస్పర విభేదాలు ఎన్నో పొడసూపుతున్నాయి. ఈ అస్తిత్వ చైతన్యాలన్నీ ఒక మానవీయ సమాజాన్ని సాధించడానికి ఎట్లా కలుస్తాయనే ప్రశ్న సాహిత్యకారుల్లో, సామాజిక శాస్త్రవేత్తల్లో నలుగుతూ ఉన్న కాలంలో ఇప్పుడీ పరిష్కారం ఇట్లా ముందుకు వచ్చినట్టుంది. దీన్ని ఇట్లా చెప్పాల్సి రావడం బాధాకరం. కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం... అన్ని అస్తిత్వాలను తన గొడుగు కిందికి తెచ్చుకొని ఐక్యత సాధించగలవని. సాహిత్యరంగంలో అది చాలా తేలిక అని ఈ ప్రపంచ తెలుగు సభలు నిరూపించాయి.

ఈ ధోరణిని నిరసించే రచయితలు అన్ని అస్తిత్వ, ప్రజాస్వామిక బృందాల్లో తప్పక ఉంటారు. ఇదేదో కారుచీకటి అలుముకున్నదని వగచనవసరం లేదు. రాంకీ ఫౌండేషన్ సాహిత్యజాతరకు వెళ్లినవాళ్లలో కూడా తిరిగి చూసుకోగల ప్రజా పక్షపాతం, అంతర్దృష్టి ఉన్నాయని ఆశించవచ్చు. తెలుగు ప్రజల పోరాటాలే సాహిత్యరంగాన్ని ఎప్పటికప్పుడు శుద్ధి చేస్తూ వచ్చాయి. ఇవాళ ప్రజా ఉద్యమాలు భారత ప్రభుత్వ సైన్యాన్ని ఎదిరించి పోరాడుతున్నాయి. ఎప్పటికంటే మరింత దృఢంగా రచయితలు ప్రజల పక్షాన నిలబడి మాట్లాడాల్సి ఉంది. దండకారణ్య రచయితలు పదే పదే ఈ విజ్ఞప్తి చేస్తున్నారు. పోరాటంలో, రచనలో, నూతన సామాజిక వ్యవస్థను నిర్మించడంలో అక్కడ మన సోదర రచయితలు రక్తార్పిత త్యాగాలతో పని చేస్తున్నారు. ఇది తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు గ్రీన్‌హంట్ వ్యతిరేక సన్నివేశం. ఈ ఎరుక సాహిత్యంలోనేగాక సర్వత్రా ప్రతిఫలించాల్సిన అవసరం ఉంది.

నిర్వహిస్తున్న పాత్ర ఏమిటి? అని పరిశీలిస్తే వీళ్లు బాగా వెనుకబడిన ఆదివాసీ సమాజంలో పుట్టి పెరిగి, మార్క్సిజం అనే శాస్త్రీయ సిద్ధాంతంతో సాయుధమై ఈ కుళ్లు వ్యవస్థను సమూలంగా మార్చాలని నడుం బిగించిన వాళ్లు. దేశ పాలకులు "అభివృద్ధి"గా చెబుతూ పాల్పడుతున్న భారీ వినాశనానికి జవాబుగా స్వావలంబన, సహకారం అనే విలువల ఆధారంగా పాదుకుంటున్న ప్రజల ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వాళ్లు. ఇలాంటి మహిళలను టార్గెట్ చేసి అమానుషంగా హత్య చేయడం అనేది కేవలం వ్యక్తులుగా వాళ్లను నిర్మూలించడానికి కాదని, వాళ్లు ప్రాతినిధ్యం వహిస్తున్న, వాళ్ల శ్రమతో, చొరవతో, మేధస్సుతో నిర్మాణమవుతున్న ప్రత్యామ్నాయ ప్రజా అధికారాన్ని లేకుండా చేయడానికే అని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. అలాగే ఈ రకం ఫాసిస్టు దాడులను ఇక్కడి ప్రజలు, ముఖ్యంగా మహిళా ఉద్యమకారిణులు ఎలా ఎదుర్కొంటున్నారనే విషయాన్ని గమనించినపుడు పాలకుల అన్ని రకాల నీచమైన ఎత్తుగడలు అంతిమంగా ఎలా ఓటమి పాలు కాక తప్పవో అర్థమవుతోంది.

ఇలాంటి కుట్రపూరిత క్రూర హత్యాకాండలలో దండకారణ్యంలో ఇప్పటి వరకు ఇద్దరు మహిళా ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోగా మరి కొందరు తృటిలో ప్రాణాపాయాన్ని తప్పించుకున్నారు. మరి కొందరు మహిళలు ఒంటరిగానే తెగించి ప్రతిఘటించి కిరాయి హంతక ముఠాలకు వెన్ను జ్వరం పుట్టించారు. ఈ సంఘటనల పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.

కుమ్లి అనే ఆదివాసీ యువతి 2010 ఫిబ్రవరి 12న కిరాయి హంతకుల దాడిలో ప్రాణాలు కోల్పోయింది. పాలకులు "అబూజ్‌మాడ్"గా పేర్కొనే మాడ్ ప్రాంతానికి చెందిన ఈ పాతికేళ్ల యువతి పుట్టింది పైవేరు గ్రామంలో. సాధారణంగా ఆదివాసులంతా, ప్రత్యేకించి మహిళలంతా ఎదుర్కొనే రక్తహీనత లాంటి అనారోగ్య సమస్యలతో బక్కపలుచగా, బలహీనంగా కనిపించే ఈ కామ్రేడ్ దుమ్‌నార్ అనే గ్రామంలో విప్లవ జనతన సర్కార్ నిర్వహించే నమూనా వ్యవసాయ క్షేత్రంలో పని చేసే కార్యకర్త. 2010 జనవరిలో ప్రముఖ మానవహక్కుల కార్యకర్త, రచయిత గౌతం నవలఖా తన దండకారణ్య పర్యటనలో భాగంగా ఈ నమూనా వ్యవసాయ క్షేత్రాన్ని కూడా చూసి, కుమ్లితో స్వయంగా మాట్లాడి వెళ్లాడు. ఆ తర్వాత ఆయన రాసిన "డేస్ అండ్ నైట్స్ ఇన్ ద హార్ట్‌ల్యాండ్ ఆఫ్ రెబెలియన్" అనే సుదీర్ఘ వ్యాసంలో ఈ వ్యవసాయ క్షేత్రం సాధించిన ఫలితాలను ప్రపంచానికి చాటాడు. ఆ ఫలితాల వెనుక ఈ బక్కపలుచని యువతి చిందించిన చెమటనెత్తురులున్నాయి.

నిజానికి ఈ యువతి విప్లవోద్యమంలో భాగస్వామి కావడమే ఒక ఆశ్చర్యం. ఎందుకంటే ఈమె 2006లో టైఫాయిడ్ బారిన పడి చాలా తీవ్రంగా జబ్బు పడింది. కుటుంబసభ్యులు తమకు తెలిసిన వైద్యాలు చేసి ఇక బతకదనే నిశ్చయానికి వచ్చి ఆమెను ఇంటి పక్కన పెంటకుప్ప పైన మంచంలో పడవేశారు. అలా వేస్తే బతకవచ్చనేది ఆదివాసులలో ఒక మూఢ నమ్మకం. ఆ సమయంలో ఆ గ్రామానికి వెళ్లిన గెరిల్లా దళం ఆమెను తీసుకొచ్చి వైద్యం చేసి మందులిచ్చి కాపాడింది. మావోయిస్టు కార్యకర్తలు తనకు పునర్జన్మనిచ్చారని ఆమె ఇతరులకు చెప్పుకునేది. ఉద్యమం చేతిలో తిరిగి ఊపిర్లు పోసుకున్న కుమ్లి తన జీవితాన్ని విప్లవానికే అంకితం చేద్దామని నిశ్చయించుకొని 2007లో ఉద్యమంలో చేరింది. తన శక్తి సమర్థతల్ని, అభిరుచిని దృష్టిలో పెట్టుకొని స్థానిక పార్టీ ఆమెను నమూనా వ్యవసాయ క్షేత్రంలో కార్యకర్తగా నియమించింది.

ఒకనాడు కేవలం సాయుధ గెరిల్లా దళాల రూపంలోనే ప్రధానంగా కొనసాగిన విప్లవ కృషి ఈనాడు అనేక జీవన రంగాలకు విస్తరించడంతో చాలా మంది ఉద్యమ కార్యకర్తలు నిరాయుధంగానే, ప్రజల మద్దతుతో, ప్రజా మిలిషియాతో కలిసి బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. అసలు మావోయిస్టు ఉద్యమంలో భాగంగా వివిధ స్థాయిల్లో, వివిధ రంగాల్లో భాగస్వాములైన కార్యకర్తలలో నిరాయుధంగా పని చేసే వాళ్ల సంఖ్యే ఎక్కువనేది బహుశా చాలా మంది ఊహకు అందని వాస్తవం. ఈ వాస్తవం మావోయిస్టు ఉద్యమానికి గల ప్రజాపునాదికి సంకేతం కూడా. కుమ్లి కూడా అలా నిరాయుధంగానే, మామూలు వేషధారణతో, ప్రజలలో ఒకదానిగా ఉంటూనే తన వంతు బాధ్యతల్ని పట్టుదలగా నిర్వహించేది. కొద్ది కాలంలోనే ఆమె ప్రజలకు తలలో నాలుకైంది. ఎక్కడున్నా తోటి మహిళలకు సహాయపడడం, ఏ ఇంటిలో ఉన్నా పిల్లల్ని ఆడించడం, జబ్బు పడ్డ వాళ్లకు తన దగ్గరున్న మందులివ్వడం లేదా ఏరియా విప్లవ జనతన సర్కారు వైద్య బృందం వద్దకు తరలించడం వంటి పనులెన్నో చేసేది. వ్యవసాయ పద్ధతుల్లో మెళకువల్ని త్వరలోనే నేర్చుకొని ప్రజల వ్యవసాయ విధానంలో మార్పు తేవడానికి ఎంతో కృషి చేసేది. ఆలుగడ్డలు వంటివి ప్రజలకు పరిచయం లేని కొత్త కొత్త పంటల్ని పండించి ప్రజలకు వాటి సాగు పద్ధతుల్ని అర్థం చేయించిన ఆర్గనైజర్ కూడా ఆమె.

ఈ కామ్రేడ్‌ను అంతం చేయడానికి ఒక పథకం ప్రకారం బయలుదేరిన ఐదుగురు సభ్యుల రహస్య హంతక ముఠా పక్క గ్రామమైన ఆల్‌వేడకు చెందిన సుక్‌రాం అనే ఏజెంటు సహాయంతో కుమ్లిని పట్టుకుంది. సుక్‌రాం అనే వాడు సంఘంలో ఉంటూనే డబ్బులకు ఆశపడి పోలీసులతో రహస్యంగా ఒప్పందం చేసుకొన్న తొత్తు. సుక్‌రాంతో పాటు సాదా బట్టల్లో గ్రామస్తుల వేషంలో వచ్చిన హంతకుల్ని గుర్తించని కుమ్లి, వాళ్లు ఏదో ఊరికి దారి చూపమని పిలిస్తే తనే స్వయంగా దగ్గరికి పోయింది. దగ్గరికి రాగానే పట్టేసిన హంతకులు ఆమెను పక్కనే ఉన్న అడవిలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడి దారుణంగా హత్య చేశారు. ప్రజలకు భీతావహం గొల్పేలా నాలుకను తెగ్గోసి తమ అధికారులకు సాక్ష్యంగా చూపించడానికి తీసుకెళ్లారు. మెడను తెగ్గోసి వెళ్లిపోయారు. జార్ఖండ్‌లో ఫ్రాన్సిస్ ఇందువార్ అనే ఒక క్రూరమైన పోలీసు అధికారి తలను గెరిల్లాలు నరికిన సందర్భంలో "మావోయిస్టు హింస" గురించి భారీ ఎత్తున గగ్గోలు పెట్టిన

మీడియా, కుమ్లి వంటి నిరుపేద ఆదివాసీ మహిళల్ని రాజ్యం క్రూరాతిక్రూరంగా హత్య చేస్తే ఏ మాత్రం పట్టించుకోకపోవడం ద్వారా దాని కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక ముఖాన్ని మరోసారి ప్రదర్శించుకుంది.

ఒంటిపై బట్టలు లేకుండా, రక్తం మడుగులో భయం గొల్పే విధంగా పడి ఉన్న కుమ్లి శవం జాడ వెదకడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఒక రోజుకు పైగా సమయం పట్టింది. దుమ్నార్, ఆ పరిసర గ్రామాల ప్రజలంతా కుమ్లి దారుణ హత్యకు ఎంతో కలత చెందారు. కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆ తర్వాత ఆమెకు సగౌరవంగా, విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపారు.

ఈ సంఘటన జరిగిన ఆరు నెలలకే ఆగస్టు 17న ఇదే హంతక ముఠా పాదంగోటి అనే గ్రామ సమీపంలో మరో దారుణ హత్యకు పాల్పడింది. సరిగ్గా రెండు రోజుల ముందు, 63వ భారత 'స్వాతంత్ర్య' దిన వేడుకలలో భాగంగా ఎర్రకోట మీద నుండి ప్రధాని మన్మోహన్ సింగ్ "హింసా మార్గాన్ని వదిలిపెట్టి ప్రభుత్వంతో చర్చలు చేయడానికి ముందుకు రావాలని, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి మాతో చేయి కలపాలని నక్సలైట్లకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను" అని వల్లించిన మాటలు పచ్చి బూటకమని రుజువు చేస్తూ చైతె అనే మరో కామ్రేడ్ (ప్రెస్ యూనిట్ సభ్యురాలు) గ్రీన్‌హంట్‌లో భాగంగా రహస్య హంతక ముఠా దాడికి బలైంది.

దండకారణ్య విప్లవోద్యమంలో కీలకపాత్ర పోషించే అనుబంధ విభాగాల్లో ప్రెస్ యూనిట్ ఒకటి. ఈ యూనిట్ ప్రజల సహకారంతో, ప్రజల మధ్యలోనే ఉంటూ పార్టీ వెలువరించే పత్రికల్ని, కరపత్రాల్ని, పోస్టర్లను, పుస్తకాలను అచ్చువేసి ప్రజల్లోకి, విప్లవ కార్యకర్తలలోకి తీసుకెళ్తుంది. ఈ యూనిట్‌ను ఎలాగైనా దెబ్బతీయాలని, తద్వారా విప్లవ సిద్ధాంత, రాజకీయాల ప్రచారాన్ని అడ్డుకోవాలని పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులు ఎన్నో కుట్రలకు, కుహనాలకు పాల్పడుతున్నారు. అయితే ప్రజల సహకారం, అండదండలు ఉన్న ఇలాంటి యూనిట్స్‌ను భారీ ఎత్తున బలగాలతో దాడి చేసి దెబ్బతీయడం అంత సులువు కాదు కాబట్టి రహస్య హంతక ముఠాలతోనే దెబ్బతీయడానికి పథకం రూపొందించారు. కుమ్లిని చంపిన హంతకులే పాదంగోటి గ్రామంలో ముగ్గురు యువకులతో రహస్యంగా సంబంధం పెట్టుకొని డబ్బు ఆశతో లోబర్చుకున్నారు. ద్రోహులుగా మారిన ఆ ముగ్గురి సహకారంతో ప్రెస్ యూనిట్ మకాం వేసి ఉన్న చోటికి రహస్యంగా చేరుకొని దాడికి పథకం వేసుకున్నారు. ప్రెస్ యూనిట్‌లో పని చేసే ఎవరైనా ఒక మహిళా కామ్రేడ్ వాళ్ల "వేట"కు లక్ష్యం.

ఆ రోజు పక్కనే ఉన్న వాగులో ఒంటరిగా స్నానానికి వెళ్లిన చైతెపై ఒక్క ఉదుటున దాడి చేసి పెడ రెక్కలు విరిచి పట్టుకొని తీసుకెళ్లారు. ఆమె అరవకుండా నోటిని చేతితో మూసేశారు. కొంత దూరం తీసుకెళ్లి అత్యాచారం జరిపి చంపేశారు. కుమ్లిని హత్య చేసినట్టుగానే మెడను కోసేశారు. కొంత రక్తాన్ని పాలిథిన్ బ్యాగ్‌లోకి తీసుకొని, కొన్ని బట్టలను హత్యకు సాక్ష్యంగా తమ యజమానులకు చూపించడానికి తీసుకెళ్లారు. ఒంటిపై సరిగా బట్టలు లేకుండా రక్తం మడుగులో పడి ఉన్న చైతె శవాన్ని కూడా సహచరులు మరుసటి రోజునే కనుక్కోగలిగారు. నిన్నటి దాకా తమతో కలిసి పని చేసిన చైతెను ఆ స్థితిలో చూసిన సహచరులు, ఆ ప్రాంతంలోని అనేక గ్రామాల ప్రజలు కదలిపోయారు. కసితో రగిలిపోయారు. బాధాతప్త హృదయాలతో మరుసటి రోజు అంత్యక్రియలు జరిపారు. ఆమె ఆశయాల్ని కొనసాగిస్తామని, శత్రువు పాల్పడుతున్న ఈ హేయమైన చర్యలను ఓడిస్తామని ప్రతిన బూనారు.

కలార్ అనే ఆదివాసీయేతర పీడిత కులానికి చెందిన దాదాపు 30 ఏళ్ల యువతి చైతె. ఉత్తర బస్తర్ డివిజన్ (కాంకేర్ జిల్లా) ఎన్‌హూర్ గ్రామంలో నిరుపేదగా పుట్టిన ఈమెను ఇంట్లో లలిత అని పిలుచుకునే వాళ్లు. గ్రామంలో మొదట కెఎఎంఎస్ (క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం)లో చేరి పని చేసింది. మహిళల సమస్యలపై ఉద్యమిస్తూ చుట్టుపక్కల గ్రామాల మహిళల్ని సంఘంలో కూడగట్టింది. ఇంటి వద్ద ఉంటున్న క్రమంలోనే పార్టీ సభ్యత్వం పొందిన చైతె విప్లవ లక్ష్యానికి అంకితమై 1999లో పూర్తికాలం విప్లవకారిణిగా పార్టీలో చేరింది. ఆ తర్వాత 2002 నుండి ప్రెస్ యూనిట్‌లో సభ్యురాలిగా పని చేసింది. ఇంటి దగ్గర చదువుసంధ్యలు నేర్చుకోలేకపోయినా ఉద్యమంలో చేరిన తర్వాత పట్టుదలగా నేర్చుకొని ప్రెస్‌లో అచ్చు మిషన్‌పై పని చేయడం, కాగితాల్ని మడిచి పుస్తకాలుగా బైండింగ్ చేయడం, అందంగా అట్టలు వేయడం, ఇంకా ఆ యూనిట్‌కు అవసరమైన టెక్నికల్ పనులెన్నో నేర్చుకుంది. కాలినడకన దూరభారాల్ని లెక్కచేయకుండా ప్రెస్‌కు అవసరమైన పేపర్లను, ఇంకును, ఇతర సామగ్రిని మోయడంలో, అచ్చువేసిన సాహిత్యాన్ని మోసుకెళ్లి వివిధ ప్రాంతాలకు చేరవేయడంలో ఎంతో శ్రమించిన ఆదర్శ కమ్యూనిస్టు ఆమె. పేదల బతుకు మారాలంటే విప్లవం తప్ప మరో మార్గం లేదన్న సత్యాన్ని గట్టిగా నమ్మి, దానికి అంకితమై పోయి నిస్వార్థంగా, ఎలాంటి ఊగిసలాట లేకుండా పదేళ్ల పాటు పని చేసిన కామ్రేడ్ ఆమె.

ముందే చెప్పినట్టు కుమ్లిని, చైతెను చంపిన హంతకులు ఒకే ముఠాకు చెందిన వాళ్లు. వాళ్లు ఇదే ప్రాంతంలో పుట్టి, ఇక్కడ ఉద్యమం పెంపొందుతున్న క్రమంలో ప్రజా శత్రువులుగా మారి ప్రభుత్వ, పోలీసు అధికారుల పంచన చేరి కిరాయి హంతకులుగా మారిన వాళ్లు. డబ్బులకు, తాగుడుకు, మాంసానికీ ఆశపడి తమ వేలితో తమ కంటినే పొడుచుకుంటున్నామని తెలియని మూర్ఖులు. కుత్తుల్ గ్రామం వాళ్లయిన కేస బైర, మిచ్చు, ఫర్సవేడ గ్రామానికి చెందిన దల్లు ఎలియాస్ అజయ్, గోమాంగల్ గ్రామానికి చెందిన ఫగుడు, ఇంకా వీళ్లతో చేయి కలిపిన మరి కొందరు హంతక ముఠాలుగా తిరుగుతూ ఇటువంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారు. వీళ్లతో కలిసి ఈ హత్యలలో పాల్గొన్న, సహకరించిన కొందరు ఆ తర్వాతి క్రమంలో ప్రజల చేతికి చిక్కి, నేరాలను ఒప్పుకొని. ఇటువంటి హత్యాకాండల వెనుక

సూత్రధారులెవరో, ఈ ఘాతుకాలకు పాల్పడ్డ తీరుతెన్నులేమిటో అంతా వెళ్లగక్కారు.

పై రెండు ఘటనల్లోనూ మహిళలనే ప్రత్యేకించి టార్గెట్ చేసి వాళ్లపై మొదట సామూహిక అత్యాచారం జరిపి, తర్వాత గొంతుల్ని కోసేసి బీభత్సకరంగా హత్య చేయడం అనేది ఎవరో కొందరు ఉన్మాదులు చేసిన ఘాతుకం కాదు. రాజ్యం ఒక పథకం ప్రకారమే ఇలాంటి హత్యల ద్వారా ఒక భయానక వాతావరణాన్ని నెలకొల్పాలని నిర్ణయించుకుంది. సాయుధ గెరిల్లాలకు బదులు నిరాయుధులను, సాపేక్షికంగా తక్కువ రక్షణలో ఉండేవాళ్లను, వ్యవసాయం, ప్రెస్ వంటి నాన్-కంబాటెంట్ (నేరుగా యుద్ధంలో పాల్గొనని) విభాగాల వాళ్లను, ప్రత్యేకించి మహిళలను టార్గెట్ చేయడం వెనుక దానికి స్పష్టమైన రాజకీయ ఉద్దేశాలున్నాయి. మొదటిది, ఇక్కడ ప్రత్యామ్నాయ అధికార సంస్థగా ప్రజల్లో స్థిరపడుతున్న విప్లవ జనతన సర్కార్ కార్యకలాపాలను, ప్రత్యేకించి విప్లవకర భూసంస్కరణల్లో భాగంగా అది చేపడుతున్న వ్యవసాయ అభివృద్ధి కార్యకలాపాలను దెబ్బతీయడం. తద్వారా ప్రజలను, విప్లవ జనతన సర్కార్ కార్యకర్తలను భయోత్పాతానికి గురి చేసి వాళ్లు తమ చెమటనెత్తుర్లతో, సృజనశీలతతో ముందుకు తెస్తున్న ప్రజా అభివృద్ధి నమూనాను రూపు మాపడం. రెండోది, ప్రజా ఉద్యమానికి గొంతుగా, విప్లవ ప్రచార వేదికగా పని చేసే ప్రెస్ లాంటి యూనిట్లను దెబ్బతీసి విప్లవ రాజకీయాల్ని ప్రజల్లోకి చొచ్చుకుపోనియ్యకుండా ఆపడం. అలా ప్రజలు చైతన్యవంతులయ్యే క్రమాన్ని అడ్డుకోవడం. మూడోది, దండకారణ్య ఉద్యమంలో ఒక ముఖ్య శక్తిగా ఉన్న మహిళా భాగస్వామ్యాన్ని దెబ్బతీయడం. అత్యాచారాలకు పాల్పడడం ద్వారా, అమానవీయ పద్ధతుల్లో హత్యలు చేయడం ద్వారా మహిళలను అభద్రతా భావానికి లోను చేసి వాళ్లను చొరవగా, సాహసంగా, క్రియాశీలంగా పని చేయనివ్వకుండా నిరోధించడం. మహిళలలోనే కాకుండా పురుషుల్లో అభద్రతా భావాన్ని సృష్టించడం కూడా రాజ్యం లక్ష్యంలో భాగమే. ఉద్యమంలో భాగమైన మహిళలందరి కుటుంబాలకు చెందిన పురుషులు కూడా ఉద్యమంలో ఏదో రూపంలో భాగస్వాములే కాబట్టి వాళ్లు తమ సంబంధీకులైన మహిళా కార్యకర్తల యోగక్షేమాల పట్ల నిరంతరం ఆందోళన పడేలా చేయడం.

ఈ కుట్రను ఇక్కడి ప్రజలు, ఉద్యమకారులు, ప్రత్యేకించి ఉద్యమ మహిళలు సరిగానే అర్థం చేసుకొని దాన్ని ఓడించడానికి తమను తాము శారీరకంగా, మానసికంగా, రాజకీయంగా, సైనికంగా మల్చుకుంటున్నారు. దండకారణ్య ఉద్యమంలో మహిళల భాగస్వామ్యం సాపేక్షికంగా ఎక్కువ ఉండడం కూడా పాలక వర్గాలు కలవరపడే అంశాల్లో ఒకటి. పార్టీ కమిటీలలో, గ్రామ స్థాయిలో పని చేసే కార్యకర్తలలో కూడా మహిళల సంఖ్య గణనీయంగా ఉన్నది. కొన్ని చోట్ల కమిటీలలో మహిళలే మెజారిటీగా లేదా మొత్తంగా ఉన్నారంటే ఇక్కడి మహిళలు విప్లవోద్యమంలో ఎంతటి కీలక పాత్ర పోషిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అందుకే ఇక్కడి విప్లవ మహిళా ఉద్యమం, మొత్తంగా విప్లవోద్యమం దీన్నొక ఛాలెంజ్‌గానే తీసుకొని ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో రహస్య హంతక ముఠాల దాడులను ఎదుర్కొంటున్నది. దండకారణ్య మహిళా ఉద్యమకారులు హంతక ముఠాల దాడులకు భయపడో లేదా పిరికితనంతోనో వెనకడుగు వెయ్యకుండా కుమ్లి, చైతెల త్యాగంతో ప్రేరణ పొందుతూ కిరాయి హంతక ముఠాలనే కాకుండా ప్రభుత్వ సాయుధ బలగాలను, కమాండోలను కూడా సాహసంగా ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కొందరు మహిళలు వీరత్వాన్ని ప్రదర్శిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మే 2011లో ఫర్సగాం అనే గ్రామం సమీపంలో పొంచి ఉన్న ఒక హంతక ముఠా ప్రజా విముక్తి గెరిల్లాలకు చెందిన ఒక చిన్న టీముపై దాడి చేయడానికి ప్రయత్నించింది. అదే సమయంలో బహిర్భూమి కోసం ఒంటరిగా ఆగిన ఒక మహిళా గెరిల్లా ఆ హంతక ముఠాలోని ఒక సభ్యుడిని గమనించిన వెంటనే తన దగ్గరున్న ఆయుధాన్ని తీసి తూటా పేల్చింది. కాని అది గురి తప్పడంతో వాడు బతికిపోయాడు. అయితే ఆ దెబ్బతో వాడూ, వాని ముఠా అందరూ కాలికి బుద్ధి చెప్పారు. ఇలాంటిదే ఒక సంఘటన డిసెంబర్ 2010లో పశ్చిమ బస్తర్ డివిజన్ నేషనల్ పార్క్ ఏరియాలో కూడా జరిగింది.

2011 ఆగస్ట్ 20న రణిత అనే ఒక మహిళా గెరిల్లా ప్రభుత్వ సాయుధ బలగాల చక్రబంధంలో చిక్కుకొని సాగించిన సాహసోపేతమైన పోరాటం, ప్రదర్శించిన మొక్కవోని ధైర్యం ప్రజాయుద్ధ పురోగమనానికి నిరంతరం ప్రేరణనిస్తూ ఉంటుంది. రణిత అసలు పేరు రాంకో హిచ్చామి. వీర మరణం పొందే నాటికి ఆమె వయస్సు 35 ఏళ్లు ఉండొచ్చు. గడ్చిరోలి జిల్లా ఏటపల్లి తాలూకాలోని పాటావి జెవెల్లి అనే గ్రామంలో పుట్టింది. ఈ గ్రామం గడ్చిరోలి విప్లవోద్యమానికి పట్టుగొమ్మగా నిలిచిన వాటిలో ఒకటి. కుంచగా, బక్కపలుచగా కనిపించే రణిత తన అసమాన పోరాటంతో, అద్భుతమైన త్యాగంతో దండకారణ్య ప్రజాయుద్ధ చరిత్రలోనే ఈరోజు ఒక కొత్త అధ్యాయాన్ని రచించింది.

దైనందిన విప్లవ కార్యకలాపాల్లో భాగంగా ప్రజల్ని కలవడానికి ఒక దళంతో పాటు చాద్‌గాం ఏరియాలోని మాకడ్‌చువ్వ అనే గ్రామానికి రణిత వెళ్లింది. మిగతా సభ్యులంతా గ్రామానికి కొంత దూరంలో అడవిలో మకాం వేయగా రణిత తనతో పాటు ఇద్దరు గెరిల్లా సభ్యుల్ని తీసుకొని ఊళ్లోకి వెళ్లింది. ఐదిండ్లయినా లేని ఆ చిన్న పల్లెకు ఆ రోజు దళం వస్తుందన్న ముందస్తు సమాచారంపై సాయుధ బలగాలు పొద్దు పొడవక ముందే నాలుగు వైపుల నుండీ ఊరిని దాదాపు చుట్టేశారు. కోబ్రా కమాండోలు, సీ-60 క్రాక్ కమాండోలు మొత్తం దాదాపు 200 మంది పకడ్బందీగానే ఆ ఊరిపై దాడికి పూనుకున్నారు. రణిత తన తోటి సభ్యులతో ఊళ్లోకి ప్రవేశించగానే ప్రజలు ఈ విషయం చెప్పారు. దానితో ఆమె వెనుదిరగడానికి ప్రయత్నిస్తుండగానే కమాండోల దళం ఒకటి ఎదురవనే అయింది. ఇరు పక్షాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ప్రతిఘటిస్తూనే మిగతా ఇద్దరు సభ్యులు ఒక దిక్కుకు ఉరికి

అడవిలోకి తప్పుకోగలిగారు కానీ రణిత మాత్రం మరో వైపు పరుగెత్తడంతో ఊరి మధ్యలోనే చిక్కుబడి పోయింది. దీన్ని కమాండోలు గమనించారు. కాల్పుల శబ్దం విని చుట్టూ పొంచి ఉన్న బలగాలన్నీ ఊళ్లోకి ప్రవేశించాయి. బైటపడేందుకు వేరే దారి ఏదీ లేకపోవడంతో రణిత పక్కనే ఇండ్ల మధ్యలోనే ఉన్న చిన్న జొన్న పెరడులోకి చొరబడి దాక్కుంది.

పారిపోయిన ఇద్దరు గెరిల్లాలను కొంత దూరం వెంబడించిన కమాండోలు తిరిగి ఊళ్లోకి వచ్చారు. మరో గెరిల్లా ఎటువైపు పారిపోయి ఉంటుందోనని తర్జనభర్జన పడసాగారు. అలా పోలీసు బలగాలు గుంపులు గుంపులుగా తనకు దగ్గరగా తచ్చాడు తుండడాన్ని రణిత గమనించింది. తనను ఎవరూ కనిపెట్టడం లేదన్న విషయం కూడా అర్థం చేసుకుంది. ఆమె దగ్గరున్న ఆయుధం పోలీసులు, మీడియా సాధారణంగా మొదటి ప్రపంచ యుద్ధ కాలం నాటిదని చులకన చేసి చెప్పే త్రీనాట్‌త్రీ రైఫిల్. ఎప్పుడో పోలీసుల నుండి గుంజుకున్న పాత కాలం నాటి బోల్ట్ యాక్షన్ రైఫిల్ అది. సరిగ్గా 33 తూటాలున్నాయి. ఆ రైఫిల్‌తోనే ఆమె ఎలాంటి తడబాటుకు, గాభరాకు లోను గాకుండా గురి చూసి ఒక కమాండోను నేల గూల్చింది. తూటా ఎటు నుండి వచ్చిందో, ఎవరు కాల్చినదో ఏమీ తెలియని స్థితిలో వాళ్లుండగానే మరోసారి గురి తప్పకుండా ట్రిగ్గర్ లాగింది. మరొక కమాండో కూడా కుప్పగూలాడు. శత్రువు ఇచ్చే ఏ చిన్న అవకాశాన్ని కూడా వదలొద్దని గట్టిగా నిశ్చయించుకున్న రణిత తూటా వెనుక తూటా కాల్చింది. మరో ఇద్దరు కమాండోలు గాయపడ్డారు. అప్పటికి గానీ కాల్పులు వస్తున్నది తమ పక్కనే ఉన్న జొన్న చేన్లో నుండి అనే విషయం వాళ్లకు అర్థం కాలేదు. ఇక వాళ్ల ఎల్ఎంజీ, ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, మోర్టార్ తదితర అత్యాధునిక ఆయుధాలన్నీ ప్రయోగించి వేల కొద్ది తూటాల జడివాన కురిపించారు. రణిత జొన్న చేను మధ్యలో ఉన్న ఒక చిన్న గొయ్యి వంటి ప్రదేశాన్ని ఆసరా చేసుకొని తన్ను తాను రక్షించుకుంది.

సాయుధ బలగాలు ఊరంతటినీ దిగ్బంధించడంతో గ్రామస్తులంతా ఎటూ పోలేక ఇండ్లల్లోనే ఉండిపోయారు. ఒకే ఒక్క గెరిల్లా సాగిస్తున్న ప్రతిఘటనలో తమకు జరుగుతున్న భారీ నష్టాలతో వెర్రెక్కిన కమాండోలు ప్రజల్ని బైట కుప్పేసి కర్రలతో బాది తమ "ప్రతాపం" చూపించారు. రణితకు ప్రజల రోదనలు, అరుపులు, కమాండోల తిట్లు స్పష్టంగా వినిపిస్తూనే ఉన్నాయి.

అప్పటికి మధ్యాహ్నం దాదాపు మూడు గంటలైంది. ఈలోగా పోలీసుల వాకీటాకీలన్నీ అదనపు సహాయం కోసం మొత్తుకుంటూనే ఉన్నాయి. ఇక్కడ ఒక పెద్ద నక్సలైట్ల దళంతో పోరాటం జరుగుతున్నట్టు సందేశాలు గడ్చిరోలి జిల్లా కేంద్రం నుండి నాగపూర్, ముంబాయిల దాకా ప్రసారం అయ్యాయి. గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్ అంటూ టీవీలలో స్క్రోలింగ్ మొదలైంది. హెలికాప్టర్లొచ్చాయి. గాయపడ్డ వాళ్లనూ, చనిపోయిన వాళ్లను మోసుకొని పోయాయి. అదనపు తూటాలతో అదనపు బలగాలు దాదాపు ఒక డజను మైన్‌ప్రూఫ్ వాహనాల్లో చేరుకున్నాయి. తాను ఈ చుట్టివేత నుండి బైటపడడం అసాధ్యమనే అంచనాకు రణిత బహుశా వచ్చే ఉంటుంది. కొన ఊపిరి ఉన్నంత వరకు ప్రతిఘటనను కొనసాగిస్తూనే ఉండాలని గట్టిగా నిశ్చయించుకుని ఉంటుంది.

మంద బలం, ఆయుధ బలంతోనే విజయాలు సాధిస్తామని విర్రవీగే కమాండోలు గుళ్ల వర్షంతో పాటు దాదాపు పాతిక గ్రనేడ్లు ఆ జొన్న చేన్లోకి విసిరారు. జొన్నచేనంతా చెల్లాచెదురుగా ఒరిగిపోసాగింది. రణిత మాత్రం ఉక్కిరిబిక్కిరి చేసే పొగ, చెవులు పేలి పోయే శబ్దాలు, కేకలు, తిట్లు, మధ్యమధ్యన "లొంగిపో" అంటూ అరిచే అరుపుల మధ్య, కళ్లన్నీ మండిపోతున్నా, తాగేందుకు చుక్క నీళ్లయినా లేని దుర్భర పరిస్థితిలో సైతం ఏ మాత్రం గుండె జారకుండా ఆ జొన్న చేనునే ఆధారం చేసుకొని, ఆ వంపు నేలను కరుచుకొని ఉండిపోయింది. గతంలో జరిగిన పద్కల్ ఎన్‌కౌంటర్ గురించి, సింగరేణి అమరుడు సమ్మిరెడ్డి సాగించిన ఒంటరి పోరాటం గురించి ఆమెకు తెలుసో తెలియదో గానీ ఆ వీరోచిత వారసత్వాన్ని ఆమె సమున్నతంగా నిలబెట్టింది. చాలా సేపటి నుండి ఆమె నుండి ఎలాంటి ప్రతిఘటనా రాకపోవడంతో చనిపోయి ఉంటుందనే అంచనాకు వచ్చిన కమాండోల టీం ఒకటి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లతో విచ్చలవిడిగా ఆటో ఫైరింగ్ చేస్తూ జొన్న చేనులోకి చొరబడే "ధైర్యం" చేశారు. కానీ రణిత ఏ మాత్రం ఆందోళన చెందకుండా వాళ్లను దగ్గరి దాకా రానిచ్చి గురి చూసి మొదటి దెబ్బకు మొదటి వాడిని కుప్పగూల్చింది. వెంట వెంట మరి కొన్ని తూటాలు కాల్చడంతో మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. ఈ దెబ్బతో ఇక కమాండోల ధైర్యం చచ్చుబారి పోయింది.

అప్పటికి అందిన అదనపు బలగాలతో దాదాపు సంఘటనా స్థలంలో బలగాల సంఖ్య ఐదారు వందలకు చేరింది. చుట్టూ మోహరించిన బలగాలన్నీ కలిపితే దాదాపు ఒక బెటాలియన్ సంఖ్యతో ఉన్న కమాండో, పోలీసు బలగాలు ఒకే ఒక్క ఒంటరి ఆదివాసీ యువతిని, ఒంటూపిరి ప్రాణాన్ని ఎదుర్కోవడానికి నానా అగచాట్లు పడాల్సిన స్థితి. "ఎన్‌కౌంటర్" అంటేనే ఎవరైనా ఒక పెద్ద నక్సలైటు నేత లేదా కొందరు నక్సలైట్లు చనిపోవడం, పోలీసులకు ఏమీ కాకపోవడం అనే అర్థం స్థిరపడిపోయిన సందర్భంలో నిజమైన ఎన్‌కౌంటర్లు ఎలా ఉండగలవో అందరికీ తెలిసేలా చెప్పిన సంఘటన ఇది.

ఇక జొన్న చేనునంతా కోసేస్తే తప్ప ఆమె ఉనికిని కనిపెట్టలేమని కమాండోలు గ్రహించారు. పైగా చీకటి పడబోతున్నది. రాత్రయితే ఆమె ఎలాగైనా తప్పించుకోవచ్చు. ఇంతా చేసి తమకు ఇంత నష్టం కలిగించిన ఈ ఒక్క నక్సలైటును అంతం చేయలేకపోతే ఆ పరాభవం తమ గ్రీన్‌హంట్‌కు ఎంత పెద్ద ఎదురు దెబ్బవుతుందో తెలుసు వాళ్లకు. పైగా ఈ ఓటమికి గురవుతున్నది చిదంబరం గ్రీన్‌హంట్ కోసమే ప్రత్యేకంగా గ్రేహౌండ్స్ తరహాలో రూపొందించిన కోబ్రా బలగమాయె. అయితే

జొన్న చేన్లోకి అడుగుబెట్టే ధైర్యమే లేని వాళ్లకు దాన్ని కోయడానికి దమ్మెక్కడిది? దాంతో అక్కడ బలవంతంగా కుప్పేసి ఉంచిన ప్రజల్ని కొట్టి, కాల్చి చంపుతామని బెదిరించి జొన్న చేను కోయించడానికి లోపలికి పంపారు. ఈ లోగా కొందరు కమాండోలు పక్కనున్న ఒక చెట్టు పైకెక్కారు. జొన్న చేనును దాదాపు పూర్తిగా కోసేసే సమయానికి వాళ్లు పై నుండి రణిత ఉనికిని గుర్తించగలిగారు. వెంటనే వాళ్లు చెట్టు పై నుండే గుళ్ల వర్షం కురిపించడంతో రణిత అక్కడికక్కడే కొనఊపిరి విడిచింది.

ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల దాకా, దాదాపు పది గంటల పాటు ఈ ఒంటరి మహిళ చేసిన ప్రతిఘటనా పోరాటం ఫలితంగా ముగ్గురు కమాండోలు (వీళ్లలో ఇద్దరు కోబ్రాలు) చనిపోగా, మరో నలుగురు కమాండోలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు మరిన్ని తూటాలు కురిపిస్తూ ఆమె మృతదేహాన్ని సమీపించగా ఆమె దగ్గర ఇంకా 19 తూటాలు మిగిలే ఉన్నాయి. అంటే ఆమె ఖర్చు చేసింది కేవలం 14 తూటాలు మాత్రమే. గడ్చిరోలి జిల్లా ఎస్పీ వీరేష్ ప్రభు 30-35 మంది నక్సలైట్లతో జరిగిన కాల్పుల్లో ఈ నష్టాలు జరిగినట్టు ప్రకటించి తమ పరువును నిలుపుకోవాలని ప్రయత్నించినప్పటికీ మూడు డజన్లకు మించని మాకడ్‌చువ్వ గ్రామస్తులందరూ రణిత సాహసానికీ, త్యాగానికీ సజీవ సాక్ష్యంగా నిలిచారు. తెల్లవారే సరికి ఆమె వీరత్వం కథలు కథలుగా పల్లెపల్లెకూ వ్యాపించింది. ఇప్పుడామె పోరాటం ఒక లెజెండ్. ఎందరో యువతులకు ఆమె ఇపుడొక రోల్‌మోడల్. "రణిత లెక్క కొట్లాడాలె" అనేది నేడు ప్రతి ఒక్కరి నోటి మాట. ప్రతి కామ్రేడ్ దృఢ ప్రతిజ్ఞ. మావోయిస్టు గెరిల్లా దళాల్లో కొత్తగా చేరుతున్న మహిళలు లేదా వివిధ కారణాలతో పేర్లు మార్చుకుంటున్న మహిళా కార్యకర్తలు ఇప్పుడు "రణిత" పేరు పెట్టుకోవడానికి ఆరాటపడుతున్నారు.

ఒక పేద ఆదివాసీ కుటుంబంలో చాలా సాదాసీదాగా పుట్టి పెరిగిన రణిత మొదట క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్‌లో చురుకైన కార్యకర్తగా పని చేసింది. తన పెదనాన్న కొడుకు ఒకరు ముందే ఉద్యమంలో చేరి బాధ్యతల్లో ఉండడం కూడా ఆమె పూర్తికాలం కార్యకర్తగా రావడానికి ఒక ప్రేరణ. సంఘంలో ఉన్నపుడే కోల్‌కతాలో ప్రజా సంఘాలు నిర్వహించిన సభలకు హాజరయిందామె. హైదరాబాద్‌లో జరిగిన మహిళా సెమినార్‌కు కూడా కెఎఎంఎస్ తరపున ప్రతినిధిగా హాజరు కావల్సి ఉండె కానీ ఏదో కారణంతో ఆగిపోయింది. 1999లో దళంలో చేరి సభ్యురాలిగా పని చేసిన రణిత ఆ తర్వాత విప్లవ జనతన సర్కార్ కార్యకలాపాల్లో భాగమై చాద్‌గాం ఏరియా విప్లవ జనతన సర్కార్ అధ్యక్షురాలిగా ఎన్నికైంది. ఆ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు తలలో నాలుకగా మెలిగింది. దళంలో సాయుధ గెరిల్లాగా పని చేస్తూనే ప్రజల సమస్యలు, బాధలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేసిన ప్రజా నాయకురాలామె. జబ్బు పడ్డ ప్రజలెందరికో విప్లవ జనతన సర్కార్ తరపున వైద్య సహాయం అందించిన ఆప్తురాలామె. ఆమె మరణ వార్త విన్న ఆ ప్రాంత ప్రజలంతా శోకంతో కన్నీరుమున్నీరయ్యారంటే ఆమెకు వారి హృదయాల్లో ఉన్న స్థానమేమిటో తెలుస్తుంది. పెద్ద చదువులు గానీ, పేరు ప్రఖ్యాతులు గానీ, మరే ప్రత్యేకతలు గానీ లేని, కోరుకోని ఒక సాధారణ గెరిల్లా మహిళ తన దృఢ సంకల్పంతో, అద్భుత సాహసంతో, అసామాన్య త్యాగంతో చరిత్రలో చిరస్థాయిగా నిల్చిపోయింది. "మహిళలు పనిలో, యుద్ధంలో పురుషులతో పోటీ పడలేరు" అని ఇంకా మెదడులో ఏదో మూలలో అణువంతయినా అనుమానం మిగుల్చుకున్న వాళ్ల కళ్లు తప్పక తెరిపిస్తుంది ఆమె పోరాటం.

ఒక సాధారణ మహిళ, సమాజం అట్టడుగు పొరల్లోంచి ఎదిగి వచ్చిన మహిళ ఇంత అసామాన్య సాహసం ఎలా చేయగల్గింది? ఒంటరయినా, వందలాది మంది కమాండోల చక్రబంధాన్ని చేధించుకోలేనని తెలిసినా, గంటల తరబడి సాగిన పోరాటంలో లొంగకుండా, ప్రాణభిక్ష కోసం ప్రాధేయపడకుండా, అత్యంత దుర్భర పరిస్థితుల నడుమ సైతం మొక్కవోని వీరత్వాన్ని ప్రదర్శించడం, దొరికిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొని శత్రువును దెబ్బతీయగల్గడం ఎలా సాధ్యమైంది? మావోయిస్టు ప్రజాయుద్ధానికుండే గతిశీలతలోనే దీన్ని అర్థం చేసుకోగలం. సాధారణ మానవుల్లో సైతం ఉండే అంతులేని సృజనాత్మకతను వెలికితీసి అసామాన్య యోధులుగా మల్చుతున్నది మావోయిస్టు విప్లవకర రాజకీయ చైతన్యమే. పాలకవర్గాలు పోరాడే ప్రజలపై అమలు చేస్తున్న అమానవీయ హింసా, విధ్వంసాలు కూడా ఈ క్రమానికి దోహదం చేస్తున్నాయి.

చరిత్రలో ఎక్కడైనా, ఏ న్యాయమైన ఉద్యమాన్నయినా అణచివేసేందుకు పాలకులు అనుసరించిన దమన నీతిలో మహిళలపై హింస, అత్యాచారాలు, హత్యలు ఒక ముఖ్యమైన భాగం. విప్లవ మహిళా ఉద్యమం ఒక బలమైన ప్రవంతిగా నడుస్తున్న దండకారణ్యంలో పాలకవర్గాలు ఇలాంటి హేయమైన కుకృత్యాలకు పాల్పడడం వాళ్ల వర్గ నీతిలో భాగమే. ఈ అడవులలో తమ కార్పొరేట్ దోపిడీకి అడ్డేదీ లేకుండా చేసుకునే కుట్రతో వాళ్లు పాల్పడుతున్న అణచివేత విధానాలు చివరకు వాళ్ల ఓటమికే దారి తీయక తప్పదని దండకారణ్య విప్లవోద్యమం, మహిళా ఉద్యమకారిణుల ప్రతిఘటన నిరూపిస్తున్నాయి.

మహిళలపై అమానుష దాడులకు, అత్యాచారాలకు పాల్పడడం ద్వారా ఉద్యమాలను రూపుమాపగలమని విర్రవీగే దేశ పాలకుల మొహంపై చెళ్లున చరిచిన చెంపదెబ్బ "రణిత". కుమ్మి, చైతె లాంటి నిరాయుధ, నిస్సహాయ మహిళా కార్యకర్తలను హతమార్చడం ద్వారా ఉద్యమ మహిళలను భయాందోళనలకు గురి చేయగలమని భ్రమపడ్డ వాళ్లకు ఇపుడు "రణిత" ఒక భయం. కుమ్మి, చైతెల త్యాగం దోపిడీ పాలకవర్గాలపై, వాళ్ల కిరాయి సాయుధ బలగాలపై కసినీ, క్రోధాన్నీ పెంచితే రణిత చేసిన వీరోచిత పోరాటం దండకారణ్యంలోనూ, దేశంలోనూ పోరాడే మహిళలందరికీ ప్రేరణగా నిలుస్తుంది. ☆

వ్యాసం

పెట్టుబడి-ప్రకృతి-సమాజం

(నెల్లూరు పవర్ ప్రాజెక్టుల కింద నష్టం నిజం, పరిహారం మిథ్య, అభివృద్ధి మాయ)

- పి. వరలక్ష్మి

కృష్ణపట్నం ఓడరేవు వస్తే నెల్లూరు రూపమే మారిపోతుంది అన్నపుడు గుడిసెల స్థానంలో మేడలు, మట్టి అంటని ఉద్యోగాలు, పిల్లలకు పెద్ద చదువులు, పూటపూటకూ వెతుక్కునే యాతన లేకుండా దేనికీ తక్కువలేకుండా చేతినిండా డబ్బు వాళ్ళ కళ్ళముందు మెదిలి ఉంటాయి. పెదకాపు బేతాలయ్య మాటల్లో చెప్పాలంటే "గొట్టాల కింద గులాబీలు పూయిస్తాం, మీకేంలోటు ఉండదు అన్నా"రట పోర్టువాళ్ళు. నెల్లూరు రూపు మారిపోవడం నిజమే. బహుశా రేపది అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతాల్లో ఒకటి కావచ్చు. కాని ప్రతిచోట జరిగినట్టుగానే స్థానిక ప్రజల కలలు విచ్ఛిన్నమైనాయి. కయ్యల్లో సవకవేసి అవి పెరిగిపెద్దవై అమ్మకానికి వచ్చేదాక నీళ్ళు కట్టడానికో, ఎరువుపెట్టడానికో, పురుగుమందు వెయ్యడానికో కూడా తిరిగి చూసుకునే అవసరం లేని భూములు విషం కక్కే పవర్ ప్లాంటు వశమైపోయాయి. "పొయ్యిమీద ఎసరుపెట్టి చేపల వేటకు పోయే"ంత నిశ్చింత భగ్నమైపోయింది. ఇచ్చిన నష్టపరిహారం కరిగిపోగా, చేసేందుకు పనుల్లేక, పోర్టులో, ప్లాంటులో వాళ్ళిచ్చే పనులు చేయలేక భారంగా పొద్దుదిగుతోంది. టైం పాస్‌కు ఇసుకలో యువకులు వాలీబాల్ ఆడుతోన్నా, గుడిముందు ముసలివాళ్ళు కబుర్లాడుకుంటున్నా, ఆడవాళ్ళు గుంపులు గుంపులుగా కూర్చొని పూసలాటలు ఆడుకుంటున్నా రేపటిని ఎన్నో రోజులు వాయిదా వేయలేమని వాళ్ళకు తెలుసు. ఒక్కొక్కటిగా పవర్‌ప్లాంట్లు పూర్తైతే నాలుగు దిక్కుల నుండి అవి ఎగజిమ్మే కాలుష్యం నీడన ఎలా బతకాలన్నది వెన్నంటే సమస్య. అయినా 30 కిలోమీటర్ల పరిధిలో పాతిక దాకా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎలా అనుమతిస్తారని వాళ్ళు ప్రభుత్వాన్ని అడగడం లేదు. లక్షల సంవత్సరాల ప్రకృతి సంపదను, వేల ఏళ్ళ మానవ శ్రమ ఇంకిన నేల సారాన్ని వెల కట్టే అహంకారాన్ని, ధ్వంసం చేసే దుర్మార్గాన్ని ఎదుర్కోలేకపోయారు. మమ్మల్ని ఇక్కడి నుండి తరలించండి అని మాత్రమే అడుగుతున్నారు. మరో మాటలో పోరాడుతున్నారు. మెరుగైన నష్టపరిహారంతో మెరుగైన జీవితాన్ని ఆశించారు. డబ్బులెక్కల మాయాజాలం పెట్టుబడిదార్లకు తెలిసినంతగా వీళ్ళకు తెలిసే అవకాశం లేదు. డబ్బు- పెట్టుబడి- లాభం లెక్కలు అంత సులభంగా అంతుపట్టేవి కావని, అదొక పద్మవ్యూహం అని వాళ్ళకు ఇప్పుడు అర్థమై ఉంటుంది.

ఇక్కడ పర్యావరణం పట్ల వ్యక్తమవుతోన్న ఆందోళన ఉద్యమరూపం తీసుకోకపోయినా, లేదా కనీసం పాపులర్ కాకపోయినా ఈ విధ్వంసం దేశవిదేశాల పర్యావరణవేత్తలను ఆందోళనకు గురిచేసిన ఒరిస్సా వేదాంత ప్రాజెక్టు కంటే ఎన్నోరెట్లు అధికమైంది. భోపాల్ విషవాయువు కన్నా ప్రమాదకరమైంది. నియమగిరి కొండల్లాగా, సోంపేట తంపర, బీల భూముల్లాగ ఇక్కడ కూడ అరుదైన ప్రకృతి సంపద ఉంది. సముద్రతీరపు వేలాది ఎకరాల ఇసుక భూముల్లో కేవలం మూడడుగుల్లోపల ఉబికివచ్చే మంచినీటి ఊటలు ప్రకృతి అద్భుతాల్లో ఒకటి. నేలటూరుపాలెం బాలయ్య మాటల్లో చెప్పాలంటే ఆ నీళ్ళు టెంకాయ పాల మాదిరి ఉంటాయి. ఇటువంటి స్ప్రింగ్ ఛానల్స్ ప్రపంచంలోనే అరుదైనవిగా చెప్తారు. ఈ నీటి ఊటల ద్వారా వచ్చే నీటిని కాలువల(సొన కాలువలు) ద్వారా చెరువుల్లోకి పారించి వ్యవసాయానికి ఉపయోగిస్తారు. ఈ కాలువల కింద వేలాది ఎకరాల భూమిని సాగుచేస్తున్నారు. దాని కోసం మట్టి తోలుకున్నారు. వీటిల్లో వరి, వేరుశనగ, సవక, జీడిమామిడి, పుచ్చ, నువ్వు పంటలు పండిస్తారు. అక్కడ ఎడారిలాగా ఎటు చూసినా ఇసకే. కాని ఆ ఇసక వెంబడే అద్భుతమైన పచ్చదనం.

చిల్లకూరు మండల గ్రామాల గుండా పోతుంటే దారి పొడవునా రెండు వైపులా నీటి ఊటలు. పుస్తకాల్లో, ఇంటర్ నెట్లో తప్ప మనం చూడలేని ఎన్నో రంగుల పక్షులు. అద్భుతమైన జీవవైవిధ్యం మధ్యన ప్రకృతి స్నేహంతో మనుషులు పండించిన పైర్లు. ఏపుగా పెరిగిన సవక, జీడిమామిడి తోటలు, వేరుశనగ పంటలు. అది ప్రకృతి కాన్వాస్‌పై నేలా నీరూ సముద్రం కేంద్రంగా మనిషి గీసిన అద్భుత చిత్రం. ఆ నేల సారం వెల కట్టలేనిది. 'సవక వేస్తే మేం తిరిగి చూడాల్సిన పని ఉండదు. భూసారాన్ని పీల్చుకొని అవే ఎదుగుతాయి. మందులూ, ఎరువులూ పనిలేదు. ఇక్కడ పండే విత్తనాలను, వరినారును ఇతర ప్రాంతాల రైతులొచ్చి తీసుకెళ్తారు' అని గతమైపోతున్న వైభవమైనా ఒకింత గర్వంగా చెప్తారు రైతులు. అయితే ఆ నేలలోని విలువైన ఖనిజ సంపదని పసిగట్టిన పెట్టుబడి సిలికా మైనింగ్ రూపంలో మొట్టమెదట వనరుల దోపిడి, పర్యావరణ విధ్వంసం మొదలుపెట్టింది. ఇప్పుడు అంతకంటే పెద్ద పెట్టుబడి మైనింగ్ భూములతో సహా సముద్రాన్ని, వాటిని ఆనుకొన్న అడవుల్ని, తీరప్రాంత గ్రామాల్ని పాతికవేల ఎకరాల సాగుభూమితో సహా దిగమింగుతోంది. సముద్రం లక్షలాది జీవరాసులకే కాదు, 137 గ్రామాల ప్రజలకు జీవనాధారం. జీవనాధారమైన సముద్రం ప్రకృతి ప్రకోపించినప్పుడు ఉప్పొంగి జీవితాల్ని ముంచేయకుండా మడ అడవులు కట్టడిచేస్తాయి. పోర్టు వచ్చాక చేపలు మత్స్యకారులకు దొరకలేనంత లోపలికి పారిపోయాయి. పోర్టు నుండి పవర్ ప్రాజెక్టులకు బొగ్గు తరలించడానికి కన్వేయర్ బెల్టు నిర్మించడానికి మడ అడవుల్ని

కొట్టేశారు. రేపు పవర్ ప్రాజెక్టులన్నీ ఉత్పత్తి మొదలు పెడితే అవి సముద్రంలోకి విడుదల చేసే వేడినీరు, రసాయన వ్యర్థాలు, ఖనిజాలు సముద్రజీవాల్ని చంపేస్తాయి. బూడిదతో సహా రకరకాల కలుష్యకారక వాయువులు జీవరాశి ఉనికిని ప్రమాదంలోకి నెట్టేస్తాయి.

సమీప భవిష్యత్తులో దేశంలోనే అత్యంత కలుషితమైన ప్రాంతంగా నెల్లూరు జిల్లా మారబోతోంది. ఎందుకంటే కృష్ణపట్నం ఓడరేవుకు 30 కిలోమీటర్లలోపు పరిసర ప్రాంతాల్లో రాబోతున్న పవర్ ప్రాజక్టుల మొత్తం సామర్థ్యం 28 వేల మెగావాట్ల పైగా ఉంటుంది. నిపుణుల అంచనా ప్రకారం వీటి కోసం రోజుకు 4లక్షల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుంది. దీని వల్ల రోజుకు 15 లక్షల టన్నుల బొగ్గుపులుసు వాయువు (కార్బన్‌డై ఆక్సైడ్), 1.75 లక్షల టన్నుల బూడిద, 2,700టన్నుల సల్ఫర్ వాతావరణంలోకి విడుదలౌతుంది. ఇవి కాక అణుధార్మిక పదార్థాలు, ఆర్సెనిక్, క్రోమియం, పాదరసం వంటి భారలోహాలు, 70 రకాల రసాయన పదార్థాలు వచ్చి చేరుతాయి. నేరుగా 137 తీర ప్రాంత గ్రామాలపై, పరోక్షంగా మొత్తం జిల్లా పై వీటి ప్రభావం ఉంటుంది. ఇప్పటిదాకా అయితేబొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు విడుదల చేసే కాలుష్యం గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, చర్మ సంబంధిత వ్యాధులేకాక క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయని, పంటలు గణనీయంగా దెబ్బతింటాయని తేల్చిన పరిశోధనలు విడివిడి థర్మల్ ప్రాజెక్టులపై చేసినవి. ఇటీవలి కాలంలో పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేసి ఒకేచోట కర్మాగారాలు కట్టడం మార్కెట్ వేలంవెర్రిగా సాగుతోంది. వీటి దుష్పరిణామాలు చైనా వంటి దేశాల్లో బయటపడుతున్నాయి. ఇన్నేసి విద్యుత్ కేంద్రాలు ఒకేచోట ఉంటే ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకోడానికి నెల్లూరు మంచి ప్రయోగశాల అవుతుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీర్జాపూర్, మధ్యప్రదేశ్‌లోని సిద్ధి ప్రాంతాల్లోనూ ఎక్కువ విద్యుత్ కేంద్రాలు ఒకే చోట కేంద్రీకరించి ఉన్నా మొత్తం సామర్థ్యంలో నెల్లూరు పవర్ ప్రాజెక్ట్ కాంప్లెక్స్ దేశంలోనే అతి పెద్దది. కాలుష్య నియంత్రణ మండలి, ఇఐఎ రిపోర్టు (ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ - పర్యావరణంపై ప్రభావాన్ని అంచనా వేసే నివేదిక) ప్రజాభిప్రాయ సేకరణ అన్నీ అపహాస్యం పాలై పెట్టుబడి పట్ల నిబద్ధతను చాటుకుంటున్నాయి. ఎవరెన్ని చెప్పినా, ప్రజలు వ్యతిరేకించినా పట్టించుకోకుండా ప్రభుత్వం వేలం వెర్రిగా అనుమతులు ఇవ్వడమే కాదు, కంపెనీలకు దళారీ పాత్ర నిర్వర్తిస్తూ ప్రజల భూముల్ని వాటికి దోచిపెడుతోంది. అందుకవసరమైన చట్టాల రూపకల్పన చేసుకుంది.

పెరుగుతున్న విద్యుత్ అవసరాల నేపథ్యంలో, గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను అందుకోవడానికి, సబ్సిడీల భారం మోయలేని ఆర్థిక స్థితిలో ప్రభుత్వం విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిందని చెప్పుకున్న 2003 విద్యుత్ బిల్లు (ఎలెక్ట్రిసిటీ యాక్ట్) ప్రధానంగా ప్రైవేటు రంగంలో విద్యుదుత్పత్తిని ప్రోత్సహించడానికే వచ్చింది. అందుకు అనుగుణంగా ప్రైవేటు పెట్టుబడులకు నిబంధనలు సరళతరం చేశారు. అంతే కాదు ఒక్క ఎ.పి జెన్‌కో తప్ప మిగతా పవర్ ప్రాజెక్టులన్నీ అవి ఉత్పత్తి చేసిన విద్యుత్తును దేశంలో ఎక్కడైనా అమ్ముకోవచ్చు. ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో పెట్టుబడిదారులకు వనరుల్ని కబ్జాచేసి ఖనిజాల్ని అమ్ముకోవడం తర్వాత ఇంధన రంగం, పవర్ ప్రాజెక్టులు ఆకర్షణీయంగా కనపడ్డాయి. తమ చేతుల్లో ఆడే ప్రభుత్వాలే కాబట్టి దేశం నలుమూలలా ప్రకృతి సంపదను వశం చేసుకోవడం కష్టం కాదు, ప్రజాప్రతిఘటన ఎదురైతే తప్ప. ఈ ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ, చట్టాలు సరే. అవన్నీ పక్కన పెట్టినా పొగలు గక్కే ఫ్యాక్టరీలు ఒక్కచోటే గుంపులు గుంపులుగా పెట్టడానికి ఫ్యాక్టరీల వాళ్ళకైనా, ప్రభుత్వానికైనా కనీస ఇంగిత జ్ఞానం లేకుండేనా అని సామాన్యులు ముక్కున వేలేసుకుంటున్నారు. కాని పెట్టుబడికి అది ఉండదు. పెట్టుబడి రూపంలో సంపదను పోగుచేస్తూ విస్తరించడమే పరమావధిగా ఉండే పెట్టుబడిదారీ వ్యవస్థకు అది ఉండే అవకాశం లేదు. నెల్లూరు పారిశ్రామిక కేంద్రం మన రాష్ట్రంలో శ్రీకాకుళం నుండి నెల్లూరు దాకా కోస్టల్ కారిడార్ పేరుతో స్వదేశీ, విదేశీ పెట్టుబడిదార్ల వశమవుతోన్న 972 కిలోమీటర్ల పొడవు, 3-5 కిలోమీటర్ల వెడల్పు సముద్రతీర ప్రాంతంలో ఒక ముక్క మాత్రమే. కోస్టల్ కారిడార్ కూడ గుజరాత్ నుండి బెంగాల్ దాకా ఉన్న 8వేల కిలోమీటర్ల పొడవైన దక్షిణ భారత తీరప్రాంతంలో ఒక భాగమే. ఈ ప్రాంతమంతా మళ్ళీ అభివృద్ధి ప్రణాళికలో భాగం.

Statement about ownership and other particulars of periodical **ARUNATARA** as required to be published in the first issue of every year after the last day of February.

Form IV (See Rule 8)

1. Place of Publication	:	Vijayawada
2. Periodicity of its Publication	:	Monthly
3. Printer's Name	:	Chalasani Prasad
Whether citizen of India	:	Indian
Address	:	33-13-3, Seetarampuram, Vijayawada-520 002.
4. Publisher's Name	:	Chalasani Prasad
Whether citizen of India	:	Indian
Address	:	33-13-3, Seetarampuram Vijayawada-520 002.
5. Editor's Name	:	Chalasani Prasad
Whether citizen of India	:	Indian
Address	:	33-13-3, Seetarampuram Vijayawada-520 002.
6. Name and addresses of Individuals who own the newspaper	:	Chalasani Prasad

I, Chalasani Prasad, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(Chalasani Prasad)
Signature of the Publisher

Date : 1st March, 2012

తీరప్రాంతాలే కాదు ఖనిజ సంపదకు ఆలవాలమైన అడవులు, కొండలు కూడ అభివృద్ధి ప్రణాళికలో భాగం. ఇది సామ్రాజ్యవాదానికి, గుత్తపెట్టుబడికి దళారీగా వ్యవహరిస్తున్న భారతదేశ పాలకవర్గం ప్రవేశపెట్టిన అభివృద్ధి ప్రణాళిక.

దీని వల్ల పాత ఉత్పత్తి విధానాలు నాశనమై ప్రజలు రోడ్డున పడుతున్నారు. వాళ్ళు కొత్త ఉత్పత్తి విధానంలో భాగం కాలేక, పాతది కాపాడుకోలేక ఘర్షణ పడుతున్నారు. కష్టమో నష్టమో కొంత కాలం పోర్టులో ఇనుప ఖనిజం లారీలు వచ్చేటప్పుడు కూలిపనులకు పోయేవాళ్ళు. దాని వల్ల అనేక ఆరోగ్యసమస్యలొచ్చినా ఇంకోదారి లేక ఆ పనులే చేసేవాళ్ళు. తరతరాల జీవనాధారాన్ని కంపెనీలకు అర్పించేసినా వాళ్ళకు కనీసం ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపలేదు. నెల్లూరు పవర్ ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులకు గాని, రైతులకు గాని ఉపాధి దొరకలేదు. అక్కడ కూలి పనులు చేయలేక చాలా మంది పని మానుకున్నారు. అది వాళ్ళకు అలవాటులేని పని. పోర్టులో, పవర్ ప్రాజెక్టుల్లో ఉత్తరాది వారిని పనుల్లో పెట్టుకున్నారు. నష్టపరిహారంతో మరోచోట భూములు కొనుక్కోవడం అసాధ్యమైపోయింది.

ముందే చెప్పినట్లు నోట్లకట్టల నష్టపరిహారం ఒక మాయాజాలం. అదొక ఆకర్షణీయమైన వల. నిజానికి తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూమికి వెల కట్టడంలో ఎంత శాస్త్రీయత ఉంటుంది? ముత్తుకూరు, చిల్లకూరు మండలాల్లో మెట్టభూముల్ని తీసుకుంటే కనీసంగా వాటి మార్కెట్ విలువ 30-40వేలు. వాటికి నష్టపరిహారం మార్కెట్ ధరకు మూడు రెట్లు అధికంగా ఇచ్చారు. అయినా కూడ అది 5-6 ఏళ్ళ పంట దిగుబడికి సమానం. ఇదే మాట వరగలి గ్రామస్తులు చెప్పారు. మరి భూమి ఉంటే మీ పిల్లలకు కూడ ఆదరువు కదా, ఎలా ఇచ్చేశారు అని అడిగితే 'లక్ష రూపాయలు ఎప్పుడు కళ్ళజూస్తామని ఇచ్చేశాం' అన్నారు. ఒక్కసారిగా కళ్ళకు కనపడే లక్ష రూపాయలు వాళ్ళ భూమి విలువను మసకబార్చిందనే అర్థం ఆ మాటల్లో ఉంది. డబ్బు వస్తుందనగానే సుఖప్రదమైన జీవితం తాలూకు అనేక ఆకర్షణలు.

పవర్ ప్రాజెక్టుల తరఫున ప్రభుత్వం డబ్బు రూపంలో ఇచ్చిన నష్టపరిహారం భూయాజమాన్యాన్ని బట్టి, ఊరి స్థితిగతుల్ని బట్టి 40వేల నుండి 7లక్షలదాకా ఉంది. పట్టాలు లేని భూములకైతే రైతుల్ని నోరెత్తనివ్వకుండా దబాయించి అంతో ఇంతో డబ్బు చేతిలో పెట్టారు. పట్టాభూములైతే మార్కెట్ రేటుకు రెండు మూడు రెట్లు అధికంగా డబ్బు ఆశ చూపారు. ముత్తుకూరు మండలంలో ఎకరానికి 7లక్షలు అనే సరికి అమ్ముకోవడం మించి మరో ఆలోచన చేయలేకపోయారు. మరోవైపు ఊరి పెద్ద రైతులు ముందుగానే ఒప్పందం చేసుకొని వాళ్ళ కింద ఉన్న విశాలమైన సాగు భూమిని ఇచ్చేసి కోట్లు డబ్బు చేసుకున్నారు. ఏ రెడ్డికి ఎంత భూమి ఉండింది, వాళ్ళకెన్ని కోట్లు వచ్చింది అనే విషయం అన్ని గ్రామాల్లోని ప్రజలు నోటి లెక్కలు వేసి చెప్తారు. ఈ భూస్వాములకు భూములు సాగుచేసే అగత్యం లేదు. అప్పటికే వాళ్ళు పట్టణాల్లో వ్యాపారాలు చేసుకుంటూ భూముల్ని కౌలుకిచ్చుకున్నారు. నేలటూరులో రైతులు 12 లక్షలు డిమాండ్ చేశారు. ధర్నా కూడా చేశారు. అయితే 7లక్షలకు ఒప్పుకోకపోతే ఫ్యాక్టరీ ఇంకచోట పెట్టుకుంటాం అన్నారట కంపెనీ వాళ్ళు. దాంతో దిగొచ్చారు. అంతేగాని భూమిలివ్వం అని ఎవరూ ప్రతిఘటించలేదు. రైతులకు నష్టపరిహారం అందేలోపే మార్కెట్లో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఒక ఎకరాకు వచ్చిన నష్టపరిహారంతో చుట్టుపక్కలెక్కడా సెంటు భూమి దొరకలేదు. పట్టణాలతో సంబంధాలు, డబ్బు లావాదేవీలలో అనుభవం ఉన్న భూస్వాములు మాత్రం రియలెస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి మరింత లాభపడ్డారు. దొరికిన చోటల్లా భూములు కొన్నారు. రైతులు మాత్రం రియలెస్టేట్‌లో, షేర్ మార్కెట్‌లో పెట్టి ఉన్నది పోగొట్టుకున్నారు. భూమి ఉపయోగపు విలువ నుండి డబ్బు విలువగా మారాక అది వాళ్ళ చేతుల్లో లేకుండా పోయింది. దాంతో వ్యవహరించడం వీళ్లకు సాధ్యం కాలేదు. డబ్బు వల్ల మానసిక అశాంతి, కుటుంబ కలహాలు, అభద్రత. కొంత మంది పిచ్చివాళ్ళైపోయారు కూడా అని లెనిన్ ధనిశెట్టి చెప్పారు. ఈ మొత్తం విధ్వంసాన్ని కళ్ళకు కట్టిన సెజ్ కథలోనూ రాశారు.



చదవండి!
చదివించండి!

వెల : రు. 50

మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఒక పరిచయం
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్
ప్రతులకు :
• మైత్రీ బుక్ హౌస్, విజయవాడ,
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్
ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్,
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్
సహచర బుక్‌మార్ట్, హైదరాబాద్

మార్చి 8కి నిజమైన వారసులు రణితలేనని చాటుదాం!

రాజ్యహింసకు వ్యతిరేకంగా మార్చి 8ని ఎక్కుపెడుదాం!

- మిడ్కో

శ్రమ దోపిడీకీ, పెట్టుబడిదారీ అణచివేతకూ వ్యతిరేకంగా పిడికిలెత్తిన సంఘటిత మహిళా పోరుకేతనం మార్చి 8. 1857, మార్చి 8న న్యూయార్క్‌లోని దుస్తుల, జౌళి కర్మాగారాల్లో పనిచేసే మహిళా కార్మికులు వేతనాల పెంపుదల కోసం, అధిక పనిగంటలకూ, దుర్భరమైన పని పరిస్థితులకూ వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఈ వారసత్వాన్ని సగర్వంగా కొనసాగిస్తూ 1908 మార్చి 8న దుస్తుల తయారీ పరిశ్రమలోని మహిళా కార్మికులు పై సమస్యలతో పాటు, ఓటుహక్కు కోసం' స్వెట్ షాపులను, చిన్న పిల్లలతో శ్రమ చేయించడాన్ని వ్యతిరేకిస్తూ విధులను బహిష్కరించారు, సమ్మె చేశారు. అరెస్టులూ, జరిమానాలూ, పోలీసుల, కిరాయి గూండాల దెబ్బలనూ తట్టుకుంటూ ఈ ఆందోళన కొన్ని రోజులపాటు కొనసాగింది. ఈ పోరాటం ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గానికి స్ఫూర్తినిచ్చింది. ఆ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలనీ, అన్ని దేశాలకు వ్యాపింపజేయాలనీ అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకురాలు కామ్రేడ్ క్లారా జెట్కిన్ భావించింది. 1910లో కోపెన్‌హేగన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మహాసభలో ఆ మహిళల పోరాట స్ఫూర్తిని ప్రతి ఏటా అంతర్జాతీయ మహిళాదినంగా జరుపుకోవాలని ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనను మహాసభ ఆమోదించడంతో, మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాట సంకేతమై చరిత్రలో నిలిచింది. నాటి నుండీ నేటి వరకూ మార్చి 8 ఒక పోరాట పిలుపుగా శ్రామిక వర్గ మహిళలను ఉత్తేజపరుస్తూనే ఉంది. ఆ పిలుపును అందుకొని, మార్చి 8 స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకుపోతూ ప్రపంచవ్యాప్తంగా ఎందరో మహిళలు పోరుబాటలో నడుస్తున్నారు. అందులో భాగంగా దండకారణ్యంలో క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ పిలుపు మేరకు, ప్రతి సంవత్సరం విప్లవ ప్రజానీకం, ముఖ్యంగా మహిళలు మార్చి 8ని పోరాట దినంగా జరుపుకుంటున్నారు.

మార్చి 8ని జరుపుకోవడం అంటే ఒక పండుగనో, వేడుకనో జరుపుకోవడం కాదు. తరతరాలుగా పోరాడుతున్న మహిళల పోరాటాన్ని కొనసాగించడం. ఆ పోరాటాన్ని రేపటి తరాలకు మరింత స్ఫూర్తిదాయకంగా అందించడం.

నేడు దండకారణ్య మహిళలు విముక్తి కోసం పోరాడుతున్నారు. దండకారణ్య మహిళల విముక్తి అనేది దేశంలోని పీడిత ప్రజలందరి విముక్తితో ముడిపడి ఉంది. మహిళలు విముక్తిని పొందడం అంటే భూస్వామ్యాన్నీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ, సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించడం, పితృస్వామ్యాన్ని అంతం చేయడం, నిజమైన అర్థంలో జల్, జంగల్, జమీన్‌లపై తమ హక్కును కాపాడుకోవడం.

ఆ లక్ష్యంతోనే నేడు ఇక్కడి మహిళలు ప్రధానంగా క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్‌లో సంఘటితం అవుతున్నారు. అట్లాగే పార్టీలోనూ, పిఎల్‌జిఏలోనూ, విప్లవ జనతన సర్కార్లలోనూ, వివిధ విభాగాలలోనూ క్రియాశీలక పాత్రను పోషిస్తూ తమ వర్గ సోదరులతో భుజం భుజం కలిపి పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. ఈ క్రమంలో అసామాన్య త్యాగాలను చేస్తూ తమ నెత్తుటితో నూతన చరిత్రను నిర్మిస్తున్నారు.

అందుకే మార్చి 8 అన్నా, మహిళా సంఘాలన్నా, మహిళా ఉద్యమమన్నా పాలకవర్గాలు ఉలికిపాటుకు గురవుతున్నాయి. మావోయిస్టు పార్టీ దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద ప్రమాదంగా ప్రకటించిన పాలకవర్గాలు 2006 నుండి దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమంపై తీవ్రమైన హింసను ప్రయోగిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అందులో భాగంగా దండకారణ్య విప్లవోద్యమంపై సిన్న సల్వాజుడుంను ప్రయోగించారు. నేడు దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను అమలు చేస్తున్నారు. ఈ హింసలో మహిళలను ప్రత్యేకంగా లక్ష్యం చేసుకోవడం స్పష్టంగా కనబడుతున్నది. సంఘ, పార్టీ కార్యకర్తలే కాక సాధారణ మహిళలు కూడా క్రూర రాజ్యహింసకు బలవుతున్నారు.

ఎంతో మంది మహిళలను, ఉద్యమకారిణులను పోలీసులు, అర్ధ సైనిక బలగాలు అరెస్టు చేయడం, చిత్రహింసలు పెట్టడం, జైళ్లలో బంధించడం, అత్యాచారాలు, హత్యలు చేయడం సర్వసాధారణమైంది. క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ నాయకురాలు కామ్రేడ్ నిర్మల సహా అనేక మంది మహిళా కార్యకర్తలు సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. కామ్రేడ్ మాలతికి ఒక తప్పుడు కేసులో పదేళ్ల శిక్ష వేశారు. ఇంతేకాక ఇటీవలి కాలంలో హంతక ముఠాలను ఏర్పాటు చేసి మహిళలపై దాడులు చేస్తున్నారు. ఇటువంటి ముఠాలు 2010లో ఫిబ్రవరి 12న కుమ్లి, ఆగస్ట్ 17న చైతే అనే మహిళా కార్యకర్తలపై దాడి చేసి దారుణంగా అత్యాచారం చేసి చంపేశాయి. ఇలా రోజు రోజుకూ మహిళలపై రాజ్యహింస పెరిగిపోతున్నది.

ఈ సంవత్సర కాలంలో కూడా మహిళలపై రాజ్యహింస హెచ్చు స్థాయిలో జరిగింది. అందుకే ఈ సంవత్సరం మార్చి 8ని రాజ్యహింసకు వ్యతిరేకంగా జరుపుకోవాలని క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ దండకారణ్య మహిళలకు పిలుపునిచ్చింది.

ఈ సంవత్సర కాలంలో జరిగిన హింసను పరిశీలిస్తే...సంవత్సరం క్రితం 2011 మార్చి11 నుండి 16 తేదీల మధ్య చింతల్‌నార్ ప్రాంతంలో ఆదివాసులపై పాలకవర్గాలు పాల్పడిన అమానుష దాడి దాదాపు ప్రజలందరి దృష్టికీ వచ్చింది. సి.ఆర్.పి.ఎఫ్.కు

చెందిన కోబ్రా బలగాలు, ఎస్.టి.ఎఫ్., కోయ కమాండోలు, ఎస్.పి.ఒ.లు కలిసి చింతల్‌నార్ పోలీసు క్యాంపుకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న మోర్‌పల్లి, పులాన్‌పాడు, తిమ్మాపురం, తాడిమెట్ల గ్రామాలపై జరిపిన ఈ బీభత్సకాండలో పలువురు మహిళలు రాజ్యహింసకు గురయ్యారు. మొత్తంగా ఈ హింసాకాండలో ఆరుగురు మహిళలు లైంగిక అత్యాచారానికి గురయ్యారు. మరెందరో పోలీసు దెబ్బలకు గాయాల పాలయ్యారు. ఈ హత్యాకాండలో, దహనకాండలో ఎంతో మంది మహిళలు తమ ఆప్తులను, ఆస్తులను, తల దాచుకునే ఇండ్లను, బట్టలను, ఆహార ధాన్యాలను కోల్పోయి దయనీయస్థితిలో బతుకుతున్నారు. మార్చి 11న మోర్‌పల్లి గ్రామానికి చెందిన హేమ్లి మూడె అనే మహిళ తన చెలకలో తునికాకు తెంపుతుండగా సాయుధ మూకలు ఆమెను కింద పడేసి బట్టలూడదీశారు. తన ఇద్దరు కూతుళ్ల కండ్లెదుటే ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె నడుంకు కట్టుకున్న పది వేల రూపాయల్ని కూడా గుంజుకున్నారు. గంగ అనే మరో మహిళను కూడా ఈ "భద్రతా" బలగాలు అత్యాచారం చేశాయి. అంతే కాకుండా వీళ్లు ఆమె ఒంటి మీద ఉన్న నగలనూ, ఇంట్లోని విలువైన సామాన్లనూ దోచుకున్నారు. మాడివి లక్కె అనే యువతిని ఆమె తండ్రి, సోదరుడితో కలిపి పట్టుకొని చింతల్‌నార్‌కు తీసుకెళ్లారు. అక్కడ లక్కె ఒంటిపై ఉన్న బట్టల్ని లాక్కుని ఆమెను తండ్రి, సోదరుడి నుండి విడదీసి సెల్‌లో ఒంటరిగా బంధించి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మాడివి భీమె అనే 80 ఏళ్ల వృద్ధురాలిపై కూడా తమ క్రూరత్వాన్ని ప్రదర్శిస్తూ విపరీతంగా కొట్టారు. ఇదే గ్రామంలో శూల అనే 28 ఏళ్ల యువకుడిని హత్య చేస్తుంటే అతని భార్య ఉంగి గుండెలు బాదుకొని రోదిస్తూ తన భర్తను చంపవద్దని ప్రాధేయపడింది. ఆమె రోదనకు ప్రతిస్పందనగా ఆ క్రూరులు ఆమె మీద పడి బట్టలు చింపేసి, చంపేస్తామని బెదిరించి ఆమెను అక్కడి నుండి తరిమేశారు. ఆ తర్వాత ఆమె భర్తను దారుణంగా చంపేశారు. మార్చి 12 పులాన్‌పాడ్‌లో ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారు. చాలా మంది మహిళలను దారుణంగా కొట్టి హింసించారు. మార్చి 16న తాడిమెట్ల గ్రామంలో మాడివి జోగి అనే మహిళ ఈ సాయుధ బలగాల చేతుల్లో పడి సామూహిక అత్యాచారానికి గురైంది. ఆమెను అత్యాచారం చేయడమే కాకుండా పోలీసులు విచక్షణా రహితంగా, స్పృహ కోల్పోయేలా కొట్టారు. ఆ తర్వాత ఆమె దగ్గరున్న దాదాపు 12 వేల రూపాయల విలువైన నగలనూ, నగదును దొంగిలించారు. ఈ గ్రామంలో మొత్తం 27 మంది మహిళలు ప్రభుత్వ సాయుధ బలగాల చేత తీవ్రంగా దెబ్బలు తిన్నారు. ఈ దెబ్బల మూలంగా 12 సంవత్సరాల ఒక బాలిక కూడా తీవ్రంగా గాయపడిందంటే ఈ బీభత్స తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

మీనా ఖల్కో క్రూర హత్య, సోనీ సోడి అరెస్ట్, చిత్రహింసల నేపథ్యంలో మహిళలపై జరుగుతున్న రాజ్యహింస భయంకర స్వభావం మరోసారి బాగా వెలుగులోకి వచ్చింది. మీనా ఖల్కో ఆదివాసీ మైనర్ బాలిక. సర్గూజా జిల్లాలోని కర్చా గ్రామానికి చెందిన గుతియారీ, బుద్దేశ్వర్‌ల బిడ్డ. 2011 జూలై 5న స్నేహితురాలిని కలవడం కోసం ఇంటి నుండి బయటకు వెళ్లిన ఈ అమ్మాయి తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితురాలి దగ్గరకు వెళ్తూనో తిరిగి వస్తూనో ఉన్న సమయంలో పోలీసుల కంటబడిన ఈ పదిహేనేళ్ల అమ్మాయి పోలీసుల అత్యాచారానికి బలైంది. ఒక మైనర్ బాలికపై తాము పాల్పడిన దారుణ అత్యాచారాన్ని కప్పిపుచ్చుకోవడానికి పోలీసులు ఆ అమ్మాయిని అమానుషంగా కాల్చి చంపి కట్టు కథలల్లారు. ఆ అమ్మాయికి నక్సలైట్లతో సంబంధాలున్నాయనీ, నక్సలైట్లను కలువడానికి వెళ్లినప్పుడు యాదృచ్ఛికంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆ అమ్మాయి చనిపోయినట్టుగా మొదట నమ్మబలికారు. అయితే ఆ అమ్మాయి మీద అత్యాచారం జరిగిందని ఆధారాలతో సహా బయటపడ్డంతో ఆ అమ్మాయి తిరుగుబోతనీ, తాగుబోతనీ ప్రచారం మొదలుపెట్టారు. అత్యాచారం జరిగిందనే ఆధారాలున్నప్పటికీ పోలీసులే అత్యాచారం చేశారని భావించడానికి వీల్లేదని సర్గూజా రేంజ్ ఐజి రాజేష్ మిశ్రా నిస్సిగ్గుగా మాట్లాడాడు. మీనా ఖల్కోను హత్యచేసి, ఆమె చరిత్రకు మసిపూయడం ద్వారా ఆమె మరణం పట్ల వెల్లువెత్తే నిరసన, సానుభూతులను అడ్డుకోవాలనే కుట్ర పన్నిన రాజ్యం తనలోని కరడుకట్టిన పితృస్వామ్య భావజాలాన్ని నగ్నంగా చాటుకున్నది.

సోనీ సోడి (36) ఒక ఆదివాసీ మహిళా ఉపాధ్యాయురాలు. ఈమెకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనీ, ఎస్సార్ అనే బహుళజాతి కంపెనీ నుండి మావోయిస్ట్ పార్టీకి డబ్బులను చేరవేస్తున్నదనే తప్పుడు ఆరోపణలతో 2011 అక్టోబర్ 8న ఈమెను పోలీసులు అరెస్టు చేశారు. అక్టోబర్ 8-9 తేదీలలో చెప్పనలవిగాని హేయమైన రీతిలో ఈమెను హింసించారు. జిల్లా ఎస్.పి. అంకిత్ గర్గ్ రూంలో, ఆయన సమక్షంలో ఆమె వంటిపైనున్న బట్టల్ని తీసివేసి గోళ్లపై కరెంట్ షాక్ ఇచ్చారని, రకరకాల క్రూరమైన లైంగిక హింసలకు గురి చేశారని దానితో ఆమె గంటల తరబడి స్పృహ కోల్పోయిందని ఆమె స్వయంగా సుప్రీం కోర్టుకు రాసిన లేఖలో పేర్కొంది. రెండు రోజుల చిత్రహింసల తర్వాత ఆమెను జైలులో బంధించారు. జైలులో ఉన్న ఆమెను కలవడానికి మహిళా సంఘాల కార్యకర్తలు చేసిన ప్రయత్నాలను పోలీసులు, ప్రభుత్వాధికారులు అడ్డుకున్నారు. అలా అడ్డుకోవడం ద్వారా ఆమె పట్ల తాము పాల్పడిన అమానవీయ హింసను మరింతగా వెలుగులోకి రాకుండా ఆవడానికి ప్రయత్నించారు. అయితే ఆ తర్వాత సుప్రీం కోర్టు ఆదేశం మేరకు చేసిన స్వతంత్ర వైద్య పరీక్షలో ఆమె మల ద్వారంలో ఒకటి, జననేంద్రియాల్లో రెండు రాళ్లను చొప్పించినట్టుగా వెల్లడయింది. వెన్నెముకపై పగుళ్లున్నట్టుగా కూడా ఎంఆర్ఐ స్కానింగ్‌లో బైటపడింది. ఈ చిత్రహింసలు నాగరికత, ప్రజాస్వామ్యం, చట్టం, న్యాయంలను అపహాస్యం చేస్తున్నాయి. రాజ్యం మధ్య యుగాల నుండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని మరోసారి స్పష్టమవుతున్నది.

అయితే పెరుగుతున్న ఈ రాజ్యహింసను మహిళలు నిర్భయంగా ప్రతిఘటిస్తున్నారు. తనను చుట్టుముట్టిన వందల సాయుధ బలగాలతో కామ్రేడ్ రణిత ఒంటరిగా తలపడిన తీరు ఈ ప్రతిఘటనకు అద్భుతమైన నమూనాగా నిలుస్తుంది. కామ్రేడ్ రణిత అసలు పేరు రాంకో హిచ్చామి. గడ్చిరోలి జిల్లా ఏటపల్లి

తాలూకాలోని పాటావి జెవెల్లి గ్రామంలో దాదాపు 35 ఏళ్ల క్రితం పుట్టింది. 1999లో ఈమె విప్లవోద్యమంలో చేరి చాద్‌గాం ఏరియా విప్లవ జనతన సర్కార్ అధ్యక్షురాలిగా ఎదిగింది. 2011 ఆగస్ట్ 20న చాద్‌గాం ఏరియాలోని మాకడ్‌చువ్వ అనే గ్రామానికి వెళ్లినప్పుడు పోలీసుల చక్రబంధంలో ఒంటరిగా చిక్కుకు పోయింది. అయినా ఏ మాత్రం గందరగోళానికీ, భయానికి గురికాకుండా సమీపంలో ఉన్న జొన్న చేనును ఆధారం చేసుకొని వీరోచిత పోరాటానికి ఒక ఉజ్వల నమూనాను నెలకొల్పింది. పోలీసులు విచ్చలవిడిగా కురిపించిన తూటాల, బాంబుల వర్షాన్నీ, లొంగిపొమ్మని అరిచే అరుపులను లెక్కచెయ్యకుండా, చివరి ఊపిరి వరకూ ఎత్తిన తుపాకీని దించకుండా ఇద్దరు కోబ్రాలు సహా ముగ్గురు కమాండోలను నేలకూల్చి, నల్గురు కమాండోలను తీవ్రంగా గాయపర్చింది. దాదాపు పది గంటల సేపు ఆ జొన్న చేనును వీరోచిత రణక్షేత్రంగా మార్చిన కామ్రేడ్. రణిత చివరికి తుపాకీని చేతిలో పట్టుకొనే వీరమరణం పొందింది. బహుశా ఆమె సజీవంగా ఉన్న కాలంలో ఒక జిల్లా పరిధిలోనే ఆమె పరిచితురాలు కావొచ్చు. కానీ నేలకొరిగిన తర్వాత ఆమె జిల్లాల, రాష్ట్రాల సరిహద్దులు దాటుకొని ఎందరికో పరిచితురాలయింది. ఆదర్శప్రాయమైన, అద్భుతమైన ప్రేరణగా నిలిచింది. ఆమె అనుభవం గెరిల్లాలకు విలువైన, నేర్చుకోవాల్సిన పాఠం అయింది. "మహిళలు పనిలో, యుద్ధంలో పురుషులతో పోటీ పడలేరు" అనే పితృస్వామ్య భావనను బద్దలు కొట్టిన ఆయుధం అయింది.

ఇటీవలి కాలంలో మహిళా గెరిల్లాలు ఒంటరిగా ఉన్న సమయంలో హంతకముఠా సభ్యులు తారసపడిన సందర్భాల్లో ధైర్యంగా ఎదుర్కొన్న కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలు మహిళల మొక్కవోని సాహసానికి కొన్ని ఉదాహరణలు.

సాయుధంగానే కాదు, నిరాయుధంగా సైతం మహిళల ప్రతిఘటన అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. దండకారణ్యవ్యాప్తంగా నిరాయుధంగా మహిళలు సాయుధ బలగాలతో ప్రతిఘటనకు తలపడిన సంఘటనలు అనేకం జరిగాయి. చింతల్‌నార్ మారణకాండ సందర్భంగా పోలీసులు పట్టుకున్న వారిని మోర్‌పల్లి మహిళలు ప్రతిఘటించి విడిపించుకున్నారు. చింతల్‌నార్ క్యాంపులో అత్యాచారానికి గురైన లక్కెను ఆమె తండ్రీ, సోదరులను కూడా పోరాడి విడిపించుకున్నారు. ఇంకా అనేక చోట్ల ఎంతో మందిని పోలీసులు పట్టుకొని వెళ్తుండగా మహిళలు సాహసంగా పోరాడి విడిపించుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. పోలీసులు పట్టుకెళ్లి పోలీసుస్టేషన్లలో, క్యాంపులలో బంధించిన వారిని సైతం మహిళలు ప్రాణాలకు తెగించి పోరాడి విడిపించుకుంటున్నారు. పోలీసుల అక్రమ నిర్బంధంలో ఉన్నవారినీ, జైళ్లలో ఉన్నవారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ ఆందోళనా కార్యక్రమాలను చేపడుతున్నారు. కాంకేర్ జంగల్ వార్‌ఫేర్ స్కూల్లో శిక్షణ పొందుతున్న పోలీసు జవాన్లు మహిళలపై పాల్పడే అత్యాచారాలు, లైంగిక వేధింపులు, తదితర అత్యాచారాలకు వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల మహిళలంతా ఒక్కటై అధికారులను ఘెరావ్ చేశారు. మీనా ఖల్కో హత్యకు వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో నిరసన వెల్లువెత్తింది. సోనీ సోడీపై ప్రయోగించిన అమానుష రాజ్యహింసకు వ్యతిరేకంగా పలు మహిళా, హక్కుల సంఘాలు ఉద్యమించాయి. ఈ ఉద్యమం కారణంగానే సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని స్వతంత్ర వైద్య పరీక్షలకు ఆదేశించిందనేది స్పష్టం.

దండకారణ్యంలోనే కాదు నేడు దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళల ప్రతిఘటనా పోరాటం కొనసాగుతోంది. లాల్‌గఢ్, నారాయణపట్నా ప్రజా పోరాటాల్లో మహిళల పాత్ర ఎంతో సమరశీలమైంది. సెజ్‌లు, అణువిద్యుత్ కేంద్రాలు, గనులు, భారీ ప్రాజెక్టులు, ఇంకా అభివృద్ధి పేరుతో తీసుకువస్తున్న పలు విస్థాపన, వినాశకర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో మహిళల భాగస్వామ్యం ఎంతో స్ఫూర్తిదాయకమైనది.

ఇలా మహిళల ప్రతిఘటన, పోరాటం కొనసాగడం అంటే మార్చి 8 వారసత్వం సగర్వంగా కొనసాగడమే. అయితే తమ సాయుధ బలగాలను రెచ్చగొట్టి ఒకవైపు మహిళలపై విచ్చలవిడి హింసా దౌర్జన్యాలను సాగిస్తున్న ప్రభుత్వాలు మరోవైపు అంతర్జాతీయ మహిళా దినాలను జరుపుతున్నాయి. మహిళలు పోరాట వారసత్వంగా స్వీకరించిన 'మార్చి 8'ని పాలక వర్గాలు జరపడం చాలా మోసపూరితమైంది. 'మార్చి 8'లోని సారాన్ని తీసివేసి, దాన్ని ఉత్త డొల్లగా మాత్రమే మిగిల్చే కుట్ర ఇది. మహిళలు, మహిళా సంఘాలు పోరాటానికి పునరంకితం కావాలని దృఢంగా ప్రతిజ్ఞ చేసే ఈ రోజున, పాలకవర్గాలు, పాలకవర్గాల ప్రాపకంలోని కొన్ని మహిళాసంఘాలు మహిళలను అవమానపరిచేలా వంటలు, ముగ్గులు, కుట్లు, అల్లికల పోటీలే కాక, అందాల పోటీలు, ఫ్యాషన్ షోలు నిర్వహిస్తున్నాయి. మహిళల చైతన్యాన్నీ, పరిధినీ, వాళ్ల సామాజిక పాత్రనూ కుదించి ఇంటికి, వంటింటికే పరిమితం చేయడం, సెక్స్ సింబల్స్‌గానే మహిళల అస్తిత్వాన్ని గుర్తించడం ఈ పోటీల లక్ష్యం. కాశ్మీర్ నుండి మొదలుకొని కన్యాకుమారి వరకూ దేశం నలుమూలల్లో జరిగే న్యాయమైన పోరాటాలను అణచడం కోసం మహిళలపై లైంగిక అత్యాచారాలను ఒక ఆయుధంగా ప్రయోగిస్తున్న దోపిడీ పాలకవర్గాలు మహిళా సాధికారత వంటి బూటకపు మాటలు వల్లిస్తున్నాయి.

మహిళలపై క్రూర హింసను ప్రయోగించడం ద్వారా తమ అధికారాన్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్న పాలకవర్గాలకు మార్చి 8 గురించి, మహిళా సాధికారత గురించి మాట్లాడే అర్హత ఎన్నటికీ ఉండబోదు. దోపిడీ పాలక వర్గాల ముసుగును తొలగించడానికి, వాటి మహిళా వ్యతిరేక ముఖాన్ని బహిర్గతం చేయడానికి మార్చి 8 సరైన సందర్భం. కాబట్టి ఈ మార్చి 8న సమరోత్సాహంతో అంతర్జాతీయ మహిళా దినాన్ని జరుపుకుందాం. మహిళలపై అమలవుతున్న రాజ్యహింసకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పీడిత మహిళలందరితో కలిసి గళమెత్తుదాం. ఈ రాజ్యహింసను ఓడించడానికి కామ్రేడ్ రణిత నెలకొల్పిన ప్రతిఘటనా నమూనాను కొనసాగిద్దాం.

కొత్త సీరియల్ ప్రారంభం

సూర్యుడు

- కె.వి. కూర్మనాథ్



ఆర్టిస్టు : రాయ్ లిచ్టెన్‌స్టీన్

(1)

ధగధగ లాడే, భగభగమండే సూర్యుడు కొన్ని వందల కోట్ల సంవత్సరాలనుండి మండుతున్నాడు. మరిన్ని వందలకోట్ల సంవత్సరాల పాటు నిరంతరాయంగా మండుతాడు. సెకెనుకు ఐదు కోట్ల టన్నుల హైడ్రోజన్, హీలియంలను మండిస్తూ సౌరకుటుంబానికి శక్తినీ, వెలుతురునూ ఇస్తున్నాడు. విశ్వవ్యాప్తంగా నిండుకున్న, కమ్ముకుంటున్న చిక్కటి చీకట్లను, రాళ్ళను సైతం కరిగించగల చల్లదనాన్ని తన పిల్లలమీద పడకుండా చూసుకుంటున్నాడు. పెక్కు వందల కోట్ల అణు విస్ఫోటనాలతో తానే బ్రహ్మాండమైన అగ్నిగోళంలాగా మండుతూ, ఇరవై వేల కోట్ల నక్షత్రాల పాలపుంత సొగసులో తానూ భాగమయ్యాడు.

తనచుట్టూ తాను తిరుగుతూ, మొత్తం తన కుటుంబంతో పాలపుంత కేంద్రంగా తిరుగుతూ, పాలపుంతతోపాటు తిరుగుతూ....సూర్యుడు నిత్య జ్వలిత. నిత్య సంచారి. తనను తాను దహించుకుంటూ వెలుతురులు, వెచ్చదనాన్ని నింపే మార్గదర్శి. కొండలమీదా, అడవులమీదా, సముద్రాలమీదా, పంటపొలాల మీదా, పిచ్చుకలమీదా, నదులమీదా, చెట్ల చిగుర్లమీదా ప్రేమగా కురిసి నవనవలాడే జీవితానికి కారణమయ్యాడు.

ఇది అంతరిక్షంలో ఉండి మన ఉనికికి కారణమైన సూర్యుడి గురించి. మన చుట్టూ కూడా ఎందరో సూర్యుళ్ళు ఉన్నారు. తాము నిప్పులాగా మారుతూ, చెత్తనూ చెదల్నీ, చీకట్లనీ తుదముట్టిస్తున్నారు. సూర్యుడు కనక మొక్కలపై పడి పత్రహరితాన్ని తయారుచేసి భూమ్మీద సమస్త జీవరాశికీ ఎలా ప్రాణం పోశాడో, ఈ సూర్యులు కూడా చుట్టుపక్కల జీవితాల్లో వెలుగుని నింపుతున్నారు. దిక్కులేకుండా, నిస్సహాయంగా, నిస్పృహలో ఉన్న వారికి శక్తి నిలిచారు. వాళ్ళని కేవలం తమ మీద యెన్నటికీ ఆధార పడేవాళ్లలాగా కాకుండా వాళ్ళకి జీవధాతువులనెలా సమకూర్చుకోవాలో, తమని తాము ఎలా వడిసెలలా, వెలుతురులా మలచుకోవాలో నేర్పారు. ఇప్పుడిక అడవుల్లో, మైదానాల్లో కనిపించే, కనిపించని చీకట్లను తరమడానికి వేల సూర్యుళ్లు పాలపుంతలో వలె వెలుగుతున్నారు.

వీళ్ళంతా తమతమ కార్యక్షేత్రాల్లో ఒక్కొక్కరిపై ఒక్కొక్కరిలా ప్రతిఫలిస్తున్నారు. వాళ్ళు ఆ సూర్యుళ్లను ఎలా అర్థం చేసుకుంటారు? ఎలా అంచనా వేస్తారు? ఏం నేర్చుకుంటారు?

* * *

అలాంటి ఒకానొక సూర్యుడి గురించిన రచన ఇది. తను పెరుగుతూ, అపసవ్య, అసమాన సమాజం గురించి నేర్చుకుంటూ, వాటిని సరిచేసే పరికరాల గురించి తెలుసుకుంటూ, వాటిని వాడుతూ, వాటిని వాడడం నేర్పించిన ఒక సూర్యుడి గురించి. కోపం తెచ్చుకునే వాటిమీద కోపం తెచ్చుకుంటూ, ప్రేమ కురిపించాల్సినచోట ప్రేమ కురిపిస్తూ, సముద్రంలో చేపవలే మారి సముద్రాన్ని, ప్రజల్లో ఒకడిగా కలిసిపోయి ప్రభుత్వాన్ని ముట్టడించాడు. అలా మారిపోతూ, కలిసిపోతూ వందల వేల వ్యక్తుల్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా విద్యుత్తులాగా మార్చాడు.

ఒక మనిషి, అంటే ఎలాంటి వనరులూ శక్తీ లేని మామూలు మనిషి, తలుచుకుంటే శత్రువును ఎలా కలవరపెట్టొచ్చో రుజువు చేశాడు. ఎలాంటి ఆచ్ఛాదనా లేని ప్రజలు అన్ని ఆయుధాలూ, కవచాలూ, డబ్బూ ఉన్న శత్రువుకు ప్రథమశ్రేణి శత్రువుగా ఎలా మారవచ్చో చూపించాడు. తానే కాదు ఎవరైనా మారవచ్చని చెప్పాడు. తయారు చేశాడు. రహస్యంగా ప్రవహిస్తున్న సత్యాన్ని ఒడుపుగా పట్టుకున్న, తెలుసుకున్న వాళ్లెవరైనా నిప్పు కణికలాగా మరొచ్చని, సత్యాన్ని మించిన ఆయుధం లేదని తెలియ చెప్పాడు.

ప్రజల శత్రువుకు సత్యమంటే పడదు. దాన్ని నొక్కి పెడతాడు. సత్యాన్ని తెలుసుకున్న వాళ్ళను, ప్రేమిస్తున్న వాళ్ళను, ప్రచారం చేస్తున్న వాళ్ళను, ఆచరిస్తున్న వాళ్ళను చూస్తే శత్రువు తట్టుకోలేడు. సత్యాన్ని ప్రతిఫలించే ఏపట్టకాన్నీ మననీయడు. ఏయే కళల సత్యం ప్రతిఫలిస్తుందో, ఏయే తీర్ల అది వ్యక్తీకరించ బడుతుందో వాటన్నిటినీ నిర్మూలిస్తాడు. నిర్మూలించడమే కాదు, సత్యశోధకుల్నే సత్య వ్యతిరేకులని ప్రచారం చేస్తాడు.

'సత్యం పిడి గుద్దులకు ఓడిపోద'ని గోర్కీ చెప్పేడని ఒకసారి చెప్పేడు, హాయిగా నవ్వుతూ.

అతడిని చూస్తే అనిపించేది, సత్యం ఇతడి రూపంలో ఉన్నదేమోనని. సత్యం సుందరంగా ఉంటుందని (సుందరంగా ఉండడమంటే అందంగా ఉండడం అన్న అర్థంలో కాదు. సొగసుగా, విలాసంగా ఉందని), అది రహస్యంగా సంచరిస్తుందేమో గాని, ప్రకాశవంతంగా సూర్యుడిలాగా ధగధగలాడుతూ ఉంటుందని అనిపించేది.

మకిలికి ఆస్కారం లేకుండా ఉండేవాడు కాబట్టే అతడంటే జనాలకి హృదయంలోపలి పొరల్లో చెప్పలేని అభిమానం. వాళ్లకేదో పొలాలు ఇప్పించాడని కాదు, లేకపోతే వాళ్లూర్లో ఉద్యోగాలు పుట్టించేడనికాదు.

తమ జీవితాన్ని తమ జీవితంగా లేకుండా ఎవరు చేస్తున్నారో, ఏయే మానవ సంబంధాలు ఎలా విచ్ఛిన్నమవుతూ ఉన్నాయో, బతుకును ఎవరు దుర్భరం చేస్తున్నారో, ఎవరెవరు ఏయే రకాలుగా ఏయే ఉత్పత్తి సంబంధాల్లో చొచ్చుకువచ్చి శ్రమవిలువను కొల్లగొడుతున్నారో అర్థం చేయించాడు. జీవన చలన సూత్రాలను వివరించి చెప్పడమే కాదు వాటిని ఏయే పనిముట్లతో ఎలా సరిచేయాలో చేసి, చేయించి చూపించేవాడు.

ఆకలితో ఉన్నవారికి చేపలిస్తే ఒకసారికి మాత్రమే ఆకలి తీర్చగలం. కానీ, చేపలెలా పట్టాలో చెపితే, వాళ్లకెపుడూ ఆకలిబాధ ఉండదని చెప్పేవాడు. అలాగే, కష్టంలో ఉన్నవారికి సహాయంచేస్తే, అప్పటికి వాళ్ళని ఒడ్డున పడేసిన వాళ్లమౌతామేమో, కానీ కష్టాలికి కారణమేమిటో చెప్పి, వాటిని ఎవరు మనమీద రుద్దుతున్నారో చెపితే, ఎలా సరిచేయాలో చెబితే వాళ్ళకెక్కువ ఉపయోగమని చెప్పేవాడు.

నిజానికి ఉద్యమానికి పర్యాయ పదం అతడు. అతడి అమరత్వంతో ఆ మేరకు ఉద్యమం నష్టపడి ఉండవచ్చు, కొంత వన్నె తగ్గవచ్చు. కానీ, అతడు వదలి వెళ్ళిన విలువల వన్నెలు పాలపుంతలోని కువకువ లాడే కొత్త నక్షత్రాల వలె మెరుస్తున్నాయి. ఎవరో రచయిత చెప్పినట్టు, సుందర పుష్పాలు నేల కొరిగితే నిస్పృహకు లోను కావద్దు. ఈ విశ్వంలో సుందరమైనవన్నీ, గొప్పవన్నీ నిశ్శబ్దంగా యెక్కడో ఒక చోట పెరుగుతూ ఉంటాయి. అవి పాత పుష్పాల పరిమళాలను, సొగసును సొంతం చేసుకుని సగర్వంగా, విలాసంగా తమ ఉనికిని ప్రకటిస్తాయి.

ఆ ఒక్కొక్కరూ అతడినెలా చూశారో, అర్థం చేసుకున్నారో తెలుసుకునే తెలియచెప్పే ప్రయత్నం ఇది.

పేరుకి ఇది సూర్యుడై నిప్పులు చెరిగి సుధాకరుడై మంచును కురిపించిన చెరగని చిరునవ్వు గురించి కావచ్చు. కానీ, ఇది శత్రువు గుండెల్లో కార్చిచ్చునీ, తనవారి హృదయాల్లో వెలుగుల్నీ చిందించిన ఏ నాయకుడిదైనా కావచ్చు. తమను తాము రద్దు చేసుకుని, నామ వాచకాలు వదులుకుని పోరాడుతున్న వాళ్ళందరి కథ కూడా. ఇది ఏ ఒక్కరినో కీర్తించడానికి కాదు. సర్వనామాలై, సకల జీవితాన్నీ, సకల శక్తి యుక్తుల్నీ ప్రజల కోసం వెచ్చించిన వాళ్ళు యెంత సామాన్యంగా ఉంటూ అసామాన్య మానవులుగా రూపాంతరం చెందారో, అలా మారుతూ ఎన్నెన్ని జీవితాల్లో ఎలా ప్రతిఫలించారో, ఏయే విలువల్ని నాటిపోయారో చెప్పడానికి. విలువల్ని ఒక జీవిత విధానంగా వాళ్లెలా మార్చుకున్నారో, ఎవరో చూస్తున్నపుడో, వింటున్నపుడో మాత్రమే కాదు, సర్వకాల సర్వావస్థల్లో విలువల్ని శ్వాసగా మార్చుకుని, చివరి శ్వాస వరకూ వాటికోసం పోరాడిన పోరాడుతున్న మనుషులు, వాళ్ళు శ్వాసించని విలువల గురించిన రచన ఇది.

(ఇంకా ఉంది...)

వ్యాసం

జల్ జమీన్ జంగల్‌మహల్ లాల్‌గడ్

- ఊ.సా.

పశ్చిమ బెంగాల్, పశ్చిమ మిద్నపూర్ జిల్లా కుష్బోనీ ప్రాంతంలోని జంగల్‌మహల్ బురిసోలి అటవీ ప్రాంతాలలో మావోయిస్టు అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ 24 నవంబర్ 2011న బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దండకారణ్యంలో దండుకట్టి, జంగల్‌మహల్‌లో జంగ్ చేసి తాను బతికున్నంత కాలం భద్రతాదళాల గుండెల్లో దడ పుట్టించి, కేంద్ర, రాష్ట్ర పాలకుల కంటిమీద కునుకు లేకుండా చేసిన విప్లవ యోధుడు కిషన్‌జీ అలా నేలకొరగడంతో తాత్కాలికంగా వారంతా ఊపిరి పీల్చుకున్నారు. "భారతదేశం(పాలకులు) ఎదుర్కొనవలసి ఉన్న అతి పెద్ద ఏకైక సమస్య నక్సలిజమే" నని ప్రకటించిన మన్మోహన్ మాటల కనుగుణంగా, చిదంబరం సారథ్యంలో , మమతా బెనర్జీ ఆధ్వర్యంలో ఇలా ఎదుర్కొన్నారు బూటకపు ఎదురు కాల్పుల్లో.

దండకారణ్యంలో గ్రీన్‌కారిడార్ నిర్మించి, దాన్ని రెడ్ కారిడార్‌గా మలిచి జగిత్యాల నుండి జంగల్‌మహల్ దాకా ఆంధ్రప్రదేశ్ నుండి బెంగాల్ దాకా జైత్రయాత్ర సాగించిన కిషన్‌జీ 35ఏళ్ళ విప్లవోద్యమ జీవిత యాత్ర తన జన్మస్థలమైన పెద్దపల్లిలో జరిగిన అంతిమయాత్రతో చరితార్థమైంది. నయా వలస పాలకుల వలసీకరణ వల్ల నిర్వాసితులవుతున్న ఆదివాసుల హక్కుల పరిరక్షకుడిగా, మలిదశ నక్సలైట్ ఉద్యమ పునర్ నిర్మాణ దక్షుడిగా, మన కాలపు మరో అల్లూరి సీతారామరాజుగా, మరో చారుమజుందార్‌గా అభివర్ణించదగ్గ మల్లోజుల జీవిత చరిత్ర మరోచరిత్ర సృష్టించింది. భారతదేశ విప్లవోద్యమ ప్రతిష్టను ఇలా ఇనుమడింప చేయడంలో ఇంత ఘనమైన, స్ఫూర్తిదాయకమైన, విప్లవాత్మక పాత్రను నిర్వహించిన కిషన్‌జీ ఉద్యమ ప్రస్థానంలో ఓ సృజనాత్మక ప్రత్యేకత ఇమిడి ఉంది. ఈ అరుదైన ప్రత్యేకతే మామూలు మల్లోజుల కోటన్నని మహోన్నత విప్లవనేత కిషన్‌జీగా మలచింది.

మిగతా విప్లవనేతల్లా ఆయన కూడా నూతన ప్రజాస్వామ్య విప్లవ ప్రజాయుద్ధ పంథానే మౌలిక పంథాగా అనుసరించినా "కొత్త ప్రశ్నలకు కొత్త సమాధానాలు కావాలి! కొత్త సమాధానాలు నూతన దృక్పథానికి నాంది పలకాలి". అంటూ 1980-90 దశాబ్దంలో వెల్లువెత్తిన నూతన సామాజిక ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలను, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమాన్ని, 1/70 ఆదివాసీ హక్కుల ఉద్యమాన్ని కిషన్‌జీ మిగతా వారికంటే భిన్నంగా ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్నాడు. అలాగే 1991 తర్వాత ఉనికిలోకి వచ్చిన నూతన ఆర్థిక విధానం తాలూకూ నయా సరళీకరణ, నయా వలసీకరణ పర్యవసానాలను ప్రత్యక్షంగా పరిగణనలోకి తీసుకున్నాడు. కాలం తెచ్చిన సామాజిక, ఆర్థిక మార్పులకు అనుగుణంగా ఇలా కొత్త పుంతలు తొక్కిన ఆయన సృజనాత్మక క్రియాశీల కొత్త ఎత్తుగడల వైఖరే తన జీవితాన్ని, ఉద్యమాన్ని కొత్త మలుపు తిప్పి అరుదైన ఈ కొత్త చరిత్రను సృష్టించింది."34 ఏళ్ళ క్రితం భూస్వామ్య దోపిడీ పీడనలకి వ్యతిరేకంగా ఎక్కుపెట్టి సాగిన రైతాంగ పోరాటాలు ఇప్పుడు నయా వలసీకరణ తాలూకూ నూతన ఆర్థిక విధానంపై ఎక్కుపెట్టి సాగే సరికొత్త ప్రజాస్వామ్య పోరాటాలుగా పరిణమించాయ"ని కిషన్‌జీ మీడియాలో అనేక సార్లు ప్రకటించాడు. అప్పుడు పెద్ద భూస్వాముల భూముల్ని, చిన్న రైతులకి, పేదలకి పంచిపెట్టే భూసంస్కరణలు జరిగితే ఇప్పుడు పేదరైతుల భూముల్ని బలవంతాన బడా పెట్టుబడిదారీ బహుళజాతి సంస్థలకు కట్టబెట్టే రివర్స్ భూసంస్కరణల నయా సరళీకరణ జరుగుతున్నది. అప్పటి భూపోరాటం పేదరైతులకు భూములు పంచే పోరాటమయితే ఇప్పటి భూపోరాటం పేదరైతుల వద్ద భూములు ఉంచే పోరాటం. కిషన్‌జీ గ్రహించిన సరికొత్తదనం ఇదే.

"అమ్మా బాగున్నావే" అంటూ ఆయన చెప్పిన మాటల్లోనే ఈ అంశాల్ని పరిశీలించవచ్చు."ప్రత్యేక తెలంగాణకి మేం మద్దతిస్తున్నాం. కానీ అంతకన్నా ఉన్నతమైన ప్రజాస్వామ్య తెలంగాణ, ప్రజాస్వామ్య దండకారణ్యం, ప్రజాస్వామ్య లాల్‌గడ్‌ల కోసం మేం ఉద్యమిస్తున్నాం.... ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ అయినా, పశ్చిమ బెంగాల్‌లో గూర్ఖాలాండ్ అయినా ప్రజల ఆకాంక్షల మేరకే ఆ ఉద్యమాలు సాగుతాయి. ప్రజాస్వామ్య తెలంగాణ దృక్పథంతో తెలంగాణాని ప్రజాస్వామీకీకరించి భారత(సంయుక్త రాష్ట్రాల) ఫెడరల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే మా లక్ష్యం" అన్నాడు. అలాగే సెజ్‌ల పేరిట లక్షలాది ఎకరాల పంట భూముల్ని, అటవీ భూముల్ని, భూగర్భ ఖనిజ సంపదని, దేశీయ, విదేశీయ బహుళజాతి గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెట్టి, ఆయా ప్రాంతాల నుండి గ్రామీణ పేదల్ని, గిరిజనుల్ని బలవంతాన నిర్వాసితుల్ని చేస్తే సహించేది లేదని చెపుతూ "మేం రక్తమైనా ఇస్తాం గాని భూములు మాత్రం ఇవ్వం అని ప్రతినబూని ప్రాణాలకు తెగించి పోరాడుతున్న పీడిత ప్రజల వెంట మేమున్నాం" అన్నాడు. "జల్ జమీన్ జంగిల్ హమారా!" "మా అడవిలో మా రాజ్యం" అనే అటానమీ హక్కుల కోసం తుడుం దెబ్బ మోగిస్తూ విల్లంబు లెక్కుపెడుతున్న ఆదివాసుల అస్తిత్వవాదాన్ని ఆసరా చేసుకొని దండకారణ్యము అంతటా "మా నాయకత్వంలో ఆదివాసుల హక్కుల కోసం ప్రజా గెరిల్లా సైన్యంతో ప్రజాయుద్ధం నడుస్తోందన్నాడు". బహుళజాతి సంస్థల కొమ్ముగాస్తున్న భారత దళారీ పాలక వర్గాలు దేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, స్వావలంబనని తాకట్టు పెట్టి "మన దేశ పౌరులమీదే మన దేశ

సైనిక బలగాలను మోహరించి గ్రీన్‌హంట్ పేరిట అంతర్యుద్ధాన్ని ప్రకటించారు"న్నాడు. "అందులో భాగంగా గత మార్చి 25, 26 తేదీల్లో(జంగల్‌మహల్) లఖన్‌పూర్ అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో తనతో పాటు చాలామంది చనిపోయినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వదంతులు వ్యాపింపజేసాయ"ని రాసాడు. చివరికి ఆ వదంతులే వాస్తవమై, ఆ ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న కిషన్‌జీని అదే సి.ఆర్.పి.ఎఫ్. డైరక్టర్ జనరల్ స్పెషల్ టీము, అదే జంగల్‌మహల్ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చేసింది. అందుకే ఈ రాజకీయ హత్య, గ్రీన్‌హంట్‌లో భాగంగా జరిగిన ఎన్‌కౌంటర్ హత్యగా అనేకమంది పేర్కొంటున్నారు.

ఆనాడు 1978 సెప్టెంబర్ 9న జరిగిన జగిత్యాల జైత్రయాత్రలో తొలి మలుపు తిరిగిన కిషన్‌జీ 35 ఏళ్ళ విప్లవోద్యమ ప్రస్థానం అనేక మలుపులు తిరుగుతూ బెంగాల్ జంగల్ మహల్ లాల్‌గడ్ దాకా ఓ లాంగ్ మార్చ్ లాగా, ఓ లాల్‌మార్చ్ లాగా ఎలా సాగిందో, దండకారణ్యాన్ని ఎర్ర కారిడార్‌గా ఎలా మలిచిందో ఓసారి సింహావలోకనం చేసుకుందాం. అంతకు ముందు 1967-69లో బెంగాల్ రగిలిన నక్సల్‌బరి నిప్పురవ్వ దావానలంలా దేశమంతా వ్యాపించి 1969-70 నాటి ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళ ఉద్యమం దాకా ఎలా సాగిందో ఓ సారి నెమరు వేసుకుందాం.

సరిగ్గా 34 ఏళ్ళ క్రితం 1967లో పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లా సిలిగురి సబ్‌డివిజన్‌కి చెందిన నక్సల్‌బరీ ప్రాంతంలో సి.పి.ఎం. రివిజనిజంపై రివల్యూషనిజం రివోల్టుగా రగిలిన నక్సలిజం నిప్పురవ్వ దావానలమై దేశమంతా వ్యాపించి శ్రీకాకుళంలో అడివంటుకొన్న ఆనాటి "వసంతకాల మేఘగర్జన" చరిత్రకి సాక్షిగా ఆనాడు చారుమజుందార్ ఆంధ్రప్రదేశ్ దాకా వచ్చి గుంటూరు జిల్లా గుత్తికొండ బిలంలో రహస్య సమావేశం నిర్వహించాడు. అందుకే 2004 లో పీపుల్స్‌వార్ పార్టీ, జనశక్తి పార్టీలు ప్రభుత్వంతో శాంతి చర్చలు జరుపుతున్న సందర్భంగా గుత్తికొండ బిలంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరిపాయి. అలా 1969-70 నాటి నక్సల్‌బరీ శ్రీకాకుళం పోరాటాల వారసత్వాన్ని స్వీకరించి, అప్పటికే దెబ్బతిన్న నక్సలైట్ ఉద్యమాన్ని పునర్నిర్మించే సంకల్పంతో 1978 సెప్టెంబర్ 9న ఉత్తర తెలంగాణలో జగిత్యాల జైత్రయాత్ర జరిగింది. ఈ దెబ్బకు తట్టుకోలేక తెలంగాణలోని భూస్వామ్య దొరలు పట్నాలు పారిపోయారు. 1979లో కరీంనగర్ జిల్లాను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించారు.

అలాంటి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి బ్రాహ్మణవాడలో సాంప్రదాయ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన మల్లోజుల కోటేశ్వరరావు ఆనాటికి సి.ఓ.సి. పేరుతో పిలవబడే విప్లవ పార్టీకి కరీంనగర్ జిల్లా తొలి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. ఆ తర్వాత 1980లో అది పీపుల్స్‌వార్ పార్టీగా మారినాక ఆంధ్రప్రదేశ్ తొలి రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ పగ్గాలు చేపట్టాడు. 1987లో దండకారణ్యంలో అడుగు పెట్టేదాకా (1976-1987) పదకొండేళ్ళ పాటు ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో వివిధ బాధ్యతలు నిర్వహించిన కిషన్‌జీ పై, పీపుల్స్‌వార్ పార్టీపై ఆ కాలంలో వెల్లువెత్తిన నూతన సామాజిక అస్తిత్వ ఉద్యమాల ప్రభావం బలంగానే పడింది. ఆ ప్రభావంతో దండకారణ్యంలో అడుగు పెట్టిన కిషన్‌జీ ఉద్యమ జీవితం మరో సరికొత్త మలుపు తిరిగింది. ఈ సరికొత్త మలుపే ఆ తర్వాత మలుపులకి మూలమలుపైంది. కనుక ఈ మూలమలుపులో ఉన్న కొత్త కోణాన్ని, కొత్త ప్రశ్నలకు కొత్త సమాధానాలు కావాలనే సరికొత్త కోణాన్ని పరిగణనలోకి తీసుకోకపోతే మలిదశ నక్సలైట్ ఉద్యమ పునర్నిర్మాణంలో కిషన్‌జీ సృష్టించిన కొత్త చరిత్ర అసమగ్రంగానే మిగులుతుంది.

గిరిజనుల సమస్య అయినా, దళితుల సమస్య అయినా మౌలికంగా భూమి సమస్యే అనే సాంప్రదాయ వర్గ దృక్పథంతో వర్గేతర సామాజిక అంశాల "ఎజెండాను పక్కనబెట్టి ఎర్రజెండాను ముందుకు తీసుకెళ్ళగలరా?" అని ప్రశ్నిస్తూ ఆనాడు (1987-1995) ఎం.ఎల్ సెంటర్ (ఎదురీత) సంస్థ సిద్ధాంతపరమైన డిబేట్ చేసింది. మార్క్సిజాన్ని కేవలం వర్గ దృక్పథానికే పరిమితం చేసి, వర్గేతర సామాజిక అంశాలను విస్మరించడం అంటే అది వర్గ కుదింపువాదం(క్లాస్ రిడక్షనిజం) అవుతుందని విమర్శించింది. ముఖ్యంగా 1985లో కారంచేడులో దళితులపై కమ్మ భూస్వాములు చేసిన అగ్ర దురహంకార దాడికి నిరసనగా రగిలిన దళిత ఆత్మగౌరవ పోరాట నిప్పురవ్వ దావానలమై బ్రాహ్మణేతర దళిత బహుజన సామాజిక ప్రజాస్వామ్య ఉద్యమ ప్రవంతి వెల్లువెత్తింది. నక్సలైట్ ఉద్యమానికి నక్సల్బరీ ఎలా ప్రేరణ ఇచ్చిందో దళిత ఉద్యమానికి కారంచేడు అలాంటి ప్రేరణనే ఇచ్చిందని దళిత మహాసభ ఓ పోలిక తెచ్చింది. ఆ దశలో దళిత ఆత్మగౌరవ పోరాటానికి ఆత్మరక్షణ పోరాటాన్ని జోడించి "సమతా సైనిక్‌దళ్" ని నిర్మించిన ఎం.ఎల్ సెంటర్(ఎదురీత) "నక్సల్బరీ రివిజనిజం పై పోరాడింది! కారంచేడు బ్రాహ్మణిజంపై పోరాడమంది!" అని పిలుపునిచ్చింది. విప్లవ శిబిరంలో ఈ పిలుపునందుకున్న మారోజు వీరన్న మూడు అంశాల్లో మౌలికమైన మార్పు తీసుకున్నారు."తుడుం దెబ్బ" అనే తొలి గిరిజన సంస్థను నెలకొల్పడం జరిగింది. దాని తరఫున "గిరిజన భూములు గిరిజనులవే". అన్యాక్రాంతమై, గిరిజనేతరుల అధీనంలో ఉన్న (48%-కోనేరు రంగారావు కమిషన్ రిపోర్టు) భూముల నుండి గిరిజనేతరులు వైదొలగాలని పిలుపునిచ్చి 1/70 గిరిజనుల భూముల చట్టం అమలు కోసం పోరాడడం జరిగింది. "జల్ జంగిల్ జమీన్ హమారా. మా అడవిలో మా రాజ్యం", "మా తండాలో మా రాజ్యం" అనే నినాదాలతో గిరిజన సామాజిక ప్రజాపోరాటాలు నిర్మించడం జరిగింది. అలాగే "తెలంగాణ మహాసభ", "దళిత బహుజన మహాసభ" స్థాపించి "మా తెలంగాణలో మా రాజ్యం", "తెలంగాణలో దళిత బహుజన ప్రజాస్వామ్య రాజ్యం" అనే నినాదాలతో సమగ్ర ప్రజాస్వామ్య దృక్పథాన్ని వెలుగులోకి తేవడానికి 142 మంది అమరవీరులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారు.

నక్సలైట్ ఉద్యమంలో భాగంగా 1969-70లో రగిలిన గిరిజన, గిరిజనేతర రైతుల భూస్వామ్య వ్యతిరేక భూపోరాటానికి అదే 1970లో జరిగిన భూసంస్కరణకి, 1/70 చట్టానికి అవినాభావ సంబంధం ఉందన్న సంగతి ఎప్పటికీ చరిత్రలో మరుగుపడే ఉంది.

ఆనాటి నక్సలైట్ నాయకుల అవగాహన ప్రకారం గిరిజన, గిరిజనేతర అనే విచక్షణ లేకుండా భూస్వామ్యేతర రైతుకూలీలందర్నీ ఒక వర్గంగా సంఘటితం పరిచే సాంప్రదాయ వర్గ దృక్పథంతోనే ఆ భూపోరాటం సాగింది. ఫలితంగా జరిగిన భూపంపిణీలో సగానికి సగం గిరిజనుల భూమి గిరిజనేతర పేదరైతుల చేతికి పోయింది. కనుక కేవలం వర్గ దృక్పథంతో ఈ నష్టాన్ని నివారించలేక విఫలం కావడం జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాలకవర్గాలు గిరిజన, గిరిజనేతర ప్రాతిపదికపై వర్గ ఐక్యతకు చిచ్చు పెట్టి విభజించి పాలించే కుటిలోపాయంతో నక్సలైట్ ఉద్యమాన్ని దెబ్బతీసే పన్నాగంతో 1970లో ఈ చట్టం చేశారు. కాని 1980-90 దశాబ్దంలో వెల్లువెత్తిన సామాజిక అస్తిత్వ ఉద్యమాలు ఈ 1/70 చట్టాన్ని పాలకులపైనే ఎక్కుపెట్టి ఎదురు దెబ్బ తీసారు. ఆ దెబ్బతో తెలుగుదేశం ప్రభుత్వం 1986లో 1/70 చట్టాన్ని సవరించాలని విఫల ప్రయత్నం చేసి భంగపడింది.

ఈ నూతన సామాజిక, ప్రాంతీయ ఉద్యమాల సరికొత్త ప్రభావంతో 1987లో దండకారణ్యంలోకి అడుగు పెట్టిన కిషన్‌జీ తెలంగాణ సరిహద్దులకి ఆనుకొని ఉండే చత్తీస్‌గడ్, దంతెవాడ, జగదల్‌పూర్, బీజాపూర్, బస్తర్ అటవీ ప్రాంతాలతో పాటు ఒరిస్సాలోని కోరాపుట్, మహారాష్ట్రలోని గడ్‌చిరోలి, చంద్రపూర్ దాటి జార్ఖండ్ తదితర అటవీ ప్రాంతాలకు విస్తరించి బీహార్, మధ్యప్రదేశ్‌లలో అడుగు పెట్టాడు. ఈ రాష్ట్రాలన్నిటి సరిహద్దులను కలిపే దండకారణ్యంలో దండుగట్టి "ఆదివాసుల మెస్సయ్య" గా, మరో అల్లూరి సీతారామరాజుగా వారి ఆదరాభిమానాల్ని చూరగొన్నాడు. అలా ఆదివాసీ హక్కుల ఉద్యమాన్ని దండకారణ్య ప్రజాస్వామ్య ఉద్యమంగా మలచడంలో కిషన్‌జీ నిర్వహించిన అపూర్వమైన అద్వితీయమైన కీలక పాత్రే అతని జీవితాన్ని, ఉద్యమాన్ని మరో మలుపు తిప్పింది. అప్పటికి అతని ఉద్యమ జీవితం (1987-2004) మరో 17 ఏళ్ళు గడిచింది.

1980లో సి.ఓ.సి., సి.పి.ఐ(ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) పార్టీగా మారినపుడు, రాష్ట్ర కార్యదర్శిగా పగ్గాలు చేపట్టడంలో కీలక పాత్ర పోషించిన కిషన్‌జీ బీహార్‌కి చెందిన 'పార్టీయూనిటీ', 'మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్' (ఎం.సి.సి) లను పీపుల్స్‌వార్‌తో విలీనం చేయడంలో కూడా ప్రధాన పాత్ర పోషించాడు. దేశంలోని ఇతర విప్లవ శక్తులను కలుపుకొని 2004లో మావోయిస్టు పార్టీ ఆవిర్భవించడం అనే పరిణామం కిషన్‌జీ జీవితాన్ని, మావోయిస్టు ఉద్యమాన్ని మరోమలుపు తిప్పింది. అప్పటికే ఆంధ్రప్రదేశ్ నుండి బీహార్ దాకా దండకారణ్యాన్ని స్థావర ప్రాంతంగా మలిచిన కిషన్‌జీ ఉద్యమ ప్రస్థానం మావోయిస్టు పార్టీ ఆవిర్భావంతో మరో మలుపు తిరిగింది. అదే ఏడాది "పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ"(పి.ఎల్.జి.ఎ) ఏర్పాటు కావడం పాలకుల్ని మరింత కలవరపరిచింది. అదే సమయంలో 34 ఏళ్ళుగా పశ్చిమబెంగాల్‌ని ఎదురులేకుండా పాలిస్తున్న వామపక్ష నిరంకుశ పాలకుల భద్రలోక్ భద్రతా వలయాన్ని ఛేదించడంలో కిషన్‌జీకి ఈ పరిణామం కీలక మలుపుగా తోడ్పడింది. ఇదే జరగకుంటే బీహార్ నుండి వేరుపడిన జార్ఖండ్ రాష్ట్రానికి ఆనుకొని ఉన్న, జార్ఖండ్ లోకి విస్తరించి ఉన్న బెంగాల్ కుష్బోనీ అడవుల్లో జంగల్‌మహల్ అటవీ ప్రాంతాన్ని కిషన్‌జీ తన ఏడేళ్ళ(2004-2011) చివరి జీవిత ఘట్టంలో విముక్తి ప్రాంతంగా ప్రకటించగలిగేవాడు కాదు. అలా పశ్చిమబెంగాల్, పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా కుష్బోనీ అటవీ ప్రాంతంలోని జంగల్‌మహల్‌ని స్థావర ప్రాంతంగా మలచుకోబట్టే దానికి ఆనుకొని ఉన్న పురులియా, బంకూర్ జిల్లాలపై మావోయిస్టు పార్టీ పూర్తి పట్టు సాధించగలిగింది. ఆ చుట్టు పక్కలనున్న నాడియా, ముర్షిదాబాద్, మాల్డా, బర్ద్వాన్ జిల్లాల్లో కార్యకలాపాల్ని విస్తరించడానికి అవకాశం ఏర్పడింది. లాల్‌గడ్‌గా పిలవబడే ఈ ప్రాంతాన్ని లాల్‌ఖిల్లాగా మలచడంలో మావోయిస్టులు ఇలా విజయం సాధించడం వల్లనే కిషన్‌జీ ప్రత్యక్ష సారథ్యంలో 2008 నవంబర్ నుండి 2009 జూలై వరకు 8 నెలల పాటు లాల్‌గడ్ ప్రాంతాన్ని తమ అధీనంలో ఉంచుకొని "కాంపాక్ట్ రివల్యూషనరీ గెరిల్లా జోన్" గా, "జనతన సర్కార్"గా డిక్లేర్ చేయగలిగారు. అలా జగిత్యాల నుండి జంగల్ మహల్ దాకా జైత్రయాత్ర చేసిన కిషన్‌జీ పశ్చిమబెంగాల్‌కి ఆనుకొని ఉన్న నేపాల్ దాకా 'రెడ్ కారిడార్' ఏర్పాటుకి పునాది వేశారు. అంతేకాదు ఈశాన్య రాష్ట్రాలకు కూడా విస్తరించి, అస్సాంలో పార్టీ కార్యకలాపాలు సాగించారు. స్వయంపాలన, స్వయం నిర్ణయాధికారం కోసం ఈశాన్య రాష్ట్రాల్లో పోరాటాలు చేస్తున్న జాతుల ఉద్యమాలకు సంఘీభావం పలికే పాత్ర కూడా కిషన్‌జీ ద్వారానే జరిగింది.

అదే సమయంలో పశ్చిమ బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ పై ప్రయోగించిన మందుపాతర తదితర ఘటనలు వివాదాస్పదమైనా అవి ఫ్రంట్ ప్రభుత్వపు పునాదుల్ని కుదిపి వేశాయని చెప్పక తప్పదు. అంతే కాదు టాటా నానో కార్ల కంపెనీ కోసం సింగూరులో, కెమికల్ హబ్ కోసం నందిగ్రాంలో వేలాది ఎకరాల పంట భూముల్ని సెజ్‌లుగా మార్చడం కోసం బుద్ధదేవ్ ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక నిరంకుశ వైఖరికి నిరసనగా వెల్లువెత్తిన పోరాటాన్ని మిలిటెంట్ ప్రజా ఉద్యమంగా మలచడంలో కిషన్‌జీ కీలక పాత్ర పోషించారు. 1967లో రివిజనిజంపై నివురుగప్పిన నిప్పులా గూడుగట్టున్న అసంతృప్తి నక్సల్‌బరీ నిప్పురవ్వతో గుప్పుమని మండినా ఆనాటి వామపక్ష పాలకులు దాన్ని పాశవికంగా అణచివేశారు. అప్పటి నుండి ఇప్పటి దాకా మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కాలం సాగిన సి.పి.ఎం. పాలనలో సామాన్య ప్రజల్లో చోటుచేసుకొన్న అసంతృప్తిని బలమైన ప్రజా ఉద్యమంగా మలచి, ఆ ప్రభుత్వ పతనానికి నాంది పలకడంలో కిషన్‌జీ పాత్ర అద్వితీయమైంది. నక్సలిజానికి పుట్టినిల్లయిన పశ్చిమ బెంగాల్‌లో మళ్ళీ 34 ఏళ్ళ(1967-2011) తర్వాత తన 35 ఏళ్ళ(1976-2011) విప్లవోద్యమ ప్రస్థానంలో అనేక కొత్త పుంతలు తొక్కి, నక్సలైట్ ఉద్యమ పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడంలో కిషన్‌జీ నిర్వహించిన చారిత్రాత్మక పాత్ర చరితార్థమైందని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఆ రకంగా జగిత్యాల నుండి జంగల్ మహల్ లాల్‌గడ్ దాకా నక్సలైట్ ఉద్యమాన్ని దేశవ్యాపితంగా విస్తరించడంలో మల్లోజుల కిషన్‌జీ మన కాలపు మరో అల్లూరిగా, చారుమజుందారుగా మరో చరిత్ర సృష్టించి చరితార్థుడయ్యాడు.

కరపత్రం

తెలంగాణ సకల జనుల సమ్మె...

- విరసం

రాజకీయ పరిష్కారాలు అవసరమైన ప్రతిచోట నిర్బంధ ప్రయోగమే పాలక విధానమని ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా పదే పదే రుజువు అవుతోంది. తెలంగాణ ఉద్యమాన్ని గుర్తించి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రభుత్వం కనీస హామీ కూడా ఇవ్వకపోగా దారుణమైన నిర్బంధాన్ని పరిష్కారంగా ఎంచుకున్నది. అణచివేత, అక్రమ కేసులు విచ్చలవిడిగా ప్రయోగించి ఉద్యమాన్ని దెబ్బతీయాలని తప్ప సమాజంలో తలెత్తే రాజకీయ ఆందోళనలతో రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుందనే రాజనీతిజ్ఞత మన పాలకులకు కనీసంగా లేదు. నిర్బంధమే అన్నిటికీ పరిష్కారమనే విద్యను బ్రిటిష్ పాలకుల నుంచి నేర్చుకున్నారు. వాళ్ల నుంచి అధికారంతోపాటు అన్ని అవలక్షణాలనూ, అణచివేత పద్ధతులను అలవర్చుకున్నారు. వాళ్లు తయారుచేసుకున్న అణచివేత చట్టాలను యథాతథంగా కొనసాగించడానికి కూడా సిగ్గుపడడం లేదు. దీనికి ఉదాహరణ రాజద్రోహ నేర చట్టమే. భారత ప్రజలు రాజద్రోహానికి పాల్పడతారనే భయం వలసపాలకులకు ఉన్నట్లే ఈ స్వదేశీ మార్క్ పాలకులకు కూడా ఉన్నది. అందువల్ల ఆ చట్టాన్ని శిక్షాస్మృతిలో పదిలంగా దాచుకొని రాజకీయ అసమ్మతిదారులందరి మీద ప్రయోగిస్తున్నారు. అవి చాలవన్నట్లు సరికొత్త అప్రజాస్వామిక చట్టాలను కూడా తయారు చేసుకుంటున్నారు. ఇక సాధారణ అణచివేత గురించి చెప్పనవసరమే లేదు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రాజ్యాంగ పరిధిలో పరిష్కారమయ్యే అతి చిన్న ప్రక్రియ. దశాబ్దాల పోరాటాల వల్ల తెలంగాణ ప్రజలు అతి పెద్ద సంఘీభావాన్ని కూడగట్టుకోగలిగారు. కేవలం కోస్తా, రాయలసీమ పెట్టుబడిదారీ వర్గం మినహా మరెవ్వరూ తెలంగాణ రాష్ట్రానికి అడ్డం లేరు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆ వర్గ ప్రయోజనాలను కాపాడడానికే తెలంగాణ ఇవ్వడం లేదు. అయినా ఉద్యమం కొనసాగుతున్నందు వల్ల నిర్బంధం ప్రయోగించి ఆ ఆకాంక్షను కాలరాయాలనుకుంటున్నది. అందులో భాగమే ఇటీవల, మరీ ముఖ్యంగా సకల జనుల సమ్మె సందర్భంలోని అణచివేత.

అంతక ముందు నుంచే వందలాది మంది విద్యార్థుల మీద, కార్యకర్తల మీద వందల కొద్దీ అక్రమ కేసులు పెడుతూ వచ్చిన పోలీసులు సకల జనుల సమ్మె సందర్భంలో మరింతగా పేట్రేగిపోయారు. ఆ తర్వాత కూడా నిత్యం తెలంగాణ అంతటా ఏదో ఒక మూల నుంచి అణచివేత వార్తలు వస్తూనే ఉన్నాయి. సకల జనుల సమ్మె సందర్భంగా రైళ్ల బంద్‌కు పాల్పడితే రైల్వే చట్టాల ప్రకారం కఠినంగా శిక్షిస్తామని బెదిరించారు. ఆ రెండు రోజులూ తెలంగాణ రాష్ట్ర సమితి నాయకుల మీద కూడా కేసులు పెట్టినా.. వాళ్లతో ఒకలాగా, సాధారణ కార్యకర్తల విషయంలో మరోలాగా వ్యవహరించారు. దీనికి ఎన్నయినా ఉదాహరణలు చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమం మీద నిర్బంధం సకల జనుల సమ్మెతో తీవ్ర స్థాయికి చేరుకుంది. సకల జనుల సమ్మె నిజంగానే తెలంగాణ సకల జనుల సమ్మెగా వ్యక్తమైందా? ముఖ్యంగా రాజకీయ నాయకత్వం అందులో కనీసంగానైనా పాల్గొన్నదా? పైగా సమ్మె విరమణ వెనుక ఉద్యమ నాయకత్వానికి ఉన్న అవగాహన ఏమిటి? 'తక్షణం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాల'నే నినాదం టి.ఆర్.ఎస్.కు సంబంధించినంత వరకు కేవలనినాదమేనా? 'తక్షణం' అనే మాటకు కెసిఆర్‌కు ఉన్న వ్యూహాత్మక అర్థం ఏమిటి? అనే సవాలక్ష ప్రశ్నల కూడలిలో ఇవాళ తెలంగాణ ఉద్యమం నిలిచి ఉన్నది. ఏ ప్రజా ఉద్యమమైనా ఆది నుంచే నిర్బంధాన్ని ఎదుర్కోక తప్పదుగాని, తెలంగాణ ఉద్యమం ఇప్పుడొక స్తబ్దతలోకి జారి

బహిరంగ సభ :

తేది - స్థలం : 09 జనవరి, 2012, సోమవారం సాయంత్రం 6.00 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో...

అధ్యక్షత : **ఎం. రత్నమాల** (విరసం),

వక్తలు : **రాజేష్** (కె.యు.జాక్),

విజయ్ (చైర్మన్ - టి.ఎస్. జాక్),

పిడమర్తి రవి (చైర్మన్ - టి.ఎస్.జాక్),

కె. రాజిరెడ్డి (కన్వీనర్ - టి.ఆర్.టి.సి. జాక్),

సమ్మ రాజయ్య (వర్కింగ్ ప్రెసిడెంట్ - తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం), **జి. దేవి ప్రసాద్‌రావు** (ప్రధాన కార్యదర్శి-టి.ఎన్.జి.ఓ. సంఘం), **కె. రఘు** (కోఆర్డినేటర్ - విద్యుత్ ఉద్యోగుల జాక్),

వి. రఘునాథ్ (జాయింట్ సెక్రటరీ - ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం),

సి. కాశీం (కార్యవర్గ సభ్యులు - విరసం).

ప్రజాకళామండలి బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

విరామం సన్నివేశాన్ని చేరుకున్నది. నిర్బంధం వల్లే ఈ పరిణామం జరిగిందనడం సరికాదు. అందువల్ల నిర్బంధంతోపాటు ఇతర విషయాలు కూడా చర్చించుకోక తప్పదు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మీద నిర్బంధం టి.ఆర్.ఎస్. పొలిట్ బ్యూరో సభ్యుడు, ప్రముఖ కవి డాక్టర్ చెరుకు సుధాకర్ మీద ప్రభుత్వం పి.డి. యాక్ట్ పెట్టి, ఆ తర్వాత దాన్ని నాసాగా మార్చి నిర్బంధించింది. ఆ తర్వాత కోర్టు కేసు కొట్టేసి విడుదల చేసినా తెలంగాణ ఉద్యమం మీది నిర్బంధంలో ఇదొక ప్రధాన సంకేతాన్ని ఇస్తోంది.

కోస్తా, రాయలసీమ పెట్టుబడిదారీ వర్గాల ఆర్థిక మూలాలను దెబ్బతీయకుండా తెలంగాణ ఉద్యమం ముందుకు పోదనే అవగాహనను టిఆర్ఎస్ ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టినా తెలంగాణ ఆందోళనలో ఈ మాట అడపాదడపా వినిపిస్తూనే వచ్చింది. సకల జనుల సమ్మె సందర్భంగా హైదరాబాదు... విజయవాడ జాతీయ రహదారి మీద చెరుకు సుధాకర్ నేతృత్వంలో నల్గొండ జిల్లాలో బస్సుల రాకపోకలను కొన్ని గంటలు నిలువరించడంతో ఆయన మీద ప్రభుత్వం కక్షగట్టి కేసులు పెట్టింది. తెలంగాణ సాధన కోసం మిలిటెంట్ పోరాటాలు చేపట్టాలని విప్లవోద్యమం పదే పదే ఎందుకు చెప్తున్నదో ఇప్పుడు అందరికీ అర్థమై ఉంటుంది. మిలిటెంట్ పోరాటాలంటే.. ఏ వర్గమైతే తెలంగాణను అడ్డుకుంటున్నదో ఆ వర్గ ఆర్థిక మూలాలను కదిలించే పోరాట రూపాలని అర్థం. అలాంటి పోరాటాలు చేపడితే పాలకులు దుర్మార్గమైన కేసులు పెడతారని కూడా చెరుకు సుధాకర్ విషయంలో రుజువైంది. స్పష్టమైన అవగాహనతో కచ్చితమైన పోరాట రూపాలు- నిర్బంధం- ప్రతిఘటన అనేవి లేకుండా ఏ చిన్న ఆకాంక్షను కూడా ప్రజలు చరిత్రలో నిజం చేసుకోలేదు.

సుధాకర్ గురించి కొంచెమైనా చర్చ జరిగింది కాని, సింగరేణి కార్మికుల మీద, ఆర్.టి.సి. కార్మికుల మీద, విద్యుత్ ఉద్యోగుల మీద, విద్యార్థుల మీద అమలైన దారుణ నిర్బంధం గురించి ప్రచారం కాలేదు. కార్మికుల మీద వందలాది కేసులు పెట్టారు. మొదటి నుంచీ విద్యార్థుల మీద పోలీసుల దాడులు, కేసులు లెక్కే లేదు. వరంగల్‌లో యాకుబ్‌రెడ్డి అనే విద్యార్థిని దారుణంగా కొట్టడమేగాక, ఎన్‌కౌంటర్ చేస్తామని కూడా బాహాటంగా పోలీసులు బెదిరించారు. మిలియన్ మార్చ్ సందర్భంలో అనేక మంది మీద కేసులు పెట్టినా ప్రత్యేకించి సి.పి.ఐ. ఎం.ఎల్. న్యూడెమోక్రసీ నాయకులను, కార్యకర్తలను కక్షపూరితంగా వేధించారు.

జాతీయోద్యమం కాలంలో రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ పార్టీ అధికార మార్పిడీ తర్వాత నేరాల అదుపు చేయడం, జాతీయ భద్రతను కాపాడడం అనే సాకుతో పీడీ, నాసా, మీసా వంటి చట్టాలను తయారు చేసుకున్నది. ఈ చట్టాలు పుట్టినప్పటి నుంచి రాజకీయ ప్రత్యర్థుల మీదనే ప్రభుత్వాలు ప్రయోగిస్తూ వచ్చాయి. 1951లో పి.డి. యాక్టును తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట ఏకే గోపాలన్ మీద పెట్టింది. 1965లో చైనా యుద్ధాన్ని సాకు చేసుకొని దేశ భద్రతకు భంగకరమని సి.పి.ఎం. కార్యకర్తలను వేలాది మందిని అరెస్టు చేశారు. ఎన్‌సి చటర్జీ (ఎంపీ) నేతృత్వంలో ఆలిండియా కమిటీ ఏర్పడి ఈ అరెస్టులకు వ్యతిరేకంగా పని చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సి.పి.ఎం.కు చెందిన డాక్టర్ యలమంచిలి రాధాకృష్ణమూర్తి కార్యదర్శిగా, శ్రీశ్రీ అధ్యక్షుడిగా ఏ.పి.సి.ఎల్.ఏ. ఏర్పడి అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా పని చేసింది. ఏడాదిపాటు ఆందోళన సాగింది.

1971లో మళ్లీ మీసా కింద బంగ్లాదేశ్ యుద్ధం సందర్భంలో దేశ భద్రత సాకుతో ఆంధ్రప్రదేశ్‌లో కర్నాటి రామ్మోహన్‌రావు, గణేశం కోటేశ్వరరావు, తాడిగిరి పోతరాజు, డాక్టర్ చిరంజీవి, ఉమ్మంతల వెంకటరెడ్డి (విద్యుల్లత పత్రిక నిర్వాహక బృందం సభ్యుడు), సాహు తదితరులను మీసా కింద అరెస్టు చేశారు. ఈ అరెస్టుల మీద ఏర్పాటు చేసిన అడ్వయిజరీ కమిటీ వీళ్లను విడుదల చేసింది. మళ్లీ 1971 ఆగస్టులో స్టేట్ పి.డి. యాక్టు కింద విప్లవకవులు జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజుల మీద కేసు పెట్టారు. ఇందులోని క్లాజ్ ఏ ప్రకారం.. ఆరోపణల్లో ఏ ఒక్కటి నిజం అయినా కేసు చెల్లుతుంది. దీన్ని(క్లాజ్ ఏ) జస్టిస్ చిన్నపరెడ్డి, ఏ.డి.వి. రెడ్డి కొట్టేశారు. 1973లో మళ్లీ మీసా కింద చెరబండరాజు, ఎం.టి. ఖాన్, వరవరరావులను అరెస్టు చేశారు. దేశభద్రతకు ముప్పు అనే సాకుతోనే ఏ.పి.ఎన్.జీ.వో. నాయకులు సూర్యారావు, శ్యాంసుందర్‌లను ఉద్యోగాలనుంచి తొలగించి కేసు పెట్టారు. ఎమర్జెన్సీలో విప్లవ రచయితలను, బుద్ధిజీవులను, అనేక మంది కార్యకర్తలను మీసా కింద అరెస్టు చేశారు. మళ్లీ 1986లో రవూఫ్, బాలగోపాల్ మీద మీసా పెట్టారు. బాలగోపాల్ బెయిల్ మీద వస్తే రవూఫ్ ఏడాదికి పైగా జైల్లో ఉన్నాడు.

ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు సుధాకర్ మీద 14 కేసులతోపాటు పి.డి. యాక్ట్ పెట్టారు. డిసెంబర్ 6న పి.డి. యాక్ట్ కింద రిలీజ్ ఆర్డర్ ఇచ్చి ఆయన బైట ఉంటే శాంతి భద్రతలకు ప్రమాదమని నాసా కింద అరెస్టు ఆర్డర్ ఇచ్చారు.

ఈ కేసుల మీద ఏర్పాటు చేసిన అడ్వయిజరీ బోర్డు .. చెరుకు సుధాకర్ 'సమాజంలో ఉండదగినవాడు కాదు' అని తేల్చి ఏడాదిపాటు శిక్ష ఖరారు చేసింది. చెరుకు సుధాకర్ అక్రమ నిర్బంధం మీద టి.ఆర్.ఎస్. ప్రతిస్పందన చాలా అభ్యంతరకంగా ఉంది. ఏ సమస్య మీదైనా సమాజంలోని విభిన్న శక్తులు తరతమ స్థాయిలో ప్రతిస్పందించే అవకాశం ఉంది. టి.ఆర్.ఎస్. కాస్త ముందో వెనుకో స్పందించినా.. సుధాకర్ మీద కేసు పెట్టడాన్ని ఖండించారేగాని అసలు ఇలాంటి చట్టాలు ఉండటం ఏమిటి? వాటిని రద్దు చేయాలని నోటి మాటగా కూడా డిమాండ్ చేయలేదు. తెలంగాణ ప్రజాఉద్యమానికి తానే రాజకీయ ప్రతినిధిని అని చెప్పుకొనే పార్టీ ఇంత అప్రజాస్వామిక వైఖరిని కలిగి ఉందంటే తప్పక ఆ పార్టీ వర్గస్వభావంలోనే కారణాలు వెతకాలి. 'ప్రభుత్వాలన్నాక ఇలాంటి చట్టాలు దగ్గర లేకుంటే ఎలా?' అనే రాజ్య వైఖరే ఇందుకు కారణం.

ఇందులో ఇంకో అంతరార్థం కూడా ఉంది. రేప్పొద్దున తెలంగాణ ఏర్పడ్డాక అధికారంలోకి ఈ వర్గమే వస్తుంది కాబట్టి, రాజకీయ ప్రత్యర్థులను అదుపు చేయడానికి ఇట్లాంటి చట్టాలు లేకపోతే ఎలా? అనే ఉద్దేశంతోనే ఆ పార్టీ తన అంబుల పొదిలో నాసా, మీసాలాంటి వాటిని పదిలంగా ఉంచుకోదల్చింది. అందుకే ఈ వైఖరి తీసుకుంది. ఒక ప్రాంతీయ ఉద్యమానికి నాయకత్వం వహించే శక్తులకు ఈ పరిమితి సహజమే అని ఎవరైనా అనవచ్చు. అప్పుడు మరింత విస్పష్టంగా ఈ మాట చెప్పక తప్పదు.

ఆస్తిపర వర్గాలు రాజ్యాంగయంత్రంలో ఉన్నంత కాలం శాంతిభద్రతలకు, దేశ భద్రతకు ప్రజలు భంగకరంగానే ఉంటారు. కాబట్టి పాలకుల దగ్గర ఇట్లాంటి చట్టాలు అవసరమవుతాయి. చివరికి సుదీర్ఘ వామపక్ష విప్లవ రాజకీయ అనుబంధం, పౌర ప్రజాతంత్ర హక్కుల ఉద్యమ నేపథ్యం ఉన్న తెలంగాణవాదుల్లో కొందరు కూడా ఇట్లాంటి చట్టాలను రద్దు చేయాలని ఈ సందర్భంగా అనలేదు. తెలంగాణ సాధనలో ఈ డిమాండ్ ప్రజాస్వామిక తత్వాన్ని మరింత పెంచుతుందని వారు అనుకోలేదు. తెలంగాణ ఉద్యమం మీద నిర్బంధం గురించి మాట్లాడడంలో ఇలాంటి వైఖరికి చాలా కీలకమైన స్థానం ఉంటుందని స్ఫురించలేదు. నిజానికి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో ఏకీభావం లేనివారు కూడా పి.డి., మీసా, నాసాలాంటి చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడవలసి ఉన్నది. ఆ ఉద్యమ ఆకాంక్షపట్ల సమ్మతి లేకపోయినా ఎవరి మీదా, ఎప్పుడూ ఇట్లాంటి కేసులు పెట్టడానికి వీల్లేదని, అసలు ఆ చట్టాలే ఉండరాదని గట్టిగా అనగలిగిన ప్రజాస్వామిక సంప్రదాయం ఉన్న సమాజం మనది. కానీ తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ఇతర ప్రాంతాలవారు ఈ చైతన్యాన్ని ప్రదర్శించారా? సందేహమే.

ప్రభుత్వం టాడా చట్టం తెచ్చి దేశవ్యాప్తంగా లక్షలాది మందిని అక్రమంగా అరెస్టు చేసింది. ఆ తర్వాత కొంతకాలానికి ఎన్.డి.ఎ. పాలనా కాలంలో టాడా పేరు మార్చుకొని పోటాగా విరుచుకపడింది. ప్రజాస్వామిక హక్కులను తాము గౌరవిస్తామని ఊదరగొడుతూ అధికారంలోకి వచ్చిన యూపీఏ చట్ట వ్యతిరేక కార్యకలాపాల వ్యతిరేక చట్టాన్ని(యు.ఎ.పి.ఎ.) తీసుకొని వచ్చింది. దీని కింద ఇతర రాష్ట్రాల్లో ప్రజా సంఘాలను, రాజకీయ సంస్థలను నిషేధించారు. దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాల్లో వేలాది మంది ఆదివాసులను, ప్రజాసంఘాల కార్యకర్తలను, బుద్ధిజీవులను అరెస్టు చేస్తున్నారు.

శత్రువర్గం పట్ల ఏమరపాటుగా ఉంటూనే, కొన్ని ముఖ్యమైన విషయాలపై కేంద్రీకరించాల్సిన సన్నివేశానికి ఈ మలి దశ తెలంగాణ ఉద్యమం చేరుకుంది. అప్పుడే ఈ స్తబ్దతలోంచి మరో వెల్లువ సాగుతుంది. కోస్తా సంపన్నవర్గాల ఆర్థిక వనరుల మీద, ఆదాయ మార్గాల మీద ఉద్యమాన్ని ఎక్కుపెట్టకుండా ఏమీ సాధించలేమని సకల జనుల సమ్మె నిరూపించింది. ఈ పనికి టి.ఆర్.ఎస్. మాత్రమేకాదు, తెలంగాణ కోరుకుంటున్న బూర్జువా శక్తులేవీ సిద్ధంగా లేవని కూడా ఈ సమ్మె తేల్చేసింది. ఈ వైఖరి అడుగడుగునా వ్యక్తం కావడం వల్లే ఉద్యమం ఇంతకంటే ముందుకు పోలేక స్తబ్దతకు గురౌవుతోంది.

తెలంగాణ నాయకత్వానికి ఉద్యమ గమనం పట్ల సొంత వ్యూహం ఉంది. వాళ్ల పరిమితులు, అవగాహనలే ఉద్యమ ఆటుపోట్లుగా మనకు కనిపిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ నాయకత్వానికి ఇవేవీ తెలియవనుకోవాలా? పైగా.. ఇటీవల తెలంగాణ ఉద్యమం మీద నిర్బంధం గురించి మాట్లాడుతూ కొందరైనా 'మేం శాంతి యుతంగా ఉద్యమం చేస్తుంటే మా మీద ఈ నిర్బంధం ఏమిటి?' అనీ, 'మేమేమైనా నక్సలైట్లమా? టెర్రరిస్టులమా? ఇలాంటి కేసులు పెట్టడానికి, ఇంత నిర్బంధం తేవడానికి' అని అనడం పరిపాటైంది.

మొదట తెలంగాణ ఉద్యమం నిజంగానే శాంతియుతంగా సాగుతోందా? పోలీసుల అకృత్యాల సంగతి కాసేపు పక్కన పెట్టినా వందల మంది విద్యార్థుల స్వయం హననం హింస కాక మరేమిటి? ఈ హింసారూపాన్ని ఉద్యమ ఆటుపోట్లతో, తెలంగాణ వ్యతిరేక శక్తుల పాత్రతో సంబంధం లేకుండా వివరించలేం. నక్సలైట్ల మీద, టెర్రరిస్టుల మీద హింస సబబే..అనే అర్థం వచ్చేలా ఈ ధోరణి ఏమిటి?

ఉద్యమాలన్నిటి మీద పాలకుల వైఖరి ఒకటే. దాన్ని అర్థం చేసుకోవడంలోనే తేడాలున్నాయి. చాలా స్పష్టంగా శ్రీకృష్ణ కమిటీ ఎనిమిదో అధ్యాయాన్ని ప్రభుత్వం ఏ దాపరికం లేకుండా అమలు చేస్తోంది. ఢిల్లీ పాలకుల కుట్రలు ఉద్యమాన్ని లోపలి నుంచి తొలిచి వేస్తున్నాయి. ఇవాళ నిర్బంధ సారాంశాన్ని మొత్తంగా గుర్తించి వ్యతిరేకించాలి. ఈ స్తబ్దత పోగొట్టే ఆలోచనలు చేయాలి. అందు కోసమే ఈ సభ. అందరికీ ఆహ్వానం.

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ ఐ.డి. : arunatara1977@gmail.com

రిపోర్ట్

తెలంగాణపై నిర్బంధానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

- చంద్రయ్య

తెలంగాణకు పోరాటాలు కొత్తకాదు. నిర్బంధాలు అంతకన్న కొత్తకాదు. ఎక్కడ దోపిడీ, పీడనలు ఉంటాయో అక్కడ ప్రజా పోరాటాలుంటాయి. ఎక్కడ ప్రజా పోరాటాలుంటాయో అక్కడ పాలకుల నిర్బంధాలు ఉంటాయి. నేటి సందర్భం ఉద్యమం. నేటి మరో సందర్భం ఉద్యమంపై నిర్బంధం. మొదటి సందర్భం ప్రజాస్వామిక పోరాట సంస్కృతి కాగా, రెండవ సందర్భం ప్రజాకంటక పాలక సంస్కృతి. ప్రపంచ చరిత్రంతా ఈ రెండు సంస్కృతుల పోరాటమే. ఈ పరస్పర పోరాట చరిత్రే నేటి తెలంగాణ ఉద్యమంలోనూ జరుగుతోంది. ఉద్యమంలో పాల్గొంటున్న తెలంగాణ ప్రజలపై, తెలంగాణేతర ప్రజాస్వామికవాదులపై పాలకుల నిర్బంధం రెండు దశల్లో కొనసాగుతోంది. తెలంగాణ ఉద్యోగులపై వివిధ కృత్రిమ చట్టాల రూపేణా జరుగుతున్న నిర్బంధం ఒకటి కాగా, విద్యార్థులపై, ప్రజలపై భౌతిక దాడుల రూపేణా జరుగుతున్న నిర్బంధం మరొకటి. అప్రకటితంగా జరుగుతోన్న ఈ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ విప్లవ రచయితల సంఘం 'తెలంగాణపై నిర్బంధానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం' అనే అంశంపై 9 జనవరి 2012 న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభను నిర్వహించింది. విరసం సభ్యురాలు రత్నమాల అధ్యక్షతన జరిగిన ఈ సభలో వక్తలుగా తెలంగాణలోని దాదాపు అన్ని జాయింట్ ఆక్షన్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. నక్సలైట్లపై హింస సమంజసమేననే అర్థం వచ్చేట్లు కొంతమంది 'మేం ఏమైనా నక్సలైట్లమా, ఇట్లా హింసిస్తున్నారు' అనే వ్యాఖ్యాలు చేస్తున్నారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ రాజ్యహింస ఏ రూపంలో, ఎవరిపైనున్నా వ్యతిరేకించాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని రత్నమాల అన్నారు.

సభాధ్యక్షత వహించిన రత్నమాల సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆర్థిక మూలాలను దెబ్బతీసినపుడే తెలంగాణ సాధ్యం అవుతుందన్నారు. అందుకు ఉద్యమాలే సరైన మార్గమని అంటూ తెలంగాణపై నిర్బంధాన్ని ఖండించారు. కాకతీయ యూనివర్సిటీ జె.ఎ.సి. ఛైర్మన్ రాజేష్ సీమాంధ్ర పెట్టుబడిదారులు తెలంగాణపై దండయాత్రలు నిర్వహిస్తూ శాంతియుత తెలంగాణ ఉద్యమాన్ని హింసాత్మకంగా మార్చి వక్కదోవ వట్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, ఎన్. చంద్రబాబు నాయుడులు వరంగల్లు ప్రాంతాన్నే తమ యాత్రల కోసం ఎన్నుకోవడాన్ని తెలంగాణ ఉద్యమాన్ని సవాలు చేయడమే అని అన్నారు. వరంగల్ డి.ఎస్.పి. థర్డ్ డిగ్రీని ప్రవేశపెట్టి విద్యార్థులను, ఉద్యమాన్ని అణచివేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలపై, విద్యార్థులపై హింసాత్మక దాడులకు పాల్పడుతూ తెలంగాణ రాజకీయ నాయకులతో ఉదారంగా వ్యవహరిస్తూ, అసలైన ఉద్యమ శక్తులైన విద్యార్థుల, ప్రజల అణచివేత లక్ష్యంగా ప్రభుత్వం నేడు ప్రవర్తిస్తోందన్నారు. యాకుబ్‌రెడ్డి లాంటి ఎంతో మంది విద్యార్థులను ప్రభుత్వం మానసిక వేధింపులకు గురిజేస్తోందన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమం పట్ల 'చూపును' అందించడానికి విరసం లాంటి సంస్థల ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. ఓట్లు సీట్లతో తెలంగాణ రాదని కేవలం ఉద్యమాల ద్వారానే తెలంగాణ వస్తుందని సింగరేణి జె.ఎ.సి. ప్రతినిధి సమ్మయ్య రాజయ్య అన్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో సింగరేణి కార్మికుల ఇళ్ళపై దాడిచేసి వారిని అరెస్టు చేసి హింసించిన విధానాన్ని సమ్మయ్య రాజయ్య చెప్పారు. తెలంగాణ విద్యార్థులపై జరుగుతోన్న నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఏర్పడ్డ తెలంగాణ విద్యుత్ జె.ఎ.సి. ఎంతో నిర్బంధకాండను ఎదుర్కొన్నదని విద్యుత్ జె.ఎ.సి. ప్రతినిధి కె. రఘు అన్నారు. మిలియన్ మార్చ్ సందర్భంగా 700 మంది విద్యుత్ శాఖ ఉద్యోగులను అరెస్టు చేసారనీ, శంకర్ అనే ఉద్యోగిపై 20 కేసులు పెట్టి హింసించారు. ఈ నిర్బంధం నిరంతరం కొనసాగుతూనే ఉందని రఘు అన్నారు. తెలంగాణ ఆవిర్భావంతోనే సమస్యలన్నీ పోతాయనే అవగాహన సరైంది కాదనీ, తెలంగాణ ఏర్పడినా సమస్యలకోసం ఉద్యమాలు నిర్మించాల్సి ఉంటుందనీ రఘు అన్నారు.

తెలంగాణ ఆర్.టి.సి. జె.ఎ.సి. ప్రతినిధి రాజిరెడ్డి తెలంగాణ ఉద్యమంలో వివిధ రూపాలలో టి.ఆర్.టి.సి. కార్మికులపై నిర్బంధం కొనసాగుతోందని అన్నారు. టి.ఆర్.టి.సి. కార్మికుల మధ్య పరస్పర భేదాలు సృష్టించి వారిని విడదీసి అణచివేయడం నిర్బంధంలో మరో రూపమన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ సంఘాల జె.ఎ.సి. ప్రతినిధి దేవిప్రసాద్ తెలంగాణ ఉద్యోగులపై కొనసాగుతోన్న నిర్బంధాన్ని ఖండించారు. రైల్‌రోకో, పెన్‌డౌన్, సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె లాంటి ఉద్యమ మైలురాళ్ళను ఉద్యోగులు నిర్మించారన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులపై 177 జీ.వో., ఎస్మాలాంటి చట్టాల పేరుతో నిర్బంధకాండను అమలు చేస్తున్నారని అన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగ కార్యాలయాలను పోలీస్ క్యాంపులుగా మార్చిందన్నారు. ప్రతి ఉద్యోగికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి హెచ్చరికలతో వారిని భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. హెచ్.ఓ.డి. ఆర్.టి.ఓ. కార్యాలయాలపై దాడులు జరిపి, అరెస్టు చేసి, జైళ్ళకు పంపిందన్నారు. వరంగల్ మహిళా ఉద్యోగి సమ్మక్కను రెండు రోజులు చంచల్‌గూడ జైలులో నిర్బంధించారన్నారు. ఎ.పి.సి.ఎల్.సి. ప్రతినిధి లింగం తెలంగాణ ఉద్యమంలో జరుగుతున్న హక్కుల ఉల్లంఘనను ఖండించారు. తెలంగాణ వ్యాప్తంగా హక్కుల ఉల్లంఘన ఎంత తీవ్ర స్థాయిలో జరుగుతోందో ప్రస్తావించారు.

చివరగా విరసం కార్యవర్గ సభ్యుడు కాశీం తెలంగాణ ఉద్యమంపై జరుగుతోన్న నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ, తెలంగాణ వ్యాప్తంగా ఇట్లాంటి సభలు ఎన్నో జరగాలని అన్నారు.

కామ్రేడ్ ఆర్ఎస్‌రావు సిద్ధాంత కృషిపై విశ్లేషణా సదస్సు

- పి. వరలక్ష్మి

అరుదైన మార్క్సిస్టు మేధావి, భారత విప్లవోద్యమానికి సైద్ధాంతిక తోడ్పాటును అందించడానికి తన మేధోశక్తినంతా వెచ్చించిన కామ్రేడ్ ఆర్ఎస్‌రావు సిద్ధాంత కృషిపై విరసం ఒక విశ్లేషణా సదస్సును నిర్వహించింది. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 12న జరిగిన ఒక్కరోజు సదస్సులో ఆయన కృషి చేసిన ప్రధాన అంశాలు అర్ధవలస అర్ధభూస్వామ్యం, అభివృద్ధి నమూనాలు, వర్గం-రాజ్యం, సంస్కృతిపై ఆయన సన్నిహితులు, మేధావులు, సామాజికవేత్తలు విశ్లేషించారు.

మొదటి సెషన్‌లో అర్ధవలస-అర్ధభూస్వామ్య విశ్లేషణ జరిగింది. అధ్యక్షత వహించిన కా. కళ్యాణరావు మాట్లాడుతూ మేధావి అనే పదానికి అర్థం, స్ఫూర్తి ఆర్ఎస్‌రావు అని అట్లా ప్రజల కళ్ళతో చూసి, ప్రజల గుండెతో స్పందించే మేధావులు అరుదని అన్నారు. అత్యంత సంక్షుభిత కాలంలో ఆర్ఎస్‌రావు గొంతు, హృదయం, మస్తిష్కం మేధావులారా మీరెవరివైపు అని అడుగుతుయ్యాయని అన్నారు. డి.నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్‌రావు ఒక అరుదైన రీతిలో రాజకీయ అర్థశాస్త్రాన్ని పునాదిగా తీసుకొని సామాజిక విశ్లేషణ చేశారని అన్నారు. భారతదేశం వంటి దేశంలో మార్క్సిస్టు సంవిధానంలో మార్పును అర్థం చేసుకొని విశ్లేషించిన వారు అరుదు. వ్యవసాయరంగ పరిణామాలపై 1950-60ల్లో చాలా చర్చ జరిగింది. ఆ చర్చలో పాల్గొన్న వాళ్ళలో ఒక విశిష్టమైన సంవిధానాన్ని తీసుకొచ్చింది ఆర్ఎస్‌రావు. ఆయన మార్పును సూత్రీకరించే పద్ధతి ప్రత్యేకంగా ఉంటుంది. అది మార్క్సిస్టు మెథడాలజీలో వచ్చిన తప్పుడు పోకడలను వ్యతిరేకించింది. ఆర్థిక వ్యవస్థకు గ్రామాలను ప్రతీకగా తీసుకొని విశ్లేషించడం ఆయన ప్రత్యేకత. సమాజంలో మార్పును ఎలా చూడాలి? ఎలా ఇది సంప్రదాయ మార్క్సిజానికి భిన్నంగా ఉంటుంది? భారతసమాజంలో మార్పును అర్థం చేసుకోడం చాలా సంక్లిష్టంగా ఉంటుంది. ఏ సమాజాన్నయినా విశ్లేషించేటప్పుడు పెట్టుబడి అనేది' ఒక పునాది భావన కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి పెట్టుబడి ప్రవేశం, పెట్టుబడి పునాది చాలా ముఖ్యం. పెట్టుబడిపూర్వ సమాజంలోకి పెట్టుబడి ప్రవేసిస్తే అది వ్యవస్థను బలపరిచేలా ఉంటుంది. అంటే భూస్వామ్య సమాజాన్ని శక్తివంతం చేసేలా ఉంటుంది. అట్లాగే మార్పుల్ని అర్థం చేసుకోడానికి స్థలకాలాలు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి పరిణామాన్ని ఒక ప్రత్యేకమైనదిగా చూడాలి. అది ఒక్కో సమాజంలో ఒక్కోలా ఉంటుంది. సామాజిక పరిణామాన్ని అర్థం చేసుకోడంలో ఒక నిశ్చయవాదం ఉండకూడదు. ఏ సమాజంలోనైనా మార్పు అనివార్యం కాదు. ప్రత్యేకత నుండి అనివార్యతను అర్థం చేసుకునే క్రమంలో మానవ కర్తృత్వానికి బలం చేకూరుతుంది.

భారతదేశంలో వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ విధానం వచ్చిందా అన్నప్పుడు ఆర్ఎస్‌రావు దాన్నిట్లా విశ్లేషించారు- మా అర్థికవేత్తలు పెట్టుబడిని అనుసరించి పోతారు. అసలు చూడాల్సింది పెట్టుబడి ఉందా లేదా అని కాదు. పెట్టుబడి స్వభావాన్ని చూడాలి. వ్యవసాయంలో పెట్టుబడి ఉంది, వేతన కూలీలు ఉన్నారు. పక్కనే అర్ధబానిస, చిన్న, సన్నకారు రైతులూ ఉన్నారు. ఆయన ఎంపిరికల్‌గా సూత్రీకరణను వివరిస్తారు. చలనశీలంగా ఉండే సమాజాన్ని అధ్యయనం చేయగలగాలి అని అంటారు. సమాజం ఏలా ఉందో కాదు, ఎలా తయారవుతోందో చెప్పాలంటారు. 80ల నుండి వ్యవసాయరంగంలో చాలా మార్పులొచ్చాయి. వ్యవస్థల పనితీరులో మార్పులొచ్చాయి. విత్తన కార్పోరేషన్లు, కొత్త రకం విత్తనాలొచ్చాయి. ధనికరైతు వ్యవసాయంలో లాభం సంపాదించి వేరే చోట పెట్టుబడులు పెడుతున్నాడు. అయితే గ్రామంపై నియంత్రణ కోసం భూములు ఉంచుకుంటున్నారు. 70ల్లో ఉన్న అర్ధభూస్వామ్య సంబంధాలకు 90ల్లో ఉన్న సంబంధాలకు మార్పు గమనించగలం. రాజ్యం పాత్ర తగ్గిపోయింది. విత్తన ఉత్పత్తిలో 100 శాతం విదేశీ పెట్టుబడులు వచ్చాయి. సంప్రదాయ విత్తనాల స్థానంలో హైబ్రిడ్లు వచ్చాయి. పూర్తిగా ప్రైవేటు నియంత్రణలోకి వెళ్ళిపోయింది. ఈరోజు విత్తన, పురుగుమందుల, ఎరువుల కంపెనీల లాబీ ప్రభుత్వ పాలసీలను నిర్దేశిస్తోంది. అవసరమైన టెక్నాలజీకాక, చిన్న, సన్నకారు రైతులకు, మెట్టభూములకు సరిపడని టెక్నాలజీ వ్యాపించింది. ఇది తరహా అర్ధవలస, అర్ధభూస్వామ్య సంబంధాలను తీసుకొచ్చింది. ఈరోజుల్లో కూడా గ్రామాల్లో భూస్వామ్యం బలంగా ఉంది. వాళ్ళే రాజకీయ నాయకులుగా ఉన్నారు. ఈ లైన్‌లో యువతరం పరిశోధనలు చేస్తే ప్రజలకు ఉపయోగం. అయితే ఈ తరహా రీసెర్చ్‌కు ఇప్పుడు మార్కెట్ లేదు.

ఇదే అంశంపై గౌలక్ బిహారీనాథ్, పంకజ్ దత్‌లు కూడా మాట్లాడారు. వీరి ఉపన్యాసపాఠాలు, ముదునూరి భారతి 'అభివృద్ధి నమూనాలు- ఆర్ఎస్‌రావు' అంశంపై ఉపన్యాసపాఠం ఇదే సంచికలో విడిగా ప్రచురించాం.

భోజనవిరామం తర్వాత కొనసాగిన సదస్సుకు కా. రాంకీ అధ్యక్షత వహించారు. ఆయన ఆర్ఎస్‌రావుతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. తర్వాత 'అభివృద్ధి నమూనాలు-ఆర్ఎస్‌రావు' అంశంపై మనోరంజన్ మహంతి మాట్లాడుతూ మనం ఆర్ఎస్‌రావు లెగసీని సెలబ్రేట్ చేసుకుంటున్నామన్నారు. చైనా విప్లవం, నక్సల్బరీల వెలుగులో ఆయన సృజనాత్మకంగా, అంతే విశ్వసనీయంగా అర్ధవలస,

అర్ధభూస్వామ్య నిర్వచనాన్ని వివరించారని చెప్పారు. అట్లానే పెట్టుబడిదారీ వ్యవస్థ లేకుండా పెట్టుబడి స్వభావం గురించి చెప్పారు. వర్గం, పితృస్వామ్యం, కులం, హిందుత్వ విషయాల్లో రాజ్యం ఎలా ఆపరేట్ అవుతోందో చెప్పారు. 1936లో ఒరిస్సాలో భగవతి పాణిగ్రాహి రాసిన షికార్ అనే ఒక కథ గుర్తుకువస్తుంది. దానిమీద అక్కడ చాలా చర్చ జరిగింది. కాని విమర్శకులు కథను విశ్లేషించిన తీరు నిరాశపరుస్తుంది. అది 'కన్వా' అనే ఒక సంతాల్ ఆదివాసీ కథ. ఆయన పులిని చంపినందుకు ప్రభుత్వం ఆయనకు బహుమతి ఇస్తుంది. తర్వాత కన్వా ఆ ఊరిలో ఉండే దుర్మార్గుడైన భూస్వామిని చంపి నాకు బహుమతి ఇవ్వమని అడుగుతాడు. అతన్ని జైల్లో పెడతారు. విచారణ జరుగుతుంది. కన్వా భూస్వామి పులికంటే క్రూరుడని వాదిస్తాడు. ఈ కథపై చర్చంతా హింస చుట్టూ తిరిగింది. ఇందులో భూస్వామ్య పాలకుల వ్యక్తీకృత హింస ఉంది. ఆదివాసుల తిరుబాటు తత్వం ఉంది. అణచివేత, హింసలకు చట్టబద్ధత కల్పిస్తూ, తిరుగుబాటును చట్టవ్యతిరేకమని శిక్షించే కోర్టు ఉంది. ఆర్ఎస్‌రావును చదివితే ఇవన్నీ అర్థమవుతాయి.

ప్రొ. హరగోపాల్ సంస్కృతీ విశ్లేషణ- ఆర్ఎస్‌రావు అంశంపై మాట్లాడారు. యజ్ఞం, కన్యాశుల్కం, రాగోలపై ఆర్ఎస్‌రావుగారి విశ్లేషణ చాలా గొప్పగా ఉంటుందన్నారు. మామూలుగా స్థలకాలాల ప్రభావంలో రచయిత ఉంటాడు. మార్క్స్ అందుకు మినహాయింపు అంటారాయన.

భౌతిక పునాదికి, సంస్కృతికి సంబంధం ఉంటుందని చెప్తూ హరగోపాల్ భౌతిక పునాదిలో వచ్చిన మార్పు ఉపరితలంలోకి రావడం అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజాల్లో అంత సులభంగా జరగదని అన్నారు. ఇందులో చైతన్యం పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఇటువంటి సమాజాల్లో భౌతిక పునాదినీ మార్చాలి. ఉపరితలాన్నీ మార్చాలి. అప్పుడు మానవ కర్తృత్వం చాలా కీలకమవుతుంది. బహుశా అందుకేనేమో ఈ సమాజాన్ని మార్చడానికి ఇన్ని త్యాగాలు అవసరమవుతున్నాయి. పెట్టుబడిపూర్వ శక్తులు బలంగా అడ్డువస్తాయి. దళిత అస్తిత్వాలు భూస్వామ్య భావజాలాన్ని ప్రశ్నిస్తున్నాయి. అయితే సామ్రాజ్యవాదాన్ని ప్రశ్నించడం లేదు. మీడియా మావోయిజం, హింస అని మాట్లాడుతూనే నరేంద్రమోడీని భవిష్యత్ ముఖ్యమంత్రిగా ఫోకస్ చేస్తుంది. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేకమయినందుకే ప్రభుత్వానికి మావోయిజం అతిపెద్ద ముప్పుగా కనపడుతోంది. అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో కొత్త వైరుధ్యాలు వచ్చాయి. సంస్కృతి రూపాల్లో భజరంగదళ్, హిందుత్వ, బాబాల వంటి అరాచక భావాలు పెరిపోతున్నాయి. ఇప్పుడు ఆదివాసీ చైతన్యం అన్నింటికన్నా ముందుంది. మధ్యతరగతికి పురోగామి భావజాలం లేదు. అంతా ఆదివాసీలపై పడింది. వాళ్లమీద దాడి జరుగుతుంటే దేశమంతా నిశ్శబ్దంగా చూస్తోంది.

విస్థాపన్ విరోధ్ కమిటీ, హర్యానా నుండి వచ్చిన అజయ్ హర్యానా సమాజంలో, తాము అధ్యయనం చేసిన అర్ధవలస, అర్ధభూస్వామ్య సంబంధాలను గురించి వివరించారు. హరిత విప్లవ ప్రభావం హర్యానాలో ఎక్కువ. మార్క్సిస్టు మేధావులంతా కాపిటలిజం వచ్చింది అన్నారు. 2004-05లో ఆర్ఎస్‌రావు మాదగ్గరికి వచ్చారు. ఆయన కాన్సెప్ట్స్ మాకు బాగా ఉపయోగపడ్డాయి. ముఖ్యంగా ఇండియాలో కులవ్యవస్థ గురించి, రైతుకూలీ గురించిన విశ్లేషణలు. కులంపునాదిపై ఎక్కువ అదనపువిలువ దోపిడి జరుగుతుంది. హర్యానాలో వ్యవసాయ కూలీ, వేతన జీవే అయితే ఊరు విడిచి ఎందుకు పోడు? భూమి మీద ఆధారపడడం ఎక్కువగా ఉంటున్నది. హర్యానాలో సాంఘిక బహిష్కరణలు చాలా ఎక్కువ. ఆ సాంఘిక బహిష్కరణలు చేసేది భూస్వాములే. గ్రామాలన్నీ కులాల సంకెళ్ళలో బంధింపబడి ఉన్నాయి. ఉద్యమాలు బాగా నడిచినప్పుడు ఖాప్ పంచాయితీలను అడ్డుకోగలిగారు. బందాబాదురీ పోరాటం అందులో ఒకటి. భూస్వామి బిడ్డ దళితునితో స్నేహం చేస్తే ఖాప్ పంచాయితీ మరణశిక్ష విధిస్తుంది. హర్యానాలో ఆడశిశువుల హత్యలు కూడా ఎక్కువ. అమ్మాయిల సంఖ్య బాగా తక్కువై బైటినుంచి కొనుక్కుంటుంటారు.

ఆ తర్వాత 'అర్ధవలస, అర్ధభూస్వామ్యం- రాజ్యం- ఆర్ఎస్‌రావు' అనే అంశంపై ప్రొ. శేషయ్య మాట్లాడారు. పౌరహక్కుల ఉద్యమం గురించి ఆర్ఎస్‌రావుతో మాట్లాడాక న్యాయస్థానం, చట్టం, ఎలా రాజ్యంలో భాగంగా పని చేస్తాయో అర్థం చేసుకున్నానని, చట్టం రాజ్యం పరిభాషేనని ఆయన అన్నారు. రాజ్యాధికారం ఎప్పుడూ చట్టం ద్వారానే వ్యక్తీకరణ అవుతుంటుంది. చట్టం ఉపరితలానికి సంబంధించిందే. అయినా పునాదిని కూడా ప్రభావితం చేస్తుంది. ఉపరితలం పునాదిని ప్రభావితం చేస్తుందని మావో అన్నాడు కాని నిర్దేశిస్తుంది అనలేదు. పౌరహక్కులపై ఆర్ఎస్‌రావు రెండు మంచి వ్యాసాలు రాశారు. మార్క్సిస్టు అవగాహనలో హక్కుల గురించి ఉండదు అని చాలా మంది అంటారు. ఆర్ఎస్‌రావు వ్యాసాల్లో మంచి ప్రతిపాదనలు, సూత్రీకరణలు చేశారు. రాజ్యం సామ్రాజ్యవాద ప్రయోజనాలు కాపాడుతూనే ఇక్కడున్న పెట్టుబడిదారులు, భూస్వాముల ప్రయోజనాలు కాపాడుతుంది. ఇవన్నీ చేస్తూ ప్రజల విశ్వాసాన్ని ఎలా సంపాదించుకోవాలి అని కూడా ఆలోచిస్తుంది. న్యాయవ్యవస్థ ఒక షాక్అబ్జార్బర్ లాంటిది. అది రాజకీయ నాయకులకు సేఫ్టీవాల్వ్ కూడా. 'హక్కులు-రెండు దృక్పథాలులో' ఆయన బాలగోపాల్‌కు సమాధానమిచ్చారు. పౌరహక్కుల దృక్పథం నుండి విప్లవోద్యమాన్ని చూడొద్దు, మార్క్సిస్టు దృక్పథం నుండి, విప్లవోద్యమ దృక్పథం నుండి పౌరహక్కులను చూడండి అని ఆయన అన్నారు.

ఆర్.డి.ఎఫ్ నుండి రాజ్‌కిషోర్ బీహార్ అనుభవాలను చెప్పారు. మాది బీహార్‌లోని చెంపారన్ జిల్లా. అక్కడ భూస్వాములు అతి ఎక్కువ. మొదట భూసంస్కరణలు బీహార్‌లోనే వచ్చాయి. అక్కడే కుక్క, పిల్లి పేరుతో భూములను రిజిస్టర్ చేశారు. వినోభా భావే భూదాన్ ఆందోళన బీహార్‌లో విఫలమైంది. నక్సల్ ఉద్యమం వచ్చింది. అక్కడి భూపోరాటం ప్రైవేటు సైన్యంతో జరిగింది. ఆ ఉద్యమం విస్తరిస్తూనే ఉంది. ఇవ్వాళ దేశం యుద్ధం ముందు నిలబడి ఉంది. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు మావోయిస్టులు ఒక సాకు మాత్రమే. గ్రామాల అధ్యయనం ద్వారా అభివృద్ధి-విస్థాపన, విధ్వంసం గురించి

(మిగతా 37వ పేజీలో...)

వ్యాసం

(12 ఫిబ్రవరి 2012న ఆర్.ఎస్.రావు సిద్ధాంత కృషిపై పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో జరిగిన విశ్లేషణ సదస్సులో భాగంగా సమర్పించిన పత్రం)

అభివృద్ధి అంటే?

- ముదునూరి భారతి

ఆర్.ఎస్.రావు గారి 'అభివృద్ధి నమూనా' గురించి మాట్లాడుతున్నపుడు నాకు ముందుగా జ్ఞాపకం వచ్చింది సంబల్‌పూర్ యూనివర్సిటిలో బి-1 క్వార్టరులో మా అనుభవాలు. అది 1975 వ సంవత్సరం అనుకుంటాను. పూనా నుండి వెళ్ళిన మాకు అక్కడి ప్రజల జీవన శైలి, వ్యవహారం అన్నీ విచిత్రంగా కనిపించేవి. ఆదివాసీ సాంప్రదాయాలు అధికంగా ఉండే బుర్లా అనే కుగ్రామంలోని యూనివర్సిటీలో ఉన్న పెద్ద భవనమే మా క్వార్టర్సు. ఈ ప్రాంతానికున్న ప్రాముఖ్యత-ఒరిస్సాలోని మహానది మీద మట్టితో కట్టిన హిరాకుడ్ డ్యాం ప్రపంచం లోనే అతి పొడవైన డ్యాంగా ప్రసిద్ధి చెందినది ఇక్కడే ఉంది. మాకు అతి సమీపంలో (2 కిలో మీటర్ల) దూరంలో కనిపిస్తూ ఉంటుంది. పై ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ డ్యాంని చూడడం, దాని మీద వెలుగుతూ ఉండే కొన్ని వందల దీపాల వరుసని చూసి ఆశ్చర్యపోవడం, విద్యుత్తుని ఉత్పత్తి చేసే పవర్ హౌస్‌ని చూడడమూ, పరవళ్ళు తొక్కుతూ ప్రవహించే పంటకాలువల అందాలు చూడడం, వెన్నెలలో వెండిలా మెరిసిపోయే నీటితో నిండిన అతి పెద్ద రిజర్వాయరు - ఇలా డ్యాము వలన వచ్చే ఎన్నో మార్పులు కనువిందు చేస్తాయి. ప్రకృతి శక్తులపై మనిషి కంట్రోలు సాధించే క్రమంలో, ప్రవాహ వేగానికి అడ్డుగా ఒక డ్యాము కట్టడం వెనుక ఎంతో జ్ఞానం ఇమిడి ఉందని గ్రహిస్తే, మనిషి ఒక అద్భుతమైన ఉత్పత్తి శక్తిగా కన్పిస్తాడు.

బుర్లాలో కాలం చాలా నెమ్మదిగా నడిచేది. నేపథ్యము చాలా స్తబ్దుగా ఉండేది. ప్రయాణీకులు రావడానికి ఆలస్యమౌతుందని తెలిస్తే, రైలు వీళ్ళ కోసం కొంత సేపు అదనంగా ఆగడం, నిన్నటి వార్తా పత్రికలు ఇవాళ రావడం లాంటి విషయాలు ఇక్కడ సమయానికి ఒక విలువ లేదని చెబుతాయి. ఇటువంటి స్థలంలో పగలు 10 గంటలయ్యేసరికి సైకిళ్ళ మీద కాని మోపెడ్‌ల మీద కాని పాల బిందెలతో కొందరు వచ్చి పాలు అమ్ముకుని వెడితే, ఇంకా కొందరు తాము పండించిన సన్న బియ్యం తెచ్చి అమ్మితే, మరి కొందరు జాడీలలో మామిడికాయ, నిమ్మకాయ లాంటి పచ్చళ్ళు తెచ్చి అమ్మేవారు. వీళ్ళంతా తెలుగువాళ్ళనీ, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వచ్చిన రైతులనీ చెప్పారు. మాకు ఎడమవైపు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న అత్తాబీరా, గుడ్‌బాగా అనే గ్రామాలలో పొలాలు కొనుక్కుని వ్యవసాయం చేస్తూ స్థిరపడిన రైతులనీ చెప్పారు. డ్యాం కట్టిన తరువాత వచ్చిన పంటకాలువలు నియంత్రిత నీటి సదుపాయం లాంటి వాటిని ఉపయోగించుకొని ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేయడం, పశువుల పెంపకం, కూరగాయలు పండించడం లాంటి పనులతో ఈ రెండు గ్రామాలు సమృద్ధికి సంకేతంగా నిలిచాయి. వీరికి స్థానిక ఒరియా భాష రాకపోయినా, తాము ఉత్పత్తి చేసే సరుకులను అమ్మడంలోనూ, వ్యాపారంలో వచ్చే లావాదేవీలను పరిష్కరించుకునే సామర్థ్యం కలవాళ్ళు. వీళ్ళని హిరాకుడ్ డ్యాం ఇచ్చిన వెలుగులకు ప్రతీకగా చూడవచ్చును.

వీరి కంటే ముందుగా, పొద్దునే 8 గంటలకే మరొక రకం వ్యక్తులు-వాళ్ళు కూడా సరుకులు అమ్మడానికే, క్యాంపస్‌కి వచ్చేవాళ్ళు. వీళ్ళు హిరాకుడ్ డ్యాం మూలాన సర్వం కోల్పోయిన నిర్వాసితులు. వీళ్ళు తమని తాము గ్రామాల పేరుతో కాక మూకుమ్మడిగా "ముంపు గ్రామాల ప్రజలు(బుడీ అంచల్ లోకా)" గానే పిలుచుకునే వారు. మాకు 20 కిలో మీటర్ల దూరంలో కుడివైపు కొండ కింద కాలనీలలో ఉండే వారు. వీరిలో ఒకడు విస్థాపన పూర్వం నేత పనివాడు. ప్రస్తుతం జీవనోపాధి లేనివాడు. ఇనుప తీగలతో చేసిన చిన్న బుట్టలో డజను కోడి గుడ్లు పెట్టుకుని 'అండారకొండా' అనే కేకతో కాలి నడకన వచ్చేవాడు. ప్రతి ఇంట్లో పాత వార్తా పత్రికల్ని రద్దీగా కొనుక్కుని తన ఇంట్లో ఆడవాళ్లతో పేపరు బ్యాగులు చేయించి అమ్మడం దినదిన గండంగా జీవనం గడపడం ఈ నిర్వాసితునికి వచ్చిన పని. ఇంకొకతను విస్థాపన ముందు సొంత పొలంలో వ్యవసాయం చేసుకునే వాడు. విస్థాపన తరువాత 'చిల్లర' వ్యాపారిగా మారి ఒక గాజు పెట్టెలాంటి దాంట్లో పావ్‌రోటీ, లేకపోతే ఇడ్లీ, వడ, సింగడ, లవంగ లత (చివరిది ఒక తీపి పదార్థం. ఇవి ఒక్కొక్కటి పదికి మించి ఉండవు) అమ్మి జీవనం సాగించే వాడు. ఇంకా కొంతమంది దయాధర్మాల మీద ఆధారపడే వాళ్ళు. పై రెండు రకాల వ్యక్తులను చూస్తే, హిరాకుడ్ డ్యాం వలన వచ్చిన పర్యవసానాలు- వెలుగు, చీకట్లను రెండింటినీ ఒక్కసారే చూపించినట్లయింది. మనస్సుని కలిచి వేసినట్లయింది.

ఈ నేపథ్యాన్ని పక్కన పెడితే, అంటే తెలుగువాళ్ళుగా ఆలోచిస్తే, మన తెలుగు వాళ్ళు చాలా తెలివైన వాళ్ళు, ఒళ్ళువంచి కష్టపడి పని చేస్తారు, సాగు నీటితో చేసే ఆధునిక వ్యవసాయ పద్ధతులు బాగా తెలిసిన వాళ్ళు అనే గర్వం ఒక పక్క, ఒరియా వాళ్ళు బద్ధకస్తులు, తెలివి తక్కువ వాళ్ళు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఏమీ తెలియని వాళ్ళు అని వాళ్ళను కించపరిచే ఆలోచనలు మరొక పక్క, అక్కడ ప్రచారంలో ఉండేవి. ప్రస్తుతం మెరుగు పరుచుకున్న ప్రాపంచిక దృక్పథంతో ఆ సందర్భాన్నే తిరిగి పరిశీలించితే హిరాకుడ్ డ్యాం అసలు అభివృద్ధి పథకమా కాదా అనే ప్రశ్నకి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇదే సమయంలో(1975 లో) మన కృష్ణాబాయి గారు మాకు ఒక ఉత్తరం రాసారు. అందులో "ఇంత పెద్ద పెద్ద డ్యాములు, ఫ్యాక్టరీలు, బహుళ అంతస్తుల భవంతులు, పెద్ద పెద్ద రోడ్లు లాంటి వన్నింటినీ మీరు అభివృద్ధి అవునంటారా? కాదంటారా? " అని. దానితో అభివృద్ధి అనే భావనకి ఒక ఫోకస్ వచ్చినట్లయింది. తరువాత కాలంలో ఒరిస్సాలో అన్ని అభివృద్ధి పథకాలకు వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమాలు, వాటిని అవగాహన చేసుకునే క్రమంలో, అభివృద్ధి అంటే ఏమిటి అనే ప్రశ్నకి ఒక సమాధానం అన్వేషించడం జరిగింది.

1. మన దేశం తనను తాను ఆధునీకరించుకునే ప్రయత్నంలో చోటు చేసుకున్న భారీ మార్పులన్నీ కూడా సమాజంలో అభివృద్ధిగానే చలామణి అయిపోతున్నాయి.పెద్ద పెద్ద డ్యాంలు, భారీ యంత్రాలతో కూడిన ఫ్యాక్టరీలు, కొత్త కొత్త రవాణా సౌకర్యాలు లాంటివన్నీ కూడా సామాన్య ప్రజానీకానికి అభివృద్ధిగానే కన్పిస్తాయి. ఇక్కడ కొన్ని ప్రశ్నలు వస్తాయి. దేశంలో వస్తున్న మార్పులన్నీ కూడా అభివృద్ధిగానే చూడాలా లేక ఒక ప్రత్యేకమైన మార్పు మాత్రమే అభివృద్ధా? అసలు అభివృద్ధి అనే భావనకి స్థిరమైన నిర్వచనం ఏమన్నా ఉందా? ఇది ఒక మార్పు జరిగే క్రమం గురించి విశ్లేషిస్తుందా లేక ఫలితాన్ని వివరించి చెప్పే ప్రక్రియా? అభివృద్ధిని డ్యాంలు, ఫ్యాక్టరీల ద్వారా మాత్రమే గ్రహించగలమా లేక ఇతర అంశాల ద్వారా కూడా అంటే ఆ సమాజంలో భాగమైన వ్యక్తుల నడవడిక, జీవన శైలి ద్వారా కూడా చూడగలమా? మానవ సమాజ అభివృద్ధి అన్ని దేశాలలో ఒకే మార్గంగానే ఉంటుందా? లేక దేశానికి, దేశానికి తేడాలుంటాయా? మార్పుకి కొలమానంగా సాధారణంగా వాడబడే వృద్ధికి, అభివృద్ధికి తేడా చూడగలమా? మార్పు, వృద్ధి, అభివృద్ధి, పురోగతి, ప్రగతి, మెరుగుపడడం లాంటి పదాలన్నీ ఒకే భావనకి చెందిన ప్రత్యామ్నాయ పదాలా?లాంటి ఎన్నో ప్రశ్నలు. డ్యాములు, ఫ్యాక్టరీలు కొద్దిమందికి మాత్రమే వెలుగునిస్తూ, ఎక్కువ మందిని చీకటిలోకి తరిమి వేస్తూ ఉంటే దీనిని అభివృద్ధి అనగలమా? అభివృద్ధి పథకాలను వ్యతిరేకిస్తూ దేశంలో వస్తున్న ప్రజా ఉద్యమాలు తమ అభివృద్ధిని ఎలా చూస్తాయి?

మార్క్సియన్ ఫిలాసఫీ ఆధారంగా సమాజాన్ని విశ్లేషించాలనే తపనతో, నిరంతరం చలనంలో ఉండే సమాజాన్ని చలన కేంద్రంగా రూపొందిన మార్క్సిస్టు ఫిలాసఫీ ఆధారంగా మాత్రమే అధ్యయనం చేయగలమనే ధృడమైన నమ్మకంతో, అభివృద్ధి అనే భావనను వివిధ కోణాల నుంచి పరిశీలించి, దానికి సంబంధించిన ప్రశ్నలకు ఆర్.ఎస్.రావు గారు ప్రతిపాదించిన సమాధానాలను క్రోడీకరించడమే ఈ ప్రయత్నం. ఆయన మాటల్లో... 'అభివృద్ధి - వెలుగునీడలు'లో అభివృద్ధి అనే భావనలోని వైవిధ్యతను గురించి ప్రస్తావిస్తూ, "అభివృద్ధి అనే భావన ఏక కాలంలో క్లిష్టమైనది, సులభంగా అర్థమయ్యేదీ కూడా. సులభంగా ఎందుకర్థం అవుతుందంటే దాని బలమైన దర్శనీయత(విజిబిలిటీ) వల్ల. క్లిష్టమైంది ఎందుకంటే దాని వెలుతురుని అర్థం చేసుకోగలిగినంత సులభంగా అది సృష్టించే నీడలను అర్థం చేసుకోలేం కాబట్టి" అంటూనే అభివృద్ధి మీద చర్చ చేయవలసిన విధానాన్ని చెబుతూ "చర్చ ఎప్పుడూ నిర్దిష్టమైన అభివృద్ధి మీదే సాగాలి, అంటే నిర్దిష్ట సామాజిక సంబంధాలలో మార్పు ఆధారంగా చెయ్యాలి. లేకపోతే చర్చకి ప్రయోజనం లేదు. అన్వేషణకి గమ్యం లేదు" అని ప్రతిపాదించారు. దీనినే ఇంకొక విధంగా చూస్తే, అభివృద్ధి అంటే సమాజంలో మార్పులు జరిగే ఒక క్రమంగా చూడాలి తప్ప, ఫలితంగా చూడకూడదనే అర్థం కూడా దీని నుంచే వస్తుంది.

వేరు వేరు సందర్భాలలో వేరు వేరు సమయాలలో ముందుకు తీసుకొని వచ్చి దేనికదే విడివిడిగా ఉన్నట్లు కనిపించే భావాలను ఒక చోట చేర్చి వాస్తవికతను అర్థం చేసుకునేందుకు సహాయపడగల నమూనాను తయారు చేయవచ్చును. 1981లో ఢిల్లీలో ఒక పాలసీ వర్క్ షాపులో "నోట్స్ ఆన్ ఎ సింప్లిస్టిక్ మోడల్ ఆఫ్ సోషల్ రిలేషన్స్" అనే వ్యాసంలో "వాస్తవికతను ఒక మూసలో పోసినట్లుగా, ఏకభాండంగా చూడడం కంటే, మూడు వేరు వేరు రంగాలలో స్థానీకరింపబడిన అమూర్తతల (అబ్‌స్ట్రాక్షన్స్) సహాయంతో సమాజ గమనాన్ని అర్థం చేసుకోవడం సబబుగా ఉంటుంది" అని ప్రతిపాదించారు. దీనితో సమాజానికి ఒక నిర్వచనం దొరికింది.

1991 'అభివృద్ధి వెలుగు-నీడలు' లో అభివృద్ధి నిర్వచనాన్ని విశాలం చేస్తూ, అభివృద్ధి పథకాలు వెలుగు నిచ్చినా, అనేక మందికి జీవనాధారం లేకుండా చెయ్యడంతో, అభివృద్ధి క్రమంలోని అసంపూర్ణతని ఎత్తి చూపించి అంతే కాకుండా సమాజంలో భాగమైన మనిషి ఆచరణకి కూడా మూడు రంగాలు ఉంటాయని ప్రతిపాదించారు.

1992 లో హైదరాబాదులోని సి.ఇ.ఎస్.ఎస్.(సెస్) అనే సంస్థలో మెథడాలజీ మీద ఉపన్యాసం ఇస్తూ, సమాజంలో అంతర్గతంగా ఉండే చలనాన్ని అర్థం చేసుకోవాలంటే మామూలుగా ఉపయోగపడే గమ్య ప్రాధాన్య శాస్త్ర పద్ధతి పనికి రాదనీ, ఒక కొత్త మెథడాలజీని - గమన ప్రాధాన్య శాస్త్ర పద్ధతిని(motion centric methodology)ని ప్రతిపాదించారు.

1990 తరువాత నుంచి మనిషి, మనిషి యొక్క ఆచరణకి సంబంధించిన (మైక్రో ఫౌండేషన్స్), గురించిన అన్వేషణ ద్వారా అభివృద్ధి అవగాహనకి మరో మార్గం తెరిచారు. ఈ చట్రంని ఉపయోగించి మేము అనేక ప్రయోగాలు చేసాము.

ఇక్కడ గుర్తు ఉంచుకోవలసిన ముఖ్యసూత్రం వాస్తవ ప్రపంచాన్ని అవగాహన చేసుకునే క్రమం గురించి - "what it is" కాకుండా "what it is becoming" అంటే అధ్యయన పద్ధతిలో వాస్తవ ప్రపంచం ప్రస్తుతం ఎలా ఉంది? అని కాక భవిష్యత్తులో ఎలా మారుతోంది అని చెబుతూ ఒక గమన ప్రాధాన్య అధ్యయన పద్ధతిని ప్రతిపాదించారు. అంతే కాకుండా అభివృద్ధిని డ్యాంలు, ఫ్యాక్టరీలు పరిధిలో కుదించకుండా సాంస్కృతిక రంగంలో (కుంకుమ పోయి ప్లాస్టిక్ బొట్లు రావడం), భాషా పరంగా (తెలుగు పోయి ఇంగ్లిషు రావడం), జీవశాస్త్ర పరంగా (విత్తనం నుంచి మొక్క రావడం) లాంటి ఎన్నో ఉదాహరణల సహాయంతో అభివృద్ధి పరిధిని విస్తృతం చేసారు.

మార్క్సియన్ మెథడాలజీలో

1.1 రెండు మౌలిక ప్రతిపాదనలు

మన చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచం కాలగమనంలో అనేక మార్పులకు లోనవుతూ, గతంలో కొండ గుహలలో నివసించిన ఆదిమానవులు ప్రస్తుతం అనేక సౌకర్యాలను సమకూర్చుకుని ఆధునిక మానవుడిగా మారిపోయాడు అనే విషయం తత్వ శాస్త్రవేత్తలందరూ అంగీకరించిన విషయమే. మానవేతర శక్తులను, మానవాతీత శక్తులను తోసి పుచ్చి, ఒక్క మానవ శ్రమ మాత్రమే ఈ వాస్తవ ప్రపంచంలో మార్పులు రావడానికి కారణమని గుర్తించిన తత్వశాస్త్రం మార్క్సిజం. మార్పు కేంద్రంగా రూపొందిన దీనిని అర్థం చేసుకోవడానికి రెండు మౌలిక ప్రతిపాదనలు సహాయపడతాయని అనుకోవచ్చును. మొదటిది మానవ సమాజ చలనం గురించి చెబితే, రెండవది ఈ చలనానికి చోదక శక్తి అయిన 'మనిషి' లో చలనాన్ని, అంటే ప్రకృతికి సంబంధించిన జ్ఞాన సముపార్జన, దాని వితరణకై మనిషి చేసే క్రమాన్ని వివరిస్తుంది. ఈ రెండూ కలిపి ప్రకృతి, మనిషి, సమాజాల మధ్య ఉండే సంబంధాన్ని వివరిస్తాయి.

మానవ సమాజం క్రమానుగతంగా నిరంతరం మార్పు చెందుతూ ఒక ఉత్పత్తి విధానం నుండి మరొక దానిలోకి దశల వారీగా మార్పు చెందుతుంది. ఈ చలన మార్గం ఒక సరళరేఖలా ఉండకపోవడంతో సమాజపు ప్రస్తుత దశ నుండి పూర్వ దశని ఊహించడం కష్టతరమౌతుంది. ఆ భిన్నమైన సమాజాల ఆవిర్భావంలో చలనం అంతర్లీనంగా ఉన్నప్పటికీ, ఆ సమాజం ఒక దానితో ఒకటి సంబంధం లేని, తనదైన స్పష్టమైన గుర్తింపు కలవిగా ఉండి, ప్రతి సమాజానికి ఒక స్థానిక స్థిరత, ఒక అంతర్గత సంతులనం, కొన్ని నిర్దిష్టసామాజిక సంబంధాలు ఉంటాయి. ఇవే ఆ సమాజానికి ఒక నిర్దిష్టమైన నిర్మాణాన్ని ఆపాదిస్తాయి. ఇంక రెండవది మనిషిలో చలనం గురించి పరిణామ క్రమంలో మనిషి ప్రకృతిలో ఉండే మిగిలిన జీవరాసుల కంటే భిన్నంగా ఒక ఆలోచించ గలిగే మెదడు, శ్రమ చెయ్యగలిగిన కాళ్ళు, చేతులు ఉండడంతో ఒక స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకొని, నిరంతరం మారిపోతూ ఉండే వాస్తవాన్ని అవగాహన చేసుకునే క్రమంలో తనలో చలనం, ఆ జ్ఞానాన్ని సమాజంలో ఆచరించే క్రమంలో సమాజంలో చలనం సాధ్యమౌతాయని అనుకోవచ్చును. ప్రతి వ్యక్తి ఆలోచన తాను నివసించే సమాజ దశ అంటే దాని నిర్మాణ నేపథ్యం మీద ఆధారపడుతుందనీ ఈ నేపథ్యమే ఆలోచనకి కొన్ని హద్దులు ఏర్పరచి, వాటిని అతిక్రమించకుండా ఆలోచనకి వీలు కల్పిస్తుంది. మొదటిది నేపథ్య సంబంధిత నిర్దిష్టత అనీ, రెండవది జ్ఞాన సముపార్జన సంబంధిత నియమావళి అనీ క్లుప్తంగా పిలుచు కోవచ్చును. మనిషిలో కాని సమాజంలో కాని చలనం ఆగిపోయిన విపరీత పరిస్థితులు ఒక సంక్షోభ స్థితిని చెబుతూ, కొత్త మార్పుల అవసరాన్ని గుర్తు చేస్తాయి.

పై ప్రతిపాదనల ఆధారంగా మార్పును నిర్మాణ నేపథ్యంలో రెండు రకాలుగా చూడవచ్చును. మొదటిది ఒక నిర్దిష్ట వ్యవస్థలోనే రాశిలో వచ్చే స్వల్పకాలీన మార్పులయితే, రెండవది వాశిలో అంటే ఒక వ్యవస్థ మరొక వ్యవస్థలోకి మారే క్రమంలో వచ్చే దీర్ఘకాలిక మార్పులుగా చూడవచ్చును. దీనినే ఆర్థిక పద జాలంలో కుదిస్తే, మొదటి మార్పుని వృద్ధిగా ఒక వ్యవస్థలోనే క్రమంగా వచ్చే మార్పులయితే, రెండవది అభివృద్ధిగా, ఒక వ్యవస్థ మరొక వ్యవస్థలోకి మారే క్రమంలో వచ్చే మార్పులు. మొదటిది వర్ణన అనుకుంటే రెండవది విశ్లేషణగా చూడవచ్చును.

మార్క్స్ ప్రతిపాదించిన సమాజము, అభివృద్ధి

2.1 అభివృద్ధి సూచికలు - అభివృద్ధి క్రమం

సమాజంలో ప్రాచుర్యంలో ఉన్న పద్ధతిలో దేశ అభివృద్ధిని మొదట ఆర్థిక అభివృద్ధికి చెందిన (gross domestic product), దేశంలో మనిషి సగటు ఆదాయం లాంటి ఆర్థిక పరమైన సాంప్రదాయిక సూచికల ఆధారంగా అంచనా వేసేవారు సమాజం మారుతోన్న తరువాతి కాలంలో ఇది వాస్తవాన్ని సరిగా ప్రతిఫలించడం లేదని, సాంప్రదాయిక సూచికలకు తోడుగా మనిషి ఆరోగ్యానికి, విద్యకి సంబంధించిన మానవ అభివృద్ధి సూచికలు కొన్నింటిని ఎంచుకొని, పై రెండు సూచికలు (ఇవి సంఖ్యలలో ఉంటాయి) కలిపినపుడే అభివృద్ధిని గ్రహించగలమన్నారు. ప్రజా ఉద్యమాల నేపథ్యంలో మరో కొత్త అభివృద్ధి సూచిక కూడా చేర్చవలసిన అవసరం ఉంది. అదే మానవ మేధస్సుకి సంబంధించి, వ్యక్తుల సమస్యా పరిష్కార సామర్థ్యం, నిర్ణాయక శక్తికి చెందిన సూచిక. సమాజంలో మార్పులు వస్తోన్న కొద్దీ ఎన్నో కొత్త సూచికలు వస్తూనే ఉన్నాయి. అభివృద్ధి నిర్వచనం ద్రవ పదార్థంలా చేతికి అందినట్లే అంది జారిపోతోంది. పకడ్బందీగా ఉండే అభివృద్ధి నిర్వచనం కోసం అన్వేషణ సాగుతూనే ఉంది.

మార్క్స్ ప్రతిపాదించిన అభివృద్ధి వేరుగా ఉంటుంది. ఒక వస్తువు కాలక్రమంలో మరొక వస్తువుగా రూపాంతరం చెందే ప్రక్రియని అభివృద్ధిగా పిలువవచ్చును. ఇలా వస్తువు అభివృద్ధి చెందే క్రమంలో ఒక కొత్త నిర్మాణం రూపు తీసుకోవడం (construction అనవచ్చును), పూర్వ రూపం పోగొట్టుకోవడం (distruction - విధ్వంసం) ఒకే సమయంలో జరుగుతాయి. సమాజపరంగా చూస్తే మనం సర్వ సాధారణంగా వాడుకునే అభివృద్ధి-విస్థాపన అనే విడదీయరాని రెండు విడి విడి క్రమాలుగా గుర్తించవచ్చును. అంటే నిర్మాణం-విధ్వంసం అభివృద్ధికి విడదీయలేని రెండు భాగాలుగా ఒకే నాణేనికి రెండు ముఖాలుగా గుర్తించవచ్చును. ఈ నిర్వాసిత ప్రజలు కొత్త నిర్మాణం(వ్యవస్థ)లో భాగం అయినపుడే ఈ క్రమం పూర్తి అయి, విస్థాపన ప్రక్రియ కూడా అభివృద్ధికి దారి తీస్తుంది. సమాజంలో పరివర్తన(ట్రాన్స్‌ఫార్మేషన్) పూర్తి అవుతుంది. దీనినే అభివృద్ధి పథకాలు - విస్థాపన - తిరిగి అభివృద్ధి (development-displacement-re-integration projects) క్రమంగా గుర్తించవచ్చును.

2.2 సమాజ అభివృద్ధి అంటే

మార్క్సిజం ఒక సమగ్ర సిద్ధాంతంగా రూపొందడానికి ఆధారమైన మూడు మూలాలు - జర్మన్ ఫిలాసఫీ, ఇంగ్లిషు పొలిటికల్ ఎకానమీ ఇంకా ఫ్రెంచ్ సోషలిజం. కొన్ని విశిష్టమైన మార్పులతో మార్క్సిజంలో మూడు అంతర్భాగాలుగా మూడు పాయలుగా కలిసిపోయాయి. ఒక సమాజాన్ని ప్రతిఫలించే సిద్ధాంతంలో మూడు భాగాలు ఉన్నాయంటే ఆ వాస్తవ ప్రపంచానికీ, అందులో భాగమైన మనిషికీ మూడు రంగాలు ఉండాలని ప్రతిపాదించి, వాటిని మూడు అమూర్తతల రూపంలో వాస్తవ ప్రపంచానికి, మనిషికి కూడా వాటిని ఆపాదించి, సమాజ చలనాన్ని అర్థం చేసుకునే ఒక నమూనా రూపొందించే ప్రయత్నం చేసారు. స్థూలంగా వాస్తవికతని ఒక ఏక శిలాఖండంగా, ఒక మూసలో పోసినట్లుగా, ఒక ముద్దలా కాకుండా మూడు సమాంతర రంగాలలో స్థానీకరించబడిన మూడు అమూర్తత ల సహాయంతో అర్థం చేసుకోవడం సమంజసంగా ఉంటుంది. మొదటిది ఫిలసఫీ రంగంలో స్థల,కాల పరిమితులకు అతీతంగా ఉత్పత్తి విధానంలో సాధ్యమయ్యే దీర్ఘకాలిక మార్పులు. రెండవది పొలిటికల్ ఎకానమీ రంగంలో స్థల ప్రత్యేకతని ఒక స్థలానికి ఆపాదించి సమాజంలో సాధ్యమయ్యే మార్పులు; మూడవది స్థల కాల ప్రత్యేకత ద్వారా ఒక స్థలంలో వ్యక్తి ఆలోచన-ఆచరణల మధ్య సాధ్యమయ్యే మార్పులు. ఈ నమూనాలో సమాజం అంటే అంతర్గతంగా తాను చలనంలో ఉంటూ, తన చలనం ద్వారా మిగతా రంగాలలో చలనాన్ని ప్రభావితం చెయ్యగలిగిన మూడు సమాంతర రంగాల కలయిక. మరొక విషయం ఈ చలన స్వభావం సరళంగా కాకుండా, గతితార్కికంగా ఉంటుంది. ఈ మూడు రంగాలను ఉత్పత్తి శక్తులు, ఆస్తిసంబంధాలు, ఉపరితలంగా గుర్తించవచ్చును.

సమాజాన్ని అంతర్గతంగా చలనంలో ఉండే మూడు రంగాల సమ్మేళనంగా రూపొందించినపుడు, ఈ మూడు రంగాలలో మొదటిదైన ఉత్పత్తి శక్తులు, మనిషికి ప్రకృతికి ఉండే సంబంధాన్ని తెలిపే రంగం. మనిషితో ప్రమేయం లేకుండానే మార్పు చెందగలిగే స్వతంత్ర ప్రతిపత్తి ఉండడంతో, సాధారణ పరిస్థితులలో ఉత్పత్తి శక్తుల రంగం మిగతా రంగాలతో పోల్చి చూస్తే అగ్రగామిగా ఉండి, మిగతా రంగాలలో మార్పులను ప్రభావితం చెయ్యగలగడంతో ఈ ఉత్పత్తి శక్తుల అభివృద్దే(సమాజ) అభివృద్ధిగా భావించబడుతుంది. ఇలా చూస్తే,

- అభివృద్ధి అంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధిగా చూడవచ్చును.
- అభివృద్ధి అంటే మానవ సంబంధాలలో మార్పు అని కూడా అనుకోవచ్చును.
- అలాగే మనిషికి ప్రకృతికి ఉండే సంబంధం ఐక్యత, సంఘర్షణలలో ఏది ప్రధానం అనే అవగాహన ప్రాపంచిక దృక్పథాన్ని ఇస్తుంది అనుకుంటే.
- అభివృద్ధి అంటే ఈ ప్రాపంచిక దృక్పథంలో మార్పుగా చూడవచ్చును.
- ఇంకొక రకంగా చూస్తే, సమాజం అంటే మానవ సంబంధాల సముదాయంగా భావిస్తే.

2.3 సమాజ అభివృద్ధి : కొరత ఆధారంగా

మానవ పరిణామక్రమ చరిత్రని పరిశీలించితే, ప్రతి సమాజం తన ప్రజా జీవనానికి అవసరమైన పదార్థాలను ఉత్పత్తి చేయడానికి కావలసిన ముఖ్య వనరులు - మానవ శ్రమ, భూమి, పెట్టుబడి(డబ్బు, సాధనాలు) తమలో పంచుకునే క్రమంలో ప్రత్యేక గుణాలు కలిగిన ఒక వ్యవస్థ, దానిలో భాగాలు ఏర్పడతాయి. ఈ వ్యవస్థలు అప్పటికి అందుబాటులో ఉన్న జ్ఞానం, ఆ జ్ఞాన సముపార్జన మీద ఆధారపడతాయి. అప్పటి సమాజంలో మనుష్యులు సమకూర్చుకున్న జ్ఞానం ఆధారంగా, ఉత్పత్తికి అవసరమైన మూడు వనరులలో ఒకటి సమాజంలో అధికోత్పత్తి సాధించడానికి అడ్డంకిగా, కొరత కనిపించిన కారణంగా, ఆ వనరు మిగతా వనరులతో పోల్చి చూస్తే, సమాజంలో అధిక ప్రాధాన్యత సంతరించుకొని, ఒక భావజాల రూపాన్ని పొందుతుంది. వ్యవస్థలో అన్ని రంగాలను ప్రభావితం చేసి కొన్ని విలువలను ఇవ్వడంతో పాటు ఒక ప్రాపంచిక దృక్పథాన్ని కూడా ఇస్తుంది.

మానవ శ్రమ 'కొరత' గా ఉన్న వ్యవస్థని ప్రస్తుత ఆదివాసీ సమాజంలో గమనించవచ్చును. అలాగే భూమి కొరతగా ఉన్న స్థిర వ్యవసాయ వ్యవస్థని భూస్వామ్య వ్యవస్థగానూ, అలా కాకుండా ప్రకృతి మీద జ్ఞానం పెరిగిన కారణంగా ఉత్పత్తుల పెరుగుదలకి, భూమికి బదులు, పెట్టుబడి కారణంగా చూసి, పెట్టుబడి ద్వారానే అధికోత్పత్తి సాధ్యమనేది పెట్టుబడిదారీ వ్యవస్థగానూ పేర్కొనడం జరిగింది. ఈ వ్యవస్థలలో ఉండే విభిన్నత వనరులను చూచే దృక్పథంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకి భూమి అనే వనరు తీసుకుంటే, ఆదివాసీ సమాజంలో భూమి ప్రకృతిలో పుష్కలంగా లభ్యమయ్యే వనరుగా ఏ ప్రత్యేకమైన విలువలు లేని దానిగా ఉంటే, స్థిర వ్యవసాయ వ్యవస్థలో భూమి తమ జీవనాధారంగా ఉంటే, పెట్టుబడిదారీ వ్యవస్థలో భూమి ఒక సరుకుగా మార్కెట్టులో విలువ కలదిగా చూడబడుతుంది.

ఇలా సమాజం ఒక కొరత దశ నుండి మరొక కొరత దశలోకి మార్పు చెందడమే అభివృద్ధిగా నిర్వచించుకోవచ్చును. కాని ఈ అభివృద్ధికి కొన్ని షరతులు ఉన్నాయి.

1. ఏక కాలంలోనే కొరతల మార్పు, అంటే భూమి కొరత పోయి భూమి పుష్కలంగా లభ్యమనీ, ఇంత వరకూ 'కొరత' గా లేని పెట్టుబడి 'కొరత' వనరుగా మారిపోవడం జరగాలి. అంటే కొత్త వ్యవస్థ నిర్మాణ క్రమంలో పాత వ్యవస్థ ధ్వంసమైపోయే రెండు చర్యలు ఏకకాలంలో జరిగిపోవాలి. ఇవి ఒక వేళ ఏక కాలంలో జరగకపోతే, నిర్మాణం కూడా విధ్వంసంగా మారి పోయే ప్రమాదం ఉంది. అభివృద్ధి ప్రక్రియ అసంపూర్ణంగా ఉండిపోతుంది.

2. కొత్త నేతృత్వం ఆవిర్భవించాలి. ఈ నేతృత్వానికి భవిష్యత్తులో తాము కోరుకునే కొత్త సమాజపు రూపురేఖలు, ధ్యేయం, అవసరాల గురించిన ముందు చూపూ ఉండాలి.

ఇలా చూస్తే అభివృద్ధి అంటే సమాజం ఒక 'కొరత' దశ నుండి మరొక 'కొరత' దశలోకి మారే ప్రక్రియగా గుర్తించవచ్చును.

మన దేశం అభివృద్ధి చెందే క్రమంలో అంతర్జాతీయ

పెట్టుబడి మీద ఆధారపడిన నేపథ్యంలో, పెట్టుబడి తన అవసరాల రీత్యా మిగతా రెండు వ్యవస్థలను తొలగించకుండానే వాటితో సహజీవనం చేస్తున్న కారణంగా కొన్ని అసాధారణ పరిణామాలు వచ్చాయి. అందులో ఒకటి మన దేశాన్ని కాని, రాష్ట్రాన్ని కాని పై మూడు వ్యవస్థల సమాహారంగా అంటే ఒక పిరమిడ్ రూపంలో ఊహించుకోవచ్చును. ఒరిస్సా లాంటి అభివృద్ధి పరంగా వెనుకబడిన రాష్ట్రాలలో శ్రమ కొరత సమాజం దాని (బేస్) గా, దాని మీద అంతకంటే తక్కువ పరిమాణంలో భూమికొరత సమాజం, దాని పైన అతి చిన్న భాగంగా పెట్టుబడి కొరత సమాజం, ఒక పిరమిడ్ రూపంగా ఏర్పడే కలయికగా చూడవచ్చును. అదే మార్కెట్టు ప్రభావం ఉన్న గుజరాత్ లాంటి రాష్ట్రాలలో పై దానికి విరుద్ధంగా, పై మూడు వ్యవస్థలు ఒక తలకిందులయిన పిరమిడ్ రూపంలో, అంటే అతి చిన్న శ్రమ కొరత సమాజం, దీనికంటె పెద్దదైనా భూమి కొరత సమాజం, అంతకంటే పెద్దదయిన పెట్టుబడి కొరత సమాజం కలగలిసి ఉండడం మన దేశంలో వచ్చిన అసాధారణ పరిణామాలలో ఒకటి.

2.4 వ్యక్తి అభివృద్ధి

వ్యక్తిని ఆచరణ - ఆలోచనల సమ్మిళితంగా చూస్తే, ఆచరణ ద్వారానే జ్ఞానం పెరుగుతుంది అనుకుంటే, ఆ పెరిగిన జ్ఞానము తిరిగి ఆచరణం మెరుగు పరుస్తుంది అని అనుకోవచ్చు. ఈ క్రమం ఆచరణ-ఆలోచన-కొత్త ఆచరణ ద్వారా వ్యక్తి అభివృద్ధి సాధ్యమౌతుంది. ఈ నమూనాలో వాస్తవ ప్రపంచం ఎల్లపుడూ చలనంలో ఉంటుంది కాబట్టి, వాస్తవ ప్రపంచానికి మనిషి తయారు చేసుకున్న నమూనా ఎల్లప్పుడూ వాస్తవ ప్రపంచానికి తక్కువగా ఉండి, ఈ నమూనా వాస్తవ ప్రపంచాన్ని అందుకునే ప్రయత్నంలో నమూనా మార్పులు వస్తూనే ఉంటాయి.

ఇక్కడ జ్ఞాపకం పెట్టుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, ఒక వ్యక్తి నిర్దిష్ట స్థల కాల నేపథ్యంలో అంటే ఒక నిర్దిష్ట వ్యవస్థలో తన కంటే ముందు నుండి ఉన్న సమూహంలో కొన్ని నిర్దిష్ట సామాజిక సంబంధాల నేపథ్యంలో జన్మించిన కారణంగా ఆ వ్యక్తికి ఈ సంబంధాలన్నీ జన్మతః సంక్రమిస్తాయి. ఈ నిర్దిష్ట నేపథ్యము మనిషికి ఆచరణ-ఆలోచన విషయంలో కొన్ని హద్దులు, నియమాలు ఏర్పరుస్తుంది. మనిషి వీటన్నింటినీ అంగీకరించవలసి ఉంటుంది. కొన్ని సార్లు ఈ సంబంధాలు వ్యక్తికి సమస్యగా, అడ్డంకిగా తోచి అవి వచ్చినపుడు వాటిని అవగాహన చేసుకునే క్రమంలో వ్యక్తిలో చలనం అలా పెరిగిన జ్ఞానం ఆచరణలో పెట్టడం ద్వారా అడ్డంకులు తొలగిపోయి సమాజ చలనానికి అవకాశం ఏర్పడుతుంది. అంటే ఆచరణలో వచ్చే మార్పులు ఆలోచనలను ప్రేరేపిస్తే,ఆలోచనలో వచ్చిన మార్పులు ఆచరణను ప్రభావితం చేస్తాయి అని అనుకోవచ్చును ఇదే మరో రకంగా చెప్పుకుంటే, పాత సమస్యలను కొత్తకోణంలోంచి చూసి కొత్త సమాధానాలు వెతకడం, కొత్త సమస్యలను గుర్తించి వాటికి ఒక సమాధానాన్ని వెతకడం అభివృద్ధిగా చూడవచ్చును.

2.5 మన దేశంలో పెట్టుబడి దశ, పర్యవసానాలు

పెట్టుబడి తన జాతీయ సరిహద్దులు దాటి ప్రపంచంలో పెట్టుబడి పూర్వ సంబంధాలు ఉన్న దేశాలలో విస్తరించిన క్రమం దాని మూడవ దశగా గుర్తించవచ్చును. దానినే సామ్రాజ్యవాద దశ అనుకుంటే ఉత్పత్తుల ప్రక్రియ కంటే చలామణీ ప్రక్రియ ద్వారా మిగులు పోగు చేసుకోవడానికి స్థానిక పాలక వర్గంతో సహజీవనం చేయవలసిన అవసరం వచ్చింది. దీనితో చారిత్రక క్రమం తలకిందులవుతుంది. అంటే పెట్టుబడి పూర్వ వ్యవస్థని (భూస్వామ్య వ్యవస్థ అని ప్రస్తుతం అనుకోవచ్చును) తోసి వేయకుండానే, దానితోనే రాజీకి వస్తుంది. సహజీవనం చేస్తుంది. సమాజాన్ని చలనంలో ఉండే మూడు రంగాల నమూనా సహాయంతో అవగాహన చేసుకుంటే, రెండు వ్యవస్థల లోని ఉత్పత్తి శక్తులు(పి.ఎఫ్) ఆస్తి సంబంధాలు(పి.ఆర్) రంగాలలో సహజీవనం స్పష్టంగానే కన్పిస్తుంది కాని దీనికి విరుద్ధంగా పెట్టుబడిదారీ పూర్వ ఉపరితలం బలోపేతమయింది. ఇది అంతర్జాతీయంగా కూడా విస్తరించింది. బలపడింది కూడా. ప్రపంచ స్థాయిలో ఉపరితలంలో పెట్టుబడిదారీ పూర్వ ఉపరితలం వ్యాపించింది. మన దేశంలో కూడా ఇదే జరిగింది. చారిత్రకంగా బద్ధ విరోధులయిన ఈ రెండు వ్యవస్థల కలయిక బడిలో చిన్న పిల్లలు ఆటల పందెంలో ఆడుకొనే మూడు కాళ్ల పరుగు పందేన్ని పోలి ఉంటుంది. అసమ వ్యక్తులు చెట్టాపట్టాలేసుకుని పరుగెత్తే ఈ పందెంలో ఒకరి గెలుపు మరొకరి ఓటమి కాకుండా, ఒకరి గెలుపు మరొకరికి కూడా గెలుపుగానే నిర్ణయించబడుతుంది. ఒకరి గెలుపు ఎంత ప్రస్ఫుటంగా ఉంటే మరొకరు కూడా అంతే ప్రస్ఫుటంగా గెలిచినట్లు భావించ బడుతుంది. కాని సమాజ పరిణామానికి, అభివృద్ధికి తీవ్రమైన అడ్డంకి ఏర్పడడమే కాకుండా ఒక సంక్షోభానికి దారి తీస్తుంది. మన దేశంలో ఇటువంటి అసంపూర్ణ పరిణామం కారణంగా మన ప్రస్తుత వ్యవస్థ అర్ధ భూస్వామ్య అర్ధ వలస వ్యవస్థగా వర్ణింపబడుతోంది.

పర్యవసానాలు:-

1. పెట్టుబడి పూర్వ సమాజాలలో ప్రవేశించే అంతర్జాతీయ పెట్టుబడి, తన పూర్వ దశలలో మాదిరిగా ఉత్పత్తి విధానంలో శ్రమ శక్తి, ఉత్పత్తి సాధనాలలో మార్పుల ద్వారా కాకుండా, ఉత్పత్తి విధానంలో మార్పులతో సంబంధం లేని కొత్త సరుకుల కలగూర గంపని దేశంలో ప్రవేశ పెడుతుంది. ఈ కారణంగా అభివృద్ధి చెందిన దేశాలలో వచ్చిన ఫలితాలు ఇక్కడ రాకపోగా, దానికి విలోమమైన (అంటే కాస్-ఎఫెక్ట్ తిరగబడడం) ఫలితాలు(దీనినే ఇన్‌వెర్షన్స్ అని కూడా అనవచ్చును) వస్తాయి.

2. ఈ దశలో పెట్టుబడి స్థానిక భూస్వామ్య వ్యవస్థతో ఏర్పరచుకున్న సహజీవనం వలన ఉత్పత్తి శక్తులలో వృద్ధి, ఉత్పత్తి సంబంధాలలో మార్పులు కొన్ని రంగాలలో వచ్చి, పెట్టుబడి పూర్వ వ్యవస్థలోని వివిధ విధానాలతో కలగలిసి ఉంటుంది.

3. ఈ దశలో పెట్టుబడి పూర్వ వ్యవస్థలోని ఉపరితలంలో సాధారణంగా మార్పులు తీసుకుని రాలేదు. కాకపోగా, పెట్టుబడి పూర్వ ఉపరితలం (దీన్ని ఆనవాయితీగా ఫ్యూడల్ ఉపరితలంగానే చూస్తారు) అంతర్జాతీయంగా కూడా బలపడి అభివృద్ధి చెందిన దేశాలలోని ఉపరితలాన్ని ప్రభావితం చేస్తుంది. అంటే ఆ దేశాలలో పెట్టుబడి పెరుగుదలతో అనుబంధంగా పెట్టుబడికి చెందిన ఉపరితలం ఏర్పడకుండా, పెట్టుబడి పూర్వ ఉపరితలం చోటు చేసుకుంటుంది. ఇది పెట్టుబడి గుణాన్ని మార్చి వేస్తుంది. దానికున్న పురోగమన కార్యక్రమాన్ని అడ్డుకుంటుంది. దీనితో పెట్టుబడి స్వభావం మారిపోతుంది.

4. ఈ క్రమంలో పెట్టుబడి తన ప్రగతి కోసం పెట్టుబడి పూర్వ సమాజంలోని సంస్థలు మతం, జండర్, కులం లాంటివాటి సహాయం తీసుకుంటుంది. దీనికి బలపడుతున్న వివిధ అస్తిత్వ ఉద్యమాలే ఉదాహరణ.

5. ఇలా ప్రపంచమంతటా అస్తిత్వ ఉద్యమాలు చోటు చేసుకోవడంతో, వర్గ పోరాటం తెరుమరుగయి వెనక్కి నెట్టి వేయబడింది. దేశంలో అభివృద్ధి అనే భావన వెనక్కు వెళ్ళి వృద్ధి అనే భావన బలంగానే ముందుకు వచ్చింది. అభివృద్ధి కుంటుబడడమే కాకుండా, సమాజంలో పెట్టుబడి ఉన్నా కూడా అది తీసుకుని రావలసిన పెట్టుబడి సంబంధాలు లేని సమాజంగా తయారయింది.

6. పెట్టుబడి పెరిగిన కొద్దీ, సమాజంలో కొన్ని ప్రగతి పూర్వక మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, పెట్టుబడికి, పెట్టుబడి పూర్వ(ఫ్యూడల్) సమాజంతో ఉండే అనుబంధం బలపడడంతో సమాజ గమనం కొంత వెనుకంజ వేస్తుంది. దీనినే రీఫ్యూడలైజేషన్ అనవచ్చును. వ్యవసాయరంగంలో పెరుగుతోన్న(నాన్ కల్టివేటింగ్ పీసెంట్ హౌసోల్డ్ భూమి యాజమాన్యం ఉండి కూడా ఆ భూమి మీద తమ శ్రమ శక్తితో వ్యవసాయం చేయని కుటుంబాలు-ఓన్ లాండ్ బట్ డునాట్ కల్టివేట్) దీనికి ఉదాహరణ.

ఈ బంధాన్ని తెగకొట్టి కొత్త సమాజ నిర్మాణం చేయడం అంతే కష్టమవుతుంది.

3. మన దేశ అభివృద్ధి నమూనా

3.1 గత 60 సంవత్సరాలుగా మన దేశ సాంప్రదాయ వ్యవస్థని ఆధునీకరించే ప్రయత్నాలనేకం జరిగాయి. దేశ ప్రధాని నెహ్రూ నాయకత్వంలో, మహల్‌నోబీస్ సారథ్యంలో రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలు దేశ ప్రగతికి ఒక లక్ష్యాన్ని, ఒక దిశని ప్రతిపాదించాయి.ప్రపంచంలో అమెరికా, ఇంగ్లాండు లాంటి అనేక దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా గుర్తింపు పొందాయి. ఆ దేశాలలో సమాజం ఎదుర్కొనే సమస్యలకి పరిష్కారం అన్వేషించే క్రమంలో అభివృద్ధికి సంబంధించిన జ్ఞానం క్రోడీకరించబడినదనీ, ఆ నమూనానే మన దేశం కూడా అనుకరిస్తే మనం కూడా వారిలాగే అభివృద్ధి చెందగలమనే ఆశ మన నేతృత్వానికి ఉండేది. దేశ అభివృద్ధి అంటే పెట్టుబడి ప్రాధాన్య దేశంగా మారిపోవడమేననీ, అంటే అభివృద్ధి అంటే ఒక సాంకేతిక సమాధానంగా భావించడం జరిగింది. కాబట్టి దీనికి కావలసిన సాంకేతిక జ్ఞానం ఒక నమూనా రూపంలో వ్యక్తీకరించబడి, ఆ దేశాలు మనకు సమకూరుస్తాయనీ, దీనితో పాటు అత్యవసరమైనది కావలసిన ధన సహాయం మాత్రమేననీ, అది ప్రపంచ బ్యాంకు లాంటి ద్రవ్యనిధి సంస్థల ద్వారా అప్పు రూపంలో ఒనగూడుతుందనీ, అదే మన దేశ అభివృద్ధికి మార్గమని నమ్మకం ఉండేది. ఆ దేశాలను అనుకరిస్తూ వివిధ కార్యక్రమాలు చేపడితే, మన దేశం కూడా వారిలాగే అభివృద్ధి చెందగలదనే నమ్మకం, ఆశ మన నేతృత్వానికి ఉండేది. మన దేశంలో వ్యవసాయ రంగంలో మార్పుల కొరకు అమెరికాలోని టెనేసీవాలీ ప్రాజెక్టుని అనుకరిస్తూ ఒరిస్సాలో హిరాకుడ్ డ్యాం, పరిశ్రమల రంగంలో రష్యాలోని ఉక్కు కర్మాగారాన్ని పోలిన రూర్కెలా ఉక్కు కర్మాగారం ఇలా స్థాపించినవే. ఉక్కు మిగతా పరిశ్రమలకు ఆధారం అవడంతో భిలాయ్, టాటానగర్ లాంటి ప్రదేశాలలో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు చేసారు. వీటినే దేశ ప్రగతికి పునాదులుగా భావించారు. అంతే కాకుండా సేవారంగంలోనూ మౌలిక సదుపాయాల సౌలభ్యం కోసం విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలకు సంబంధించి ఎన్నో కొత్త పథకాలు చేపట్టారు. ఈ పథకాల అమలు ద్వారా కొంత వెలుగులు వచ్చినమాట వాస్తవమే కాని ఆశించిన లక్ష్యాలకు సాధించిన లక్ష్యాలకు తేడాలు వచ్చాయి. పెట్టుబడి ఇది జాతీయం అవవచ్చును, అంతర్జాతీయం అవచ్చును/ ద్వారా మాత్రమే సమాజ పునర్నిర్మాణం సాధ్యమనే నమ్మకంతో పై క్రమాన్ని వేగవంతం చేసే గ్లోబలైజేషన్ విధానం ఎంచుకోవడం, మన ఆర్థిక రంగాన్ని అంతర్జాతీయ మార్కెట్టులో భాగంగా చెయ్యడం, ఆ మార్కెట్టు అవసరాలకు అనుగుణంగానే కార్పొరేటు వ్యవసాయం ద్వారా వ్యాపార పంటల ఉత్పత్తి, సెజ్‌ల ద్వారా వివిధ పరిశ్రమలు, సేవారంగంలో కార్పొరేటు ఆస్పత్రులు, 5 నక్షత్రాల హోటళ్ళు, కార్పొరేటు విద్యాలయాలు, రియల్ ఎస్టేటు, నాలుగు లేక ఆరు లేన్ల పెద్ద పెద్ద రోడ్లు, బహుళ అంతస్తుల భవన సముదాయం, ఐ.టి. ఆధారిత సంస్థలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, సూపర్ మార్కెట్లు, వీటన్నిటికి కావలసిన రాయితీలు... ఇలా ఎన్నో మార్పులు, చేతిలో డబ్బు ఉంటే కొన్ని వేల సరుకులు మార్కెట్టులో లభ్యమౌతాయి. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం 20సంవత్సరాలలో రూపొందించిన భూసేకరణ చట్టంలో కూడా పారిశ్రామికీకరణ దీనికి అనుబంధంగా మౌలిక సదుపాయాల కల్పన, పట్టణీకరణ అనేవి దేశ ఆర్థిక వృద్ధికి మూడు మంత్రాలుగా ఉద్ఘాటిస్తూ, అడ్డంకులు లేని పెట్టుబడి ప్రవాహమే దేశంలో వృద్ధికి మూల సూత్రంగా, ప్రధాన లక్ష్యంగా పరిగణించడం జరిగింది.

ఈ ప్రపంచీకరణ కార్యక్రమం వలన అనూహ్యమైన పర్యవసానం ఒకటి సమాజంలో చోటు చేసుకుంది. శ్రమ లేకుండా, కొన్నిసార్లు సరుకుల ఉత్పత్తి లేకుండానే, పై దేశాలకు అనేక సేవలు అందించడం ద్వారా అంటే, ఉత్పత్తితో ప్రత్యక్ష సంబంధం లేకుండానే లాభాలు, డబ్బు సంపాదించ వచ్చుననే భావజాలం

సమాజంలో బలంగా వేళ్ళూనుకుంది. దీనికి ఉదాహరణ మన (స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్) లో డబ్బు పెడితే మనకు లాభాలు వస్తాయని అందరం అనుకుంటాం. అంతే కాకుండా, ప్రజల అవసరాలతో సంబంధం లేని సరుకుల జాబితా వేల సంఖ్యలో పెరిగిపోవడం, ఇవన్నీ మార్కెట్టులో ప్రత్యక్షమవడం, అనేక ప్రలోభాలకు గురి చేసి వాటిని కొనేలా చెయ్యడం చూస్తూనే ఉన్నాం. కళ్ళు మిరుమిట్లు గొల్పే ఈ వెలుగులే అభివృద్ధి అనే భావం కూడా సమాజంలో బలంగా వచ్చింది. పెట్టుబడి తన ప్రభావాన్ని చూపడం ప్రారంభించింది. అందరం అనుకునేటట్లుగా బొంబాయిలోనో, విశాఖపట్టణంలోనో ఉన్న వసతులన్నీ మన గ్రామంలో కూడా సమకూర్చుకుంటే, మనం కూడా వాటిలాగే అభివృద్ధి చెంది పోగలమనే ఊహ(భావజాలం) అలాంటిదే. దీనితో అభివృద్ధి క్రమం మరుగై, అభివృద్ధి రూపాలే అభివృద్ధిగా చలామణీ అయిపోతున్నాయి. అభివృద్ధి అరువు తెచ్చుకునే రూపం అయింది. ఇవన్నీ జరిగినప్పటికీ మన దేశంలో ప్రధాన సమస్యలైన పేదరికం, నిరుద్యోగం, సమాధానం దొరకని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. అభివృద్ధి లాగానే పేదరికం నిర్వచనం కూడా మారిపోతూనే ఉంది. వానిలో పేదల సంఖ్య, అంచనాకి అందకపోవడం, పేదలు, నిరుద్యోగుల సంఖ్యలుగా మారిపోవడం జరిగింది. ఇంకో విధంగా చూస్తే, అభివృద్ధి అనేది సమాజంలోని ప్రజలు ఎదుర్కొనే సమస్యలకి సమాధానం వెతికే క్రమంగా కాక, అభివృద్ధి చెందిన దేశాలలోని కార్యక్రమాలు అనుకరించడమే అభివృద్ధిగా మిగిలిపోయింది.

3.2 అభివృద్ధి : సమాంతర పరిణామాలు, పర్యవసానాలు

మన దేశంలో గత 60 సంవత్సరాలుగా కొనసాగుతున్న పారిశ్రామికీకరణ యొక్క భౌతిక స్వరూపాన్ని పరిశీలించితే, మూడు సమాంతర పరిణామాలు ముందుకు వస్తాయి.

1. ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేసింది(సాంకేతికంగా).
2. లక్షలాది ప్రజలను వాళ్ళ భూముల నుండి, పని నుండి, నైపుణ్యం నుండి విడుదల చేసి వేరొక చోట జీవనోపాధి చూపించలేక నిరుద్యోగులను చేసింది.
3. ఈ రెండు పరిణామాలను భౌతిక ప్రపంచంలో కాక తప్పుడు చైతన్యంలో ప్రతిఫలించే భావజాలాన్ని బలోపేతం చేసింది.

వివరంగా మొదటిది.

మానవుడు ప్రకృతితో చేసిన సంఘర్షణ ఫలితంగా జ్ఞానం సంపాదించుకోవడమూ, క్రమానుగతంగా దీనిని సమాజంలో ఆచరించే క్రమంలో ఈ జ్ఞానం పెరుగుతూ రావడం జరిగాయి. ఈ పెరుగుదలే ఉత్పత్తి శక్తుల పెరుగుదలకి దారి తీస్తుంది. ఈ జ్ఞానమే అభివృద్ధి క్రమంలో అనేక భౌతిక రూపాలలో ఇమిడిపోయి ఇవే అభివృద్ధిగా ముద్ర వేసుకుంటాయి. ఈ భౌతిక రూపాలు ఎంత పెద్దగా ఉంటాయో, అభివృద్ధి కూడా అంతే ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయానికి తావు వస్తుంది. జ్ఞానం పెరుగుతోన్న కొద్దీ ఈ రూపాలు కూడా మారిపోతూ ఉంటాయి. ఇలా కొత్తగా వచ్చిన సాధనాలు, పరికరాలు, పరిజ్ఞానం, జ్ఞానం పాతవాటిని తొలగించి ముందుకు సాగుతాయి. ఉదాహరణగా, మానవుడు పాత రాతియుగం నుండి కొత్త రాతియుగానికి, ఇనుము ఉపయోగము నుండి మెకానికల్ పరికరాలకి, వాటి నుండి రసాయనిక పునాది గల ఉత్పత్తికి, ఆ ఉత్పత్తి నుండి ఎలక్ట్రానిక్ యుగంలోకి అభివృద్ధి చెందుతూ వచ్చాడు. ఇలా క్రమానుగత పరిణామ ఫలితాన్నే, వాటి భౌతిక రూపాన్నే అభివృద్ధిగా భావిస్తున్నాం.

దీనికి విరుద్ధంగా, మన దేశంలో సామ్రాజ్యవాద దశలో అభివృద్ధి క్రమంలో వచ్చిన భౌతిక రూపాలన్నీ తొలగింప బడకుండానే కొత్తవి కూడా వచ్చి వాటి పక్కనే చేరతాయి. కలకత్తా లాంటి నగరాలలో రవాణా సౌకర్యాలు చూస్తే-సైకిల్ రిక్షా, ఆటో రిక్షా, ట్రాము, బస్సు, రైలు, కారు, విమానం ఇవన్నీ కూడా ఉపయోగంలో ఉండి కన్పిస్తూనే ఉంటాయి. అలాగే వంట సాధనాలుగా ఉపయోగపడే కట్టెలు, బొగ్గులు, చితుకులు, పుల్లలు, రాక్షసి బొగ్గు, కిరసనాయిలు, కరెంటు, వంటగ్యాసు, హాట్ ప్లేట్, మైక్రో వొవెన్లు ఇలా అన్నీ ఒకే సమాజంలో వాడుకలో ఉంటాయి. ఎన్నో దశలకి చెందిన ఈ అభివృద్ధి రూపాల సమాహారమే ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సూచికగా నిలిచి సమాజంలో వెలుగులు నింపుతుంది.

ఈ సామ్రాజ్యవాద దశలో మన దేశం జ్ఞానానికి, టెక్నాలజీకి అభివృద్ధి చెందిన దేశాల మీద ఆధార పడడంతో, జ్ఞానం ఒక సమాచార సేకరణగా మారిపోయింది. కంఠస్థమే 'జ్ఞాన' సేకరణకి మేలైన ముఖ్య పద్ధతిగా మారిపోయింది. మన అభివృద్ధి, విదేశాలను ఆశ్రయించి వారినుండి అరువు తెచ్చుకునే సాంకేతిక జ్ఞానం అయితే, ఆచరణలో ఇది సమాచారంగానే ఉండిపోవడంతో, జ్ఞానం అభివృద్ధి చెందదు. ఆచరణలో వచ్చే సమస్యలకు సమాధానం తెలియక పై దేశాల మీదే ఆధారపడే పరిస్థితి వస్తుంది. జ్ఞాన సముపార్జనకి స్వావలంబన గుణం పోతుంది. మానవుడు సజీవ జ్ఞానవాహికగా తన వంతు జ్ఞానాన్ని పెంచి, ఈ పెరిగిన జ్ఞానాన్ని ముందు తరాలకు అందించే పాత్ర పోగొట్టుకొని, నిర్జీవ వాహికగా సమాచారాన్ని ఒక చోటు నుండి మరొక చోటుకి చేర వేసే మాధ్యమంగా, ఒక కన్వేయర్ బెల్ట్‌గా మారిపోతాడు.

రెండవది -

మన పారిశ్రామికీకరణ క్రమాన్ని పరిశీలించితే, ఒక ముఖ్యమైన పర్యవసానం అన్నింటిలోనూ సర్వసాధారణంగా కన్పిస్తుంది. పరిశ్రమల స్థాపన కొరకు అవసరమైన భూమిని సేకరించే క్రమంలో స్థానిక ప్రజానీకం, అందులో ముఖ్యంగా ఆ భూమిమీదే ఆధారపడి జీవించే ప్రజలు విస్థాపన చర్య ద్వారా భూములు పోగొట్టుకొని నిర్వాసితులైపోయారు. పాత సమాజంలో వారికున్న జీవనోపాధితో పాటు తమ జీవన శైలి, జ్ఞానం, పరిజ్ఞానం అన్నీ పోగొట్టుకొని, కొత్త సమాజంలో దానికవసరమైన నైపుణ్యం లేని కారణంగా జీవనోపాధి దొరకక దీనిలో భాగం కాలేక సమాజపు అంచులలోనే మిగిలిపోయారు. ఈ మిగులు మనుష్యులు అంటే

సమాజపు ఉత్పత్తిలో భాగమైనా కూడా సమాజపు అభివృద్ధిలో భాగం కాలేక, సమాజానికి భారమైన మనుష్యులు. వీరినే ఇంకొక రకంగా చెప్పాలంటే, వీరి అనేక రూపాలే దారిద్ర్య రేఖ దిగువన ఉండే పేద, నిరుపేద ప్రజలు, ఆదివాసీలు, సమాజపు అంచుల వెలుపల ఉండే సమూహం, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వ్యవసాయ కూలీలు, చిన్నకారు రైతులు, అసంఘటిత కార్మికులు, స్త్రీలు లాంటి వాళ్ళంతా ఈ కోవకే చెందిన మనుష్యులు.

పెట్టుబడి రాశి పెరిగిన కొద్దీ అంటే భారీ అభివృద్ధి పథకాల సంఖ్య పెరిగిన కొద్దీ, మిగులు మనుష్యుల సంఖ్య తగ్గకపోగా, క్రమంగా పెరుగుతూనే ఉంది. ఇప్పటికే ఉన్న మిగులు మనుష్యుల సమూహానికి కొత్త వాళ్ళు వచ్చి కలుస్తూనే ఉన్నారు. పరిణామాలు ఎటువంటివైనా సరే, పారిశ్రామికీకరణ మార్గమొక్కటే మన దేశ అభివృద్ధికి సూత్రమని తలచి, మన ప్రభుత్వం ఈ మిగులు మనుష్యుల గురించి ఆలోచించడం మొదలు పెట్టింది. దీపాలు వెలుగు నివ్వాలంటే సెమ్మ కింద చీకట్లు తప్పవనీ, అందరి కోసం కొందరు త్యాగం చెయ్యక తప్పదనీ, ఇది అనివార్యమని అనే వాదన కూడా ఉంది. దేశంలో నిరుద్యోగం, పేదరికం సమస్యల తీవ్రత ఒక పక్క, ఈ మిగులు మనుషుల సామాజిక అభివృద్ధికి ఆటంకమని తలచి, ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరిట వారి సమస్యలకి ఒక పరిష్కారంగా, అభివృద్ధి క్రమంతో ఏ సంబంధమూ లేకుండా వీరి కోసం ప్రత్యేకంగా జవహర్ రోజ్‌గార్ యోజన, మిగులు భూముల పంపకం, వివిధ పేదరిక నిర్మూలన పథకాలు, విద్య, ఆరోగ్యం, ఆహారం, ఉపాధి, వడ్డీ లేని ఋణ సహాయం, స్వయం సహాయక బృందాల ఏర్పాటు లాంటి రోజు వారీ అవసరాలు తీర్చే పథకాలు, పబ్లిక్ రంగంలో సంక్షేమ పథకాల పేరిట ప్రవేశ పెట్టింది. ఇవి అమలులో వైఫల్యం చెందుతూనే ఉన్నాయి, కొత్త పథకాలు వస్తూనే ఉన్నాయి. ఆచరణలో ఈ పథకాలు ఆశించిన లక్ష్యాలను సాధించలేక పోయాయి. దీనితో ఈ పథకాల మీద పెట్టే ఖర్చే అమితంగా, తడిసి మోపెడయినట్లుగా పెరిగిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థకి పెనుభారంగా, గుదిబండగా మారిపోయింది. దేశ ఆర్థిక పరిస్థితికి ఒక సవాలుగా నిలిచారు. ఈ ఖర్చు అనివార్యమైన తప్పనిసరి ఖర్చుగా, సామాజిక ఖర్చుగా తయారయింది. ఈ క్రమంలో తమ శక్తి మీద కాకుండా, ప్రభుత్వం అందించే సహాయం, దయాధర్మం మీద ఆధారపడే జన సమూహమే ఈ మిగులు మనుష్యులు. వీళ్ళు మిగిలిపోయిన మనుష్యులుగానే ఉండిపోయారు.

జీవించే ఆధారం లేకపోవడం, సుదూరంగా నైనా భవిష్యత్తు మీద ఆశలు లేకపోవడంతో వీరు అభివృద్ధి పథకాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. వీరి ఆందోళన తీవ్రతరమవడం, ప్రభుత్వ అణచివేతలో భాగంగా సమాజంలో హింస-ప్రతిహింసలు భాగమై పోవడమే కాకుండా అభివృద్ధి వెనుకంజ వేసింది. దీనికి కారణాలు అసంపూర్ణ పునరావాసం, కొత్త సమాజ నిర్మాణం, పాత సమాజ విధ్వంసం ఒకే సమయంలో జరుగక పోవడంతో అభివృద్ధి కూడా విధ్వంసంగానే మారిపోయింది.

సామాజిక సంబంధాలు పూర్తిగా మార్చలేని ఈ అసంపూర్ణతే 'పెట్టుబడి సంబంధాలు తీసుకుని రాలేని పెట్టుబడి' గా అనుకోవచ్చును. ఈ పరిస్థితుల్లో విస్థాపన ఒక అభివృద్ధికి దారితీయలేదు.

మూడవది-తప్పుడు చైతన్యం:-

సామ్రాజ్యవాద దశలో వచ్చిన ఈ వైరుధ్య ఫలితాలు సమాజంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక జీవితంలో అనేకానేక ధోరణులకు, ఘర్షణలకు దారి తీస్తోంది. మతం, కులం, వివిధ అస్తిత్వ ధోరణులకు తోడు ప్రాంతం, పేదరికం లాంటి అంశాలు ముందుకు వచ్చాయి. ఈ వైరుధ్య ఫలితాలను అభివృద్ధి క్రమంలో అనివార్యంగా జరిగే మార్పులుగా భావించాలనే వాదన కూడా ఉంది. ఎంత చెట్టుకి అంత గాలి అన్నట్లుగా, ఎంత భారీ అభివృద్ధి పథకమైతే అంత పెద్ద వెలుగుతో పాటు అంతే పెద్ద చీకట్లు అసంఖ్యాక నిర్వాసిత ప్రజల రూపంలో తప్పదనే వారు కూడా చోటు చేసుకుంటోంది. వీటన్నిటికి మూలం అభివృద్ధి చెందడం అంటే పెట్టుబడి దారీ దేశంగా మారిపోవడమేననీ, అభివృద్ధి చెందిన దేశాల నమూనాని అనుకరించడమే సరియైన పద్ధతి అని, అధిక పెట్టుబడులతో కూడిన అభివృద్ధి పథకాల స్థాపనే సాంప్రదాయ దేశాలకున్న ఏకైక మార్గమని ఒక మూఢ విశ్వాసం దీనికి మూలం. దీని మూలాన అభివృద్ధి పథకాలే అభివృద్ధిగా చలామణీ అయిపోయి, దేశంలో వస్తున్న మార్పులన్నీ అభివృద్ధిగానే కన్పిస్తున్నాయి. అభివృద్ధి రూపాలనే అభివృద్ధి అని ఒప్పుకుంటే, ఇప్పుడు వీటికి వ్యతిరేకంగా వస్తున్న ప్రజా ఉద్యమాలన్నీ అభివృద్ధి నిరోధక ఉద్యమాలయిపోతాయి. నయానో, భయానో వీటిని అణిచివేసే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తూనే ఉంటుంది.

4. ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గాలు

దేశంలో కొనసాగుతున్న అభివృద్ధి క్రమాన్ని పరిశీలించి చూస్తే, సమాజం ఆధునీకరించబడాలి అనే ధ్యేయంతో పెట్టుబడి-ఇది పబ్లిక్, ప్రయివేటు, పబ్లిక్‌ప్రయివేట్ పార్ట్నర్‌షిప్ దయినా సరే-ద్వారానే ఇది సాధ్యం అనుకునే పాలక వర్గ భావజాలం ప్రబలంగానే ముందుకు వస్తోంది. దీనిని వ్యతిరేకిస్తూ నిర్వాసిత ప్రజలు చేసే ఉద్యమాలను అభివృద్ధి పథకాలకు వ్యతిరేకంగానే కాకుండా అభివృద్ధి క్రమాన్నే ప్రశ్నిస్తున్న, వ్యతిరేకిస్తున్న ఉద్యమాలుగా గుర్తించ వచ్చును. ప్రస్తుత దశలో ఈ రెండు దృక్పథాల మధ్యన తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకోవడం దేశ ఆర్థిక పరిస్థితి మీద ప్రభావం చూపడంతో, సమాజం అనిశ్చితకు, సంక్షోభానికి లోనయింది. ఈ వైరుధ్య సందర్భంలోనే ఏది అభివృద్ధి? ఏది కాదు? ఇది ఎవరి అభివృద్ధి? అనే ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఈ మిగులు మనుష్యులను ఉపయోగించుకొని అభివృద్ధి సాధించడం ఎలా అన్నదే ఇవాళ మన ఆర్థిక వ్యవస్థ ముందున్న క్లిష్టమైన సవాలుగా నిలిచింది. ఈ సమస్యకి ఒక నిఖార్సయిన సమాధానం అన్వేషించే క్రమంలో రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ప్రస్తుత సమాజంలో రూపు తీసుకుంటున్నాయి.

వ్యాసం

ఆర్.ఎస్.రావుగారి తియ్యని జ్ఞాపకంలో...

భారత వ్యవసాయరంగంలో ఉత్పత్తి విధానం పై కొన్ని ఆలోచనలు

- డా. జి.బి.నాథ్

తెలుగు సేత : సంజన

గత శతాబ్దం 60 - 70 దశకాలలో మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్ర వేత్తలు, ఆచరణ శీలురు, సామాజిక శాస్త్రవేత్తలు - భారత ఆర్థిక రంగంలో - నిర్దిష్టంగా వ్యవసాయరంగంలో ఉత్పత్తి విధానాన్ని వివరించే చర్చలో నిమగ్నమయ్యారు. ఈ చర్చ చాలా మందిని ఆకర్షించింది. ఉత్పత్తి విధానానికి సంబంధించిన ఈ చర్చలో ముడిపడి ఉన్న ప్రధాన అంశాలను ఆలిస్ థార్నర్ ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ లో రాసిన వ్యాసపరంపరలో గుర్తించారు. క్లుప్తంగా అవి ఏమిటంటే 1. భారత వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ విధానం ఉన్నదా? 2. అలాకాని పక్షంలో వ్యవసాయరంగంలో ప్రధాన ఉత్పత్తి సంబంధం పెట్టుబడిదారీ పూర్వ సంబంధమా లేక అర్ధ భూస్వామ్య సంబంధమా? 3. ఒకటికంటే మించి ఉత్పత్తి విధానాలు ఉండే అవకాశం ఉందా? 4. నేటి భారత దేశంలో ప్రధాన వైరుధ్యం ఏది? 5. భారత ఆర్థిక వ్యవస్థను అలా చిత్రీకరించడం పట్ల వామపక్ష పార్టీలు ఎలా స్పందిస్తాయి. (థార్నర్ 1982 ఎ.బి.సి.) అదే పత్రికలో బాసోల్, బసులు (2011 ఎ.బి) తమకు లభించిన నూతన గణాంకాల ఆధారంగా రెండు భాగాల మరొక వ్యాసం రాసారు. దానిలో వారు విశ్లేషణలు, గణాంకాల ఆధారంగా చర్చను వ్యవసాయరంగ పరిధిని దాటి వ్యవసాయేతర రంగానికి విస్తృతం చేసారు. భారత ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సంబంధాలు, మిగులు విలువను చేజిక్కించుకొనే పద్ధతులను విశ్లేషిస్తూ 1982లో థార్నర్ లేవనెత్తిన అంశాన్నే వీరు కూడా లేవనెత్తారు. అయితే, భారత ఆర్థిక వ్యవస్థలో 1990లలో నయా ఉదారవాద ఆర్థిక విధానాల ప్రవేశం తర్వాత వచ్చిన మార్పుల్ని వారు అందులో చేర్చారు.

ఉత్పత్తి విధానంపై చర్చలో పాల్గొన్న వివిధ వ్యక్తుల అభిప్రాయాలు క్లుప్తంగా ఇవి. తమ క్షేత్ర పరిశీలన ద్వారాను, వ్యవసాయ యాజమాన్య అధ్యయనాలనుండి సేకరించిన గణాంకాల ద్వారాను ఒక బృందం భారత వ్యవసాయరంగంలోకి పెట్టుబడిదారీ విధానం ప్రవేశించిందనే నిర్ధారణకు వచ్చింది. దీనిని వ్యతిరేకించే బృందం పెట్టుబడి ఉనికిని నిరాకరిస్తూ భారత దేశాన్ని అర్ధవలసగా చిత్రించింది. ఈ రెండింటికి భిన్నంగా, భారత

మొదటిది పాలక వర్గం ఒక ప్రక్క తన పారిశ్రామికీకరణను కొనసాగిస్తూనే, దీనికి ఆటంకంగా ఉన్న మిగులు మనుషుల జీవన శైలిని మెరుగు పరచినప్పుడే తమ వృద్ధి కార్యక్రమం నిరాటంకంగా కొనసాగ గలదనే నమ్మకంతో, 'ఇన్‌క్లూసివ్ గ్రోత్' అనే ఒక కొత్త భావనని తయారు చేసి తమ ధ్యేయం నెరవేరే విధంగా ఎన్నో కొత్త ప్రణాళికలు తయారు చేసింది. స్వయం సహాయక సంఘాలు, మైక్రోఫైనాన్సింగ్ ఇన్‌స్టిట్యూషన్ తయారుచేసి నేరుగా మిగులు మనుషులకు ధన సహాయం చేసే కార్యక్రమం ద్వారా వారు మెరుగుపడే బరువు, బాధ్యతలను కూడా నేరుగా వారికే అప్పగించింది. ఇవి అమలులో సమస్యలను ఎదుర్కొంటున్నాయని వార్తాపత్రికల వారి కథనం. రెండవది మిగులు మనుషులు తమకు తామే ఇచ్చుకున్న మరో ప్రత్యామ్నాయ మార్గం. ఇందులో మిగులు మనుష్యులను మిగిలిపోయిన మనుష్యులుగా కాక, మిగులు ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న మనుష్యులుగా, సమాజ గమనానికి చోదక శక్తులుగా గ్రహించడం దీని ప్రత్యేకత. వీరి అభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని, దాని కనుగుణంగా వివిధ పథకాలు, కార్యక్రమాలు ఎంచుకోవలసిన అవసరం ఉంది. వారి పరిసరాలలో లభ్యమయ్యే వనరుల ఆధారంగా, వారి నైపుణ్యం, సామర్థ్యం, వారి జ్ఞానాన్ని మెరుగు పరచడం, వీటికే రానున్న కొత్త సమాజపు అవసరాలకూ సంతులనం ఉండే విధంగా కార్యక్రమాలు చేపడితే, సమాజంలో మిగులు మనుషులు అభివృద్ధి చెంది తద్వారా సమాజంలో సమగ్రమైన అభివృద్ధి సాధ్యమయ్యే అవకాశం ఉంది. అందుచేత దీనిని 'ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్' గా చూడవచ్చును. దీనినే శ్రమ ఆధారిత అభివృద్ధి మార్గంగా కూడా చూడవచ్చును.

ఆర్.ఎస్.రావు గారి మాటల్లో....

ఈ చట్రం రూపొందించడంలో భారత ఆర్థిక వ్యవస్థలో పేద రైతులు, వ్యవసాయ కూలీలకు ప్రధాన స్థానముంటుందనీ, వారు పేదరికం గురించి, మార్కెట్లు గురించి లేవనెత్తిన అంశాలు ఒకవైపు, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం మీద, సహాయం మీద ఆధారపడడం గురించిన ప్రశ్నలు మరొక వైపు ఒక చట్రాన్ని ప్రతిపాదించే ఇతివృత్తాలవుతాయి.

ఈ చట్రం ఒడిదుడుకులతో ఉంది, ఇంకా స్పష్టమైన రూపం తీసుకోకపోయినా, భారత వాస్తవికతను అర్థం చేసుకునే చట్రం, బహుశా ఈ వాస్తవికతను అర్థం చేసుకునే చట్రం, బహుశా ఈ వాస్తవికతను మార్చగలిగే ఆలోచనా, ఆచరణ చట్రం దేశ పీడిత ప్రజలు తమకి తాము ఇచ్చుకున్న నక్సల్బరీ పోరాట చట్రమే అని ప్రతిపాదించారు.

అంటే మన ఆర్థిక వ్యవస్థని అర్ధ భూస్వామ్య-అర్ధ వలస వ్యవస్థగా వర్ణిస్తే, ఈ రెండు వ్యవస్థల మధ్య ఉండే బంధాన్ని తెగ్గొట్టి సమాజాన్ని ముందుకు నడిపించ గల ప్రజా ఉద్యమాలు చేసే సంఘర్షణే అభివృద్ధిగా. గుర్తించ వచ్చును. ఈ ప్రశ్నించడమే అభివృద్ధికి ఒక సూచికగా నిలుస్తుంది.

దేశంలోని ఉత్పత్తి విధానంలో పై రెండు అంశాలు మిళితమై ఉన్నాయని భావించింది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని సమర్థించే వారి ప్రాతిపదికలు : ఇవి 1. స్వేచ్ఛా వేతన శ్రామిక వర్గం ఉనికిలో ఉండడం (పట్నాయక్ 1971, ఓమ్ వెట్ 1981, రుద్ర 1970, ఛటోపాధ్యాయ 1972, బసోల్, బసు 2011, థార్నర్ 1982). 2. పెట్టుబడిదారీ రైతు తన ఉత్పత్తిలో ప్రధాన భాగాన్ని మార్కెట్‌లో అమ్ముకుంటాడు. (పట్నాయక్ 1971, బసోల్, బసు 2011, రుద్ర 1970, ఓమ్‌వెట్ 1981) 3. మరింత విస్తృతంగా అధిక మిగులు విలువను సృష్టించడం కోసం మిగులును పోగుచేసుకోవడం (సంచయనం), పునఃపెట్టుబడి పెట్టడం (పట్నాయక్ 1971, థార్నర్ 1972) 4. మానవ శ్రమ స్థానంలోకి యంత్రం ప్రవేశించడం. తదనంతర సాంకేతిక పరిణామాలు (రుద్ర 1979, ఓమ్‌వెట్ 1981, ఛటోపాధ్యాయ 1972)

ఈ ఆలోచనా విధానానికి భిన్నంగా, భారత వ్యవసాయరంగంలో ఉత్పత్తిలోనూ, ఉత్పత్తి సంబంధాలలోనూ ప్రధాన లక్షణం పెట్టుబడిదారీ కాదని, పెట్టుబడిదారీ పూర్వ లేక అర్థ భూస్వామ్యరూపమని వాదించే అనేక అధ్యయనాలు మనముందున్నాయి. పెట్టుబడిదారీ పూర్వ ప్రతిపాదనకు ఆధారాలు ఇవి. 1. స్వేచ్ఛా రహిత శ్రామిక వర్గంపై ఆర్థిక ఒత్తిడిని అమలు చేయడం ద్వారా మిగులును రాబట్టు కోవడం (బాధురి 1973) 2. విస్తృతమైన చట్ట బద్ధం కాని కౌలుదారీ వ్యవస్థ (బాధురి 1973, ప్రసాద్ 1973) 3. చిన్న కౌలుదారులు, వ్యవసాయకూలీలు అప్పుల ఊబిలో కూరుక పోవడం (భాధురి 1973, ప్రసాద్ 1973) 4. అదే ఆర్థికవర్గం చేతుల్లో వడ్డీ వ్యాపారం, భూయాజమాన్యం ఉండడం (బాధురి 1973, 1984, ప్రసాద్ 1974) 5. చిన్న రైతుల ఆర్థికవ్యవస్థ కొనసాగింపు. (సావు 1976, భాధురి 1984) 6. విలాసవంతమైన వినియోగం, అనుత్పాదక పెట్టుబడులలోకి మిగులు ప్రవేశించడం, వ్యవసాయరంగంలో అతి తక్కువ పెట్టుబడి ప్రవేశించడం (ప్రసాద్ 1974) 7. స్వల్పవేగంతో సాంకేతిక అభివృద్ధి 8. శ్రమ జీవుల నిరుద్యోగిత, అల్పనిరుద్యోగిత (చంద్ర 1974, సావు 1976)

భారతీయ వాస్తవికతలోని ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మూడవ ఆలోచనా విధానం రూపొందించిన శరత్ జి లిన్ (1980) వలసానంతర భారతదేశంలో ద్వంద్వ ఉత్పత్తి విధాన సిద్ధాంతానికి బహుళ ప్రచారం కల్పించారు. ఆయన సిద్ధాంతం ప్రకారం పెట్టుబడిదారీ పూర్వ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాలు సహజీవనం చేస్తున్నాయి. అందుచేత దీనిని ద్వంద్వ ఉత్పత్తి విధానం అని పిలవాలి. అదేవిధంగా హమ్జా అలావి (1975) వలసవాద ఉత్పత్తి విధానం అనే మాట వాడాడు. అంటే భారతదేశంలో పెట్టుబడిదారీ, భూస్వామ్య ఉత్పత్తి విధానం కాక వాటికి పూర్తిగా భిన్నమైన ప్రత్యేక ఉత్పత్తి విధానం అమలులో ఉందని అర్థం. ఈ వలసవాద ఉత్పత్తి విధానంలో భూస్వామ్య, అర్ధ భూస్వామ్య వర్గానికి, పెట్టుబడిదారీ రైతుకు మధ్య ప్రయోజనాలకు సంబంధించిన ఘర్షణలేదు. చిన్న కమతాలు కల్గిన మధ్య తరగతి రైతుల ఆధిపత్యం అమలవుతోంది. జాయిరస్ బనాజీ (1972) వలస పూర్వ భారతదేశంలో భూస్వామ్యం, వలస కాలంలో పెట్టుబడిదారీ విధానం ఉన్నాయనే నిర్ధారణలను తిరస్కరించారు. కానీ వలస కాలంలో భారత ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తి విధానాన్ని వలస ఉత్పత్తి విధానంగా చిత్రీకరించడం సరి అయినదని ప్రతిపాదించాడు.

పరేష్ ఛటోపాధ్యాయ (1972) సామ్రాజ్యవాదానికి సంబంధించిన చర్చను లేవనెత్తాడు. దానిది విధ్వంసక, ప్రతికూల పాత్ర: ఆయన అభిప్రాయంలో బ్రిటిష్ పాలకులు భారతదేశంలో పెట్టుబడిదారీ పూర్వ ఆర్థిక వ్యవస్థ స్థితిని కాపాడారు. నాశనం చేసారు. అదే సమయంలో భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి వేగాన్ని నిరోధించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశాన్ని అధ్యయనం చేసిన 'బాచి' (1982) స్వాతంత్ర్యానంతరం పెట్టుబడిదారీ అభివృద్ధి జరిగినప్పటికీ రాజ్య యంత్రాంగం పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి సంబంధాలతో అపవిత్ర మైత్రిని చేసుకొన్నది అని అన్నారు. భారతదేశంలో ఉత్పత్తి విధానంపై చర్చలో ఇమిడి ఉన్న వివిధ అంశాలను విస్తృతంగా అధ్యయనం చేసిన థార్నర్ (1982 ఎ.బి.సి) ప్రస్తుతం భారత వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ ఆధిపత్యం కొనసాగుతోందన్నారు. అంతమాత్రం చేత సమకాలీన భారతదేశంలో అమలవుతున్న ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ విధానంగా అర్థం చేసుకోకూడదన్నారు. (పెట్టుబడిదారీ అభివృద్ధి చలనాన్ని మార్క్సిస్టు సూత్రీకరణ వెలుగులో చూస్తే) పెట్టుబడిదారీ విధానం ఉద్భవించిన పారిశ్రామిక సమాజాల పరిస్థితులకు భిన్నంగా ఒక నిర్దిష్ట వలస నేపథ్యంలో భారత పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భవించడం ఇందుకు కారణమని ఆమె వాదన. (థార్నర్ 1982 సి.) వలసకాలంలో వ్యవసాయరంగం స్వభావరీత్యా భూస్వామ్యమని, అధికార మార్పిడి తదనంతరం పెట్టుబడిదారీ అభివృద్ధి జరిగినప్పటికీ వ్యవసాయరంగంలో అర్ధవలస, అర్ధభూస్వామ్యమే కొనసాగుతోందని వివిధ అంశాల సమీక్షనుబట్టే తెలుస్తుంది. మొత్తం మీద చూస్తే సామ్రాజ్యవాద ప్రభావం, పెట్టుబడిదారీ అభివృద్ధిని అరికట్టింది. అర్ధభూస్వామ్య సంబంధం ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అడ్డంకిగా నిలిచింది. (ఓమ్‌వెట్ 1981, పట్నాయక్ 1971, ఛటోపాధ్యాయ 1972, చంద్రా 1974)

ఉత్పత్తి విధానంపై చర్చలో తొలినుంచీ పాల్గొంటున్న ఆర్.ఎస్.రావు పెట్టుబడిదారీ రైతు వెతుకులాటలో 'రుద్ర' ప్రయత్నాలపై తీవ్ర వ్యాఖ్యానాలు చేసారు. ఆ వ్యాఖ్యానాలు చర్చలో పాల్గొన్న ఇతరులకు కూడా వర్తిస్తాయి. ఆయన వ్యాఖ్యాన సారాంశమేమిటంటే ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ కోసం వెతుకులాటలో ఇప్పుడెలా ఉన్నదనే దానికంటే, రాబోతున్నది ఏది అనేదానిమీద ప్రధాన వక్కాణింపు ఉండాలి. (రావు 1970) ఈ నేపథ్యంలో చూసినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థలో. పెట్టుబడి ఉనికి ఉందా లేదా అనే దానికంటే ఉన్న పెట్టుబడి స్వభావం ఏమిటన్నదే ప్రాసంగికమైన అంశంగా కనబడుతుంది. (రావు 1995 ఎ.) అయితే ఆయన పెట్టుబడి ఆధిపత్యకారకంగా ఉందా లేక ఇప్పుడిప్పుడే

అభివృద్ధి చెందుతుందా అనే అంశాన్ని చర్చించకుండా భారత సమాజాన్ని పరిణామం చెందించడంలో పెట్టుబడి సామర్థ్యాన్ని ప్రశ్నించారు. ఆయన మూడు అధ్యయన అంశాలను గుర్తించారు. 1. ఉపరితలం 2. దేశీయ మార్కెట్ 3. శ్రామిక శక్తి.

మొదటిది - భారత దేశంలో ప్రవేశించిన పెట్టుబడి తనతో పాటు పెట్టుబడిదారీ ఉపరితలాన్ని తీసుకురాలేదు. ఒకవైపు తన పెట్టుబడిదారీ పూర్వ లక్షణాన్ని ఒదులుకొని, మరొకవైపు వలస నిర్మాణాన్ని కలిగి ఉన్న పాత ఉపరితలాన్నే కొనసాగించింది.

రెండు - ఉత్పత్తిదారునిగా, మిగులు విలువను సృష్టించేది, వినియోగదారునిగా మార్కెట్‌ను సృష్టించేది కూడా కేవలం శ్రామిక వర్గం మాత్రమే. అయితే ఉద్యోగాలను కల్పించడంలో పెట్టుబడి అశక్తత కారణంగా పెద్ద సంఖ్యలో వ్యవసాయకార్మికులు నిరుద్యోగులుగా ఉండిపోయారు. ఇది వ్యవసాయరంగంలోనూ, పరిశ్రమలోనూ పెట్టుబడి పోగుపడడానికి అవరోధంగా మారింది.

మూడు - భూమి కలిగియున్న, భూమిలేని వ్యవసాయకార్మికులు నిరంతర దారిద్ర్యంలో ఉన్నారు. ఆ కారణంగా తమ శ్రమను స్వేచ్ఛగా పెట్టుబడికి అమ్ముకొనే స్వాతంత్ర్యాన్ని వారు ఉపయోగించుకోలేక పోతున్నారు. వర్తమాన కాలంలో భారతదేశంలో వ్యవసాయసంబంధాలను అర్థం చేసుకోవాలంటే సామ్రాజ్యవాద యుగంలో పెట్టుబడి స్వభావాన్ని విశ్లేషించాలని 'రావు' (1985 బి.) సూచిస్తున్నారు.

అసంపూర్ణ చర్చ : 1960, 1970లలో ఉత్పత్తి విధానంపై సాగిన చర్చ అసంపూర్ణంగా ఉండిపోయింది. విద్యావేత్తలు ఆర్థిక అంశాలకే పరిమితమై పోయారు. కొన్ని సందర్భాలలో వారు మేధోపరమైన సర్కస్‌ఫీట్లు చేసారు. వారి గణాంకాలే వారిని తికమక పెట్టాయి. మేధో పరిశోధకులలో చాలా మంది తమ సూక్ష్మ, స్థూల అధ్యయనాలలో భారత వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ రైతులకోసం అన్వేషిస్తుంటే, పేద రైతులు, వ్యవసాయకార్మికులు, భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు, లెనినిస్టు) నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక, వలసవాద వ్యతిరేక సాయుధ పోరాటం చేస్తున్నారు. భారత సమాజచలనాన్ని అధ్యయనం చేయడంలో మేధావుల ఆలోచనకూ, కార్యకర్తల ఆలోచనకూ ఉన్న తేడా ఇది. ఉత్పత్తి విధానానికి సంబంధించిన చర్చ అంతా 1960లలోని నక్సలైట్ ఉద్యమ ప్రతిఫలనంగానే జరుగుతూ ఉందనేది అర్థమవుతుంది. అయితే సమస్యలు లేవనెత్తడంలోనూ, జవాబులు వెదకడంలోనూ పరిశోధకులు వాస్తవాలనుండి పరాయీకరణ చెందారు.

వలసపూర్వ వస్తుగత స్థితి : 1947లో బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని వదలివెళ్ళిన తర్వాత ఈ దేశ శిష్టపాలకులు వ్యవసాయరంగంలో ఎదుగూ బొదుగూ లేకపోవడానికి కారణంగా పరిణమించిన వలస పాలనా కాలంలో అరికట్టబడిన ఉత్పత్తి శక్తులను విడుదల చేయాలనుకున్నారు. ఇందుకోసం వివిధ భూసంస్కరణలను చేబట్టారు. వాటిలో ప్రధానమైనది 1. సాగుభూమి నుండి దళారీలను రద్దు చేయడం 2. కౌలుదార్ల రక్షణ 3. భూకమతాలపై సీలింగ్ పరిమితి 4. మిగులు భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేయడం. అయితే మాజీ దళారీలకు పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించారు. స్వంత సాగుకోసం పెద్ద మొత్తంలో భూమిని కలిగి ఉండే అవకాశాన్ని కూడా వారికి కల్పించారు. ఏది ఏమైనప్పటికీ భూస్వామ్య, అర్ధ భూస్వామ్య భూస్వాములను తొలగించి వారి స్థానంలో శక్తి యుక్తులు గల రైతాంగానికి అవకాశాన్ని కల్పిస్తూ నిలువ నీరుగా ఉన్న వ్యవసాయాన్ని, పునర్నిర్మాణం చేయడంలో దళారుల రద్దు ఒక అఖండమైన విజయంగా భావించవచ్చు. భూస్వామ్య ప్రభువులు, పెట్టుబడిదారీ భూస్వాములుగా పరిణామం చెందారు. తమకు ప్రభుత్వం చెల్లించిన నష్ట పరిహారాన్ని ఉపయోగించుకొని మాజీ దళారులు వ్యాపారం, పరిశ్రమలు, ఆధునిక సేద్యం తదితర రంగాలలోకి ప్రవేశించడం ఆసక్తికరమైన అంశం. కౌలుదార్ల రక్షణ చట్టాలు, భూమి పరాయికరణపై పరిమితులు విధించడానికి, యాజమాన్యపు హక్కులు కౌలుదార్లకు బదిలీచేయడం, కౌలు దోపిడీని అరికట్టడం వంటి అంశాల అమలు కోసం చేయబడ్డాయి. అయితే భూమిపై హక్కుకు సంబంధించిన రికార్డులు లేని కారణంగా ఈ చట్టాల అమలు సక్రమంగా సాగలేదు. మిగులు భూమిని పంపిణీ చేయడం కోసం భూ యజమాన్యంపై పరిమితులు విధించారు. కాని రాజకీయ చిత్త శుద్ధి లేకపోవడం, చట్టం అమలులో జాప్యం జరగడం ఫలితంగా బినామీ పద్ధతులలో భూయాజమాన్యంలో మార్పులు జరిగి సీలింగు చట్టాల బారి నుండి తప్పించుకోవడానికి భూ కామందులకు బంగారం లాంటి అవకాశం దొరికింది. మొత్తం మీద చూస్తే కౌలు సంస్కరణలు, సీలింగు భూముల పునఃపంపిణీ ఆచరణలో సాధించిందేమీ లేదు. గ్రామీణ సమాజాన్ని పునర్నిర్మాణం చేయడానికి ఉద్దేశించబడిన ఏ పథకంలోనైనా భూమి సమస్య ప్రధానమైందయినప్పటికీ ఆచరణలో అది వెనక్కు నెట్టివేయబడింది. భారత పాలక వర్గం వ్యవసాయరంగంలో వ్యవస్థాగత మార్పులను పక్కన బెట్టి హరిత విప్లవ వ్యూహం ద్వారా సాంకేతిక మార్పు తీసుకరావడానికి ప్రయత్నించారు. ఇది ఒక ప్యాకేజీ పథకం. అధిక దిగుబడి వంగడాలు, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, తగినంత నీటి వనరుల్ని అందించడం వంటి పరస్పరాధారిత అంశాలు దీనిలో ఉన్నాయి.

భూస్వామ్య వ్యవస్థను యథాతథంగా ఉంచి సాంకేతిక పరమైన పరిణామాన్ని ప్రారంభించిన ఫలితంగా భూస్వాముల, ధనిక రైతుల ఆర్థిక పునాది బలపడింది. వారికి అధిక మొత్తంలో మిగులును ఉత్పత్తి చేయడానికి, నీటి పారుదల, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ పరికరాల తయారీ వంటి రంగాలలో పెట్టుబడులకవసరమైన రుణాన్ని సంపాదించడానికి అవసరమైన రాజకీయ, ఆర్థికబలం వాళ్ళకు ఉండడమే ఇందుకు కారణం. హరిత విప్లవ ఫలాలు ప్రధానంగా దేశంలో నీటి పారుదల సౌకర్యాలున్న ప్రాంతాల్లోని ధనిక, సంపన్న రైతులు, భూస్వాముల జేబుల్లోకి వెళ్ళి పోయాయని వేరే చెప్పాల్సిన పని లేదు. ఇందుకు భిన్నంగా చిన్న రైతులపట్ల, ప్రత్యేకించి కౌలుదార్ల పట్ల

సంస్థాగతమైన వ్యతిరేకత ఉంది.

ఉత్పత్తి మార్కెట్లో తప్పని సరియైన వ్యాపారీకరణ:

భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న వ్యాపారీకరణ, ద్రవ్యీకరణ - ప్రతి ఉత్పత్తి దారుణ్ణి వినియోగపు పంటల మార్కెట్ కబంధ హస్తాలలోకి బలవంతాన నెట్టివేశాయి. అయితే మధ్య, పేద రైతులు, భూమిలేని కౌలుదార్లు మార్కెట్లో భాగస్వాములు కావడంలో ఒక వైచిత్రి ఉంది. వాళ్ళకు తమ రోజువారీ ఖర్చుల కోసం డబ్బుకావాలి. అందుకోసం వాళ్ళు తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని కళ్ళాల మీదనే అమ్మేస్తారు. వినియోగపు పంటల మార్కెట్లో ప్రతి సామాజిక బృందానికి ఒక పాత్ర ఉంటుంది. అయితే ఏ బృందం ఎలాంటి పాత్ర వహిస్తుందనేది వాళ్ళ రోజువారీ అవసరాలకు సంబంధించిన కాలం నిర్ణయిస్తుంది. పేద రైతులు నూర్పిడి అయిపోయిన తక్షణం మార్కెట్లో ఉత్పత్తిని అమ్ముకునే వాళ్ళుగా ఉంటారు. ధనిక రైతులు, భూస్వాములు ఆహార ధాన్యాల కొనుగోలుదారులుగా మార్కెట్లో ప్రవేశిస్తారు. ఈ విధంగా పేద రైతులు, భూమిలేని కౌలుదార్లు తమ పంటని కళ్ళాల్లో చౌకధరకు అమ్ముకుంటారు. దీనినే తెగనమ్ముకోవడం అంటాం. తరువాత వాళ్ళే తమ ఆహార అవసరాల కోసం అదే ధాన్యాన్ని తాము మొదట మార్కెట్లో అమ్మిన ధర కంటే రెట్టింపు ధరకు కొనుక్కోవలసి వస్తుంది.

ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ - రైతాంగం:

1990 ల నుండి భారత ప్రభుత్వం 'సంస్కరణ', 'పునర్వ్యవస్థీకరణ', 'ఉదారవాదం', 'నూతన ఆర్థిక విధానం' వంటి పేర్లతో నయా ఉదారవాద ఆర్థిక విధానాలను అవలంబిస్తోంది. వివిధ సామాజిక బృందాల వస్తుగత, సామాజిక జీవనంపై ఈ విధానాల ప్రభావం అత్యంత కీలకమైంది. ఇది ప్రాథమికంగా బయటి శక్తుల దృష్టి కోణం నుండి రూపొందించబడ్డది. వీటికి చోదకశక్తి మార్కెట్. ఎగుమతుల కోసం వృద్ధి దీని వ్యూహం. వీటిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. వ్యవసాయక అవసరమైన వనరులపై సబ్సిడీలను తగ్గించడం, వినియోగపు వస్తువుల మార్కెట్లపై ప్రభుత్వ కంట్రోలును రద్దు చేయడం, వ్యవసాయోత్పత్తుల అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించి ఉదారవాద సూత్రాలను అవలంబించడం, ప్రభుత్వ ధాన్య సేకరణ కార్యక్రమాన్ని తగ్గించడం, భారత ఆహార సంస్థ పాత్రను కుదించడం, ప్రజా పంపిణీ వ్యవస్థను అటకెక్కించడం వంటి ప్రపంచ బ్యాంక్ నిర్దేశిత విధానాలను పాలకులు అమలు పరుస్తున్నారు. భారత వ్యవసాయాన్ని ప్రపంచ మార్కెట్ తో అనుసంధించాలని, వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలని కోరుతూ గట్టి లాబీయింగ్ జరుగుతోంది.

వ్యవసాయోత్పత్తుల అంతర్జాతీయ వాణిజ్యంలో అనుసరిస్తున్న ఉదారవాద విధానాల కారణంగా దేశంలో వ్యవసాయోత్పత్తుల ధరలు పెరిగి పేద రైతుల, వ్యవసాయ కార్మికులపై అప్పుడే దుష్ప్రభావాన్ని వేస్తున్నాయి. వాళ్ళు రెండు రకాలుగా నష్టపోతున్నారు. మొదట, స్వేచ్ఛా మార్కెట్లో ఆహార ధాన్యాలను ఎక్కువ ధరలకు కొనవలసిన వినియోగదారులుగా, రెండు, ధరలు తక్కువగా ఉన్నప్పుడు కళ్ళాల మీద తమ ఉత్పత్తులను అతి చౌకగా అమ్ముకోవలసిన అమ్మకం దార్లుగానూ నష్టపోతున్నారు. వ్యవసాయోత్పత్తుల స్వేచ్ఛాయుత ఎగుమతి వ్యవసాయ రంగంలో ప్రపంచీకరణ సూత్రం. దీని కారణంగా తక్కువ లాభాలు వచ్చే ఆహార ధాన్యాల పంటల నుండి అధిక లాభాలు సంపాదించే వాణిజ్య పంటల వైపు దృష్టి మళ్ళింది. దీని కారణంగా జనాభాలో పేద, నిరుపేద ప్రజలకు ఆహార ధాన్యాలు దొరికే అవకాశమే మృగ్యమైంది. ఈ విధంగా ఎక్కువ విలువ గలిగిన వాణిజ్య పంటలు, తోటలు, కోళ్ళఫారాలు, చేపలు, రొయ్యల చెరువులు వంటి విదేశీయుల, శిష్టవర్గాల కోర్కెలు తీర్చడం కోసం ఆ రంగాలకు ప్రాధాన్యత లభించడంతో ఆహార ధాన్యాలకు తీవ్రమైన కొరత ఏర్పడడమే కాక, సాధారణ రైతుల బతుకు నడివీథిలోకి చేరింది. లీజ్ మార్కెట్‌ను స్వేచ్ఛా వ్యాపారంగా చేసే ప్రతిపాదన కూడా ఉంది. గ్లోబల్ గ్రీన్, మోన్‌శాంటో, కోకాకోలా, మహికో వంటి బహుళ జాతి కార్పోరేషన్లు, రిలయన్స్, భారతి, పెప్సికో, ఐ.టి.సి., తాతా, మహీంద్రా, డి.సి.యం., కార్గిల్ తదితర కార్పోరేట్ సంస్థలు వ్యవసాయ ఆధారిత వ్యాపారరంగంలోకి ప్రవేశించిన తరుణంలో, పేద సన్నకారు రైతులతో కూడిన 2/3 వ వంతు రైతాంగాన్ని కాపాడడం సాధ్యం కాదు. బహుళ జాతి సంస్థలతో కలిపి ధనిక రైతులు, భూస్వాములు వాళ్ళనుండి భూములు లీజుకు తీసుకొని అంతిమంగా వాళ్ళ భూముల్ని తాము హక్కు భుక్తం చేసుకొని ఈ సన్నకారు, చిన్న రైతాంగాన్ని రైతు కూలీలుగా మారుస్తారు. ఈ రకంగా భూసంస్కరణల కోసం రైతాంగం చేబట్టిన దీర్ఘకాలిక పోరాటాలు నిష్ఫలమయ్యే పరిస్థితి ఏర్పడింది.

వలస పూర్వ కాలంలో వ్యవసాయాభివృద్ధిలో తరుగుదల ఏర్పడింది. ఆర్థిక ఉదారవాద సంస్కరణల తరువాత ఈ తరుగుదల కొట్టవచ్చినట్లుగా కనబడుతుంది. స్థూలదేశీయ ఉత్పత్తిలో వ్యవసాయోత్పత్తి 1980లో 39 శాతం ఉండగా 2010 నాటికి అది 15 శాతానికి పడిపోయింది. అదే సమయంలో వ్యవసాయ పనులమీద ఆధారపడ్డ కార్మికుల సంఖ్య 68 శాతం నుండి 55 శాతానికి పడిపోయింది. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు సన్నగిల్లడంతో వ్యవసాయం మీద ఆధారపడాల్సిన వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. వ్యవసాయం మీద ఆధారపడ్డ రైతుల కొచ్చే ఆదాయం వారి వినియోగపు ఖర్చులకు చాలక వాళ్ళు అప్పులకోసం వడ్డీవ్యాపారస్తుల మీద, షావుకార్ల మీద ఆధారపడాల్సి వచ్చింది. నరసింహం కమిటీ నివేదికలోని సిఫార్సుల తరువాత గ్రామీణ రంగానికి అందుతున్న వ్యవస్థాగత రుణం క్రమంగా తగ్గిపోతోంది. ద్రవ్యలోటును తగ్గించు కోవడానికి ప్రభుత్వం ఎరువులు, విద్యుత్, సాగునీరు తదితర అంశాలపై సబ్సిడీలను తగ్గిస్తూ వచ్చింది. దీని ఫలితంగా ఉత్పత్తి, ఆదాయాలు పడిపోయాయి. ఈ కారణాలన్నిటి మూలంగా రైతాంగం దుర్భర

దారిద్ర్యంలోకి నెట్టివేయబడి దిక్కు తోచని పరిస్థితులలో ఆత్మహత్యలు చేసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయం వ్యాపారంగా మారి రైతులు వాణిజ్య పంటలనే పండిస్తున్న సంపన్న ప్రాంతాలైన పంజాబ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో కూడా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. హరిత విప్లవం అమలైన ప్రాంతాలలో రైతుల ఆత్మహత్యలు ఆ వ్యూహం ఎలాంటి సంక్షోభంలోకి దారితీసిందో తెలియ జెప్పుతున్నాయి. కాని భారత ప్రభుత్వం మాత్రం ఇప్పుడు తూర్పు భారతదేశంలో రెండవ హరిత విప్లవాన్ని ఎలాగైనా అమలు పరచాలని ఆరాటపడుతోంది. పశ్చిమ భారతదేశంలో హరిత విప్లవం ఎంతవైఫల్యం చెందిందో దాని ఫలితాలనుండి మనకు తెలుస్తూనే ఉంది. అది అధిక దిగుబడి విత్తనాలు, క్రిమిసంహారక మందులు, పురుగు మందులు, వ్యవసాయరంగానికి సంబంధించిన యంత్రాల మార్కెట్‌లోకి సామ్రాజ్యవాదుల ప్రవేశానికి ద్వారాలు తెరవడానికి మాత్రమే ఉపయోగపడింది. ఇంతేగాక విదేశాలనుంచి పెట్టుబడిని, సాంకేతిక నైపుణ్యాన్ని దిగుమతి చేసుకోవడం కూడా ప్రారంభమైంది. ఈ విధంగా, భారత వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాద జోక్యం ఈ దేశాన్ని వారు దోచుకోవడానికి అన్ని అవకాశాలను కల్పించింది. వీటినే తూర్పు భారతదేశంలో వాళ్ళు పునరావృతం చేయబోతున్నారు. దీని ఫలితంగా సామ్రాజ్య వాదులు, ధనిక రైతాంగం, భూస్వాములు, వ్యాపారస్తులకు విస్తృతమైన మార్కెట్‌లు ఏర్పడతాయి. పెట్టుబడిని, వినిమయ వస్తువులను, సేవా సౌకర్యాలను మన దేశానికి ఎగుమతి చేయడం ద్వారా సామ్రాజ్యవాద దేశాలు దీనిని వలసదేశం నుండి అర్ధవలస దేశంగా మార్చి వేశాయి. సామాజిక మద్దతు అవసరం కాబట్టి సామ్రాజ్యవాదం, స్థానిక భూస్వాములతో, వడ్డీ వ్యాపారస్తులతో, వ్యాపారులతో స్నేహం చేసింది. వారి క్రియా శీలక మద్దతుతో సామ్రాజ్యవాదం పెట్టుబడి పూర్వదోపిడి రూపాన్ని కాపాడి కొనసాగిస్తున్నది. భారతదేశంలో దోపిడీని కొనసాగించడంలోనూ, అర్థభూస్వామ్య అర్థవలస స్థితిని కాపాడడంలోనూ భూస్వామ్యం సామ్రాజ్యవాదానికి మంచి మిత్రుడిగా ఉంది. పెట్టుబడిని ఎగుమతి చేయడం ద్వారా సామ్రాజ్యవాదం భూస్వామ్య దోపిడీ రూపంపై పెట్టుబడిదారీ దోపిడీ రూపాన్ని ప్రతిక్షేపించింది. దీని ఫలితంగా అధికార మార్పిడి తదనంతరం భారతదేశం అర్ధవలస అర్ధభూ స్వామ్య దేశంగా మారింది. ఈ విధంగా పరస్పర వ్యతిరేకమైన రెండు ఉత్పత్తి విధానాలు భూస్వామ్య విధానం, పెట్టుబడిదారీ విధానం సహజీవనం చేస్తున్నాయి. చిన్న తరహా ఉత్పత్తి దారులను మార్కెట్ నుండి తొలగించి, దాన్ని పెద్దతరహా ఉత్పత్తిదారులు చేజిక్కించుకుంటారనే పెట్టుబడిదారీ అభివృద్ధి సూత్రం ప్రకారం చూస్తే పరస్పర వ్యతిరేకమైన ఉత్పత్తి విధానాలు ఒకే దేశంలో ఇమడవు. అయితే వలసవాదమనే చారిత్రక పరిస్థితుల కారణంగా సామ్రాజ్యవాదం భారత ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిని ప్రతిక్షేపించింది. ఆ విధంగా రెండు శక్తులూ ఇక్కడ సహజీవనం చేస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో మౌలిక రాజకీయ పరిణామాన్ని సాధించాలంటే కార్మికులతో దోపిడీకి గురవుతున్న విశాల ప్రజానీకంతో స్నేహాన్ని పెంపొందించుకొని అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలోని సామ్రాజ్యవాదాన్ని, భారతదేశంలో వారికి విశ్వాసపాత్రుడైన స్నేహితుడిగా ఉన్న భూస్వామ్యాన్ని ఓడించడం రైతాంగం ప్రధాన కర్తవ్యం. సామ్రాజ్యవాదానికి సామాజిక పునాదిగా ఉన్న భూస్వామ్యాన్ని రద్దు చేయడం కోసం పోరాడడమే సామ్రాజ్య వాదంపై పోరాడడానికి మంచి మార్గం. భూస్వామ్య, వలస, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు మాత్రమే సమాజాన్ని మౌలికంగా, గుణాత్మకంగా పునర్నిర్మాణం చేయగలవు.

(24వ పేజీ తరువాయి....)

ఆర్‌ఎస్‌రావు చెప్పారు. అసలైన అభివృద్ధి జనతనసర్కార్లలో ఉంది. అది భారత ప్రభుత్వాన్ని భయపెడుతోంది.

తర్వాత అర్ధవలస అర్ధభూస్వామ్యం- రాజ్యం -ఆర్‌ఎస్‌రావు అంశంపై కా. గంటి ప్రసాదం మాట్లాడారు. వినీల్ కృష్ణ కిడ్నాప్ సందర్భంలోనే ఆర్‌ఎస్‌రావు తనకు పరిచయమయ్యారని,జైలు నుండి వచ్చాక ఆయనను కలుస్తానని చెప్పానని కాని కలవలేక పోయానన్నారు. రాజ్యం అనే విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో కా. గంటి ప్రసాదం తన ఉపన్యాసంలో వివరించారు. రాజ్యం అనే విషయాన్ని ఆకళింపు చేసుకోడం సంక్లిష్టంగా ఉంటుందని లెనిన్ అంటాడు. ఒక పరిణామ క్రమంలో రాజ్యం ఆవిర్భవించడాన్ని అర్థం చేసుకుంటేగాని దాని స్వభావం అర్థం కాదు. మనం చాలా అలవోకగా బూర్జువా రాజ్యం అంటుంటాం. కాని దానికున్న స్వభావం అర్ధవలస, అర్ధభూస్వామ్యం. వర్గపాలనను స్థిరం చేయడానికే రాజ్యం ఉంటుంది. దోపిడిని నిలబెట్టడమే దాని లక్ష్యం. రాజ్యం పాలకవర్గ వైరుధ్యాలను సెటిల్ చేస్తుంది. ప్రజలు-పాలకుల మధ్య వైరుధ్యంలో అది ప్రజల మీద అణచివేతే ప్రయోగిస్తుంది. బైటికి ఎంత నాగరికంగా కనపడుతుందో దాని అంతర్గతం అంత క్రూరంగా ఉంటుంది. అవసరమైన సందర్భాల్లోనే అది బహిర్గతమవుతుంది. ఆయా సమాజాల్లో ఉండే వర్గసంఘర్షణను అర్థం చేసుకుంటే తప్ప రాజ్యం అర్థం కాదు.

ఇదే అంశంపై చివరగా కా. వివి మాట్లాడుతూ ఇది అర్ధవలస, అర్ధభూస్వామ్య దళారీ వ్యవస్థ కూడా అన్నారు. దళారీ దర్గానికి ఏ వ్యవస్థలోనూ పునాది ఉండదు అన్నారు. మార్క్స్ వర్గం గురించి ఏం చెప్పాడో కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక నుండి ఆయన కోట్ చేశారు. ఇటీవలి కాలంలో ఉత్పత్తి విధానం మారింది అని మేధావులు తేలిగ్గా మాట్లాడడం వెనక కాపిటలిజం వస్తే సాయుధపోరాటం అవసరం లేదని చెప్పదలచుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య, దళారీ నిరంకుశ పాలన అనే నిర్వచనం ఇవాళ తప్పని చెప్పేవాళ్ళ ఉద్దేశం ఇదే కావొచ్చు అన్నారు. వర్గేతర సామాజిక సంబంధాలు తననొక వర్గంగా చూసుకోడానికి ఏవిధంగా ఉపయోగపడతాయి అనేదే ఇవాళ ముఖ్యమని అన్నారు.

వ్యాసం

(ఆర్.ఎస్.రావు సిద్ధాంత కృషిపై సదస్సులో భాగంగా సమర్పించిన పత్రం)

అర్ధ భూస్వామ్య, అర్ధ వలస చట్రాన్ని అర్థం చేసుకోవడానికి ఒక చిన్న ప్రయత్నం

- పంకజ్ దత్

తెలుగు సేత : కార్తి

(ప్రొ. ఆర్.ఎస్.రావు తన రచనలతో రేకెత్తించిన నూతన ఆలోచనలు, అనేక చర్చల సందర్భంగానూ, ఉపన్యాసాలలోనూ గత 40 సంవత్సరాలుగా ఈ అంశంపై ఆయన లేవనెత్తిన విస్తారమైన విషయ పరిధికి ప్రేరణ. అయితే ఈ అంశం పై ప్రొ. రావు అవగాహనను తప్పుగా వ్యాఖ్యానించినా, పొరపాటుగా వ్యక్తీకరించినా అందుకు పూర్తి బాధ్యత ఈ రచయితదే)

అవగాహన "ఈ రచయిత అర్ధ భూస్వామ్య, అర్ధ వలస వాదానికే ఇంకా కట్టుబడి ఉన్నాడు. సామ్రాజ్యవాదం నేటి ప్రపంచంలో ఒక ఆధిపత్య రూపంగా ఉంటున్న నేపథ్యంలో పెట్టుబడి పూర్వ ఆర్థిక, సాంఘిక నిర్మాణాల బహుళ దొంతరలతో కూడిన భారత రాజ్యం, సామ్రాజ్యవాదానికీ, పెట్టుబడి పూర్వ రూపాలకీ మధ్య ఉన్న మైత్రి, ఒడంబడిక కారణంగా జాతీయ బూర్జువా వర్గం రూపొందకుండా నిరోధించే అవరోధంగా కలిగి ఉంది. ఆ అవరోధాలు ఆర్థిక పరమైనవీ, ఆర్థికేతరమైనవీ కూడా. గతితార్కికం మాట్లాడితే సామ్రాజ్యవాదం మరింతగా చొచ్చుకు వస్తున్న కొద్దీ మార్పు చెందిన పెట్టుబడిదారీ పూర్వ నిర్మాణాలు కూడా పెరుగుతూంటాయి. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడి పూర్వ నిర్మాణాలకూ మధ్య వైరుధ్యంలో పోరాటం కంటే ఐక్యతే ఎక్కువ. రాజ్య నాయకత్వంలో ఈ వైరుధ్య చలనం ఇంకా కొనసాగుతున్నది." (ఆర్.ఎస్.రావు : ఉత్పత్తి విధానం పై చర్చ: ఒక పరిశీలన. అక్టోబరు, 2007)

ఎ.పెట్టుబడిదారీ వ్యవస్థ:

సాంప్రదాయక పెట్టుబడిదారీ వృద్ధి సరళంగా నిర్వచించ బడిన భూభాగంలో నానాటికి పెరుగుతూన్న డిమాండ్‌కు అనుగుణంగా మరింత మరింతగా సరుకుల ఉత్పత్తి అవసరాన్ని కోరుకున్నది. ఈ డిమాండ్ పెరగడమంటే వాణిజ్యంలో పెరుగుదల, సరుకుల పంపిణీకి అవసరమైన నెట్‌వర్క్ సౌకర్యాల పెరుగుదల అని కూడా అర్థం. డబ్బు, జాగా, విస్తారమైన ఉత్పత్తి కోసం ఫ్యాక్టరీల నిర్మాణం, ముడి సరుకులు, సాధన సంపత్తి ఇవన్నీ పెద్ద స్థాయిలో ఉత్పత్తిని సాధించడానికి అవసరం. పెరుగుతూ ఉన్న డిమాండ్‌ను తట్టుకోవడానికి, తగినంత పెట్టుబడి అవసరం, డిమాండ్ కూడా అంతగానే పెరిగాయి. అయితే స్వేచ్ఛాయుతంగా తమ శ్రమను అమ్ముకొనే శ్రామికులు దొరకడం అన్నింటికన్నా ముఖ్యమైన అంశం.

సాంప్రదాయక భూస్వామ్య నిర్మాణాలు, సాంఘిక ఆచరణకు సంబంధించిన ఆర్థికేతర రూపాలు, నూతనంగా తలెత్తుతున్న ఈ కొత్త అవకాశాలకు ఒక తీవ్ర అవరోధంగా మారాయి. ఈ అడ్డంకిని అధిగమించడానికి విప్లవకర చర్యలు అవసరం. భూమికి కట్టివేయబడిన రైతాంగాన్ని బానిసత్వం నుండి విముక్తి చేస్తే తప్ప పారిశ్రామికవేత్తలు తమ కిష్టమైన రీతిలో వారినుపయోగించుకొని మరిన్ని సరుకులను ఉత్పత్తి చేయడం సాధ్యం కాదు. ఈ కొత్త ఆలోచనకు సంబంధించిన భావజాలం, బూర్జువా ప్రజాస్వామిక విప్లవంగా వ్యక్తీకరించబడింది. ఆ కారణంగా రాజకీయ, దాన్ని వెన్నంటి ఉండే సాంస్కృతిక రంగాలలో కొత్త సమీకరణాలు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా పాత భూస్వామ్య వ్యవస్థ, అది రూపొందించుకున్న సంస్థలు మార్చబడ్డాయి. ఖచ్చితమైన భౌగోళిక సరిహద్దులు కలిగిన జాతి రాజ్యాలు దాని స్థానంలో ఏర్పడ్డాయి. ఒక నూతన పెట్టుబడిదారీ సమాజం రూపొందింది.

బూర్జువా వర్గం శ్రామిక వర్గం సహాయంతో డిమాండ్‌కు అనుగుణంగా వస్తూత్పత్తి చేయడమే గాకుండా నూతన సరుకులను కనుగొని తయారు చేసి, నూతన అవసరాలను కూడా సృష్టించింది. మార్కెట్‌లోకి బహుళ రకాలయిన సరుకులు, సేవలు విజృంభించాయి. నూతన, మేలైన ఉత్పత్తి సాధనాలు, నూతన టెక్నిక్‌లు, వికేంద్రీకరణ, యాంత్రీకరణ, ప్రత్యేకీకరణ, సమర్థవంతమైన ఉత్పత్తి విధానాలకు-యంత్రాలకు సంబంధించిన నూతన శాస్త్రీయ జ్ఞానం, అభివృద్ధి చెందిన యంత్రాలు, పెచ్చు పెరిగిన యాంత్రీకరణ కాలం గడుస్తున్న కొలదీ ఇవన్నీ జరగడంతో పాటు మార్కెట్ విస్తరణ జరిగింది. బూర్జువా నాయకత్వంలో ఒక నూతన శాస్త్రీయ వ్యవస్థ తల ఎత్తింది.

ఈ మొత్తం క్రమాన్ని అభివృద్ధిలో భాగంగా అర్థం చేసుకోవడానికి చర్చించాల్సిన అంశాలు: ఒక నూతన ఉత్పత్తి విధానం రూపొందడం, అది తనని తాను న్యాయ సమ్మతం చేసుకుంటూ తన ఉనికిని శాశ్వతం చేసుకుంటూ తన తరపున తాను ప్రచారం చేసుకుంటూ, తన స్వంత ఉపరితలాన్ని సృష్టించుకోవడం (ఇదే క్లుప్తంగా బూర్జువా రాజ్యం). అదే సమయంలో పద్ధతి ప్రకారం పాత భూస్వామ్య ఉత్పత్తి విధానాన్ని నాశనం చేయడం. ఉత్పత్తి శక్తులు ఎదగవలసిన అవసరం ఫలితంగా పాత భూస్వామ్య ఆస్తి సంబంధాలు బద్దలై, వాటి స్థానంలో ఒక నూతన పెట్టుబడి - శ్రమ, ఆస్తి ఉత్పత్తి సంబంధాలు ఏర్పడ్డాయి. భూమికి కట్టి వేయబడిన శ్రమను విముక్తి చేసి స్వేచ్ఛాయుత శ్రమ మార్కెట్‌ను రూపొందించడం ఇందులో ప్రధాన అంశం. సామాజీకరించబడిన ఉత్పత్తి ద్వారా భారీ స్థాయిలో ఉత్పత్తిని పెంచడానికి ఇదొక్కటే మార్గం. ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యం కొనసాగుతూనే, సామాజిక ఉత్పత్తి నుండి అదనపు విలువను సృష్టించి, దాన్ని స్వంతం చేసుకోవడానికి ఇదొక్కటే మార్గం. పెట్టుబడి నుండి పెట్టుబడిని సృష్టించడానికి, మరింత మరింతగా పెట్టుబడిని పోగేసుకోవడానికి నూతన బూర్జువా వర్గానికి ఇదొక్కటే మార్గం. ఆర్థికేతర అంశంగా ఉంటూ కొన్ని సాంఘిక సంబంధాల చిహ్నాంగా కొనసాగుతూ వచ్చిన భూమి ఇప్పుడు ఉత్పత్తి కారకంగా, నూతనంగా తలెత్తుతున్న ఉత్పత్తి శక్తుల ఆర్థిక పార్శ్వంగా మారింది. ద్రవ్యీకరణ, వేతన శ్రమ, సరుకుల ఉత్పత్తి, అవసరాల పెరుగుదల, శ్రమ చలనం,

నూతన బ్యాంకింగ్, ద్రవ్య పద్ధతులు, సంస్థలు, పెట్టుబడి, అమ్మకం, కొనుగోలు, మారకపు విలువ ప్రధానాంశంగా మారడం ఇవన్నీ నూతన పెట్టుబడి-శ్రమ సంబంధాలను సూచించే ప్రతిఫలనాలు, సూత్రీకరణలు. ఇవన్నీ నూతనంగా వ్యవస్థీకృతమైన బూర్జువా వర్గపు సాంఘిక, సాంస్కృతిక రాజకీయ వ్యక్తీకరణలతో కలసి, నానాటికీ వ్యాప్తి చెందుతూ ఉన్న పెట్టుబడి శ్రమ సంబంధాన్ని శాశ్వతం చేయడానికి అనుకూల పరిస్థితుల్ని సృష్టించాయి. ఈ మొత్తం క్రమం అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుక-అభివృద్ధి.

పెట్టుబడిదారీ విధానం అంటే- అమలులో ఉన్న భూస్వామ్య ఆస్తి సంబంధాలను ధ్వంసం చేసి, శ్రమను విముక్తం చేసి మార్కెట్‌ను వ్యాప్తి చేస్తూ, పెట్టుబడి-శ్రమ సంబంధాలను హేతుబద్ధంగా, క్రమం తప్పకుండా సృష్టిస్తూ కొనసాగించడం అని అర్థం. పెట్టుబడిదారీ వర్గం పెరుగుతున్న కొద్దీ, పోటీ కూడా పెరిగి ఫలితంగా మార్కెట్ వ్యాపించి పాత భూస్వామ్య సంబంధాలను అవిశ్రాంతంగా ధ్వంసం చేయడం జరుగుతుంది. అయితే ఈ తీవ్రమైన పరిణామం తాను జాతి రాజ్యంగా(రక్షించుకోదగిన స్వంత మార్కెట్) సృష్టించుకున్న పరిమిత, రక్షిత భౌగోళిక ప్రాంత పరిధిలోనే పెరగడం కారణంగా పెట్టుబడిదారీ బృందాల మధ్యనే పోటీ తీవ్రమౌతుంది. కాని అంతులేని తన లాభ దాహాన్ని సంతృప్తి పరచుకొనే ఈ క్రమంలో భూస్వామ్య సంబంధాలను ధ్వంసం చేయడానికి కొద్ది అవకాశాలు మాత్రమే మిగిలాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, పారిశ్రామిక పెట్టుబడి, లేక వాణిజ్య పెట్టుబడి, లేక ద్రవ్య పెట్టుబడి ఈ మూడు రూపాలు సంక్లిష్టమయ్యాయి. అయితే తీవ్ర పోటీ, జాతి రాజ్యాల సరిహద్దుల చేత భౌతికంగా పరిమితం చేయబడిన మార్కెట్, భూస్వామ్య సామాజిక పరిస్థితులను ధ్వంసం చేసి వాటిని మార్చడానికి తగిన అవకాశాలు సన్నగిల్లడం వంటి అంశాల కారణంగా గుత్తాధిపత్య క్రమం ప్రారంభమైంది. మార్కెట్ సంకుచితమై, లాభాలు తగ్గిపోవడం ప్రారంభమయ్యాక తన ఎదుగుదలను కాపాడుకోవడానికి గుత్తాధిపత్యాన్ని సంపాదించడం పెట్టుబడికి తప్పనిసరి అయింది. గుత్త పెట్టుబడి దశ ప్రారంభమైంది.

బి.సామ్రాజ్యవాదం:

గుత్త పెట్టుబడి దశ అంటే ఉత్పత్తి శక్తుల అత్యున్నత అభివృద్ధి అనే అర్థం. మిగులును ఉత్పత్తి చేసే సాధనంగా యంత్ర శ్రమ భౌతిక శ్రమ కంటే ప్రాధాన్యతను సంతరించుకొంటుంది. అయితే దేశీయ మార్కెట్ కుంచించుకుపోయిన కారణంగా లాభాలు తగ్గిపోతూ దాని ఉనికే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి తల ఎత్తుతుంది. పారిశ్రామిక పెట్టుబడిగా, వాణిజ్య పెట్టుబడిగా, ద్రవ్య పెట్టుబడిగా నిజానికి ఈ మూడింట మిశ్రమంగా దాని గుత్తాధిపత్య లక్షణాలు. అది మిగులును సృష్టించుకోవడానికి, చేజిక్కించుకోవడానికి, నూతన మార్కెట్లను కనుగొనాల్సిన తప్పనిసరి పరిస్థితులను సృష్టిస్తాయి. పెట్టుబడి పూర్వ విధానాలు కలిగిన నూతన మార్కెట్లు పెట్టుబడి నిలదొక్కుకోవడానికి, బలపడడానికి కావాల్సిన అన్ని అవకాశాలను అందిస్తాయి. చవక శ్రమ, సరుకులను అమ్ముకోగలగడం, అసాంఘిక నిర్మాణంలోనే వ్యాపారం, ముడి సరుకుల వెలికితీత, ద్రవ్య స్పెక్యులేషన్, పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఇవన్నీ ఉంటాయి.

"నిరపేక్ష అదనపు విలువ సృష్టిని వెన్నంటే సాపేక్షిక అదనపు విలువ సృష్టి ఉంటుంది. శ్రమ, పెట్టుబడికి లాంఛనంగా లోబడి ఉన్నప్పుడు మాత్రమే నిరపేక్ష అదనపు విలువ సాధ్యం కాగా, సాపేక్షిక అదనపు విలువ-శ్రమ పెట్టుబడికి వాస్తవంగా పూర్తిగా లోబడినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. చారిత్రకంగా చూస్తే పెట్టుబడి నిరపేక్ష అదనపు విలువతో ప్రారంభమవుతుంది. దాని ఉత్పత్తి ప్రారంభ దశలో అది కేవలం సహకారంగానే ఉంటుంది. ఆ స్థితిలో అసంఖ్యాకంగా ఉండే శ్రామికులు ఒక పెట్టుబడిదారుడి కింద ఉంటూ ఒకే సమయంలో ఒకే ప్రాంతంలో కలసికట్టుగా పని చేస్తూ ఒకే సరుకును తయారు చేస్తుంటారు. ఈ ఉత్పత్తి విధానానికి అంతకు క్రితం ఉత్పత్తి విధానానికి ఉండే ఒకే ఒక వ్యత్యాసం ఏమిటంటే శ్రమ క్రమం సాంఘిక క్రమంగా పరిణామం చెందడం. ఈ రకమైన ఉత్పత్తి సామాజికీకరణ శ్రమను, వేతన శ్రమను అనుసంధానించి ఫలితంగా దేశీయ మార్కెట్‌ను, ఆ పిమ్మట సంపూర్ణ సంబంధాలను సృష్టిస్తుంది. ఇది పెట్టుబడిదారీ విధానంలో ఒక చారిత్రక దశ. ఈ దశలో అది మునుపటి ఉత్పత్తి విధానాలను రద్దు చేస్తుంది కాబట్టి ఆ మేరకు దాని స్వభావం అభ్యుదయకరమైనది. ఒకసారి పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి సామాజికీకరణను పూర్తి చేశాక, సాపేక్షిక, నిరపేక్ష అదనపు విలువను గుంజుకోవడం ప్రారంభమౌతుంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధునిక పారిశ్రామిక దశలోకి చేరుకొన్న కాలం. శాస్త్ర పరిజ్ఞానాన్ని పెద్ద ఎత్తున అన్వయించడం, ఫలితంగా యంత్రాలు యంత్రాలను అధికంగా ఉత్పత్తి చేయడం, పెట్టుబడి సజీవంగా ఉండడం వంటివన్నీ దాని లక్షణాలు. ఈ విధంగా పెట్టుబడి తన మొదటి దశలో తన స్వంత ప్రాంతంలో శ్రమ క్రమాన్ని, ఉత్పత్తిని సామాజికం చేసింది. రెండవ దశలో ఉత్పత్తి శక్తులను విప్లవీకరించింది. అదీ చరిత్ర. పెట్టుబడి సామ్రాజ్యవాద దశలోకి ప్రవేశించిన తరువాత జాతీయ సరిహద్దులను దాటి, ఇంకా వ్యక్తిగత ఉత్పత్తి తక్కువ స్థాయి పంపిణీ సంబంధాలతో కూడిన పెట్టుబడి పూర్వ దశలో ఉన్న దేశాలను తన వలసలుగా మార్చుకోవడానికి ప్రయత్నించింది. పెట్టుబడిదారీ నమూనా సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే అది మొదటి దశ అయిన ఉత్పత్తిని సామాజికీకరించడాన్ని పూర్తి చేయాలి. ఇది ఉత్పత్తి శక్తుల స్థాయిలో, స్వదేశీ ఆర్థిక క్రమంలో మాత్రమే పూర్తవుతుంది. అదనపు విలువ ఎంత వస్తుందనేది నేరుగా ఉత్పత్తి శక్తుల స్థాయితో సంబంధాన్ని కలిగి ఉంది. ఉత్పత్తి శక్తుల స్థాయి పెరుగుతూన్న కొద్దీ లభించే అదనపు విలువ కూడా పెరుగుతుంది. అదనపు విలువను రాబట్టడమే సామ్రాజ్యవాదానికి ప్రధాన లక్ష్యం. అందుకనే అది దానికి లభించిన ఉత్పత్తి శక్తుల స్థాయికి అనుగుణంగా అదనపు విలువను రాబట్టుకునే తన పద్ధతులను అభివృద్ధి చేసుకొంటుంది. అంతేగాని తన మొదటి దశ కార్యక్రమానికే పెట్టుబడి పరిమితం కాదు. ఈ దృష్టితో చూసినప్పుడు పెట్టుబడి పూర్వ ఉత్పత్తి విధానాలను తొలగించడం ద్వారా, పెట్టుబడి తన అభివృద్ధికర స్వభావాన్ని పోగొట్టుకుంటుంది. అయితే సామ్రాజ్యవాద ప్రవేశంతో స్వదేశీ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ వ్యవస్థను సృష్టిస్తుంది. ఇది సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ కొనసాగింపు. మిగులును రాబట్టుకోవడంలో ఉపయోగకారిగా ఉంటుంది. పెట్టుబడిదారీ పూర్వ దోపిడీ రూపాలను నూతనంగా నేర్చుకొన్న పెట్టుబడి రూపాలతో జత చేయడం ద్వారా ఈ ఆర్థిక వ్యవస్థలో నూతన ప్రయోజనాల సృష్టి జరుగుతోంది. ఈ మొత్తం క్రమంలో తమ వైరుధ్యాలతో సహా రెండు వ్యవస్థలు

సహజీవనం చేస్తాయి". (ఆర్.ఎస్.రావు - భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఒక పరిశీలన - చాప్టరు 3, టు వర్డ్స్ అండర్‌స్టాండింగ్ సెమిఫ్యూడల్ సెమికొలోనియల్ సొసైటీ పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, 1995)

శక్తివంతమైన, అత్యున్నతంగా అభివృద్ధి చెందిన, ఐక్యంగా ఉన్న, దురాక్రమణ స్వభావం గల సామ్రాజ్యవాద దేశం భారతదేశం లాంటి సమాజాలలో ప్రవేశించి రాజకీయంగా తన వలసలుగా మార్చుకుంటుంది. తద్వారా ఒక క్రమ పద్ధతిలో మిగులును రాబట్టడానికి అవసరమైన సంస్థాగత ఏర్పాట్లను చేసి వాటిపై అజమాయిషీని నెరపుతూ క్రమబద్ధం చేస్తుంది. ఈ గుత్త పెట్టుబడిదారీ దశలో సామ్రాజ్యవాదం ఇంకెంత మాత్రం అభ్యుదయకరమైంది కాదు. అది అభివృద్ధి హీనమైనది, అనారోగ్యకరమైనది. ఎగుమతి చేయబడిన ఈ పెట్టుబడి స్వభావం వలస సమాజంలోని జ్ఞాన పునాదికి భిన్నమైనది, పరాయి అయినది. దాని అత్యున్నత అభివృద్ధి స్వభావ కారణంగా, అదనపు విలువను సృష్టించడం కోసం అది శ్రామికులను భూమి నుండి విముక్తం చేయాల్సిన అవసరం లేదు. అభివృద్ధి చెందిన, యాంత్రీకృతమైన సాంకేతిక నైపుణ్యంతో అది వలస సమాజంలో యంత్ర శ్రమను అత్యున్నత రూపంలో ప్రవేశ పెడుతుంది. అది స్వదేశీ శ్రామికులను పెట్టుబడిలో తక్కువ ప్రాధాన్యత కలిగిన ఒక భాగంగా మాత్రమే చూస్తుంది. ఉత్పత్తి క్రమాన్ని యాంత్రికంగా నిర్వహించడానికి మాత్రమే దేశీయ కార్మికులను పనిలో పెట్టుకొంటుంది. ఆ సామ్రాజ్యవాద పెట్టుబడి తన పరిణామ క్రమ చరిత్రతో, తన జ్ఞానంతో, దేశీయ శ్రామికులను సమ్మిళితం చేయాల్సిన అవసరం ఉండదు. స్థానిక జ్ఞానం అనవసరమయిందిగా మారిపోతుంది. సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడి తాను ప్రవేశించిన దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ లేకపోయినా మనగలదు.

అందుచేత ఒడిదుడుకులు లేకుండా దోపిడీ స్వేచ్ఛను కలిగి ఉండడం కోసం సామ్రాజ్యవాదం/సామ్రాజ్యవాద పెట్టుబడి భావజాల పరంగా రాజకీయంగా అమలులో ఉన్న భూస్వామ్య, పెట్టుబడి పూర్వ అధికార నిర్మాణాలతోను, సంస్థలతోను స్నేహంతో ఉంటుంది. నిజానికి సాంఘికంగా పెట్టుబడి పూర్వ సంస్కృతికి లోబడి ఉండడం దానికి అవసరం, సౌకర్యవంతం కూడా. మరణశయ్య మీద ఉన్న ఇలాంటి దశలో గుత్త పెట్టుబడి పాత వ్యవస్థలతో స్నేహం చేసి బలహీన పడుతుంది. రెండింటి మధ్య వైరుధ్యంలో పోరాటం కంటే ఐక్యతే ఎక్కువగా ఉంటుంది. దీని ఫలితంగా అర్ధ భూస్వామ్య, అర్ధ వలస వర్గ స్వభావం గల ఒక నూతన వ్యవస్థ నిర్మాణమవుతుంది.

"పెట్టుబడిదారీ విధానం అనేది జాతీయ స్థాయిలో రూపొందింది. అది తన జాతీయ సరిహద్దులు దాటి, పెట్టుబడిని ఇతర దేశాలకు, అంత వరకూ పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలలో ఉన్న దేశాలకు పంపించినప్పుడు అది సామ్రాజ్యవాదం అవుతుంది. ఇలా చేయడంలో సామ్రాజ్యవాదం తాను వలస వెళ్ళిన దేశంలోని పునాది సంబంధాలను మారుస్తుంది. అంటే ఆ దేశంలో పెట్టుబడి-శ్రమ సంబంధాలను ప్రవేశపెడుతుంది. ఇటువంటి పరిణామం ఒక కారణం వల్ల ఆసక్తికరమైనది అవుతుంది. ఏమంటే, పెట్టుబడి మొట్టమొదటి సారిగా అంతరాల వ్యవస్థలో భాగం అవుతుంది. అంటే, వలస దేశంలోని పెట్టుబడి సామ్రాజ్యవాద పెట్టుబడికి లొంగి ఉండే, ఆధారపడి ఉండే, పూరకంగా ఉండే స్థితి వస్తుంది. గుత్త పెట్టుబడి దశలో పెట్టుబడి పొందే ముఖ్యమైన మార్పు ఇది. ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక, రాజకీయ పోరాటపు మొదటి అడుగు అన్ని పెట్టుబడుల మధ్య సమానత్వం ఉండాలని ప్రారంభమయింది. ప్రస్తుత వ్యూహంలో ఆ సమానత్వానికి స్థానం లేదు. ఇలా ప్రవేశించినందువల్ల, దోపిడీకి, సొంతం చేసుకోవడానికి అవకాశం కల్పించవలసి వచ్చినందువలన పెట్టుబడి ఆ దేశాలలోని పెట్టుబడిదారీ పూర్వ పాలక వర్గానికి కూడా లొంగిపోతుంది. కనీసం మొదటి దశలో లొంగిపోతుంది. అంటే, పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలతో పోరాడిన చారిత్రక క్రమాన్ని తలకిందులు చేసి, ఒక రాజీకి, మిలాఖత్తుకు సిద్ధపడుతుంది. మళ్ళ [illegible] డ కూడా అంతరాల వ్యవస్థలో పునాదికీ, ఉపరితలానికీ ఏక సూత్రత [illegible] కనబడుతుంది. పునాది స్థాయిలోనేమో పెట్టుబడుల మధ్య అంతరాల వ[illegible] ఉంటుంది. పెట్టుబడిదారీ పూర్వ ఉపరితలంలోని అంతరాల వ్యవస్థను [illegible] సహకార నిర్మాణాలు ఈ పెట్టుబడికి మద్దతు ఇస్తాయి. దీనికి [illegible]క కోణం కూడా ఉంది. స్థానిక వడ్డీ వ్యాపార వాణిజ్య పెట్టుబడి, సామ్రాజ్యవాద పెట్టుబడి రెండూ కూడా ఈ దశలో ఉత్పత్తి ప్రక్రియ మీద కన్న చలామణీ ప్రక్రియ మీద ఎక్కువ కేంద్రీకరిస్తాయి.

వలస దేశాలలోకి పెట్టుబడిదారీ విధానం విస్తరణ వల్ల ఈ దేశాలలో పెట్టుబడిదారీ పూర్వ ఉపరితలం బలోపేతం అయింది. (ఆర్.ఎస్.రావు : "సామాజిక సంబంధాల సరళ నమూనా-ఒక అభిప్రాయం", చాప్టర్ 5, టు వర్డ్స్ అండర్‌స్టాండింగ్ సెమిఫ్యూడల్ సెమికొలోనియల్ సొసైటీ పర్‌స్పెక్టివ్స్, హైదరాబాదు, 1995)

వలస సమాజ నేపథ్యం నుండి చూస్తే అంతర్జాతీయ పెట్టుబడి స్వభావం స్పష్టంగా అభ్యుదయ నిరోధకమూ, రాజకీయంగా మితవాదం, దాని ఎదుగుదల, ఉనికి ఇంకెంత మాత్రం శ్రమశక్తి మీద ఆధారపడి ఉండదు. అది మిగులు సృష్టికి శ్రమను ప్రధాన వనరుగా భావించదు. శ్రమ కేంద్రక సామాజిక ఉత్పత్తిని వ్యాప్తి చేయదు. వలస దేశంలోని దేశీయమైన జ్ఞానాన్ని అది గుర్తించదు. దాని వల్ల దానికేమీ లాభం లేదు. వలస దేశంలో లభ్యమయ్యే సాపేక్షికంగా ప్రాథమిక పెట్టుబడి, దాని సాంకేతిక నైపుణ్యాలు దానికి అవసరం లేదు. అది వాటిని గౌరవించదు. సామ్రాజ్యవాద పెట్టుబడి వాస్తవానికి మొదట మనిషిని భూమినుండి తొలగిస్తుంది. (తన మానసిక శారీరక శక్తి ద్వారా ఉత్పత్తి శక్తులన్నింటికి మూల వనరు అయిన మానవుణ్ణి). అతణ్ణి, అతని జ్ఞాన పునాది నుండి అక్కడ అమలులో ఉన్న అన్ని రకాల నేర్పరితనం నుండి తొలగిస్తుంది. స్థానిక సరుకులను, తయారీ పద్ధతులను తొలగిస్తుంది. దేశీయంగా అభివృద్ధి చెందుతున్న సైన్సును, సాంకేతిక పరికరాలను తొలగిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే సామ్రాజ్యవాద పెట్టుబడి వలస దేశంలోని పెట్టుబడి పూర్వ సాంఘిక విలువలతోనూ, సంస్కృతితోనూ మిలాఖత్ అయి వాటిని శక్తివంతం చేస్తూ ఆయా సమాజాలలో మార్పుకు దోహదపడే శక్తులన్నింటిని నిరుపయోగం చేస్తుంది.

పెట్టుబడి మనుషులను భౌతికంగా తొలగించడమంటే నూతన వ్యవస్థలో తిరిగి భాగం చెయ్యకుండా ఉనికిలో ఉన్న జ్ఞాన సంపదను నాశనం చెయ్యడం. అంటే అర్థం, అది ప్రవేశ పెట్టే పెట్టుబడి-శ్రమ సంబంధాలకు మనుషులు అవసరం లేదు. దాని వ్యాప్తి, అభివృద్ధి, శ్రమ శక్తి కేంద్రకమైనవి కావు. గుత్త పెట్టుబడి మరణప్రాయమైనది. ఎందుకంటే అది ఇంకెంత మాత్రం పెట్టుబడి పూర్వ ఆస్తి సంబంధాలలో మార్పు తేవడం ద్వారా సమాజాన్ని అభివృద్ధి చేయలేదు. నిజానికి వలస దేశాల సంపూర్ణమైన రాజకీయ మద్దతును సంపాదించడం, సమాజంలో

ఒడిదుడుకులు లేని స్థితిని రూపొందించడం ద్వారా మిగులును సంపాదించడానికి గుత్త పెట్టుబడి పెట్టుబడిదారీ పూర్వ నిర్మాణాలతోనూ, అధికార వ్యవస్థలతోనూ స్నేహం చేస్తుంది.

సి. అర్ధ భూస్వామ్య, అర్ధ వలస చట్రం :

ఒక ఉత్పత్తి విధానంలో మార్పు తప్పనిసరి అయినపుడు ఆ మార్పును ప్రారంభించే నాయకత్వం స్పష్టంగా ఉంటుంది. దాని భావజాలం అమలవుతుంది. సాంప్రదాయకంగా చూస్తే నూతనంగా తల ఎత్తుతున్న బూర్జువా వర్గం భూస్వామ్య, ఇతర పెట్టుబడిదారీ పూర్వ విధానాలను నాశనం చేసి ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించింది. ఎప్పటికీ కొనసాగుతూ ఉండే పెట్టుబడి-శ్రమ సంబంధాలను, బూర్జువా రాజ్యాన్ని స్థాపించింది. ఆ విధంగా ఉత్పత్తి శక్తులు నిరాటంకంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలను కల్పించింది.

భారత దేశంలో భూస్వామ్యాన్నీ, పెట్టుబడిదారీ పూర్వ నిర్మాణాల్ని ధ్వంసం చేయాలని కోరుకున్న బీజ ప్రాయంలో ఉన్న మార్పును కోరే శక్తులన్నీ సామ్రాజ్యవాద జోక్యం కారణంగా, అది తెచ్చిన నిర్జీవమైన గుత్త పెట్టుబడి కారణంగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో సామాజిక నిర్మాణాలు అర్ధ భూస్వామ్య, అర్ధ వలస స్వభావం కలవిగా మారాయి. గుత్త పెట్టుబడి ప్రవేశంతో ఒక ఉత్పత్తి విధానం నుండి అంత కంటే ఉన్నతమైన విధానంలోకి మారడానికి సహజంగా అంతర్లీనంగా ఉండే శక్తి యుక్తులకు ఆటంకాలెదురయ్యాయి. సామ్రాజ్యవాద జోక్యం పెరగడం అంటే (గుత్త పెట్టుబడి అభివృద్ధి) పెట్టుబడి-శ్రమ సంబంధాలు మరింతగా పెరగడం, పెద్ద సంఖ్యలో సంక్లిష్టమైన సరుకులు ఉత్పత్తి జరగడం, పెద్ద స్థాయిలో ద్రవ్యీకరణ, అభివృద్ధి చెందిన జ్ఞాన సంచయం, అత్యాధునికమైన సాంకేతిక నైపుణ్యాలు తయారీ క్రమాలు, శాస్త్రీయ ఆచరణలు, ప్రత్యామ్నాయాలు, అభివృద్ధులు, వేతన శ్రమ వినియోగం అని అర్థం. నిజానికి ఇవన్నీ పెట్టుబడి ఆచరణకు సంబంధించిన సూత్రాలు. ఇది కొంత గందరగోళానికి దారితీసింది.

సామ్రాజ్యవాద అధీనంలో ఉండే స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో, ఈ సూచికలు కొందరిలో గందరగోళాన్ని కలిగించాయి. వారు భారతదేశం అర్ధ భూస్వామ్య, అర్ధ వలస దేశం అనే నూతన ప్రజాస్వామిక చిత్రీకరణను కూడా ప్రశ్నిస్తున్నారు. సామ్రాజ్యవాదానికి సాంఘిక పునాది భూస్వామ్యమే అనేది అర్థం చేసుకుంటే, అది పెట్టుబడి-శ్రమ సంబంధాన్ని ఎంత ఎక్కువగా ప్రవేశ పెడితే (పైన పేర్కొన్న సూచికలు) అంత తొందరగా రద్దయిపోయి, మార్పు చేయబడిన పెట్టుబడి పూర్వ నిర్మాణాలు, వ్యవస్థలు బలపడతాయని అర్థం చేసుకోగలిగితే భావజాల పరంగా ఎలాంటి గందరగోళం ఉండదు.

సామ్రాజ్యవాద జోక్యం కారణంగా కనపడే అభివృద్ధి ప్రతిఫలనాలు కొన్ని సందర్భాలలో నూతన ప్రజాస్వామిక దృక్కోణం గల పరిశోధకుల్నీ, కార్యకర్తల్నీ మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ఫలితంగా భావజాల పరమయిన చర్చ అంతా ఏక కేంద్రకంగా మారిపోతుంది. గతితర్కంగా ఆలోచిస్తే పెట్టుబడి-శ్రమ అభివృద్ధి సూచికలను పాత పెట్టుబడి పూర్వ సామాజిక నియంత్రణ, దోపిడీ రూపాల సందర్భంలో అధ్యయనం చేయాలి. పెచ్చు పెరిగిన సామ్రాజ్యవాద జోక్యం కారణంగా పెట్టుబడి పూర్వ ఆధిపత్య, దోపిడీ, సామాజిక నియంత్రణా రూపాల అభివృద్ధిలో వస్తున్న మార్పులను గుర్తించడానికి, ఉదహరించడానికి, రికార్డు చేయడానికి అర్ధ భూస్వామ్య, అర్ధ వలస చట్రానికి సంబంధించిన సూత్రాలకు మాత్రమే కట్టుబడి ఉండాలి.

అర్ధ భూస్వామ్య-అర్ధ వలస సామాజిక చట్రంలో బందీ అయిపోయిన ఉత్పత్తి శక్తులను విముక్తి చేయడం అనే అసంపూర్ణంగా మిగిలిపోయిన కర్తవ్యం, స్థానిక చైతన్యానికి లోబడి ఉండిన జ్ఞాన పునాదిని దాని వ్యక్తీకరణలను విముక్తి చేయడం, నూతన ప్రజాస్వామిక క్రమంలో సమ్మిళితమయ్యే అవకాశాన్ని తొలగించబడిన అంశాలన్నింటికీ ఇవ్వడం, అదే సమయంలో ఆర్థికేతర భూస్వామ్య సామ్రాజ్యవాద ఉక్కు కౌగిలిని ధ్వంసం చేయడం - వీటన్నింటినీ మార్పు, అభివృద్ధిలను తన గర్భంలో దాచుకున్న ఉద్దీపన శక్తుల దృష్టి కోణం నుండి మాత్రమే చూసి అర్థం చేసుకోవాలి. ఒకానొక దశలో భూస్వామ్యం నుండి మార్పు సాధించాల్సిన అవసరం బూర్జువా వర్గానికి తప్పనిసరి అవుతుంది. ఆ క్రమంలో దానికి అదే నాయకత్వం వహిస్తుంది. పెట్టుబడి-శ్రమ వైరుధ్యాల నుండి శ్రామిక వర్గ భావజాలం తలెత్తింది. ఉత్పత్తి సాధనాల సామాజిక యాజమాన్యం అక్కడి నుండి సోషలిజం వైపు, కమ్యూనిజం వైపు ప్రయాణం చేయడం దాని అవసరం. నూతన ఆస్తి సంబంధాలను వ్యవస్థాపితం చేసి బందీగా ఉన్న ఉత్పత్తి శక్తులను విడుదల చేసి భూస్వామ్య వ్యతిరేక కర్తవ్యాలను పరిపూర్ణం చేయగల శక్తులను గుర్తించడం ప్రధానమవుతుంది.

"ఉత్పత్తి విధానంపై చర్చ-ఒక అంచనా" అనే పేరు గల ప్రొ. ఆర్.ఎస్.రావు పత్రం ముగింపుని తెలుసుకోవడం చాలా ఆసక్తి దాయకంగా ఉంటుంది.

"ఒక లెనినిస్టు సాధారణ నమూనా ప్రకారం చూస్తే వ్యవసాయ సంబంధమైన శ్రమ ఉనికిలో ఉండడం, పెట్టుబడిదారీ సంచయం పట్టు విడుపు లేకుండా కొనసాగించడం ఉంటే, వీటి ఆధారంగా వ్యవసాయం పెట్టుబడిదారీ విధానంలోకి మారుతూ ఉందని సూత్రీకరించవచ్చును. అయితే మావోయిస్టు దృష్టి కోణం నుండి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని అర్థం చేసుకుంటే వ్యవసాయ రంగంలో వ్యవస్థాగతమైన మార్పుకు పునాదిగాను, చోదకశక్తి గాను ఉండేది భూదాహం అనేది గుర్తించాలి. వ్యవసాయ సంబంధం వ్యవస్థను మార్పు చేయడానికి చోదకశక్తిగా ఉపయోగపడేది వ్యవసాయ కార్మిక వర్గమే కాని ధనిక రైతాంగం కాదు."

నూతన ప్రజాస్వామ్యం పునాదిగా గల పరిశోధన-ఆచరణ, సామ్రాజ్యవాదం కారణంగా విస్తృతంగాను వివిధ రూపాలలోనూ జరుగుతూ ఉన్న విధ్వంసాన్ని, మార్పు చేయబడిన పెట్టుబడిదారీ పూర్వ దోపిడీ రూపాలు ఎలా సృష్టించబడి వ్యవస్థీకృతమౌతున్నాయో నిర్దిష్టంగా ప్రత్యేకంగా అర్థం చేసుకోవాలి. అదే సమయంలో నిర్దిష్టమైన, ప్రత్యేకమైన ఆచరణలు, విజయాలను రికార్డు చేస్తే మార్పుకు చోదక శక్తులుగా ఉన్న బృందాలు నిర్వహిస్తున్న కీలక పాత్రను వివరించడానికి అవకాశం ఉంటుంది. శ్రమ ఆధార, భూమి ఆధార వ్యవస్థల ఆచరణను చారిత్రకంగా పరిశీలిస్తే అర్ధ భూస్వామ్య, అర్ధ వలస చట్రం సుసంపన్నమయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిశీలనలను భావజాల రూపంలో సమీక్ష చేసుకోవడం ద్వారా ఉత్పత్తి శక్తులకు సంబంధించిన అవసరాలు, ఆస్తి సంబంధాలు, ప్రజల సంస్కృతి వంటి అంశాల వ్యవహారంలో ఆచరణలో ఏం జరుగుతుందో లోతుగా తెలుసుకోవచ్చు. ఆ విధంగా ఆ మూడు అంశాల మధ్య తప్పనిసరి అయిన ఆచరణాత్మకమైన ఐక్యతను రూపొందించడం సాధ్యమవుతుంది.

రిపోర్ట్

'రచయితలూ, కళాకారుల్లారా విషప్రచారాన్ని తిప్పి కొట్టండి'

యాన్ మిర్డాల్‌తో చర్చాగోష్ఠి

- కూర్మనాథ్

చరిత్ర పట్లా చరిత్ర నిర్మాణం పట్లా చరిత్ర నిర్మాతల పై ఏమాత్రం గౌరవంలేని దేశం భారతదేశం. రాజులు, రాజుల ఆస్తులు, ఆ ఆస్తుల కోసం వాళ్లు చేసుకున్న యుద్ధాలు - ఇవి తప్ప మన చరిత్ర పుస్తకాల్లో మరొకటి కనబడదు. పుక్కిటి పురాణాలు, అవాస్తవిక కట్టుకథలే తప్ప చరిత్రను, సమాజపు ఆర్థిక పునాదుల్ని నిర్మించిన వారి గురించి ఎక్కడా ప్రస్తావన వుండదు. వారి శ్రమను బ్రాహ్మణీయ పాలకవర్గాలు ఎట్లా దోచుకున్నారో, వారినెట్లా నిచ్చెనమెట్ల కులవ్యవస్థ చట్రంలో బంధించారో మన చరిత్రలో ఆనవాళ్లుండవు. పురాణాలను తలకిందులు చేసి చూస్తే పాత్రల స్వభావాల్ని తరచి చూస్తే అసలు సంగతి బోధపడుతుంది.

వేటగాళ్లు రాసుకున్న చరిత్రలో వారి గొప్పతనం గాక ఇంకేముంటుంది? నిరసనగొంతులు ప్రతిశతాబ్దంలో వినొచ్చినా అవి చిన్నగొంతులుగానే మిగిలిపోయాయి కానీ, చరిత్రను పూర్తిగా ప్రతిఫలించలేకపోయాయి. మార్క్సిస్టుశాస్త్ర ఉపకరణాలు అందుబాటులోకి వచ్చిన తర్వాతనే, కోశాంబి లాంటి చరిత్రకారులు పూనుకున్న దగ్గరనుండే చరిత్ర ప్రజలవైపు నుండి చెప్పే పద్ధతి మొదలైంది.

యాన్‌మిర్డాల్ (Jan Myrdal) ఈ సంస్కృతిని మరింత సునిశితం చేశాడు. చరిత్రను నిర్మిస్తున్న ప్రజలతో మమేకమై, వారి పోరాటాన్ని అర్థం చేసుకున్నాడు. వారి జీవితంలో భాగమైన, వారి పోరాటంలో అంతర్భాగమైన కళలను రికార్డు చేసాడు.

ప్రజాపోరాటాలకు తిరుగులేని, షరతుల్లేని మద్దతు ప్రకటించాడు.

మధ్యయుగాల్లో మనదేశానికి కొందరు చరిత్రకారులు వచ్చారు. కానీ వాళ్లకీ యాన్‌మిర్డాల్‌కీ వ్యత్యాసం ఉంది. చరిత్రను పాలకవర్గాల దృక్పథంతో కాకుండా ప్రజలదృష్టితో చూశాడు. ఒక్కసారే కాకుండా కొన్ని దశాబ్దాల తర్వాత మళ్లా వచ్చాడు. ఉద్యమ పురోగతిని చూసి, విస్తృతిని చూసి 'భారతదేశంపై అరుణతార' అని పుస్తకం రాశాడు. చరిత్ర నిర్మాణం పట్ల, నిర్మాతల పట్ల మరోసారి తన నమ్మకాన్ని ప్రకటించాడు.

యాన్‌తో విరసం ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో సారస్వత పరిషత్ హాల్‌లో 'ఆదివాసీల జీవితం, పోరాటం - బుద్ధిజీవుల పాత్ర' అనే అంశంపై సమావేశం ఏర్పాటుచేసింది. సమావేశానికి వరవరరావు అధ్యక్షత వహించారు. మూడుగంటల పాటు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యావంతులు, ఉద్యమ మిత్రులు ఆయన చెప్పిన విషయాలు విన్నారు. ప్రశ్నలడిగారు. సమావేశానంతరం మిర్డాల్ కోరగా గద్దర్, ఊ.సా., సంధ్య, ప్రజాకళామండలి కళాకారులు కోటి, రాజ నర్సింహ్మ, ప్రభాకర్, తదితర కళాకారులు పాటలు పాడి వినిపించారు.

ఆ సమావేశంలో ఆయన మాట్లాడిన విషయాల్లో కొన్ని ఇక్కడ మీతో పంచుకుంటున్నాం. ఆయన మాటల్లోనే.

చాలా ఉన్నతమైన సాహిత్య వారసత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. మేధావులు, రచయితలు, కళాకారులు ప్రజలపక్షాన నిలబడ్డారు. ప్రజలనుంచి నేర్చుకుని సాహిత్యాన్ని సృష్టించారు. వారి అనుభవాల్ని, వారి అనుభూతుల్ని, భావనల్ని కవితల్లోకి, పాటల్లోకి మార్చారు. అసలు సాహిత్య ప్రయోజనం ఇదే. ప్రజలు పోరాడుతున్నారు. పేదప్రజల కొడుకులూ, బిడ్డలూ ఉద్యమాల్లో ప్రజాసైన్యంలో చేరుతున్నారే తప్ప, ధనవంతుల పిల్లలు కాదు. వాళ్లు చేస్తున్న పోరాటం ఏదో సొంతలాభం కోసం కాదు.

మరోపక్క ప్రజలపై, గ్రీన్‌హంట్ పేరుతో యుద్ధం మొదలైంది. వాళ్లు సామాన్యప్రజలు. భూమిపై వాళ్ల హక్కుల్ని కాలరాస్తూ ప్రభుత్వం బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది. కంపెనీలకు గనుల్ని ధారాదత్తం చేస్తోంది. ఇందుకోసం పర్యావరణాన్ని నాశనం చెయ్యడానికి, వ్యవసాయ యోగ్యమైన భూమిని గుంజుకోవడానికి, ప్రజల్ని అక్కడినుంచి తరిమికొట్టడానికి, నిర్మూలించడానికి కూడా ప్రభుత్వం వెనుకాడడం లేదు. ఇది ప్రజలపై యుద్ధం ప్రకటించడమే.

ఈ సందర్భంలో సాహిత్యం చెయ్యాల్సిందెంతో ఉంది. ఈ క్లిష్టమైన చారిత్రక సందర్భాన్ని ప్రజలకు అర్థం అయ్యేట్టు చెయ్యడానికి సాహిత్యం, పాటలు, కళలు ఎంతో దోహదం చేస్తాయి.

ప్రభుత్వం, ప్రసార సాధనాలు ప్రచారం చేస్తున్నట్టు ఉద్యమకారులు అభివృద్ధికి వ్యతిరేకం కాదు. ప్రజలకు ఉపయోగపడే, హాని చెయ్యని అభివృద్ధిని వాళ్లు కాంక్షిస్తారు.

విధ్వంసం అభివృద్ధి కాదు. అది పర్యావరణానికి మంచిది కాదు. ప్రజలకీ, మన భవిష్యత్తుకూ కూడా మంచిది కాదు. ప్రజలకే కనుక నిర్ణయాధికారం ఉంటే వాళ్లు ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తారు. వాళ్ల విధ్వంసం కోసం, వాళ్ల జీవనోపాధిని నాశనం చెయ్యడం కోసం కాదు.

ప్రసారమాధ్యమాలకు కనిపించే అభివృద్ధిమార్గం ఒకే ఒక్కటి, అది పెట్టుబడి వల్లెవేసే అభివృద్ధి మార్గం. ఇది కాక మరో ప్రత్యామ్నాయం వాళ్లకి కనబడదు. ఈ అభివృద్ధి నమూనాలో అట్టడుగున ఉన్న ప్రజలకు ఎట్లాంటి నిర్ణయాధికారం లేదు. అభివృద్ధికి అనేక మార్గాలున్నాయి.

ఉద్యమం అభివృద్ధికి వ్యతిరేకం అని ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజం లేదు. నేను చాలమంది ఉద్యమకారులతో, ఉద్యమప్రాంత ప్రజలతో మాట్లాడాను. వాళ్ల అభివృద్ధి నమూనాలపట్ల నాకు విశ్వాసం, నమ్మకం కలిగాయి.

గెరిల్లాజోన్ ప్రాంతంలో నీటిపారుదల, వ్యవసాయ అభివృద్ధిని ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు ఉదాహరణగా చూపించవచ్చును.

పుస్తక సమీక్ష



ముస్లిం స్త్రీల జీవిత పోరును చిత్రీకరించిన - 'పహెచాన్'

- మిడ్కో

ముస్లిం స్త్రీల జీవితాలను పలు కోణాల్లో ఆవిష్కరించిన కథల సంపుటి- పహెచాన్. ఇందులో గీతాంజలి (డా. భారతి) రాసిన 17 కథలు ఉన్నాయి. ఈ కథలు నిజానికి కథలు కావు- ముస్లిం స్త్రీల గాథలు- వాళ్ల బాధలు, కన్నీళ్లు, చిదిమివేయబడుతున్న వాళ్ల ఆకాంక్షలు, వాళ్ల పెనుగులాట. 'పుట్టెడు దుఃఖం దిగమింగి నిభాయించుకోగల హిమ్మత్/ తాఖత్ ఉంటేనే ఈ కథలు చదవండి'అని రత్నమాల ఈ కథల గురించి ఎందుకు రాసిందో వీటిని చదవడం మొదలు పెట్టిన వెంటనే అర్థమవుతుంది. ఈ కథలన్నింటినీ ఏకబిగిన చదవడం చాలా కష్టం. ఓ కథ చదివాక కలిగే దుఃఖం, అశాంతి నుండి కోలుకోవడానికి కొంత సమయం పడుతుంది. వికలమయిన మనసును కూడదీసుకొని ధైర్యం తెచ్చుకుంటే తప్ప మరో కథలోకి వెళ్లలేం.

'రచయితలకు వారి వృత్తి లేదా చదువు జీవితాన్ని చూడ్డానికి ఒక కిటికీగా ఉపయోగపడుతుంది'అంటారు వల్లంపాటి వెంకట సుబ్బయ్య. వృత్తిరీత్యా డాక్టర్ అయిన గీతాంజలి ముస్లిం స్త్రీల శరీరాలను మాత్రమే పరీక్షించి వదిలెయ్యలేదు. వాళ్ల జీవితాలను పరిశీలించింది. చేత్తోనో, థర్మామీటర్‌తోనో, స్టెతస్కోప్‌తోనో చూసి సరిపెట్టలేదు. హృదయంతో పరామర్శించింది. ఆ పరామర్శ ద్వారా పొందిన అనుభూతిని తనలోనే దాచుకోవడం సహజంగానే ఆమెకు కష్టమైంది. అందుకే ఇలా పంచుకుంది.

ఈ కథలు ఓ నిర్దిష్ట సమూహం-ముస్లిం స్త్రీల- గురించి చెప్పినవి. అదే సమయంలో వీటిలో సాధారణత్వమూ కనబడుతుంది. రూపంలో వేరైనా సారంలో స్త్రీలందరి గాథలే. అంతేకాదు స్త్రీల గురించి చెప్పే ఈ కథలు మనకు మొత్తంగా ముస్లిం సమాజ దుస్థితిని అర్థం చేయిస్తాయి. ఇంకా చెప్పాలంటే మొత్తం సమాజ దుస్థితినీ అర్థం చేయిస్తాయి.

ఇందులో సాదీ పెళ్లిళ్ల నేపథ్యంలో ఆరు కథలున్నాయి. 'కాలీబదరియా(నల్లమబ్బులు)లో బదరియా, దోర%బి%క్ (నరకం)లో జన్నత్ బేగంల పెళ్లిళ్లు సాదీ షేక్‌లతో జరుగుతాయి. బదరియాను పెళ్లి చేసుకున్న షేక్ ఆమెను హైదరాబాద్‌లో ఒక హోటల్లో కొన్నాళ్లు ఉంచి, పీల్చిపిప్పిచేసి ఆ తర్వాత వేశ్యా గృహానికి అమ్మేసి పోతాడు. జన్నత్ బేగంను చేసుకున్న వాడు బొంబాయిలో ఆమెకు కొన్నాళ్లు నరకం చూపించి పనిమనిషిగా అమ్మేసి వెళ్లిపోతాడు.

ఇంటర్నెట్ పెళ్లికి సంబంధించిన కథ 'సబా-సవేరా'. సబా, సవేరాలు అక్కా చెల్లెళ్లు. పెళ్లి కొడుకుల ఫొటోలను మాత్రమే చూసి తల్లిదండ్రులు వాళ్లకు ఒమెన్‌లోని ఇద్దరన్నదమ్ములైన యువకులతో ఇంటర్నెట్ పెళ్లిళ్లు చేస్తారు. విమానమెక్కి ఎన్నో ఆశలతో సబా, సవేరాలు కాపురానికి వెళ్తారు. అక్కడికి వెళ్లాక ఆ యువకులిద్దరూ మూర్ఛవ్యాధి రోగులని తెలుస్తుంది. మోసం చేసి పెళ్లి చేసుకున్నారని అక్కాచెల్లెళ్లిద్దరూ ఆక్రోశిస్తారు. ఫలితంగా వాళ్లకు చిత్రవధలు మొదలవుతాయి. 'జహానుమా గల్లీ నంబర్ దో'లో 55 ఏళ్ల షేక్ భార్య చనిపోయిందని అబద్ధం చెప్పి పద్దెనిమిదేళ్ల యాస్మీన్ బానును పెళ్లి చేసుకుంటాడు. సాదీకి వెళ్లాక షేక్‌కు భార్య చనిపోలేదనీ, ఒకరు కాదు ఇద్దరు భార్యలున్నారనీ, పాతికేళ్ల వయసున్న ఇద్దరు కొడుకులు కూడా ఉన్నారనీ తెలుస్తుంది. కానీ, దేశం గాని దేశంలో ఆమె ఏం చేయగలదు? పెళ్లి చేసుకున్న షేకే కాదు, వాడి కొడుకులిద్దరూ కూడా ఆమెనొక సెక్స్ పరికరంగా ఇష్టమొచ్చినట్టు వాడుకుంటారు.

'అబ్బా మై రషీదా హు'లో రషీదాను ఒక బ్రోకర్ మోసం చేసి, ఒక షేక్ ఇంట్లో బేబీ సిట్టర్ ఉద్యోగమని చెప్పి, సాదీ పంపిస్తాడు. అక్కడికెళ్లాక తెలుస్తుందామెకు. ఆ షేక్ తనను మూడేండ్లకుగాను కాంట్రాక్ట్ పెళ్లి చేసుకున్నాడని. కానీ ఆమె ఏం చెయ్యగలదు?

ఇలా సాదీ పెళ్లిళ్లకు బలైన బదరియా, జన్నత్, సబా, సవేరా, యాస్మీన్... లు లేలేత ప్రాయం వాళ్లే. వీళ్లందరికీ తల్లిదండ్రులు దేశం కాని దేశం వాళ్లతో ఎందుకు పెళ్లిళ్లు చేశారు? గొప్ప కోసం కాదు. పేదరికం వల్ల! షేక్‌లు ఆశ చూపిన లక్ష, లక్షన్నర సొమ్ము కోసం. ఒక బిడ్డ బలైనా మిగతా బిడ్డలకు కాస్త మంచి బతుకు దొరుకుతుందనే ఆశతో. అంటే

ఇక్కడి ప్రజలశక్తి నన్ను ఆకర్షించింది.

ఈ సందర్భంగా రచయితలకు, కవులకు, మేధావులకు ఒకటి చెప్పదలచుకున్నాను. ఈ క్లిష్ట సందర్భంలో మీ పాత్ర చాలా ముఖ్యమైనది. మీరు చెయ్యాల్సిందెంతో ఉంది. ముఖ్యంగా ఉద్యమం మీద, అభివృద్ధి మీద చాలా విష ప్రచారం జరుగుతోంది. దీన్ని మీరు మీ రచనలతో తిప్పికొట్టాలి. అసలు జరుగుతున్నదేమిటో ప్రజలకు - ముఖ్యంగా పట్టణాల్లో నివసించే ప్రజలకు - మీ రచనల ద్వారా అర్థం చేయించాలి.

అవి ఎలా ఉండాలంటే ప్రజలమనసుల్లో నాటుకుపోయిన అబద్దాలను పెకలించాలి. ఫిన్లాండ్‌లో మిన్నాకాంట్ అనే రచయిత్రి ఎలా చేసిందో అలా చేయాలి. గతశతాబ్దం మొదటిభాగంలో ఆమె రచనల ద్వారా ప్రజల అవగాహనను మార్చగలిగింది. వాస్తవాన్ని ప్రతిఫలించే రచనలు చెయ్యాలి. వైరుధ్యాల్ని స్పష్టంగా వెల్లడించాలి.

ఇదంతా ఎందుకు చెయ్యాలి? మీ కోసమో, నా కోసమో కాదు. మనందరికోసం చెయ్యాలి.

ఇదీ 84 సంవత్సరాల వయస్సుగల యాన్‌మిర్డాల్ అంతరంగం. పౌరహక్కులపట్ల, ప్రజా ఉద్యమాల పట్ల తిరుగులేని విశ్వాసం వున్న ప్రజాచరిత్రకారుడి ఆకాంక్ష. యాన్‌మిర్డాల్ నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ప్రపంచ ఉద్యమాలను బలపర్చడం, రికార్డుచెయ్యడం, మళ్లీ మళ్లీ ఉద్యమ ప్రాంతాల్లో తిరిగి చరిత్రను - ప్రజల చరిత్రను - నిక్షిప్తం చెయ్యడం. ప్రజల పోరాటాలకు మద్దతునివ్వడం - ఇవీ మనం చెయ్యాల్సినవి.

ముక్కు పచ్చలారని ఈ అమ్మాయిలు సౌదీ షేక్‌లకు బలి కావడానికి కారణాలను వర్గ సమాజపు మూలాల్లో వెతుక్కోవాలి. మరి పెళ్లిళ్లయి, భార్యలుండీ షేక్‌లు ఈ అమ్మాయిలను అందులోనూ తమకంటే ఎంతో చిన్న వయసులోని అమ్మాయిలను ఎందుకు బలిచేస్తున్నారు? దీనికి కారణాలను మహిళను కేవలం ఒక విలాస వస్తువుగానే చూసే కరడు గట్టిన పితృస్వామ్యంలో వెతుక్కోవాలి. మహిళ అంటే వాళ్లకు వ్యక్తి కాదు, మనసు కాదు, కేవలం శరీరం మాత్రమే! వీళ్లంతా ఏదోలా మళ్లీ వాళ్ల ఇండ్లకు తిరిగి వచ్చారు. బదరియా గర్భిణిగా, ఎయిడ్స్ రోగిగా తిరిగొస్తుంది. జన్నత్ గర్భంతో తిరిగొస్తే నాటు వైద్యురాలితో ఆ గర్భాన్ని విచ్ఛిత్తి చేసే ప్రయత్నం చేయడం వల్ల గర్భసంచీ, తద్వారా శరీరమూ విషపూరితమై చనిపోతుంది. రషీదా కూడా నిండు గర్భిణీగా తిరిగొస్తుంది. ఇక వీళ్లందరి భవిష్యత్ ఏం అవుతుంది అనేది మనం ఊహించుకోవడం కష్టం కాదు. అయినా మనకు ఊహించుకునే కష్టం లేకుండా మై అమీనా బాత్ కర్రై'కథ మనకు తెలియజేస్తుంది. 13 ఏళ్ల అమీనా పెళ్లి 60 ఏళ్ల షేక్‌తో జరుగుతుంది. ఆమె సౌదీకి వెళ్లకముందే ఒక ఎయిర్ హోస్టెస్ ద్వారా రక్షించబడుతుంది. అది దేశవ్యాప్తంగా పెద్ద సంచలన వార్త అవుతుంది. పలు మహిళా సంఘాలూ జోక్యం చేసుకుంటాయి. అందరూ అమీనాను రక్షించామని సంతృప్తి పడతారు. కానీ తర్వాత అమీనా ఏమయింది? మరో నాలుగేళ్ల తర్వాత ఆమె పెళ్లయింది. సౌదీ సంబంధం కాదు, హైదరాబాదీ సంబంధమే. అయితే 60 ఏళ్ల వృద్ధుడితోనే. అమీనాను సౌదీకి పంపకుండా ఆపడం అనేది మాత్రమే అమీనా కథకు పరిష్కారం కాదు. ఆమె కథకైనా బదరియా, జన్నత్...తదితరుల కథలకైనా పరిష్కారం సమాజ మార్పుతోనే ముడిపడి ఉంటుందనేది స్పష్టం.

పిల్లలను అందులోనూ మగపిల్లలను కనే పనిముట్టుగా స్త్రీల దుస్థితిని తెలియజేసే కథలు ఉనో నహీ మానే, ఫాతేహా, ఔలద్. ఉనో నహీ మానే(అతను ఒప్పుకోడు)లో గంపెడు పిల్లలున్న నూరున్నీసా బిడ్డను కన్న ప్రతిసారీ ఆపరేషన్ చేయించుకుంటానని భర్తను అడుగుతూ ఉంటుంది. అడిగినప్పుడల్లా ఆమె భర్త మండి పడతాడు. దేవుడిచ్చిన పిల్లలను అడ్డుకోవద్దంటాడు. ఆమె సంతానోత్పత్తి ప్రక్రియ మీద ఆమెకు ఎటువంటి హక్కూ లేదు. ఇష్టంలేని గర్భాలను మోస్తూ పురిటి నొప్పులను భరిస్తూ ఉంటుంది. ఇంతలో పెద్ద కూతురు మునీరా పెళ్లవుతుంది. తల్లీ, కూతుళ్లు ఒకేసారి గర్భం ధరిస్తారు. అందరూ వెక్కిరిస్తూ ఉంటారు. తల్లికీ కూతురుకూ కూడా ఇది అవమానంగా ఉంటుంది. ఇందులో ఒక వైచిత్రి ఉంది. ఏ సంతానోత్పత్తి ప్రక్రియ మహిళలకు గుర్తింపునూ, గౌరవాన్నీ తెస్తుందని సమాజం చెప్తుందో, ఆ సంతానోత్పత్తి ప్రక్రియనే ఆమెను అవమానానికీ, ఎగతాళికీ గురి చేస్తుంది. ఫాతేహా (సమర్పణ), ఔలద్(వారసుడు)లు స్త్రీలను మగపిల్లలను కనే పనిముట్లుగా చూసే స్థితిని తెలియజేసే కథలు. స్వంత ఆస్తి నుండి పుట్టిన వారసుడు అనే భావన మహిళల జీవితాలను ఎంత అభద్రతలోకి నెట్టి వేస్తున్నదో ఈ కథలు చెప్తాయి. ముగ్గురు ఆడపిల్లలు పుట్టిన తర్వాత మాలన్ బీ (ఫాతేహా) గర్భసంచిలో గడ్డ అవుతుంది. గర్భసంచి తీసేయించు కోకపోతే ప్రాణానికి ముప్పని డాక్టర్లు చెప్తూ ఉంటారు. కానీ మాలన్ బీ ససేమిరా ఒప్పుకోదు. ఎందుకంటే ఆమె మగపిల్లాడిని కనలేక పోతే మరో పెళ్లి చేసుకోవడానికి భర్త తయారుగా ఉంటాడు. భర్త మళ్లీ పెళ్లి చేసుకోకుండా ఉండడం కోసం తను మగపిల్లాన్ని కని తీరాలనుకుంటుంది. అలా గర్భసంచిని తీయించుకోవడానికి మొండికేసి గర్భసంచిని తన కడుపులోనే భద్రంగా ఉంచుకొని ప్రాణాలు కోల్పోతుందామె.

నఫీజ్ (ఔలాద్)కి ఇద్దరు ఆడపిల్లలు పుట్టగానే భర్త ఆయన తల్లిదండ్రులకు తెలియకుండా ఆపరేషన్ చేయిస్తాడు. వారసుడిని కనడం లేదని అత్త నఫీజ్‌ని వేధిస్తుంది. ఇక తప్పనిసరై ఆపరేషన్ విషయం కొడుకు చెపుతాడు. ఎలాగైనా తనకు వారసుడు కావాలనే పట్టుదలతో కొడుక్కు మళ్లీ పెళ్లి తలపెడుతుంది తల్లి. దాన్ని ఆపడం కోసం నఫీజ్ పిల్లలు పుట్టడం కోసం తిరిగి ఆపరేషన్ చేయించుకుంటుంది. అయినా ఆమెకు పిల్లలు పుట్టరు, భర్తకు మళ్లీ పెళ్లవుతుంది. నఫీజ్ తన ఇద్దరు ఆడపిల్లలతో సహా బావిలో శవమై తేలుతుంది.

బిఛ్‌డా చమన్ (తప్పిపోయిన తోట), పహెచాన్ (గుర్తింపు) గుజరాత్ మారణకాండ నేపథ్యంలో పుట్టిన కథలు. హిందూ ముస్లింల మధ్య లేని వైరుధ్యాలను పాలక వర్గాలు సృష్టిస్తాయి. నిన్నటి దాకా హైదరాబాద్‌లో భద్రంగా ఉన్న ముస్లింలపై గుజరాత్ మారణకాండ ప్రభావం ఎంతగా పడిందో, ఒక్కసారిగా,వాళ్లు ఎలా తమ సొంత గడ్డపై పరాయివాళ్లలా అణిగిమణిగి, ఒదిగి ఒదిగి నడుచుకోవడం మొదలెట్టారో హృద్యంగా చెప్పిన కథ బిఛ్‌డా చమన్. జహీరా (బెస్ట్ బేకరి కేస్) హృదయ విదారక గాథే పహెచాన్. తనను మృగాల్లా పీక్కుతిని, తన తండ్రీ, తమ్ముడూ, చెల్లిలను దారుణంగా హతమార్చిన వారి గురించి 'కోర్టుల ఆ కుక్కలందర్నీ గుర్తుపట్ట్స జైలుకు పంపిస్తా'అనుకుంటుంది. కానీ కోర్టులో 'ఇతను కాదు, ఇతను కూడా కాదు, నాకు తెలియదు, గుర్తు పట్టలేను, ఎప్పుడూ సూడనే లేదు వీండ్లను'అంటుంది. ఆమె అలా ఎందుకు గుర్తుపట్టనట్టు ఉండవల్సి వచ్చిందో, అలా ఉండడానికి ఎంతగా ఘర్షణ పడిందో పహెచాన్ చెప్తుంది.

'పత్తర్'(రాయి) హృదయవిదారకమైన కథ. మదర్సాలో చదువుకుంటున్న 17 ఏళ్ల అస్రాబానును తల్లికి ఆరోగ్యం బాగాలేదని రెండు రోజుల కోసం ఇంటికి తీసుకెళ్లడానికి తండ్రి (ఖాద్రి) వస్తాడు. కానీ వెళ్లడానికి ఆ అమ్మాయి ఇష్టపడదు. అరె ఎందుకు వెళ్లవు అంటూ వార్డెన్ మందలించి ఆ అమ్మాయిని ఖాద్రి వెంట పంపుతుంది. కానీ ఆ వార్డెన్‌కేం తెలుసు? పదేళ్లుగా ఆ అమ్మాయి ఆ 'తండ్రి'చేత అత్యాచారానికి గురవుతోందని! మానవ సంబంధాల్లోని ఈ అమానవీయతను మనం జీర్ణించుకోలేం. ఇక్కడ ఖాద్రి మృగంలా ప్రవర్తించడం అనేది ఒక అంశమైతే ఈ దుర్మార్గాన్ని అస్రా, ఆమె తల్లి ఎందుకు మౌనంగా భరించవల్సి వచ్చింది అనేది మరో అంశం -ముఖ్యమైన అంశం కూడా. ఎన్నెన్నో సామాజిక బంధనాలు వాళ్లను కట్టిపడేశాయి. లేకుంటే అస్రా, ఆమె తల్లి లాంటి వాళ్లకి అలా దుఃఖాన్ని బిగపట్టాల్సిన అవసరం ఉండదు. 'పఢ్‌నా యా మర్‌నా'(చదవాలె లేకుంటే చావాలే) చదువుకోవడానికి ఒక ముస్లిం యువతి పడే ఆరాటాన్ని చిత్రించిన కథ. 'గాయబీ లద్దాఫ్'(మాయమైన దూదేకులాయన) భిన్నమైన కథ. ఇది నేరుగా మహిళా సమస్యకు సంబంధించింది కాదు. కానీ ఒక సామాజిక సమస్య ఓ మహిళ జీవితాన్ని ఎలా అతలాకుతలం చేయగలదో చెప్పే కథ.

సైతాన్ కూడా బాగా కదిలించే కథ. ఇంజనీరు అయిన అఫ్జల్ తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రేమించిన అమ్మాయిని కాదని తన అత్త కూతురు-అక్తర్-ను పెళ్లి చేసుకుంటాడు. కానీ ఆమెతో మనస్ఫూర్తిగా సహజీవనం చేయలేకపోతాడు. చివరికి మూడేళ్ల కూతురునూ, గర్భవతి

అయిన భార్యనూ వదిలేసి అతను ప్రేమించిన షంషాద్‌ను పెళ్లి చేసుకుంటాడు. 18 ఏళ్ల తర్వాత బిచ్చమెత్తుకుంటున్న భార్య, పిచ్చిదయిన కూతురు కనబడతారు. అఫ్జల్‌లో తీవ్రమైన పశ్చాత్తాపం కలుగుతుంది. అక్తర్‌ను క్షమించమని అడుగుతాడు. ఇంటికి రమ్మంటాడు. షంషాద్ కూడా అక్తర్‌ను రమ్మంటుంది. కానీ అక్తర్ క్షమించదు. అఫ్జల్‌లో అపరాధ భావన పెరిగీ పెరిగీ తనను తానే శిక్షించుకుని మరణిస్తాడు. ఈ కథ పేరు సైతాన్ అనేది అఫ్జల్‌ను ఉద్దేశించే. కానీ మొదటి నుండి కూడా పాఠకులకు ఈ సైతాన్ పట్ల ఓ పక్క కోపమూ, మరో పక్క జాలీ కలుగుతుంటాయి. చివరకు అతని మరణం మనసును బరువెక్కిస్తుంది. అక్తర్ జీవితం అంత విషాద భరితం కావడానికి అఫ్జల్ కారణంగా కన్పిస్తాడు కానీ, నిజానికి ఇక్కడ మనం తప్పుపట్టాల్సింది వివాహ వ్యవస్థను.

భర్త ఎంత హింసించేవాడయినా సామాజిక అభద్రతను తప్పించుకోవడానికి, మహిళ అతనితో కల్సి ఉండాలనే అనుకుంటుంది. అటువంటి మహిళలకు 'తలాక్'అనే మాట ఎల్లప్పుడూ వెంటాడుతూ అభద్రతను కల్గిస్తూ ఉంటుంది. ఆమె ఇష్టాయిష్టాలతో ఏ మాత్రం సంబంధం లేకుండా పురుషుడు తలాక్ అనేస్తే భార్యాభర్తల మధ్య సంబంధం ఇట్టే తెగిపోతుంది. విడాకులు అనే మాట ముస్లిం సమాజంలో పురుషులకు సంబంధించిన హక్కుగానే ఉంది. అయితే ఖులా అనే కథలో జహంగీర్ బీ విడాకుల హక్కు ఆడవాళ్లకి కూడా ఉంటుందని చాటుతుంది.

'బచ్చేదాని'(గర్భసంచి) సంతానోత్పత్తిపై మహిళలకు హక్కు లేకపోవడం, బహుభార్యాత్వం, సౌదీ పెళ్లివంటి పలు సమస్యలను తడుముతుంది.

ఈ మహిళల జీవితాలను రచయిత్రి ఎంతలా కళ్లకు కడుతుందంటే నూరున్నీసా, బదరియా, నఫీజ్, మాలన్ బీ, రషీదా... వీళ్లంతా మనకు ఎంతో సన్నిహితుల్లా అనిపిస్తారు. మన పక్కింటి మహిళలే అనిపిస్తారు. వాళ్లకీ మనకీ నడుమ ఒక గోడ మాత్రమే అడ్డుగా ఉన్నట్టు ఆ గోడకున్న కిటికీలోంచి ఈ మహిళల వెక్కిళ్లు మనకు వినబడుతున్నట్టే అనిపిస్తుంది. ఆ కిటికీని బద్దలు కొట్టుకు వెళ్లలేని మన నిస్సహాయతకు అసహనం కూడా వేస్తుంది.

ఈ కథల్లోని మహిళల వ్యక్తిత్వం వైవిధ్యభరితంగా ఉంటుంది. తమ సమస్యల పట్ల వాళ్ల ప్రతిస్పందనలు పలు విధాలుగా ఉంటాయి. కొందరు మహిళలు తలవంచుకునే ఉంటారు. కొందరు మహిళలు మాత్రం తల ఎత్తుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తారు .

కథకురాలిగా గీతాంజలి పరిష్కారాల్లోనూ వైవిధ్యం చూపించింది. కొన్ని కథలకు ఆమె పరిష్కారం చూపలేదు. కొన్ని కథలకు వైయక్తిక పరిష్కారాలనే చూపింది. కొన్ని కథలకు మాత్రం సామాజిక పరిష్కారం చూపించింది.

ఉనో నహీ మాన్తేలో నూరున్నీసా భర్తను ఎదిరించో, అతనికి చెప్పకుండానో ఆపరేషన్ చేయించుకోడానికి సిద్ధపడదు. కానీ ఆమె కూతురు మునీరా తండ్రికి చెప్పకుండానే తల్లిని ఒప్పించి ఆమెకు ఆపరేషన్ చేయిస్తుంది. ఔలద్‌లో నఫీజ్ సమస్యకు ఎదురొడ్డలేక ఆత్మహత్య చేసుకుంటుంది. ఫాతేహాలో మాలన్ బీ కూడా వారసుడిని కని తన కాపురాన్ని నిలబెట్టుకోవడానికి చివరికి ప్రాణాలే కోల్పోతుంది.

సైతాన్‌లో అక్తర్, భర్త రెండో పెళ్లి చేసుకున్నప్పుడు తనను వదిలెయ్యవద్దనీ పనిమనిషిగానైనా ఉండనీయమని ప్రాధేయపడుతుంది. కానీ భర్త ఆమెను నిర్దాక్షిణ్యంగా వదిలేసి 18 ఏళ్ల తర్వాత తిరిగి ఇంటికి రమ్మని ప్రాధేయపడుతాడు. ఆయన రెండో భార్య కూడా 'నువ్వు వచ్చి రాణిలాగా ఉండు. నేను నీకు సేవలు చేసుకుంటాను'అని వేడుకుంటుంది. కానీ అక్తర్ భర్తను క్షమించలేకపోతుంది. పత్థర్‌లో అస్రా తన టీచర్ సహాయంతో తండ్రి(ఖాద్రి)మీద కేసు పెడుతుంది. దానికి ఆమె తల్లి ఖుర్షిదా బేగం పూర్తిగా మద్దతునిస్తుంది. కానీ ఖాద్రి రెండో భార్య గానీ, సమాజం గానీ దీన్ని హర్షించరు. ఇంటి గుట్టు బయటపెట్టిన 'నేరానికి'తల్లీకూతుళ్ల మీద వీధిలో వెళ్తుంటే రాళ్లు విసురుతారు. దాని నుండి తప్పించుకోవడానికి తల్లీ కూతుళ్లు కాస్సేపు పరుగెడుతారు. కానీ తర్వాత అస్రా నిలబడి తమ మీదికి విసిరిన రాళ్లను తీసుకొని తిరిగి విసరడం మొదలుపెడుతుంది. తల్లి కూడా కూతుర్ని అనుసరిస్తుంది. అలా వాళ్లు సమాజాన్ని ప్రతిఘటిస్తారు. కొన్నాళ్లు జైల్లో ఉన్న ఖాద్రి తిరిగి వచ్చి అస్రా చెల్లెలి మీద అత్యాచారానికి పాల్పడుతాడు. అస్రా మరో చెల్లి దీన్ని సహించలేక రాయితో తల పగులగొట్టి తండ్రిని చంపేస్తుంది. ఇలా ఈ కథలో స్త్రీల చైతన్యం పలువిధాలుగా వ్యక్తమవుతుంది. 'ఖులా'లో సమాజాన్ని ఎదిరించి జహంగీర్ బీ భర్తకు విడాకులివ్వడానికి నిర్ణయించుకుంటుంది. ఆమె అక్క ఆయేషా బీ ఆమెకు పూర్తి మద్దతునిస్తుంది. గాయబీ లద్దాఫ్‌లో భర్తకు చెప్పకుండానే ఫైమీనా ఆపరేషన్ చేయించుకుంటుంది. పఢ్‌నా యా మర్‌నాలో నిషాద్ బేగం కుటుంబంతో తీవ్రంగా ఘర్షణ పడి చదువుకోవాలనే ఆకాంక్షను నెరవేర్చుకుంటుంది. సౌదీ పెళ్లిళ్లకు బలైన బదరియా, జన్నత్, సబా, సవేరా, యాస్మిన్, రషీదాలు తీవ్ర ప్రయత్నం ద్వారానే ఆ బతుకు నుండి బయటపడగలుగుతారు. మై అమీనా బాత్ కర్రైలో అమీనా తన సమస్యకున్న సామాజిక మూలాల్ని కొంతమేరకు అర్థం చేసుకొని సామాజిక పోరాటాల్లోకి వస్తుంది. మొత్తంగా అమీనాను ఈ మహిళలందరికీ ప్రతినిధిగా చూపుతుంది రచయిత్రి.

పురుషుల పాత్ర చిత్రీకరణలోను గీతాంజలి వైవిధ్యాన్ని ప్రదర్శించింది. స్త్రీల సమస్యలను, కుటుంబ హింసను చిత్రీకరిస్తున్నప్పుడు పురుషులే దోషులుగా కనబడుతారు. పురుషులు ఇలా దోషులుగా మారడం వెనుక సామాజిక నేపథ్యాన్ని చెప్పగలిగిందామె. అదే సమయంలో కొన్ని పురుష పాత్రలను ఎంతో మానవీయంగా తీర్చిదిద్దింది.

గీతాంజలి చూపించిన కొన్ని పరిష్కారాలు సహజంగానూ, సరిగానూ లేవు. సబా-సవేరా, జహానుమా గల్లీ నెంబర్ దో కథలకు ముస్లిం రిజర్వేషన్లను పరిష్కారంగా చూపెడుతుంది. ముస్లిం సమాజ వెనుకబాటుతనానికి చదువుల్లోనూ, ఉద్యోగాల్లోనూ వారికి సరైన ప్రాతినిధ్యం లేకపోవడం అనేది ఒకానొక కారణం మాత్రమే. అసలు కారణం సామాజిక సంపత్తిలో వారికి భాగస్వామ్యం లేకపోవడమే. 'మై అమీనా బాత్ కర్రై'లో అమీనా సామాజిక పోరాటాల్లోకి వచ్చే క్రమాన్ని కూడా మరింత సహజంగా చూపించాల్సి ఉండె. మొత్తంగా ఈ కథల్లో రచయిత్రి శిల్పపరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండె.

ఇలా కొన్ని లోపాలు ఉన్నప్పటికీ ముస్లిం స్త్రీల అస్తిత్వ పోరాటాలను చిత్రించిన ఈ కథలు తప్పక చదవాల్సినవి.

లేఖ

జైలు నుంచి దండకారణ్యానికి...

- రవి

ప్రియమైన రూపి,

మనం కలిసి ఎన్నో ఏళ్ళు అయ్యిందికదా! నిన్ను ఈ రూపంలో పలకరించే అవకాశం ఉందేమో అనే ఒక ఆశతో ఈ ఉత్తరం.

నూతన ప్రజారాజ్యాధికార నిర్మాణానికి ప్రత్యక్షంగా పూనుకున్న పోరులో నిమగ్నమైన నీ గురించి నీవు మనదేశ అంతర్గత భద్రతకు ప్రమాదంగా మారిన వివరం అరుంధతీ రాయ్ 'అవుట్‌లుక్' వ్యాసంలో చూసాం. శత్రు నిర్బంధంలో ఉన్న మేం, నిన్ను ఎంతో కాలం తరువాత కలువ బోతున్నాన్నని ఆనందంతో ఎదురు చూస్తున్న అను కూడా శత్రు చేత చిక్కి, వాడి నిర్బంధ శిబిరంలోనే ఉన్న నీ గురించి, మాసె గురించి ఇంకా ఎందరో సహచరుల గురించి చదువుతూ మిమ్మల్ని పోల్చుకుని కలిసినట్టే ఆనందించాం.

నిన్నుకలిసిన అరుంధతీరాయ్ ఒక సమావేశానికి వచ్చినప్పుడు ప్రత్యేకంగా అమ్మ, నాన్నలను పిలిపించుకొని కలిసి చాలా ఆప్యాయంగా పలకరించింది. మాసె అమ్మ, నాన్నలను కూడా. అనుకోని ఈ పలకరింపుతో అమ్మ, నాన్నలు నీ గురించి ప్రత్యక్షంగా తెలుసుకొని ఆనందించారు. గర్వించారు. ఒకప్పుడు తన పిల్లలు చదువుల మీద వేరే ఊరికి వెళ్ళినా కళ్ళనీళ్ళు పెట్టుకునే అమ్మ ఇప్పుడు ఈ విప్లవ రాజకీయాల నిమగ్నతకు గర్విస్తూనే ఉంది తప్ప మరో భావం లేదు. ఎప్పుడైనా కలిసే అవకాశం దొరక గలిగితే బావుండుననే ఆశలు ఉన్నా, కలవలేక పోతున్నానే దుఃఖం లేదు. మీ క్షేమం గురించి మాత్రం అమ్మ, నాన్నలు అందరు అమ్మ, నాన్నల లాగే కోరుకోవడం కొంత ఆందోళన చెందడం మాత్రం సహజమే కదా!

నీవు ఒకందుకు నన్ను క్షమించాలి. నీవు అమ్మ కోసం రాసిన కవితలు, ఇంకా ఇతర కవితలు అమ్మ, నాన్నలకు చేర్చమన్న నీ కోరిక నెరవేర్చలేక పోయాను. ఆ కవితలు ఉన్నప్పుడేమో అవకాశం లేక పోయింది. ఆ తర్వాత నేను అరెస్టయినప్పుడు కంప్యూటర్‌తో పాటు నీ కవితలు కూడా పోయాయి. నీవు ఇతరత్రా అరుణతార వంటి పత్రికలకు పంపేందుకు ప్రయత్నించ గలవు. విభిన్న విషయాలమీద నీవు రాసిన కవితలు చాలా బావుండినాయి. నీ కవితలపై నా అభిప్రాయాలు కూడా తెలపలేక పోయాను అప్పట్లో. నీ కవితా వ్యాసంగం దండకారణ్య సాహితీ వాతావరణంలో, మరింతగా కొనసాగుతోందని ఆశిస్తున్నాను. నీ అక్షరాలను చదివి నిన్ను కలిసినట్టుగా ఆనంద పడతామని మర్చిపోక తప్పక అరుణతారకు నీ రచనలు పంపు. ఈ మధ్యే మూడు దశాబ్దాల దండకారణ్య సాహిత్యోద్యమ చరిత్ర చదివి చాలా ఉత్సాహం పొందాం. ఇతర భాషీయులకు ఉపయోగపడుతుందని దాన్ని ఆంగ్లంలోకి అనువదించే ప్రయత్నం చేస్తున్నాను.

ఇక, ఈ రెండేళ్ళ కాలంలో ప్రజా రాజకీయ భాగస్వామ్యం పెరగడం మనం ఆనందించ గలిగే, గర్వించగలిగే ఒక పరిణామం. నాయిన మొదటి నుంచీ విప్లవ సాహిత్య పఠనం, విప్లవ రాజకీయాల గురించే తెలుసుకోవడం పట్ల ఆసక్తిగా ఉన్నా, ఈ రెండేళ్ళలో రాష్ట్రమంతటా సభలు, సమావేశాలకు వెళ్ళడం పెరిగింది. నాయిన గురించి అరుణతారలో ఉదయమిత్ర కవిత చూసే అవకాశం కలిగిందా? అయితే ఈ విషయంలో అమ్మలో వచ్చిన మార్పే గర్వించ దగిన మార్పు.

నీకు గుర్తుండక పోయి ఉండవచ్చు. నేను 1988లో మొదటి సారి అరెస్టయినప్పుడు అదొక పెద్ద అవమానంగానే అమ్మ భావించి వేరే వాళ్ళతో చెప్పడానికి కూడా నామోషిపడింది. కానీ... ఆజాద్ అమరుడైనాక అంత్యక్రియల ప్రసారం టి.వి.లో చూస్తూ ఏ తల్లి పేగు కదిలిందో కానీ ఉండబట్ట లేక ఆయన అంతిమ సంస్కారానికి వెళ్ళి ఆజాద్ అమర్ హై అంటూ నినాదాలిచ్చింది. (ఆజాద్ కవర్ పేజీతో ఉన్న అవుట్‌లుక్ లోని ఫొటోలో పోల్చుకుని ఉండొచ్చు)

రాంజీ అంత్యక్రియలకు పెద్దపల్లి పోలేక పోయానని బాధపడింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాంజీ సంస్మరణలో జరిగిన కిక్కిరిసిన సభకు హాజరై నివాళులర్పించింది.

ఆజాద్‌లు, రాంజీలు, సూర్యం, అప్పారావులు ఎందరెందరిని ఎన్ని విధాలుగా వాళ్ళ జీవితంలోనూ, మృత్యువులోనూ కూడా ప్రభావితం చేస్తున్నారో కదా!

2009-2011ల మధ్య కాలం 1999 కంటే కూడా గడ్డుకాలంగా దాపురించింది కదా! ప్రజారాజకుమారుడు ఆజాద్‌ను, ఎడారిలోనే పూలు పూయించగల విప్లవ కృషీవలుడు రాంజీ, భారతదేశపు ఝుర్‌ఘొన్స్కీ, కాగలిగిన సూర్యం, అప్పారావులను మనం కోల్పోయాం.

అమ్మ విషయంలో మరొక్క చాలా ముఖ్యమైన పరిణామం గురించి రాసి ఇతర విషయాలు రాస్తా. నీవు ఉండగానే, నిజానికి నీ ప్రత్యక్ష కృషి వల్ల కూడా అమ్మలో కులం విషయంలో వచ్చిన మార్పు కూడా చాలా ఆహ్వానించదగిన మార్పు. నేను, అను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నామని అమ్మతో అందరి కంటే ముందు చెప్పినప్పుడు అమ్మ అడిగిన మొదటి ప్రశ్న ఆమె కులమేమిటని. మాల అని తెలిసిన తర్వాత కలిగిన మొదటి ప్రతిక్రియ దుఃఖం.

ఆ తర్వాత దాదాపు నాలుగైదేళ్ళ వరకు కూడా అను, నీవు ఓపికతో చేసిన పోరాటం అమ్మ తనతో తానుకూడా చేసుకున్నట్టుంది. ఒక క్రమంలో అమ్మలో వచ్చిన మార్పు ఎంతో సహజమైన మార్పుగా మారిందంటే ఈ విషయంలో అమ్మకు అందరికంటే పెద్ద సర్టిఫికెట్ అమ్మకు తెలియకుండానే ఇచ్చింది అను. అమ్మ గురించి అను నాకు రాసిన ఉత్తరమే అమ్మకు ఒక పెద్ద కాంప్లిమెంట్.

నూతన సంస్కృతీ నిర్మాణంలో ప్రత్యక్షంగా పాలుపంచుకుంటున్న నీకు ఈ సాంస్కృతిక మార్పు స్ఫూర్తినిస్తుందని ఈ విషయం రాసాను.

కా. అప్పారావును పట్టుకున్న సమయంలోనే పూణెలో కా. కొండారెడ్డిని కూడా పట్టుకొని బూటకపు ఎన్కౌంటర్లో కాల్చి చంపారు కదా! మన మాధవి ఆ టైంలో ధైర్యమైన అడుగు వేసి తన సహచరుడు కొండారెడ్డిని పూణెలో పట్టుకున్నారని వెంటనే పూణె నుండి హైదరాబాదు వచ్చి ఏపిసిఎల్సి సహాయంతో రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ముందుకు, మీడియా ముందుకు వచ్చి ప్రకటించింది. ప్రస్తుతం తన కాళ్ళపై తాను నిలబడే ప్రయత్నం చేస్తూ అమరవీరుల బంధు మిత్రుల కమిటీలో పనిచేస్తోంది.

కా. అప్పారావు మరణ వార్త విన్నప్పుడు చర్లపల్లి జైలులో ఎంతోమంది అధికారులు, జవాన్లు కూడా ఆయునను తలుచుకొంటూ నివాళులర్పించారు.

కా. కొండారెడ్డి, సూర్యం, ఆజాద్లను పోలీసులు పట్టుకున్న విషయానికి సంబంధించి ప్రత్యక్ష సాక్ష్యాలున్నా పోలీసులను చట్ట పరిధిలో శిక్షించడానికి అవసరమైనంతగా పౌరహక్కుల ఉద్యమం చేయలేక పోయిందని నా కనిపిస్తుంది. గుజరాత్లో సొహ్రాబుద్దీన్ కేసు విషయంలో, ఇంకా ఇతర విషయాల్లో ఐ.పి.ఎస్. ఆఫీసర్లు సైతం జైలు పాలయ్యారు కానీ, ఇంత ప్రత్యక్ష సాక్ష్యాలున్నప్పుడు కూడా అవసరమైన చర్యలు పౌరహక్కుల ఉద్యమం చేపట్టలేక పోయింది. గుజరాత్ విషయంలో పాలకవర్గాలలోని ఒక సెక్షన్ రాజకీయాల వల్ల అవి సాధ్యమైతున్నదనేది వాస్తవమైనా, ఈ విషయంలో మాత్రం చేపట్టవలసిన చర్యలు దృఢమైన పట్టుదలతో చేపట్టలేకపోయింది.

ఇక తెలంగాణ ఉద్యమ విషయానికి సంబంధించి మన కుటుంబం నుండి కూడా ఒకరు ఆత్మ బలిదానం చేసుకున్నారు. మన రామన్న (అందరికీ రామశర్మగా పరిచయం కదా!) ... నెలలో తెలంగాణ కోసం అంటూ ఉత్తరం రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. తన అంత్య క్రియల్లో ఎటువంటి బ్రాహ్మణ కర్మకాండ ఉండ కూడదని, తెలంగాణ వాదులే తన చితికి నిప్పు పెట్టాలని రాసిపెట్టి చనిపోయాడట. ఆయన కోరుకున్న విధంగానే అంత్యక్రియలు జరిగాయి. పెద్ద నాన్న చనిపోయిన కొద్దినెలలోనే పెద్ద కొడుకిట్లా ప్రాణాలు తీసుకోవడం పెద్దమ్మకు పెద్ద దెబ్బే అయినా ఆయన అంత్యక్రియలలో తెలంగాణ కోసం నినాదాలిచ్చింది పెద్దమ్మ.

తెలంగాణ ఉద్యమ ప్రభావం తెలంగాణ ప్రజలపై ఎంత ఉందో అంచనా ఉండే ఉంటుంది. అయితే రాజకీయాలకు దూరంగా ఉండే వాళ్ళెందరో ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ "నిర్మల చిన్నమ్మ. తను ఇప్పుడు జిల్లా స్థాయి మహిళా ఉద్యమ నాయకురాలిగా ఎదుగుతున్నదని విన్నా.

రామన్న విషయంలో బయటకు తెలియని మరోకోణం ఉంది. నేను చర్లపల్లి జైలులో ఏడాదిపాటు ఉన్నప్పుడు నన్ను రెండు మూడు సార్లు కలిసాడు. అప్పుడు ఆయన జీవితంలోని మరో అజ్ఞాత కోణం గురించి తెలిసింది. ఆయన మహబూబ్నగర్ జిల్లాలో పౌరహక్కుల సంఘం మీద నిర్బంధ సమయంలో అక్కడి యూనిట్కు రాజీనామా ఇచ్చి హైదరాబాద్ మారిన తర్వాత, విప్లవోద్యమానికి చేరువ కావడమే కాక రహస్యంగా మద్దతునిస్తూనే ఉన్నాడు. నిప్పులు చెరుగుతున్న ఆనాటి నిర్బంధ సమయంలో ప్రాణాలకు తెగించి ఉద్యమానికి అతను అందించిన సహకారం విని ఆశ్చర్యపోయాను. అతనికి మన అన్నగానే కాకుండా ఒక కామ్రేడ్గానూ జోహార్లు.

ఆంధ్రప్రదేశ్లో విప్లవోద్యమం పెను నష్టాలను ఎదుర్కొన్న నేపథ్యంలో నాయకత్వం, ఉద్యమం అక్కడి నుండి తాత్కాలికంగానైనా రిట్రీట్ కావడంతో తనకు పార్టీతో సంబంధం తెగిపోయి ఒక నిరాశకు గురై దానికి తోడు వ్యక్తిగత జీవితంలోని వైఫల్యాలతో కూడా చితికి పోయాడు. జీవితానికి ఏదో విధంగా సార్థకత చేకూర్చుకోవాలని అనుకున్నాడో, ఏమో తెలంగాణ కోసమంటూ తన ప్రాణాలర్పించాడు.

తెలంగాణ ఉద్యమమే కాక, విప్లవోద్యమం కోసమూ అజ్ఞాతంగా బాధ్యతలు నిర్వహించిన ఒక మంచి సానుభూతి పరుణ్ణి కోల్పోయింది.

ఒకవైపు తెలంగాణ ఉద్యమం ఇట్లా ఊపులో ఉన్న సమయంలో విప్లవోద్యమం ఆంధ్రప్రదేశ్లో ముఖ్యంగా తెలంగాణలో బలహీన పడి ఉండడం ఒక విషాదమైతే, సామ్రాజ్యవాదం మన ఎరుకలో ఎన్నడూ లేనంత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. సంక్షోభంలో నుండి బయటపడడానికి మన దేశ వనరులను మరింత కొల్లగొట్టడానికి వ్యూహాలు రచించారు. మన్మోహన్, చిదంబరం, జైరాం రమేశ్ వంటి దళారులతో చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎన్నో ప్రజావెల్లువలు చెలరేగుతున్నాయి. లాల్గఢ్, నారాయణపట్నం వంటి విప్లవ ప్రజావెల్లువలు దేశ వ్యాప్తంగా కూడా ప్రజా ఉద్యమాలకు, విప్లవోద్యమానికి వారధిగా మారుతున్న సమయంలో ఆ వెల్లువకు సారథ్యం వహిస్తున్న కిషన్జీ వంటి నాయకుడితో సహా కేంద్ర కమిటీ స్థాయిలో పెద్ద ఎత్తున నాయకత్వాన్ని అరెస్టులు, బూటకపు ఎన్కౌంటర్ హత్యలలో కోల్పోవడం ఒక చారిత్రక విషాదం. కా. గణపతి ఒక ఇంటర్వ్యూలో అన్నట్టు విప్లవోద్యమం, విప్లవ పరిస్థితులూ, సంక్షోభమే అవసరమైన సంఖ్యలో ప్రజావీరులను, నాయకులను సృష్టించుకుంటుందని ఆశిద్దాం.

కవిత్వం

వేచి ఉండు

నా కోసం వేచి ఉండు, నేను తిరిగి వస్తాను
అయితే దృఢంగా వేచి ఉండాలి సుమా
నీవు దుఃఖాల్లో మునిగి ఉన్నప్పుడు వేచి ఉండు
పసుపు పచ్చటి వర్షాన్ని చూస్తున్నప్పుడూ
మంచు తుఫానులమీంచి
గాలి దూసుకుపోతున్నప్పుడు వేచి ఉండు
చెమటలు కక్కే ఎండలో వేచి ఉండు
తమ నిన్నల్ని మరచిపోతూ
ఇతరులు వేచి ఉండడం మానేశాక వేచి ఉండు
సుదూరాల నుండి నీకు ఉత్తరాలు రావడం మానేశాక
కూడా వేచి ఉండు
ఇతరులందరూ వేచి ఉండడానికి అలసిపోయాక
కూడా వేచి ఉండు
మా అమ్మా, నా కొడుకూ నేనిక లేనేమో అనుకున్నాక
కూడా వేచి ఉండు
దోస్తులు మంట చుట్టూ కూర్చుని
నా స్మృతికి తాగినప్పుడు
వేచి ఉండు, నువ్వు నా స్మృతికి తాగడానికి
తొందరపడకు
వేచి ఉండు
ఎందుకంటే మృత్యువులన్నిటినీ ఎదిరించి
నేను తిరిగి వస్తాను
అప్పుడిక వేచి ఉండని వాళ్లని అననీ నేను అదృష్టవంతుడినని
వాళ్లకెప్పటికీ అర్థం కాదు
మృత్యుముఖంలో ఉన్న నన్ను
నీవు నీ ఎదురుచూపులతో కాపాడావని
నీకూ, నాకూ మాత్రమే తెలుస్తుంది
నేను ఎలా బతికి బట్టకట్టానో
అది నీవు నా కోసం వేచి ఉండడం వల్లే
మరెవ్వరూ వేచి వుండనట్టుగా

(రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సోవియట్ యూనియన్‌లో పదుల వేలమందికి కంఠతా వచ్చిన కవిత ఇది. ఇంగ్లీషు నుండి అనువాదం - షహీదా)

సామ్రాజ్యవాద సంక్షోభపు ప్రత్యక్ష ప్రభావం మన వాళ్ళ వాకిట్లోకి కూడా అడుగుపెట్టింది. గత ఇరవై ఏళ్ళలో మన కుటుంబ సభ్యులు, బంధువులు ఉద్యోగాలవేటలో అమెరికా, బ్రిటన్ వంటి దేశాలకు పెద్ద సంఖ్యలో వెళ్ళారు కదా! సబ్‌ప్రైమ్ సంక్షోభ ప్రభావం, ఇతర సంక్షోభ ప్రభావాలు వాళ్లమీద కూడా పడ్డాయి. ఇట్లా సామ్రాజ్యవాద సంక్షోభం వల్ల అమెరికా గాలి బుడగ బద్దలై వెనక్కు వచ్చే వారి వల్ల ఇక్కడి ఉద్యోగ అవకాశాలపై, జీతభత్యాలపై మరింత ప్రభావం పడడం తథ్యం. ఇది నిరుద్యోగంపై, నిరుద్యోగ యువకులపై వేసే ప్రభావాన్ని కూడా విప్లవోద్యమ అభివృద్ధి వైపు మలిచేందుకు మనం సృజనాత్మకంగా పట్టణాల్లో పని చేయడాన్ని అభివృద్ధిపరచుకోవలసి ఉంది.

ఇక మా గురించి -

నేను, అనూ ఇద్దరం ప్రస్తుతం హజారీబాగ్ జైలులోనే ఉన్నాం. హజారీబాగ్ జైలు అనగానే మేరీ టేలర్ 'భారతదేశంలో నా జైలు జీవితం' చదివిన వాళ్ళకు గుర్తుకువచ్చే అవకాశం ఉంది. మేరీ టేలర్ ఉన్న మహిళా వార్డులోనే అనూ ఉంది. ఈ జైలుకు చాలా చరిత్ర ఉంది. 120 ఏళ్ళకు పై బడిన జైలు ఇది. మొత్తం ఝార్ఖండ్ ప్రాంతంలో ఉన్న ఏకైక సెంట్రల్ జైలు-ఝార్ఖండ్ ఏర్పడ్డాక, వేరే ఏ ప్రగతి లేదుకానీ మరో నాలుగు సెంట్రల్ జైళ్లు మాత్రం ఏర్పాటయ్యాయి. హజారీబాగ్ సెంట్రల్ జైలు నుండి జయప్రకాశ్ నారాయణ 1942లో గోడ దూకి తప్పించుకున్నాడు. ఆయన పేరు మీద ఈ జైలును జయప్రకాశ్ నారాయణ కేంద్రకారాగారం అని పేరు పెట్టారు. ఆయన ఉన్న వార్డు ఒక చిన్నపాటి మ్యూజియం లాగా మార్చారు. ఇంకా ఈ జైలులో రాహుల్ సాంకృత్యాయన్, సుభాష్ చంద్రబోస్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, రాజేంద్ర ప్రసాద్, కర్పూరి ఠాకూర్ వంటి నాయకులనెందరినో స్వాతంత్ర్యోద్యమ కాలంలో నిర్బంధించారు. 1972లో నక్సలైట్లు జైలు నుండి తప్పించుకునే పెద్ద ప్రయత్నం చేసారు. అది విఫలమైంది. అప్పుడు జరిపిన కాల్పుల్లో 14 మంది నక్సలైట్ నాయకులు అమరులు అయ్యారు.

ఇక అనూ పైన (నా పైన కూడా) హజారీబాగ్‌లో నాలుగు తప్పుడు కేసులు పెట్టారు. రెండేళ్ళ తర్వాత బెయిల్‌పై 2011 సెప్టెంబర్‌లో విడుదల అవుతుందని ఆశించాం. బెయిల్ బాండ్లపై సంతకాలు కూడా అయినాక ఆఖరి నిముషంలో ఆమెపై మరో కేసు పెట్టారు. తర్వాత వేరే జిల్లా కేసు కూడా పెట్టారు. దీనికి తోడు అనూపై సి.సి.ఎ. యాక్టు కింద ఒక సంవత్సరం పాటు డిటెన్షన్ విధించారు. కాబట్టి 2012 అక్టోబర్ వరకు కనీసం అనూ జైలులో ఉండాల్సిందే. సి.సి.ఎ. యాక్టు అంటే క్రైమ్ కంట్రోల్ యాక్టు. ఝార్ఖండ్ లో ఇది పి.డి. చట్టం లాంటిది. ఈ చట్టాన్ని ఈ మధ్య కాలంలో చాలా మంది విప్లవోద్యమ నాయకులపై ప్రయోగిస్తున్నారు. కేసులన్నీ అయిపోయాక దీన్ని ప్రయోగిస్తున్నారు. కాబట్టి కనీసం మరో ఏడాది పాటు అనూకు జైలే పాఠశాల. పోరాటశాల.

వాళ్ళు, మేము, అమ్మా, నాయినలు, ప్రకాశ్ ఇంకా అందరూ నీ రచనల్లో నిన్ను చూసుకుంటామని మరోసారి గుర్తుచేస్తూ నీ రచనలకై ఎదురు చూస్తుంటాం. కలిసే రోజు వీలైనంత త్వరలో రావాలని ఆశపడుతున్నాం.

నీకు, నీ జీవన సహచరుడికి, ఇతర సహచరులందరికీ మా ఇద్దరి విప్లవాభివందనాలతో.

- నీ రవన్న

మా బడి

ఎం. రాఘవాచారి

కూల్చిన గోడలు
రాల్చిన ఇటుకలు
ఎగిసి ఎగిసి పడుతున్న
దుమ్ముధూళి కింద
నేలమీద ఆకాశాన్ని పరిచినట్టు
తారుమీద జారిపోయే వాహనాల
కుదించిన మైదానంలో మాబడి

ఆ ఇల్లు మరొక ఇల్లు
విసిరిన అందమైన చుక్కలు
నక్షత్రాలు నేలకు దిగి ఆడుకుంటున్నట్టు
ప్రకృతిలోని వర్ణాలన్నీ
పరవశంలో కౌగిలించుకుంటున్నట్టు
మా పిల్లలు

అవతల ఆకాశపు గొడుగుకింద
జరుగుతున్నదేమిటో
చిన్నచిన్న అంగళ్ళను మింగుతున్న
ఏ వ్యాపారం జీవితాల్ని కమ్మేస్తున్నదో
ఎంతెంత వ్యాపారం
నేలను ఆకాశాన్ని పిడికిట్లో పట్టిబిగిస్తున్నదో
విరిసీ విరియని మొగ్గల్ని
గాలికి సుగంధాలద్దే పూవుల్ని
ఎట్లా తుంచేస్తున్నదో
ఊహలకందని పిల్లల ప్రపంచం మాబడి

పైపైన అందనివేవైనా
తెలియాలంటే... పదండి...
వేర్లలోకి తలుపులు తెరుచుకుంటే తప్ప
తెలియవు నిజాలు
కత్తిరిస్తున్న వేర్లను
తిరిగి తిరిగి అతికించుకునే
యాతనలో పిల్లలు

అంటాడొకడు
అమ్మ అనే మాట వింటేనే
కన్నీళ్ళుకురుస్తాయని
గొంతు పూడుకుపోతుందని
అనారోగ్యానికి
ఆ పూటకు లేని క్రౌర్యానికి
చూస్తూ చూస్తుండగానే
రాలిపోయిన అమ్మ బొమ్మగా
కన్నీటిలో రూపుకట్టుకున్నదని
మరొకరంటారు
అమ్మానాయిన తమకు తెలియరని
ఎంతకష్టం
తల్లిదండ్రుల్ని పిలుచుకురమ్మనే మాట
ఎట్లా తట్టుకుంటారు వాళ్ళు
ఒంటరి పిల్లల ఏడుపునిండిన సముద్రం మాబడి

మరికొందరుంటారు
ఏడ్చితప్ప సాధించుకోలేని వాళ్ళు
ఏడిపిస్తే తప్ప
ఏదీ నెరవేర్చుకోలేని వాళ్ళు
వాయిదాల అగాధంలో
దొరకని తీరంకోసం సంఘర్షించే వాళ్ళు
అడిగీ అడిగీ అడిగి ఆగిపోయిన వాళ్ళు
అన్నీ దండిగా ఉన్న దేశంలో
అన్నీ నిండుకున్న జీవితాలు వాళ్ళ తల్లిదండ్రులు

అప్పుల భాగహారాలు
ఆస్తుల తీసివేతలు తప్ప
వారసత్వంగా ఏవీ దక్కని వాళ్ళు
పంచుకున్న అప్పులు
సంసారాలను పంటచేలను చుట్టిన అప్పులు
వ్యాపారపు తడిగుడ్డలు
బిగుసుకుంటున్న బతుకులు వాళ్ళ తల్లిదండ్రులు

ఈ పిల్లలు
విలవిలలాడున్న జీవితాలు
గాలానికి చిక్కిన చేపలు
రాల్చిన కన్నీళ్ళు

ఎంత ఇష్టంగా కని ఉంటారు వీళ్ళని
ఎంత కష్టమైపోయింది పెంపకం

బిడ్డను పనిలోకి దింపి
గిజగిజలాడుతున్న తల్లికి
తోడూలేక నీడాలేక
పనిలోనే మిగిలిన బిడ్డకి
హెచ్చరికలు జారీ చేయకండి
పనిలో వాళ్ళు నడుస్తుంటే
రెక్కలు అరుగుతున్న చప్పుడు వినండి
మీ స్పందన మొద్దుబారిపోతే
క్షమించుకోండి మిమ్మల్నిమీరే

మేమూడున్నాం
నీళ్ళలోంచి ఆకాశంకింద
మొలిచిన నేలమీద
నాల్గు జీతపురాళ్ళకోసం
సంతకాలు చేస్తున్నవాళ్ళం

ధిక్కారం తప్ప
ఏదీ తోడు రాదని
తెలుసుకుంటున్న పిల్లల
దైన్యహృదాయాలలో
సంతకానికింత చోటుకోసం
తండ్లాడుతున్న వాళ్ళం

మాబడి పిల్లలు మేము
ఎవడెవడి ఆనందానికో
ఎగరేసిన
రంగురంగుల పతంగులమైనాం

దారం ఆధారంగా
నేలకు దిగుతాం
తల్లి ఒడిలాంటి ఒక బడికి రూపుకట్టి
కొత్త అక్షరాలు దిద్దుకుంటాం.

చైతన్య ప్రకాశ్ నాలుగు కవితలు

ఉక్కు నమ్మకాలపై ఉక్కు పాదం

ఒక పొద్దుగల్లటి పూట ఎర్రటి దుమ్ము పొగలో
మీదిమోటర్ నుంచి దిగిదిగంగనే
రాయపూర్ నన్నాహ్వానించింది
ఆదివాసి ఎర్రటి కన్నీళ్ళు మాడిన
కషాయం పారే కాల్వలు
అడవినీ అడవి సంపదనూ
ముట్టడించడానికి
లైసెన్స్‌డ్ శిబిరాలు
గుట్టల్లోంచి విలవిలలాడి చిమ్ముతూ
ఇనుప పొరల్లోంచి ఎర్రర్రని నీళ్ళు
రాజ్‌నంద్‌నాక్ నన్నాత్మీయంగా
హత్తుకున్నది
మాన్‌పూర్ అచ్చం
మా మానాల తండాలా ఉన్నది

ముసలమ్మకు ముద్దపెడ్తూ కాదు
పిల్లవానికి చదువు చెప్తూకాదు
రోగిని పరీక్షిస్తూ కాదు
దయానీయమైన మనుషుల్ని
మరోచోటుకి మోస్తూ కాదు

ఓపికగా ఉదారంగా మర్యాదగా
వినయాతి వినయంగా
ఓటేయడానికి చాతగాని ముసలమ్మకు
చిటికెన వేలితో చేయూతనిస్తూ
శిబిరమ్ముందు పోలీస్ కటౌట్
నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది
అటవి సంపద మోస్తూ లారీలు
ఖనిజ సంపద తవ్వుతూ కార్మికులు
జనం భయంతో మూతబడ్డ కంపెనీలు
చెరువులో స్నానాలు చేస్తూ ఆదివాసీలు
ఆవుల మందలు కాస్తూ పిల్లలూ
గొర్రెల్లో గొర్రెలై మసలుతూ
మరికొందరు పిల్లలూ
కండ్లకు కట్టినట్టు
ఎవడి గుండెను వాడే తవ్వి ఇవ్వడానికి
స్వచ్ఛందంగా ముందుకొచ్చి నిలబడ్డట్టు
'దల్లి హౌజ్' మైన్ మ్యాన్'
పారెత్తి నిలబడ్డ రాతి విగ్రహం

గుట్ట గుట్టకు గురిపెట్టిన తుపాకులు
పొద్దుగూకితే భయం
తెల్లారితే భయం
అడివంటే నాకే కాదు
చెట్టును ప్రేమించే వాడికే కాదు
ప్రాణుల్ని ప్రేమించే వాడికే కాదు
ఎటొచ్చి ప్రాణాలు తీసే
ప్రాణాంతక ప్రణాళికలు రచించే
వాళ్ళతోనే భయం

మైలు మైలుకీ శిబిరం
అక్కడ ఎవరున్నారని
విదేశీ విద్రోహ శత్రువులెవున్నారని
ఆరోగ్యమందని అక్షరాలు దొర్కని
అన్నపానాదులు నోచుకోని
అమాయక ప్రజలున్నారు
మోసమెరుగని నోరులేని మనుషులున్నరు
అంతకన్నా స్వచ్ఛమైన కాలుష్యమెరుగని
జీవులున్నారు

అక్కడేమొచ్చిందని
అమానవ అనాగరిక యుద్ధం?
మట్టి బంగారమని తెల్సిన కాన్నుంచి

మన్నున వట్టని బహుళ మూర్ఖత్వం
మానవ రహిత విమానాలు
దోచుకునే దొంగ చూపులు
ఎందర్ని కాల్చి అయినా సరే
ఎన్ని కొంపలు కూల్చైనా సరే
కాజేయాలని కాపు కాసి ఉన్నది
రాయపూర్ నుంచి నాగ్‌పూర్ పయనిస్తూ
నిలువ నీడనియ్యని కుట్ర
మోహరించి ఉన్నది
ఇనుమునూ ఇనుములాంటి మనుషుల్ని
మింగేయాలని
నెత్తుటి పిపాసి యుద్ధ భీహర వ్యూహం

కర్రెటి కడాయి కాలుతున్నది
ఎర్రలు కు పొయ్యిలకేయి
చాయ ఉడుకుతున్నది
మాన్‌ఫ్యాక్టర్‌లో మా సిరిసిల్లా కనబడ్డది
మా గొల్లపెల్లి కనబడ్డది
మా ఎల్లారెడ్డి పేట్ కనబడ్డది
రాయపూర్‌లో మా కరీంనగర్ కనబడ్డది
అడవి అడవంతా దృశ్యమానం
తాలూకా పట్టణాలింకా
జనంకోసం తొవ్వలియ్యలే
ఎప్పుడు ఎప్పుడా అని మట్టిని నమిలి
పోరుగు వాడి చేతిలో పెట్టాలని
ప్రజాస్వామ్య తుపాకుల చేతుల మీదుగా
ఎదురు చూస్తున్నవి
బోరియా బోరియాకు
చెప్పరాని దిగులు విషాదం
కమ్ముకున్నది

నీరూ అడవీ భూమీ
తమగాలి తమదేనని
తమ బిడ్డలకు ధీమానిస్తూ
నిలబడ్డ ధైర్యం
ఓటమెరుగని యుద్ధ నేపథ్యం
దాని స్వతంత్ర పూర్వగాథ
విన్పిస్తున్నది

తెలంగాణ – ఒక చెరుకు సుధాకర్

సత్యమేవ జయతే వేలాడ్తూ
ప్రభుత్వాలు అబద్ధలాడ్తుంటయ్
నిరంతరం కోర్ కమిటీ డ్రామా
తెలంగాణ ప్రక్రియ ప్రారంభం
రోడ్‌మ్యాప్ కాంక్రీట్‌వర్క్
పెద్దల ఒప్పందం ఫజల్ అలీకమిషన్
ప్రణబ్ కమిటీ రోశయ్య కమిటీ శ్రీకృష్ణ కమిటీ
తర్వాత కూడా
ఆజాద్ పరిశీలన జీరో నుంచి
ప్రారంభం అవుతుంది
నమ్మిన మాటల్లో భావితరం
బలిదానాలకు సిద్ధపడ్తుంది
ఇవేవి రాజద్రోహం కానేరవు
తప్పుకోవడానికి తట్టుకోవడానికి
పదాల అన్వేషణ
అసాంఘిక శక్తుల ప్రమేయం బూచి
పైసలున్నోని ప్రసారమాధ్యమం
ఏకాభి ప్రాయ సాధన తప్పని సరి
ఎన్ని మాటలని వినాలి?
బలమున్నోనిదే బడితే
అరచేవాని గొంతు నులుమడానికి
ఎనిమిదో అధ్యాయం
చిదంబర రహస్యం
తెలంగాణ పోలీసుమేళా
నమ్మకాలే బలీయంగా
తెల్సినవానికైనా తెల్వని వానికైనా
కొన్ని విశ్వాసలుంటయ్
రాటుదేలిన వానికి రాగిల్లిన వానికి
మరికొన్ని అదనంగా
తన జీవితకాల పొడగింపుగా
వారసత్వ పరంపరగా
రాజకీయ విశ్వాసలుంటయ్
ఏలేవానికి ఎన్నో విశ్వాసలుంటే
జీవించే వాడికి పోరాడే వాడికి
ఒకే ఒక విశ్వాసముంటే తప్పేం?
రెండు కండ్లైనా డెబ్బయి కండ్లైనా
ఒకే దృశ్యం
రైతు నడ్డి విరిచి రైతు మీద శోకం
అయ్య పోయినా తక్కుమీదే చూపు
కడుపు కాలి నెత్తురుడికి
జనానికెన్ని తొవ్వలు కనబడాలి?
నలుబైఏండ్ల నక్సల్బరీ అయినా
యాభైఏండ్ల తెలంగాణ అయినా
దుమ్ము దులిపి దుక్కి కడ్డం బెట్టిన
దిక్కు మాలిన చట్టాలైనా
మా చెరుకు సుధాకరన్న

ఒక సాదృశ్యం
ఇజాలు ఎవరికైనా ఉంటయ్
విజన్ లే వేరు వేరు
అది తెలంగాణ నిజమైంతర్వాత కూడా
నాసా ఎస్మా నలుపును తుడుచుకుంటూ
తెలంగాణ ఒక చెరుకు సుధాకర్

మనకు మనమే

పుట్టుకైతేనేం చావైతేనేం ఒకే తీరు
తెగువ ఒక మార్గం
బతికించలేని జీవించనియ్యని
ముందట ఒక యుద్ధం
ఓటేయకుంటే చచ్చినట్టే లెక్క
ఓటేసినావంటే చావడం గ్యారంటీ
నీ ఇంటి ముందట
ఒక పచ్చటి అడవి ఉంది
నీ ఇంటి వెనుక
సిరులు ఒలికే ఒక గుట్ట ఉంది
ఆ మాత్రం చాలు
నీవు బతుకడానికైనా చావడానికైనా
దేశ సరిహద్దులు ప్రమాణం కానేకావు
నీ చుట్టూ నీ ఇంటి పరిసరాల చుట్టూ
మరణం సదా స్మరణం
సార్వభౌమాధికారం సర్వసత్తాకం
చదువుకోవడానికైతే బలేగుంటది
ఉద్యోగించడానికైనా సంపన్నులచుట్టూ
దండంబెడ్తూ చుట్టూ మెలికలు తిరగడానికైనా
వినయాతి వినయంగా ఉంటది
అంతా సరి సమానమని
రాసుకున్నది బరాబరే
ఎటుజూసినా లెక్క బరాబరే
ఎవలం ఎవలకు గాకుంటా
ఎవలకు ఎవలు లేకుంటా
పుట్టుక నుంచి మరణం దాకా
ఒకానొక మానవ కృత్రిమ వలయం
కొద్ది కొద్దిగానైనా
ఎవరో కొద్దిగానైనా
ఎవరో కొద్ది గొప్ప వారి గురించి కాకుండా
మనం మన గురించైనా ఒక జీవిత కాల యుద్ధం
తెగబడితే ఎప్పటికైనా మన వారసులు విముక్తం
చెప్పే వాడెవ్వడో వింటూ మనం లోకువై
ఎవలమో మనమై ఒక పరాయీకరణ
ఎటువెట్టి ఇది మనదేశం
దీని పేరు ప్రజా స్వామ్యం

ఉన్నోనికి పెరుగుతుంటది
లేనోనికి తరుగుతుంటది
నిజమైనా అబద్ధమైనా
మనకు మనంగా

నడక

వాడు మట్టిమీద పుట్టి
మట్టి కోసమే మాట్లాడిండు
చెట్టులో చెట్టైండు గుట్టలోగుట్టైండు
మనిషై పుట్టినందుకు
మనిషి కోసమే మాట్లాడిండు
వాన్నెట్లా పట్టుకుంటవ్?
వాన్నెట్లా మట్టుబెడ్తవ్?
వాన్నెందుకు అట్లా వేధించి వెంటాడ్తవ్?

స్వప్నాల్ని సాకారం చేసుకుంటాన్కి
ఎవరి సొమ్మేం తిన్లే
అడ్డమచ్చినోని మెడలు వంచడాన్కి
కేవలం చేతులే నమ్ముకొని
తనకాళ్ళ మీద తానే నిలబడ్తూ
జబ్బకు సంచేసుకొని
సంచారియై బయలెల్లిండు

మన్నుకు బువ్వయ్యిండు
చెట్టుకు పువ్వయ్యిండు
మనిషికి మాటయ్యిండు
వాన్నెట్లా తీసేస్తవ్?
వాన్నెట్లా నిషేదిస్తవ్?
మరణించిన కొద్దీ మళ్ళీ మళ్ళీ లేస్తుండు

గుట్టమీద గుండయ్యిండు
మొగులు మీద పొద్దయ్యిండు
వాగులో ప్రవాహమయ్యిండు
ఉసికెలో జెకమొకరాయి అయ్యిండు
దేశానికో బాష అయ్యిండు
బాధకో ముఖమయ్యిండు
గుండెకో దిటువయ్యిండు
చీమల కొలువయ్యిండు
యాడని దొర్కవడ్తవ్?
ఎట్లని నిర్మూలిస్తవ్?

నిటారుగానే నిదానంగా నడిచిపోతున్నడు
వేదనాపర్యంతం నడక సాగుతనే ఉన్నది

ఉరిమినపుడు మెరుపయ్యిండు
తరిమినపుడు ఆకాశంలో చుక్కయ్యిండు
గాలిలో గాలయ్యిండు
నీటిలో చేపయ్యిండు
యాడని గాలిస్తవ్?
హిందూ మహాసముద్రంలో మునిగి
బంగాళాఖాతంలో తేల్తడు
కరీంనగర్‌లో గురిపెడ్తే
కలకత్తాలో మిగుల్తడు

వాడిప్పుడు మౌనాన్కి
భాష్యమయ్యిండు
తీరొక్క భాషల్ల జనం పాటయ్యిండు
వాడెట్లా మరణిస్తడు?
కూంబింగ్‌లు బాంబింగ్‌లు కాలాతీతం కావు
వానలో వానయ్యిండు
చలిలో చలయ్యిండు
ఎండలో ఎండయ్యిండు
వాన్నిప్పుడు ఎట్లా ఏరివేస్తవ్?

అట్లా వాడు సాదాసీదాగా
తిరుతనే ఉంటడు
ఒక్కన్ని పడితే
ఒక్కనిమించి మరొకడు
బయలెల్లిన వాడొక్కడే కాదు
మరింత సమూహంగా పేనుకుంటూ
వాడిప్పుడు సమాజానికి పర్యాయపదం
ఏమాటకామాటే సమాధానంగా
ప్రత్యర్థుల చేతుల ధరింపే ప్రత్యమ్నాయంగా
అడుగు అడుక్కు
వేగంగా అతివేగంగా
ఒక్కసారి ప్రారంభమైందా
నడకో సుడిగాలి
భూగోళాన్ని చుట్టుముట్టిందాకా
ఆగనే ఆగడు
పక్షిలో పక్షై పరుగెడ్తూ
అది విహంగవిస్తారమే

మనిషికి మరణముండొచ్చు
గెలిచే దాకా మాటకు మరణమే లేదు
పేలిన తూటా మరణించవచ్చు
తుపాకీ కాలం చెయ్యొచ్చు
కిందా మీదా పడి మనిషి మాత్రం లేస్తడు
మనిషి మాత్రం నడుస్తడు

మనిషిని కరిచే మర్మమేదో
అమానవుడు లెంకుతనే ఉంటడు
వాడు మట్టి మనిషి కాబట్టి
గట్టి మనిషి కాబట్టి
మట్టినే ప్రేమిస్తడు
మట్టినే పూజిస్తడు
మట్టిమీద
సమస్త ఆధిపత్య అహంకారాల్ని
వాడెప్పటికైనా
మట్టిలోనే కలుపుతడు

వాడెప్పుడూ
కాలంతో సమాంతరంగా
నడిచిపోతుంటడు
వానికి మరణమేంటిది?
జననమేంటిది?
మట్టిలో మట్టై చెట్టులో చెట్టై
సదా మనుషుల్లో జీవిస్తుంటడు
(ఆజాద్ స్మృతిలో)

రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటి రష్యన్ కవిత

సహచరి కవితలు రెండు

అమ్మా... ఆ శోకం నీది కాదు!

నా కొడుకులు చనిపోతే
నా ఒక్కదానికే శోకం...
వారు బతికుంటే
దేశ ప్రజలందరికీ లాభం!
అమ్మా! నువ్వన్న ఈ మాటలు
నిజమేనమ్మా! కానీ
ఈ శోకం నీ ఒక్కదానిదే
కాదమ్మా...
కోటాను కోట్ల తల్లుల
శోకం తల్లీ ఇది...
కడుపున పుట్టిన బిడ్డల
బతుకు బాగుకోసం
తల్లులు ఆ తల్లుల
జీవితం పండుగలా
సాగాలని కలలు కనే
బిడ్డల స్వప్నాల్ని
నరహంతకులు ధరాధిపతులై
చిదిమేస్తే... ఆ దుఃఖం
నీ ఒక్కరిదే కాదు తల్లీ...

మాది కూడా!
ఆ శోకం ప్రజలందరిదీ...
ఈ దుఃఖం నీ ఒక్కదానిదే కాదమ్మా!
మాగ్జింగోర్కీ తల్లిలా
ఉగ్గు గిన్నెల్లో మానవతను
మధుర భావాల్ని రంగరించిన
తెలంగాణ తల్లుల అరవై తొమ్మిది
నెత్తుటి గాయాల్ని నిమిరి
జగిత్యాల జైత్రయాత్రలో
జంగల్ మహల్ జనతన్
సర్కార్ కోసం సాగనంపిన
కన్న బిడ్డల్ని... కాళ్ళూ వేళ్ళూ విరిచి
చిత్ర హింసల్లో ఏలికలు కాల్చి చంపితే
ఆ దుఃఖం నీది కాదు తల్లీ... మాది!
కోటి వేణువుల కరచాలనాల్లో
అడుగు జాడల్లో అడవి దారుల్లో
కన్న తల్లుల గర్భ శోకాల్ని
తెలంగాణ తల్లి దుఃఖ సంద్రాల్ని
ఎదురీదుతున్న వాళ్ళు...
నీలాంటి తల్లుల దీవెనల్ని
ఆయుధాలుగా భుజానమోస్తూ
శ్రీకాకుళం నుండి సింగూరుల్దాకా
లాల్‌గడ్ నుండి అబూజ్‌మాడ్‌ల దాకా
ఆదివాసీ జనం గుండెల్లో
ఒన్ ఆఫ్ సెవెంటీల మైనింగ్ సెజ్‌ల
గ్రీన్‌హంట్‌లో హతులౌతున్న దుఃఖం
నీది మాత్రమే కాదు తల్లీ... అది మా అందరి శోకం
దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా
ఆదివాసీలకు రాలేదని
స్వతంత్ర భారతావనిలో
ధనికులు మరింత ధనికులుగా
పేదలు నిరుపేదలుగా
మారుతున్నరని
పేద ధనిక తేడాల్లేని
కులమతాల పీడనల్లేని
సమ సమాజం కోసం
కలలు కన్న నీ కన్న బిడ్డల
సాహసం... అనన్యమైనది!
సామ్రాజ్యవాదపు
ఎరుపురంగు కరకు
మమతల్ని నందిగ్రాంల
నుండి అస్సాంల దాకా
ఆదిలాబాద్‌ల నుండి
అమెరికాల్దాకా సోంపేటల
నుండి వాల్‌స్ట్రీట్‌ల్దాకా
'దేరీజ్ ఆల్టరనేటివ్...
దటీజ్ పీపుల్స్ స్ట్రగుల్' అని
ప్రపంచానికి ఎలుగెత్తి
చాటిన వెలుగు దివ్వెలు వాళ్ళు...
వాళ్ళను అదృశ్యం చేసినా
అదృశ్యంగా పోరాటాల్లో
కొనసాగుతుంటరు...
చదువు చైతన్యాన్ని తెస్తుంది
చైతన్యం విప్లవాన్ని తెస్తుంది
విప్లవం పరివర్తన తెస్తుందని
గోడల మీది రాతల్తోనో
తరగతి బోధనల్తోనో సాధ్యం కాదని
సమాజాన్ని సొంతం తమతో
తీసుకెళ్తున్న వాళ్ళు...
సమస్త పోరాటాలకు
సకల జనులకు
ఆనాటి అరవై తొమ్మిది
తెలంగాణ నుండి
రేపటి ప్రజాస్వామిక
తెలంగాణ దాకా
బాటలు వేసినవాళ్ళు
పోరాటం ఒక్కటే
ప్రజల జీవితాల్లో
వెలుగు నింపుతుందని...
చాటిన వాళ్ల
ఇప్పుడు వాళ్ళ ఎముకలే కాదు...
చితాభస్మం
జనం పిడికిళ్ళలో
ప్రతిజ్ఞ అయ్యింది!

అమరుల స్థూపం...

నేను అమరుల స్థూపం
నుండి మాట్లాడుతున్న!
మీ నమ్మక ద్రోహాలకు
విశ్వాస ఘాతుకాలకు
బలైపోయిన తెలంగాణ
అమరుల ఆత్మ గౌరవాన్ని
మాట్లాడుతున్న...

తెలంగాణ ఇష్టమన్నోనికి
తెస్తమన్నోనికి ప్రాణమిచ్చి
అరవై తొమ్మిది విద్రోహానికి

నేలకొరిగి అసెంబ్లీ ఎదుటి
అమరుల స్థూపంలో ఒదిగి పోయిన
బుల్లెట్ గాయాలనుండి మాట్లాడుతున్న...

అమర వీరుల స్థూపం నలుదిక్కుల చేసిన
రంధ్రానికో పదిమందిమి ఒరిగిన
నెత్తుటి చరిత్రను మాట్లాడుతున్న
అసెంబ్లీల్లో అరవై తొమ్మిది నెత్తుటి
సిరాతో చేసిన ఒప్పందాలు హామీలు
ప్రకటనలకు మోసపోయిన
తెలంగాణ తల్లి దుఃఖాన్ని
మాట్లాడుతున్న...

తెలంగాణ ద్రోహుల
పాదాల తాకిడికి తల్లడిల్లుతున్న
తెలంగాణ తల్లి పేగును మాట్లాడుతున్న...
మీ పాదయాత్రలకు... ఒదార్పులకు
మాగుండెలపై సాగుతున్న పోరుబాటలకు
నెత్తురోడుతున్న తెలంగాణ అమరత్వాన్ని
తెలంగాణ అమరవీరుల స్థూపంలో నుండి
మాట్లాడుతున్న...

మాట తప్పిన సీమాంధ్ర ద్రోహులకు
రెండు కళ్ళైనందుకు... మీ కనుగుడ్లను
పీకి స్థూపానికి వేలాడ కట్టాలి!
ఉరేసుకుందాం..రా! అని మా అమరత్వాన్ని
అవహేళన చేసినందుకు మీ శవాల్ని
స్థూపం అడుగున పాతి పెట్టాల్సిందే!
మా తల్లుల గర్భ శోకాల్ని మా బలిదానాలపై
నిలబడి ఎగతాళి చేస్తున్నందుకు
మీ నాలుకలు తెగ్గొయాల్సిందే...

ఓట్లకో సీట్లకో సీమాంధ్ర
దోపిడి గాళ్ళకో తెలంగాణను
బలిపెడుతున్నందుకు... మిమ్మల్ని
ఉరితియ్యాల్సిందే!

అసెంబ్లీ లాబీల్లో
తెలంగాణ బిల్లుకోసం నోటితో
మాట్లాడి నొసటితో సమైక్యతను
చాటుతున్న మీ విద్రోహులకు
కడుపు కాలిన తెలంగాణ తల్లులా
చెప్పుల్తో జవాబు చెప్పాల్సిందే...
ఓటు పోరుబాటకు
గోరి కట్టాల్సిందే!

వాలుతున్న పొద్దు

- మేడక యుగంధరరావు

చిటారు కొమ్మలు
ఒకప్పటి మిఠాయి పొట్లాలు
తల్లివేరుకే నిప్పంటిస్తున్న
నిర్దయ నైరాశ్య నిశాచర
విధ్వంసకర పరిస్థితుల్లో,
చలికాచుకోమంటూ వృద్ధ వృక్షాలు
మౌనంగా దగ్ధ మవుతుంటే
ఆత్మీయ స్పర్శలు మరీచికలవుతున్నాయ్

కొడుకు కోడళ్ళ చీదరింపుల చర్నకోలా విరుపులకు
గుండె కుడ్యం కుప్పకూలిపోగా
తెగిన కన్నీటి కట్టకు
మధ్యరాత్రులు, బాత్రుంలే వేదికలవుతాయ్

గోరు ముద్దల కోసం చందమామనే బంధించి
ముక్కు తుడిచి, మూతి కడిగిన చేతులు
నేడు నాల్గు రోడ్ల కూడలిలో
విల్లు బద్దై వణుకుతూ చేతులు చాస్తుంటే
స్కూటర్ మీది శవం ఆబగా
నోట్ల సిగ్నల్ కోసం ఎదురు చూస్తుంటుంది

పేగునిచ్చిన మమకారం
వర్షపు ముందర ఎగసిన ధూళిలో
సుళ్ళు తిరుగుతూ
కొడుకుల కంట్లో పడి నిరంతరం సలపరిస్తూనే ఉంటుంది

ఇంకుతున్న ఆయుష్షుపై తీతువు పిట్టలు
నిశీథిలో వెర్రికూతలు కూస్తున్నాయ్
ముడతలు పడ్డ చర్మపు రహదారులపై
దారి దొరక్క, త్యాగాల గతం తీవ్రంగా
పెనుగులాడుతుంటుంది
గడియబెట్టి బిర్ర బిగుసుక్కూర్చున్న
బంధాల వాకిట్లో
ఎందుకర్రా! పిసరింత
పలకరింపు పరిష్వంగనల కోసం ఎదురు చూపు?

- - -

ఆకులు రాల్చే కాలంలో...
అనుభవాల జ్వలన శిఖల్ని రేపటి నెగళ్ళకు తాపించి
మలి సంధ్యకు ప్రణమిల్లే వారేరి...??

బంధు మిత్రుల స్మృతి

-ఎస్.ఎస్.ఆర్.

ఏదీ... నా కల...
ఎవరో ఛిద్రం చేశారు
నాకలల్ని ఎవరో నాలుగు రోజులు
ఎండకూ వానకూ ఎరవేశారు
కోపంతో ఎరుపెక్కిన కన్నెక్కడో?
నినాదాల నోరెక్కడో?
స్నేహపు చిరునవ్వుల పెదవులెక్కడో?
బిగిసిన పిడికి లెక్కడో?
అన్నీ అస్తవ్యస్తంగా వికృతంగా
ఈ వ్యవస్థ ఎలా ఉండాలని
వాడు అనుకున్నాడో... అలా
వాడి వికృత ఆలోచనల
పురుగులు పట్టించాడు
ఇది వాడి వికృత కల అని తెలిసి
అందమైన కల కనడం
ఎంత అవసరమో తెలిసివచ్చింది
మా ముఖాన్ని ఎంత వికృతంగా
చేసినా సరే; కల కనటం మానం
మీ ఆచరణ మీ త్యాగం
అందమైన కలలను సాకారం చేసుకునే
కర్తవ్యాన్ని మా ముందుంచింది

మల్లోజుల కోటేశ్వరన్నా

-బల్ల సరస్వతి

కోటి కోటి బంధాల అనుబంధం నీవన్నా కోటన్నా
ప్రత్యేక తెలంగాణ తొలిపొద్దు పొడుపువై
అస్తమించని ఆదిత్యుడవై ప్రతి మదిలో
మెదిలే మహనీయుడవు నీవన్నా
పీడిత దళితుల నయన తారవై
పెద్దపల్లి ఒడినిండిన నాయకా!
కరీంనగరు హృదయారుణ జ్వాలా!
తెలంగాణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు
వణుకు పుట్టే సందేశమిస్తవని
ఎదురు చూస్తున్న మాకు
పిడుగులాంటి వార్త
మాకు నిరాశ మిగిల్చి
రాజ్యహింసకు గురిమైతివా
బూటకపు ఎన్‌కౌంటరుకు బలియైతివా
తీరొక్క బాధకు లోనైతివా
నింగినంటిన విప్లవ జ్వాలవైతివా!
అన్నా కోటన్నా
మరువ లేని మరువగారాని
కోటి రతనాల వీణవైతివా!
జనుల గుండెల్లో నిండిన
జవం, జీవం నీవై పోతివా!
అన్నా మల్లోజుల కోటేశ్వరన్నా!
అమ్మా మధురమ్మా
జన చైతన్య యాత్రగా
నీ ముంగిట నిలిచినాడమ్మా
నీ కొడుకు నీ బంగారు తండ్రి
కన్నీటితో స్నానమాడించి
నీ మది నింపుకో తల్లీ
నీవే కాదు నీ బిడ్డను
తన బిడ్డగా తలచి కండ్లల్ల నింపుకొని
తెలంగాణ ప్రతి తల్లి
భాష్పాంజలి ఘటిస్తున్నదమ్మా
దండకారణ్యంలో ప్రతి చెట్టు, పుట్ట
జంతువు వలపోస్తున్నదమ్మా
రాంజీ ఏడని?
హైదరాబాదు ప్రతి అణువు
పరితపిస్తున్నదమ్మా ప్రహ్లాద్
ఏడీ ఎక్కడనీ?
సామాజిక శాస్త్రవేత్తగా మానవతా విలువల్ని
పెంచి పోషించడానికి జీవితాంతం
పోరు సల్పిన మేరునగధీరుడమ్మా నీ కొడుకు
వాళ్ళకు చావులేదమ్మా
మరలా మరలా
మనమధ్యకొస్తూనే ఉంటారు

కవి ఇంకా జీవించే ఉన్నాడహో...!

- జనజ్వాల

తల ఎత్తిన తనమంత
జెజ్జనకరి గజ్జెలని అదుముకొని
ఇంద్రధనుస్సు సొగసులతో నెమలి నాట్యం చేసింది
ఆకాశం...., ఇదీ నాలుగు పదుల జ్ఞాపకాల అలల ఒడి
కాళ్ళ కింద మట్టి
తల తలుపులకు నా తాత జేబులోని
నశ్యం దిబ్బయైంది
రక్త కణాల చలన ప్రవాహమై

మాట; పిడుగుల వర్షమైంది
పల్లె ఓ కన్నీటి హస్త దీప్తితో ఆహ్వాన గీతికయై
అమ్మ బడియైంది
రాత్రి, రాత్రులంత సూర్యుడు గాలిమీద
అగ్గిపుల్లలు గీస్తూనే ఉండేవాడు
తుపాకి ఎందుకు!
పాట, గుండె తడికి తోడుగా జలపాతమౌతుంటే
పడగ విప్పిన వేయిపడగల సర్పం సంతతి
సర్రున పారిపోయింది
పాదాల ఢమరుకం సాక్షిగా
విరిగిపోయిన కల చెదిరిపోలేదు
శకలాలుగా కంటి రెప్పల మధ్య
కదలాడుతూనే ఉంది

ఇప్పుడు తల ఎత్తడానికి
తల ఉంటేకద!
వంటి మీద వట్టి చీకటి బతుకు
పారిపోయిన సర్పం పడగ విప్పింది
పడగ కింద బతుకు, ఆత్మలేని సామ్రాజ్యపు షోకేసులోని
బొమ్మబతుకు
విరిగిపోయిన చీపురు పుల్లగా చూపులు
తల ఉంటే కద, చూపు ఉండేది

ఏళ్ళు వెళుతూ వెళుతూ
కుష్ఠురోగి వేళ్ళలా రాలుతూ
శవం నడక కప్పుకుంది జీవనం
ఎక్కడ శబ్దమన్నా
పోనీ నిశ్శబ్ద మన్నా
భయం
పీడకలల పగటి రాత్రుల
భయం పరుగులు

\- - -

సంతాప సభ ముగిసింది
చచ్చిన వాళ్ళు ఒకరు తరువాత ఒకరు
మాట్లాడింద్రు,
మాట పడిపోయినవారు చప్పట్లు కొట్టి
వెళ్ళిపోయారు
వెళ్ళిపోయిన వారు వెళ్ళిపోగా
కాలం కాకరించిన ఉమ్మిలితో
భూమిని శుభ్రపరచుకుంది

పునర్జీవనంతో
పిడికిలి జెండా మీద
సుత్తి కొడవలి ముద్రలు
ముందు మాటగా విప్లవం వర్ధిల్లాలని
కొత్త పుస్తకం తెరుచుకుంది
ఎర్ర జెండా మీద వెన్నెల కవిత్వం కురుస్తుంది
మళ్ళీ, కాలం మీద కారల్ మార్క్సు ఒక ముద్దు పెట్టిండు
సూర్యుడు మరీ చిన్న పిల్లోడై రాత్రులను చాక్లెట్లు చేసుకొని
చప్పరిస్తున్నాడు

కొత్త సృష్టి గర్భంలో
అమరుడు, ఆమే కోరస్‌తో కొత్త పాట పాడుతున్నారు
పాట మీద మళ్ళీ సంతకం చేస్తున్న
కోడి గింజలను వెతుక్కుంటున్నట్లు
ఆరికె కోరన్న... బిడ్డిక మంగన్న... కేదరి... సింగన్న...
ఆది పుత్ర వీరుల పాద ముద్రికలన్ని...., సాయుధ పోరాటాలన్నీ
వెతుక్కుంటు...
కవి ఇంకా జీవించే ఉన్నడహో!

మహమూద్ రెండు కవితలు

ఆకలి కుట్ర

1

మా నెత్తి మీద ఆకాశం
ఆ నెత్తి మీద గొడుగయ్యింది
మా పాదం కింది భూమి
వాళ్ళ పాదాక్రాంతమైయ్యింది

అన్నీ ఆక్రమించుకొని ఆకలిని
ఆల్సేషన్ కుక్కలా వొదిలిన కుట్ర

శూన్యంలో అనామక విశ్వపదార్థంలా
గిరికిలు కొడుతూ
మా కడుపులోంచి నోరుతెరుస్తుందొక ఆకలికేక

2

ఆకలి
చూపు పారించినంత మేరా పొట్టలను
వీపుల్లోకి దూర్చేసిన ఆకలి

ఆరడుగుల వ్యక్తుల్ని ఉండలా చుట్టేసిన ఆకలి

గాలిలా వానలా ఎండలా నీడలా
ఆకలికి తోడు ఆకలి

కడుపు ఒక్కటే దాని దాని లోకం కాదు

నాభిని చీల్చుకుని
దేహమంతా దాని ఆవహం

వొంట్లో రుధిరమంతా ఆవిరై
ఎండు ఎడారిలా మాంసం మిగిలి

ఆకలిని తింటూ
ఆకలిని కంటూ
నాలుగు మెతుకుల కల

వేలాడుతుంటుంది
కుక్క నాలుకలా

మా వొంటి ప్రతి స్వేద గ్రంధి
తెరుచుకున్న ఆకలి నేత్రం

రెండు చేతులున్న శరీరానికి
కరువైంది పిడికెడు అన్నం

అన్నపూర్ణమ్మా
ఏది నీ జాడ
ఏది నీ జోల
మా బాల్యానికి కొంచెం
బలవర్ధక ఆహారం కావాలి

అయిదు చేతిమునివేళ్లపై ఐదు మెతుకులు
నాలుక కొనకు తగిలేలా కొంచెం పాలు చాలు

దానె దానె పె లిఖా హై ఖానెవాలెకా నాం
ఆ మెతుకులపై మాత్రం పేరు అదృశ్యం

నీ గోదాముల్లో దూరిన పందికొక్కులు కడుపులు
పేలేలా తింటూన్నాయి
ధాన్యరాసులు కూడా సిగ్గుపడి మగ్గిపోతున్నాయి
అజీర్ణవాంతులు చేసుకోవడంలో పరాకష్టకెళ్ళింది నీ దేశం
మూడోవంతు జనానికి దొరకడం లేదు ఆహారం
ఇది వైరుధ్యాలకే వైరుధ్యం

జానెడు పొట్ట చేస్తున్న జాగారంలో
మా ఖాళీ చేతుల్లోంచి మొలుచుకొస్తున్న మృత్యుఘోషలు వినపడ్డం లేదా
మిగులు ఆహారాన్నీ కూడా మింగేస్తున్న వారి కుట్ర నీకర్థం కావడం లేదా?
(ఎన్.డి.టివిలో మాల్ న్యూట్రిషన్‌పై కథనం చూసి)

జనని

ఎట్లా ప్రత్యక్షమౌతాయో తెలియదు
తొలకరి తొట్టతొలి చినుకును
ఒడిసిపట్టుకునే తామరాకు ఒడిలా
నేను తూలి పడబోయిన ప్రతిసారీ
ఆ ఇసుక తిన్నెల.... అరచేతులు

కోటకు గోడలా తోడుండడం,
నా దాహానికి దప్పిక తీర్చడం
నదికి తెలిసినట్టుగా ఎవరికి తెలుస్తుందీ?

ఉపరితలం ఒక్కోసారి ఇసుకమేటలైపోయినా
లోపలంతా తడిసముద్రాలే...
చలువ పంచే చెలమ స్నేహాలే...

దప్పిక తీర్చడం కోసమైతే
గుండెకు చిల్లేసుకొని
నెత్తుటిని ఒలికించడమూ
బిడ్డ ఉగ్గబట్టిన దుఃఖంలో ఉన్నప్పుడు
ప్రాణాన్ని ప్రణవం చేసి పాలలా పట్టడమూ
నదికి మాత్రమే తెలుసు!

పండని కాయలను
పండ్లలా తీర్చిదిద్దడానికి
చచ్చిబతుకుతుంది జనని...

పారే దారిలో, ఎత్తుపల్లాల్లో పడిలేస్తూ
పండిపోయిన గాయాల సుజల ప్రవాహం నది

తల్లిలా నది
నదిలా తల్లి
లాలించందే, పాలించందే
మనగలదా ఈ జగత్తు!

ఆ చల్లని బాహువుల్లో
తేలియాడే
జ్ఞాపకాల కాగితపు పడవనే కదా నేను!

నాలుగు పిట్టలు

- మహమూద్

పని

చేసి
చేతిలో పెట్టేవాడిదే
ఈ ప్రపంచం
చేతిలో ఉన్నది ఆరగించేవాడిది కాదు

రైతు

నీ రెక్కలు తెగితే
మా రెక్కలు విచ్చుకుంటాయి
పొలం నువ్వు దున్నితే
కడుపులు మావి పండుతాయి

ప్రయోజనం

ఒక్క రసానుభూతి కోసమేనా
నేను రాస్తాను?
నీలో సంస్కారాన్ని రగిలించని
నా అక్షరాన్ని ఉరితీస్తాను...

అహంకారం

నాకు నేనే ఆదర్శమంటున్నావా?
ఎంత అహంకారం
గొప్పవాళ్ళు ఆకాశం నుండి రాలిన సితారాలు కాదు
ఎంతటి వారైనా గాలిలో నడవలేరు...

ముషాయిరా

నా కవన విహంగాల్ని
మీ చప్పట్ల చకోరాలు ముద్దెట్టుకోవాలి
ఈ లోకపు ముషాయిరా
కలకాలం కొనసాగాలి....

వెన్నెల

డప్పీ కొడుతూ, పాట పాడుతూ
దర్వేష్ వెళుతున్నాడు
చంద్రుడు ఇపుడతని ఝోలీలో
వెన్నెల కురిపిస్తున్నాడు

కాలం ఖరీదు

బంగారం చాందీగా మారి
చాందీ బంగారంలా వెలిగే రోజు వస్తోంది
జీర్ణ వ్యవస్థను జాగ్రత్తగా కాపాడుకోండి
అన్నం బదులు రాళ్లు తినే రోజు దగ్గరలోనే ఉంది....

సీమ

నన్ను వలసల పాల్జేయడానికి
వాళ్ళిక్కడికి వలసగా వస్తూనే ఉన్నారు
ఎండిన మట్టిని పిండి
నా రుధిరంతో వ్యాపారం చేస్తూనే ఉన్నారు

చలువ చెలమ

చొక్కా వదులుగా లేకపోతే
ఉక్కపోస్తుంది నాన్న! అంటుందమ్మ
రాతికి కూడా చనుబాలు తాపే
చలువ చెలమ

పుస్తకం

చేతికి చేయి
దేహానికి
అదనపు అంగం
పుస్తకం...

వాన

ఈ రాత్రి
వానలో తడిసి ముద్దయింది
ఉదయాన్ని పిలవండి
ఆరబెట్టేద్దాం....

నేను

నన్ను నేను ఎక్కడో పోగొట్టుకున్నానని
ఎంతలా తల్లడిల్లానో...
తర్వాత చూసుకుంటే
నా అక్షరాల్లో ఓ అక్షరంలా పడి ఉన్నాను

స్వప్నం

స్వప్నాల మీద
నాకు లేదు నమ్మకం
రాత్రి వచ్చి
ఉదయం వెలసిపోవడమే కదా వాటి లక్షణం

వాస్తవం

వాస్తవం నాకాదర్శం
రాత్రి నిదురపుచ్చి
ఉదయం నిదురలేపే
తల్లిలాంటిది దాని చైతన్యం

కాందిశీకులు

దేశాల
సరిహద్దులకు
పూసిన పుండ్లు
కాందిశీకులు

రిపోర్ట్

అనంతపురం కథావర్క్‌షాప్ విశేషాలు

- పి. వరలక్ష్మి

సెప్టెంబర్ 2010 ఒంగోలు కథావర్క్‌షాప్ తర్వాత చాలారోజులకు మా కథల బండి అనంతపురం చేరింది. తెలంగాణ ఉద్యమం, ఇతర విరసం కార్యక్రమాల్లో మునిగిపోయి మొత్తం మీద ఒక సంవత్సరానిగ్గాని తీరిక చేసుకోలేక పోయాం. జనవరి 20, 21 తేదీల్లో రెండురోజులు కలిసి కథలు, కబుర్లు కలబోసుకున్నాం. సెలవుల్లేకపోవడం వల్లనేమో ఈ సారి హాజరు తగ్గింది. రెండురోజులూ పూర్తిగా ఉన్నవాళ్ళతోబాటు వాళ్ళ అనుకూలతను బట్టి ఏదో ఒకరోజు హాజరైన వాళ్ళు కూడా కలిపి 15మంది అయ్యారు. దాదాపు 20 గంటలు చాలా అర్థవంతమైన, లోతైన చర్చలు జరిగి ఇది అసలుసిసలు వర్క్‌షాప్ అనిపించుకుంది.

శనివారం ఉదయం శశికళక్క ఇంటి దగ్గర అందరం కలిసేసరికి సుమారు 11.00 గంటలయింది. అక్కడి నుండి బయలుదేరి సెయింట్‌జోసెఫ్ హైస్కూల్‌లో ఒక తరగతిగదిలో సమావేశమయ్యాం. మొదట వర్క్‌షాప్ నిర్వహణ ఏఏ అంశాల ప్రాతిపదికపై జరగాలి అని కొంత వివరంగానే మాట్లాడుకున్నాం. మామూలుగా కథలు చదివి చర్చించడంతో పాటు కథకు కథకు మధ్య వివిధ అంశాలను తీసుకొని చర్చించాలని అనుకున్నాం. అవి స్థూలంగా 4అంశాలు. 1) కథారచన ఎలా ప్రారంభించారు, రచనా క్రమంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి "నేనూ-కథ". 2) సమకాలీన విషయాలను సృజనాత్మక సాహిత్యంలోకి, ముఖ్యంగా కథల్లోకి ఎలా తీసుకురావాలి, ఇపుడున్న సామాజిక, రాజకీయార్థిక పరిస్థితులను, సామాజిక పరిణామాలను అవి ఏ దిశగా ప్రభావితం చేస్తున్నాయో చెప్పడానికి ఎటువంటి రూపాలను ఎంచుకోవచ్చు, అటువంటి ఉదాహరణలు ఏమైనా ఉన్నాయా? 3) ప్రధాన స్రవంతి పత్రికల్లో ఎటువంటి రచనలు వస్తున్నాయి, మనం వాటికి రాయాలంటే ఎలాంటి టెక్నిక్స్ పాటించాలి? 4) ఇప్పుడొస్తున్న సాహిత్యం ఏఏ అంశాల కేంద్రంగా ఉంటున్నది?

నేనూ-కథ:

మొదట ఉదయమిత్ర "నేనూ-కథ" అంశంపై మాట్లాడారు. "మొదట్లో కవిత్వం రాసేవాడిని. కథారచయితలు, కవులు వేరువేరు, ఎవరి డిపార్ట్‌మెంట్ వారిది అనే భావన ఉండేది. నేను నిజామాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్నప్పుడు సాయంకాలాలు మిత్రులతో అట్లా నడున్నాపోతూ చాలా విషయాలను నాటకీయంగా చెప్పి నవ్విస్తూ ఉండేవాడిని. అప్పుడు హిమజ్వాల అన్నాడు, కథ రాయొచ్చు కదా అని. అప్పుడేమో నేను కవిని కదా కథ ఎట్ల రాస్తాననుకునేవాడిని. నా మొదటి కథ నాకొచ్చిన కల. కలలో ఒక సింహం ఆవును కొట్టి పడేస్తే అది రక్తం కార్చుకుంటూ కొండమీది నుండి జారిపడుతుండేది. దాన్నే కథగా రాయాలనిపించి "భయం" అనే కథ రాసిన. కలను కొంచెం మార్చి రాసిన. గుట్టపైన గడ్డి ఉన్నా పులి ఉందని భయంతో కిందనే కడుపులు మాడ్చుకుంటాయిగాని ఆవులు పైకి పోవు. ఒక ఆవు పోతుంది. పులితో కొట్లాడుతుంది. పులిని గాయపర్చి ఆవు చనిపోతుంది. అది ఒంటరిగా పోయింది కాబట్టి చనిపోయింది. అందరం కలిసిపోయి ఉంటే గెలిచేవాళ్ళం అని మిగతా ఆవులు అనుకుంటాయి. "భయం" కథతో కథంటే నాకు భయం పోయింది. ఈ కథ అరుణతారలో వచ్చింది. రెండోకథ "ఊట". పెద్దకథ. దుందుభి నది ఇసుకను ఒక కాంట్రాక్టరు హైదరాబాదుకు తరలించి అమ్ముకునేవాడు. మా మిత్రుడు ఇసుక లారీలు పట్టుకోవడంలో ఇబ్బందులను చెప్పినప్పుడు దాన్ని పట్టుకొని నేను కథ రాసిన. అట్లనే చింతపల్లిలో గూడేలను కాలబెట్టమని జీవో వచ్చినప్పుడు మా మామ పోలీసుల్లో ఉన్నాడు. ఆయన గూడెం వాళ్ళపై సానుభూతితో ఆ పని చెయ్యడు. దాన్నీ కథగా రాసిన. మొదట్లో కథలేమీ పెద్దగా చదవకుండానే కథలు రాసేవాడిని. ఎమోషనల్‌గా రాసేవాడిని. థీరీ చదవనప్పుడు కథలు బాగా రాసేవాన్ని. వల్లంపాటి, కారా మాష్టారి పుస్తకాలు చదివాక రాయడం స్లో అయింది. అయితే బాగా ఆలస్యం చేశాననిపిస్తోంది. అప్పుడు నాకంత ప్రోత్సాహం లేదు. ఇప్పటికి ఒక సంకలనం వేశాను. ఇంకోటి రాబోతుంది. అయినా అసంతృప్తి ఉంది. అయితే ఎప్పటికైనా మంచి కథ రాస్తాను."

అల్లం రాజయ్య: "కథా నిర్మాణం గురించి చదివాక రాయలేకపోతున్నామనేది చాలా తరచుగా వినిపిస్తుంటుంది. అది సరికాదు. కథనం వేరు, కథ వేరు. కథనాలు రాయడం సులభమే. మొదట్లో అందరూ కథనాలే రాస్తారు. కథ రాయడం కష్టం. ఇతివృత్తం కుదరడం చాలా కష్టం. ఇతివృత్తం సాధారణంగా ఎవరో ఒకరు చెప్పే ఉంటారు. అదే విషయాన్ని ఎలా చెప్పాలి అనిపిస్తుంది. అయితే స్థలకాలాలను దృష్టిలో పెట్టుకొని రాస్తే సమస్య ఉండదు. ఎప్పుడైనా దారి తెలవడం వల్ల సులువవుతుంది కాని కష్టం కాదు. కథనం నుండి కథలోకి పోవడంలో పడే ఇబ్బందే అది."

కథనానికి కథకు తేడా ఏమిటని ఒక యువమిత్రుడు అడిగితే రాజయ్యగారు కథనం ఫోటోగ్రఫీ అని, కథ పెయింటింగ్ వంటిదని అన్నారు.

తర్వాత "నేనూ-కథ" అంశంపై బాసిత్ మాట్లాడారు. "సాహిత్యంతో నా పరిచయం నాలుగోతరగతిలో బాలమిత్రతో

మొదలైంది. అమ్మ కథలు చెప్పేది. నాన్న చరిత్ర బాగా చెప్పేవాడు. నేను రిలిజియస్ వాతావరణంలో పెద్దగా లేను. నాన్న చాలా డెమోక్రటిక్. ఉర్దూలో రాయలేకపోవడం నా సమస్య. తెలుగులో రాస్తే ఆ ఫ్లేవర్ రాదనిపించేది. నా మిత్రుడు, అధ్యాపకజ్వాల ఎడిటర్ అశోక్ కుమార్ వల్ల చదివే అలవాటు పెరిగింది. రాయాలనే కోరిక కూడ అశోక్ కుమార్ నుండే కలిగింది. మూడు గంటల్లో 300పేజీలు చదివేవాడిని. డిగ్రీ సెకండియర్‌లో చలాన్ని బాగా చదివిన. విరసంలోకి వచ్చాకే శ్రీశ్రీని ఎక్కువగా చదివింది. అశోక్ కుమార్ పెయింటింగ్ వేసేవాడు. వేసి, దాని కింద వ్యాఖ్య రాసేవాడు. రాయడం గురించి చర్చ చేసేవాళ్ళం. తక్కువలో ఎక్కువ భావం చెప్పాలి అనేవాడాయన. అలా రాయలేక చాలా రోజులు ఆగిపోయిన. అప్పట్లో గురజాడ చాలా ఇష్టమైన రచయిత. "దేవతలారా మీపేరేమి?" కథ చాలా ఇష్టం. అప్పుడు గురజాడలాగా రాయాలనుకున్నా. మంచి రచయితల కథలు చదవడం, రాయాలని ప్రయత్నించి చిత్తుగా రాసి చించేయడం జరిగేది. నా మొదటి కథ "అవసరాలకు ఓ అబ్బాయి". అది ప్రింట్ కాలేదు. అమరావతి వర్క్‌షాపుకు వచ్చేముందు కచ్చితంగా కథ రాసే పోవాలని "అబ్బా" కథ రాశాను. మిత్రుల సూచనల మేరకు దాన్ని సవరించి అనంతపురం వర్క్‌షాప్‌లో చదివాను. తర్వాత షాద్‌నగర్‌లో "ఈద్‌నమాజ్", ప్రొద్దుటూరులో "సైదాబీ తాయమ్మ" చదివాను. తెలంగాణ ఉద్యమంపై కథ రాయాలని అనుకుంటున్నా. కాని నన్ను వెంటాడుతున్న ఒక కథను రాసి తీసుకొచ్చా. టీచర్ వృత్తి వల్ల ఒత్తిడి, దానికితోడు తెలంగాణ ఉద్యమ సందర్భంలో చాలా డిస్టర్బ్ అవుతున్నా. ఉద్యమంలో భాగమవుతున్నా రాయలేకపోతున్నా. ఆంధ్రజ్యోతి వంటి పత్రికలకు రాయాలంటే ఎలాంటి ప్రమాణాలు ఉండాలి. అన్ని పత్రికలకూ ఆస్థాన రచయితలుంటారు. నమస్తే తెలంగాణ కూడ మినహాయింపు కాదు. జీవితంలో డిస్టర్బెన్స్ కథలోకి తీసుకురావాలి. ఏదో అశక్తత. చాలా అసంతృప్తిగా, నిరాశగా అనిపిస్తుంది. చాలాసార్లు రాసినవి కూడ పత్రికలకు పంపలేకపోతున్నా."

ఇదే అంశంపై వెంకట్రాములు కూడ మాట్లాడారు. "కథలు చదవడం కన్నా వినడమే ఎక్కువ. మా గేరిలో ఒక ముసలామె ఉండేది. చాలా కథలు చెప్పేది. చిన్నప్పుడు చందమామ, బాలమిత్ర, బుజ్జాయిలతో కథలు చదవడం మొదలైంది. స్కూల్లో ఉన్నప్పుడే "పరివర్తన" అనే కథ రాశాను. అది ప్రింట్ కాలేదు. నేను కొకు, చలం వంటి రచయితలను పూర్తిగా అధ్యయనం చేయలేదు. సమీక్షలు, విమర్శలు చదివానంతే. మాదిపాలమూరు. వలస గురించి అనుభవపూర్వకంగా తెలుసు. వలసపోతున్న తల్లి కొంగు పట్టుకొని ఏడ్చిన అనుభవం. దాన్ని కథ రూపంలో తీసుకురాలేకపోయాననే అసంతృప్తి ఉంది. మొదట్లో కొన్ని పాటలు, నాటికలు రాశాను. "పాఠశాల తప్పిపోయింది" నాటిక కరీంనగర్ మహాసభల్లో ప్రదర్శించారు. చంద్రబాబు మీద "బాబు నవ్విండు" నాటిక రాశాను. అయితే నాటికకంటే కథకు ఎక్కువ విస్తృతి ఉందని కథవైపు మొగ్గిన. మొదటి కథ "లోయ". ఏది నాగరికం, ఏది అనాగరికం అని రాశాను. తర్వాత చెట్లు నరికేయడం, పక్షులు వెళ్ళిపోవడం గురించి "చెట్టు", "ఆపరేషన్ బర్డ్ హంట్" కథలు. తర్వాత "జంగిడి" కథ. జంగిడి అంటే పశువుల సమూహం. వాటిని మేపుకోడాని తీసుకుపోయే ఎల్లప్ప ఏమైయ్యిండు. చాలా దయనీయంగా తయారైండు. ఆ కథే రాశాను. ఇప్పుడు వ్యవసాయంలో ఆధునికత ప్రవేశం, ఫైనాన్స్ వ్యవస్థ రైతు కుటుంబాలను ఎలా విచ్ఛిన్నం చేస్తోందనే అంశంపై "ఏడు సంచుల దరిద్రం" కథ రాసి తీసుకొచ్చాను.

అల్లం రాజయ్య : "వలసపోతున్న తల్లి కొంగును పట్టుకొని తచ్చాడిన పిలగాడు ఈడిదాకా వచ్చాడు. ఆయన వచ్చాడు గాని పిలగాడు రాలేదు. ఆ పిలగాడు వచ్చి మందిలో కలవాలి. మనం మన బాల్యం నుండి, దుఃఖం నుండి విముక్తమైతే, అంటే వ్యక్తిగత దుఃఖానికి దూరమై మనం సామూహిక గానమైనపుడు యూజన్ పాటియార్ గీతమై సాగుతాం. రాయడమంటే విముక్తి కావడమే."

బాసిత్ కథ "ఛాయ":

ఇక కథకుల అనుభవాలు వదిలి కథల్లోకి దిగుదామనుకున్నాం. ఒకే అంశంపై నిరంతరాయంగా చర్చించడం కంటే వివిధ అంశాలు మార్చి మార్చి చర్చించుకుంటే కొత్తగానూ ఉంటుంది, విసుగు పుట్టకుండా ఉంటుంది కదా అనుకున్నాం. మొదటి కథ బాసిత్ చదివాడు. కథ పేరు "ఛాయ". చామనఛాయ అంటే ఇష్టపడే నఫీజ్‌కు శ్యామల పరిచయమవుతుంది. ఆమె భర్తవల్ల కష్టాలపాలై ఉంటే ఆదుకుంటాడు. ఆశ్రయమిస్తాడు. నఫీజ్ అనారోగ్యం పాలైతే శ్యామల నర్సుగా అతనికి సేవలు చేస్తుంది. నఫీజ్‌కు పెళ్ళి, కుటుంబం కూడ ఉంటుంది. వాళ్ళ గురించి నలుగురూ నాలుగురకాలుగా అనుకుంటారు. నఫీజ్ స్నేహితుడు సాదత్ మొదట కాస్త అనుమానపడినా తర్వాత అర్థం చేసుకుంటాడు. శ్యామల కేసు వ్యవహారంలో తనకు తెలిసిన లాయర్ మిత్రుడితో మాట్లాడతాడు. స్నేహితుడు బద్‌నాం కాకూడదని తపనపడతాడు. ఆ దిశగా సలహాలిస్తాడు. స్త్రీపురుష సంబంధాల్లోని సంక్లిష్టతను తడుముతుంది ఈ కథ. బాసిత్ కథ చదివాక దానిపై చర్చ జరిగింది.

రవీంద్రారెడ్డి: కథ సంఘటనల సమాహారంగానే ఉంది. చాలా విషయాలు వచ్చేసాయి. ఒక విషయం, ఒక సంఘటన తీసుకొని ఉంటే రచయిత ఇంకా బాగా చెప్పగలిగేవారు. పెద్ద కథ అయింది.

పరిమళ్: కథనమంతా నఫీజ్‌పై అనుమానం కలిగేలా ఉంది. చివరికి పాజిటివ్‌గా చెప్పాడు. అయితే అది నెగెటివ్ పాత్ర. ఆయన ముఖంలో మార్పు అనారోగ్యం కంటే ఆయన స్వభావం వల్లనే కావొచ్చు అనిపిస్తుంది. ఏమైనా చాలా సంక్లిష్టత ఉన్న కథ.

వెంకట్రాములు: ఇది సమాజంలో నలుగుతున్న సబ్జెక్ట్. కథలో పాత్రలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాల్లో అస్పష్టత ఉండి అపోహలు కల్పించేదిగా ఉంది. సంభాషణలు పొడవైనాయి.

పెద్దయ్య: చాలా మంచి కథాంశం. కథనం ఇంకా చిక్కగా ఉండాల్సింది.

వరలక్ష్మి: కథ బాగుంది. మంచి సబ్జెక్ట్. పాజిటివా, నెగెటివా

అని చెప్పలేని సంక్లిష్టతలు స్త్రీపురుష సంబంధాల్లో ఉంటాయి. కథ నఫీజ్ మంచివాడా, కాదా అని తేల్చే విధంగా ఉండనవసరం లేదు. ఆయన చామనఛాయను ఇష్టపడినంత మాత్రాన వేరే రకంగా అర్థం చేసుకోవాల్సిన అవసరమూ లేదు. కథను మరోసారి ఎత్తిరాసే క్రమంలో సంభాషణలు, సన్నివేశాల్లో ఉండే లోపాలు సర్దుకుంటాయి.

శశికళ: కథ సాగదీసినట్లుగా ఉంది. పాత్రలు పడుతున్న ఘర్షణ బాగా చిత్రించాల్సి ఉంది. సన్నివేశాలు ఇంకా బలంగా రావాలి.

పాణి: చాలా విషయాలు కనిపిస్తూ ఉంటాయి. అవి అర్థమవడంలో ఇబ్బంది. దాన్ని రాయడంలో ఇబ్బంది. కథగా మలచడంలో ఇంకా ఇబ్బంది. ఒక మనిషిని చూస్తే తరచుగా సామాజిక వాస్తవం అతనిలో రిఫ్లెక్ట్ అవుతూ ఉంటుంది. కొన్ని పంచాయితీల్లో కనిపిస్తుంటాయి. ఎలా ఉంటాయంటే బట్ట విప్పితే ఘాటైనవి బైటికొస్తాయి. మన ఇష్టాఇష్టాలు, ఆమోదంతో సంబంధం లేకుండా చాలా విషయాలు వస్తాయి. ఎవరి తర్కం నుండి వారు అర్థం చేసుకుంటారు. కథలో బేసిక్ ఫోకస్ ఏదో మరోసారి చూసుకోవాలి. ఒక డ్రైవింగ్ ఫోర్స్ చుట్టూ ఎన్నైనా ఉండొచ్చు. కాని ప్రధానమైనదేదో తెలుసుకోవాలి. కథలో మిగిలిపోయినవి చాలా ఉన్నాయి. శ్యామల ఏమనుకుంటోందో కథలో కనిపించలేదు.

అల్లం రాజయ్య: మంచి చర్చ జరిగింది. ఇది కథ. కథనం కాదు. స్త్రీ పురుష సంబంధాల్లో సంక్లిష్టత సరే. మరి పురుష సంబంధాలు ఎలా ఉన్నాయి. దోస్తు ఇన్ని సహాయాలు ఎందుకు చేస్తున్నాడు. శ్యామల భర్తను వదిలిపెట్టి ఎందుకు రావాలి? తల్లిదండ్రులు ఎందుకు అనుమానపడుతున్నారు? ఇతన్ని ఆమె ఎందుకు ఇష్టపడుతుంది? శారీరకం కాకపోవచ్చు. సేవలు చేస్తుంది కదా. ఇక నఫీజ్ పోలీస్‌స్టేషన్‌కు పోయే ధైర్యం కూడా లేని సాంప్రదాయవాది. బహుషా నఫీజ్ కంటే ఆమెకు ఎక్కువ స్పష్టత ఉండొచ్చు. ఆమెకు ఘర్షణ తప్పదు. ఒక రకంగా "ప్రజలు" ఉండే పరిస్థితిలో ఉంది. ఈయనకు మగవాడి లక్షణం ఉండొచ్చు. భయస్తుడు, కాని స్పందించే గుణం ఉంది. అయితే ఒక సన్నివేశంలో ఆమె అతని పక్కన మంచం దగ్గర కూర్చోవడం అవసరం లేదు. అందువల్ల అది ఏర్పడీ ఏర్పడని సంబంధంలాగుంది. నర్మగర్భితంగా చెప్పడం కొన్ని కథలకు బాగుంటుంది. స్త్రీపురుష సంబంధాల్లో పాత సాంప్రదాయక పద్ధతులు, శరీరానికి సంబంధించిన భావాలు పాత దగ్గరే ఉండిపోకూడదు.

రచయిత స్పందన: సాదత్‌కు స్పష్టత ఉంది. స్త్రీపురుష సంబంధాలు అత్యంత ప్రజాస్వామికంగా ఉండాలనుకుంటాడు. మొదట్లో నఫీజ్ అడ్వాంటేజ్ తీసుకుంటున్నాడా అని అనుమానపడతాడు. వాళ్ళ కుటుంబాన్ని చూసి కాదని అర్థం చేసుకుంటాడు. అందుకే నఫీజ్ బద్‌నాం అవుతున్నాడని బాధపడతాడు.

పత్రికలు-రచనలు:

అలా ఒక కథ అయ్యాక పత్రికలు-రచనలు అనే అంశంపై మాట్లాడుకున్నాం. చర్చ ఇలా జరిగింది.

వరలక్ష్మి: మామూలుగా పత్రికలు లబ్ధప్రతిష్ఠులైనవారి రచనలే ప్రచురిస్తుంటారు కదా. కొత్తగా రాసేవాళ్ళ పరిస్థితి ఏమిటి? బాగా రాశాం అనుకున్నవి కూడ పత్రికల్లో ప్రచురితం కాకపోవడం వల్ల నిరాశ కలుగుతుంటుంది. ఒక్కోసారి మన రాజకీయ విశ్వాసాల మూలంగా మన రచనలు వెయ్యరు. రాశాక ప్రచురణ కోసం వాళ్ళనీ, వీళ్ళనీ అడగాలంటే ఎందుకులే మన పత్రికల్లో రాసుకుంటే పోతుంది అనే అభిప్రాయానికొస్తాం.

అల్లం రాజయ్య: బాగా పేరున్న రచయితల రచనలే వేస్తారు అనుకోవడం సరికాదు. "మహదేవుని కల"ను 18 పత్రికలకు పంపాను. అందరూ తిప్పి పంపారు. ఇండియా టుడే వాళ్ళు స్వయంగా కథ అడిగితే పంపాను. వాళ్ళూ తిప్పి పంపారు. నిజానికి ఆ కథ నాకు చాలా సంతృప్తినిచ్చింది. నాకిష్టమైన కథ ఇన్నాళ్ళకు రాయగలిగాను అని ఫీలయ్యాను. పత్రికల ఎడిటర్స్‌కు జ్ఞానం తక్కువ. వాళ్ళు కథలెక్కువ చదువుతారు కాని జీవితం తెలీదు. కొత్తవాళ్ళ రచనలైతే చాలా వస్తున్నాయి. నేరుగా విప్లవపార్టీ నాయకుల రచనలే వస్తున్నప్పుడు మన రాజకీయ విశ్వాసాలకు స్పేస్ ఇవ్వరు అని అనుకోలేం.

పాణి: ఆంధ్రజ్యోతిలో కొత్తవాళ్ళ రచనలు వస్తున్నాయి. మన రాజకీయాలు వెయ్యరు అనుకోవడం సరికాదు. మన రిపోర్ట్ వివిధలో వచ్చాయి కదా. అలాగని వాళ్ళు అంత ప్రజాస్వామికమేం కాదు. మన అవసరాలు కొన్ని తీర్చడానికి బైటి పత్రికలు పనికొస్తాయి. బైటిపత్రికలకు పంపేటప్పుడు మనం కొన్ని పద్ధతులు పాటించాలి. ముఖ్యంగా వాళ్ళకు పేజీల పరిమితి ఉంటుంది. రచన పరిమాణం, భాష కూడ వాళ్ళ పద్ధతిలో ఉండాలి. కథైనా వాళ్ళ పరిధిలో ఒదిగే థీమ్ కావాలి. ఉదాహరణకు బాసిత్ కథ థీమ్ దగ్గర ఇబ్బంది లేదు కాని నిడివి దగ్గర ఇబ్బంది ఉంది.

అల్లం రాజయ్య: ఆంధ్రభూమిలో భూమి సమస్యపై పరమేశ్వర్ పేరుతో వ్యాసాలొచ్చాయి. మన రచనా పద్ధతి మార్చుకుంటే తప్పకుండా వేస్తున్నారు. మనం అన్ని పత్రికలకూ రాయాలి. మన సాహిత్యానికి, రాజకీయాలకు ప్రచారం ఉండాలి కదా.

పాణి: మన సాహిత్యప్రచారం గురించి చర్చ వచ్చింది గనక నేను రెండు ప్రతిపాదనలు చేయదలచుకున్నాను. 40ఏళ్ళుగా మనం రాస్తున్న కథలు ఎడిట్ చేసుకొని నాలుగైదు సంపుటాలుగా వేస్తే ఎలా ఉంటుంది? అట్లాగే మన 40ఏళ్ళ సాహిత్యకృషి గురించి ఒక మీటింగ్ పెట్టడం. అందులో చర్చించే అంశాలు ప్లాన్ చేసుకొని ముందే రాసుకొచ్చి చర్చించాలి.

అల్లం రాజయ్య: జిల్లాల వారిగా సంకలనాలు తేవాలి. లబ్ధప్రతిష్ఠుల్ని పక్కనపెట్టాలి, ఎందుకంటే అటువంటి వారివి ఇప్పటికే సంకలనాలు వచ్చి ఉంటాయి గనక. లబ్ధప్రతిష్ఠులైన రచయితలపైనే అరుణతారలో విశ్లేషణలు వస్తున్నట్లు నాతో చాలా మంది పంచుకున్నారు. మనం కొత్తవాళ్ళ రచనల పట్ల బాధ్యతగా, సెన్సిటివ్‌గా ఉండాలి. కథలతోపాటు, కవిత్వం, పాటలు కూడ సంకలనాలుగా తేవాలి. జిల్లాలవారీగా బాధ్యతలప్పగించి అవన్నీ

సేకరించాలి.

ఈ చర్చ కార్యాచరణ ప్రణాళికతో కూడిన మంచి ప్రతిపాదనలతో ముగిసింది. తర్వాత శశికళ "బోడిచదువు" కథ చదివారు.

శశికళ "బోడి చదువు":

పేదరికంతో అల్లాడుతున్న ఒక కుటుంబంలోని అమ్మాయి అన్ని కష్టాలు అనుభవిస్తూ, సమాజంలోని దుర్మార్గాలను చూస్తూ చదువుకుంటోంది. "బోడిచదువు" అని ఈసడింపుకు గురైనదే తనకు జీవితంలో ఏం చేయాలో నేర్పిందని ఈ కథలో చెప్పారు.

కథపై చర్చ ఎక్కువగా ముగింపుపైనే జరిగింది.

రవీంద్రారెడ్డి: చివర్లో ఆ అమ్మాయి "ఆ బోడి చదువే నేనేం చేయాలో నాకు నేర్పింది" అంటుంది. ఆమె ఏమయ్యిందో స్పష్టంగా లేదు.

పెద్దన్న: ముగింపు చాలా బాగుంది. ఆ వాక్యంతో ఆమె ఏమై ఉంటుందో పాఠకులు ఊహించుకోవచ్చని.

అల్లం రాజయ్య: ఆ అమ్మాయి ఏమైందో మనకు తెలుసు. ఆమె మనముందరే ఉంది.

రుక్మిణి: ఆ అమ్మాయి ఆ మాట అంటున్నది చిన్నతనంలోనా, పెద్దయ్యాక ఏమైనా సాధించాలనా అనే సందేహం కలిగింది.

పాణి: కథలో పలికిన టోన్ గురించి ఒక సందేహం కలుగుతోంది. చిన్న అమ్మాయి పెద్దగొంతుతో మాట్లాడుతున్నట్లుంది.

వరలక్ష్మి: పదో తరగతి అమ్మాయికి చాలా విషయాలు అర్థమవుతాయి. ఈ విషయంలో అబ్బాయిల కంటే అమ్మాయిలు తొందరగా పరిణతి సాధిస్తారని. కథలో ఆ సమస్య ఏమీ నాకు కనపడడం లేదు.

జరిగిన చర్చపై రచయిత స్పందిస్తూ ఇది తన సొంత కథేనని చెప్పారు. ఈ కథా నేపథ్యంతోపాటు మొత్తంగా తన రచనా నేపథ్యం కూడా చెప్పారు. బడి, కాలేజీ చదువులకు పరిమితం కాకుండా తాను చదివిన సాహిత్యం తన జీవితాచరణను ఎలా నిర్దేశించిందో వివరించారు. తన చుట్టూ అల్లుకున్న విషాదం మరింత అధ్యయనం వైపు, రచనవైపు ప్రేరేపించాయని చెప్పారు. అట్లా రాడికల్ విద్యార్థి సంఘం, విరసంలో తను భాగస్వామ్యం కావడం గురించి చెప్పారు. "మొదట ఇసుర్రాళ్ళు చేసేవాళ్ళ జీవితాన్ని "వర్తమానం హోరులో" అనే కథగా రాశాను. తర్వాత కథ "స్కూల్ ఫస్ట్". అది ఉపాధ్యాయ పత్రికలో అచ్చయింది. మా నాన్నకు వై.సి.వి. రెడ్డి, కడపజిల్లా రచయితల సంఘంతో పరిచయం. ఆయన ద్వారా కడప రచయితలు నాకు పరిచయమయ్యారు. తర్వాత రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సింగమనేని నారాయణ గార్లు మా పొరుగున ఉండేవారు. వాళ్ళతో కథా చర్చల్లోకి వెళ్తూ ఉండేదాన్ని. నేను స్కూల్లో పనిచేయడం వల్ల చిన్నపిల్లల మనస్తత్వం గురించి తెలిసేది. అందువల్ల ఎక్కువగా పిల్లల కథలు రాశాను. నా కథా సంకలనం "చెదిరిన పిచ్చుకగూడు" అనంతపురం విరసం సాహిత్య పాఠశాలలో ఆవిష్కరించారు. అయినా పనుల ఒత్తిడిలో కథా ప్రక్రియపై కృషి చేయవలసినంత చేయలేదనిపిస్తోంది. వర్క్‌షాప్ వచ్చాక ఇంకా మందగించింది. జ్ఞానం పెరిగింది, రాయడం తగ్గింది. స్కూల్లో లిటరరీ క్లబ్ పెట్టగలగడం, పిల్లలకు సాహిత్యం పట్ల ఆసక్తి కలిగించడం కొంత సంతృప్తినిస్తోంది.

అట్లా శశికళ తన అనుభవాల్ని పంచుకున్నాక వెంకట్రాములు తన "ఏడు సంచుల దరిద్రం" కథ చదివారు.

వెంకట్రాములు "ఏడుసంచుల దరిద్రం":

ఇది వ్యవసాయ రంగంపై మార్కెట్ నియంత్రణ పెరిగాక చోటుచేసుకున్న సంక్షోభాన్ని తెలిపే కథ. మైక్రోఫైనాన్సులు, వడ్డీలు మధ్యతరగతి రైతును ఎట్లా పీల్చి పిప్పి చేస్తున్నాయో "మైబూ" కుటుంబాన్ని తీసుకొని చెప్పారు. మైబూ మధ్యతరగతి రైతు. ఫైనాన్స్ ఏజెంట్ చెప్పే అందమైన మాటల్ని నమ్మి వాయిదాల పద్ధతిలో ట్రాక్టర్ కొంటాడు. అది ఆ కుటుంబానికి మోయలేని భారమవుతుంది. చివరికి ఎలాగోలా దాన్ని వదిలించుకుంటాడు.

ఈ కథపై చాలా లోతైన చర్చ జరిగింది. చర్చ క్రమంలో వ్యవసాయరంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను, గ్లోబలైజేషన్ నేపథ్యంలో మారుతున్న జీవనశైలిపై కూడ ఎన్నో ఆలోచనలను పంచుకున్నాము.

నల్లూరి రుక్మిణి: కథ చాలా బాగుంది. విన్నాక బాధ కలిగింది. ఫైనాన్స్ ఇప్పించడంలో ఏజెంట్ మల్‌రెడ్డి ప్రోత్సాహం చాలా ఉంది. ఆయన పాత్ర విస్తృతి పెంచాల్సింది. ఎందుకంటే మైబువాళ్ళకు ట్రాక్టర్ అవసరమయ్యేంత భూమి లేదు. ఐదారు ఎకరాల భూమి ఉన్న వాళ్ళు ట్రాక్టర్ కొనడం చాల అరుదు. మైబుని ఆ దిశగా ఒప్పించే ప్రయత్నం కథకు జోడిస్తే బాగుంటుంది. శీర్షిక కొంచెం ఆలోచించాలి.

శశికళ: రైతులకు కొత్త టెక్నాలజీని పరిచయం చేసి మైక్రోఫైనాన్సుల ద్వారా వాటిని అంటగట్టడానికి గార్లదిన్నెలో ఫార్మేషనరీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ పెట్టారు. ఏ ప్రాంతం చూసినా అట్లాగే ఉంది. ఏ పథకాలొచ్చినా ఏవీ అందవు. వలసలు తీవ్రమయ్యాయి. అనంతపురంలో ఇటీవలే **41**మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు సామాజిక వైపరీత్యాలన్నీ రైతుపై దాడి చేస్తున్నాయి. రచయితలుగా మనం అసలు శత్రువెవరో గుర్తించేలా చెప్పాలి. ఇక్కడ శత్రువు ఫైనాన్సియరా, ట్రాక్టరా, ప్రకృతా, రాజకీయ నాయకులా చెప్పాలి. చాలా మంచి కథ. ఇది అనుభవంలో ఉన్న విషాదం. వెలుగు చూపించాలని కోరుకుంటున్నా.

బాసిత్: రైతు ఆత్మహత్య చేసుకుంటాడా అని భయపడుతూ విన్నాను. కథలో అలా జరగకపోవడం ఊరట కలిగించింది. మల్‌రెడ్డి, మైబు పాత్రలను ఇంకా ఎలివేట్ చేయొచ్చు. యాంత్రీకరణ గురించి చెప్పేటప్పుడు పెట్టుబడిదే ఈ దుర్మార్గం తప్ప యంత్రానిది కాదని చెప్పాలి. కథ శీర్షిక వినూత్నంగా ఉంది.

శశికళ: ఒరియాలో టాకింగ్ ప్లవ్ అని ఒక కథ ఉంది. రైతుకు పశువుతో అనుబంధం గురించి చెప్తుంది. చదవాల్సిన కథ.

ఉదయమిత్ర: మైబమ్మ పాత్ర చాలా ప్రాక్టికల్‌గా ఉంటుంది.

వ్యవసాయ కుటుంబంలో స్త్రీల పాత్ర చాలా ఎక్కువ. మైబమ్మ పాత్ర చాలా బాగుంది. కథలో కథగా తీసుకొచ్చిన "ఏడు సంచుల దరిద్రం" బాగా అమరింది.

వరలక్ష్మి: జీవన శైలిలో మార్పు వస్తున్నది. అది కూడ పాత ఉత్పత్తి విధానాన్ని వదులుకునేలా చేస్తుంది. కథలో మైబమ్మ పాత్ర పాత తరానికి సంబంధించినది. కొత్తతరం వాళ్ళు ఇంట్లో పశువులు, పేడ, కసువు, వాటిచుట్టూ ఉండే చాకిరీ ఇష్టపడడం లేదు. అందువల్ల కూడ ట్రాక్టర్ కావాలనుకుంటున్నారు.

పాణి: కథ చాలా బాగుంది. రైతు పాత్ర చచ్చిపోతుందేమోనని నేనూ ఆందోళన పడ్డాను. చివరికి చాలా ప్రాక్టికల్‌గా ఆలోచించాడు రచయిత. ఈ కథని దాటి కొంత మాట్లాడుకుంటే సామాజిక ఉద్యమాల చుట్టూ ఏ సమస్య ఉన్నదో. అదే మన సాహిత్యంలో కూడ ఉన్నది. అది సామాజిక పరిస్థితుల్ని అంచనా వేయడంలో తలెత్తే ప్రశ్నలు, వాటి స్వభావాన్ని అర్థం చేసుకోవడం. ఈ కథావర్క్‌షాపులు వాటికి సమాధానం చెప్పే ప్రయత్నం చేయడం లేదనిపిస్తోంది. అంతరించిపోతున్న సమాజానికి సంబంధించిన ఈతిబాధలు మన కథల్లో రాస్తున్నాం. సమాజంలో ఒక పరిణామం కూడ ఉంది. దాన్ని పట్టుకుంటున్నామా? ఈ కథ ఆ పరిణామ దశలోని ఒక సంక్షోభం గురించి చెప్తుంది. సమాజం ఎప్పుడూ ఒక చలనంలో ఉంటుంది. వెనక్కి వెళ్ళిపోతున్న సమాజానికి సంబంధించిన కథలే ఎక్కువొస్తున్నాయి. అయితే పురోగమించే శక్తి ఏది అని గుర్తించడం మార్క్సిస్టులకు మాత్రమే సాధ్యం. సమాజంలో జరుగుతున్న మార్పు స్వభావాన్ని బట్టి పాత సమాజంలోని జీవన భద్రత ప్రభావితమవుతుంది. ట్రాక్టర్ రావడం ఉత్పత్తి సాధనాల అభివృద్ధిలో భాగం. అయితే ఫైనాన్స్ వల్ల సంక్షోభం తలెత్తుతుంది. అట్లాగే జీవన భద్రతకు, జీవన నాణ్యతకు పేచీ వస్తుంది. పేడ, కసువు ఇష్టపడకపోవడం అందువల్లే. రచయిత దేని పక్కన నిలబడాలి అన్నప్పుడు ప్రగతిదాయకమైన దాని పక్కనే నిలబడాలి. నిజానికి ట్రాక్టర్ ఒక ప్రగతిదాయకమైన పాత్ర పోషించాలి. అలా జరగకపోవడం వల్ల సంక్షోభం. ఈ కథకు ఆశావహమైన స్వభావం-తడిశాకైనా గుడిసె కప్పడం ఉన్నా ఇందులో రైతు చేసిన ప్రయాణపు స్వభావం ఏమిటి? ఇవి అంతరించిపోతున్న సమాజం గురించైనా చెప్తున్నాయి, లేదా పరిణామ సంక్షోభాన్నైనా చెప్తున్నాయి. నిజానికి రైతులు కార్మికులు కావడం అసలు పరిణామం.

అల్లం రాజయ్య: మైబు ట్రాక్టర్ తేకముందు పరిస్థితి చెప్తూ కందులకు 60వేలు, వడ్లకు 50వేలు వస్తుందన్నారు. అది సాధ్యం కాదు. భారతీయ ఉత్పత్తి విధానాలు నక్సల్బరీ ముందు చాలా పనికిమాలినవి. అది రైతును రైతుకూలిగా మార్చే విధానాలు కాబట్టే తెలంగాణ నుండి నక్సల్బరీ వరకు ఉద్యమాలొచ్చాయి. బ్యాంకింగ్ వ్యవస్థతో సహా అన్నీ వ్యవసాయాన్ని, రైతును ధ్వంసం చేసేవే. ఏ మాత్రం గిట్టుబాటు కాకుండా దివాలా తీయించేవే. ట్రాక్టరుకు ముందు కథలో చెప్పినట్లు ఆదర్శవంతంగా లేదు. వ్యవసాయం గురించి భారతదేశానికి ఒక ప్రణాళిక నక్సల్బరీ ప్రణాళిక. ప్రభుత్వానికున్న ప్రణాళిక హరిత విప్లవం, బ్యాంకింగ్ వగైరా వ్యవసాయాన్ని నాశనం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఏకీకృత విధానం లేదు. అది ఇండియాలో ఉన్న సంక్లిష్టత. భారతదేశంలోకి బ్రిటిష్ పెట్టుబడి వచ్చాక సమాజంలో ఉండే ఉత్పత్తి శక్తుల గురించి అధ్యయనం జరిగింది. ఇక్కడ పెట్టుబడిని రానిచ్చే సామాజిక పరిస్థితులు లేవు. గ్లోబలైజేషన్ పెట్టుబడి కూడ అటువంటిదే. ప్రపంచవ్యాప్తంగా ఆ పెట్టుబడులొచ్చాక సంక్షోభాలొచ్చి ప్రభుత్వాలు కుప్పకూలాయి. ఇండియాలో ఉన్న పాత సమాజపు పట్టు వల్ల ఇంకా కుప్పకూలలేదు. అయితే కొత్త ఉత్పత్తి సంబంధాలొచ్చి పాతవాటిని తోసేయడం జరుగుతుంది. ఇక్కడ ట్రాక్టర్ రావడానికి ప్రేరణ ఉంది. పాత సమాజంలో సంక్షోభం ఉంది. తప్పించుకోలేని పరిస్థితులొచ్చాయి. ఈ సంక్షోభంలోని క్రోధం వేరేగా చానలైజ్ అవుతోంది. ఉదాహరణకు తెలంగాణ ఉద్యమం.

పాత సమాజం కుప్పకూలిపోయింది. పాతపద్ధతిలో వ్యవసాయం చేసే పరిస్థితి లేదు. బాగా పండే చోట్ల క్రాప్‌హాలిడే ప్రకటించారు. కూలి చేసేవాళ్ళే ఏదో ఒక రకంగా బతుకుతున్నారు. ఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన పరిణామాలు జరుగుతున్నాయి.

రచయిత స్పందన: నేను కూడా ట్రాక్టర్ చెడ్డది అని చెప్పదలచుకోలేదు. ఫైనాన్స్ పెట్టుబడి గురించి చెప్పాలనుకున్నా. ట్రాక్టర్‌ను ఏదో మోజు కొద్దీ, ప్రలోభాలతో కొనడం, స్టేటస్ కోసం తెచ్చుకోవడం చూస్తున్నాను.

ఏం రాయాలి, ఎలా రాయాలి:

ఏడు సంచుల దరిద్రం కథపై చర్చ ముగిశాక రాత్రి భోజనం ముగించి మళ్ళీ సమావేశమైనాం. బాగా పొద్దుపోయేవరకు జరిగిన చర్చలో సమకాలీన పరిస్థితులు, సమాజంలో మార్పుక్రమాన్ని అంచనా వేయడం, సాహిత్యంలోకి తర్జుమా చేయడంలో ఎదురవుతున్న సవాళ్ళ గురించి వివరంగా చర్చించాం. రాజయ్యగారు స్థానిక రాజకీయార్థిక, సామాజిక పరిస్థితుల్లో వస్తున్న మార్పులు, ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను అంచనా వేసే ప్రయత్నం చేస్తుంటే మధ్యమధ్యలో పాణి వీటిని సాహిత్యంలోకి తీసుకురావడానికి ఏ రూపాల్ని ఎంచుకోవాలి, నవలా సాహిత్యంలో ఇప్పటికే ఉన్న రూపాలు ఎంతవరకు ఉపయోగపడతాయి అని అడుగుతూపోయారు. మిగతావాళ్ళం దాదాపు ప్రేక్షకులమే అయ్యాం. ఆసక్తికరంగాసాగిన ఆ సంభాషణలో కొన్ని భాగాలు.

అల్లం రాజయ్య: ఎంత మార్పు గురించి మాట్లాడుకున్నా ఇప్పటికీ 2/3 మంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. అయితే మార్పు వేగవంతమయ్యింది. ఒకప్పుడు తెనాలి, కావలి వంటి పట్టణాలు మహాద్భుతమైన సాంస్కృతిక కేంద్రాలుగా కనపడ్డాయి. తర్వాత చాలామంది చదువుల కోసం ఉద్యోగాల కోసం విదేశాలకు పోయాక అక్కడ సంపాదించిందంతా ఇక్కడ పెట్టుబడి పెడుతున్నారు. కొనేవాళ్ళు లేక రియలెస్టేట్ సంక్షోభం వచ్చింది. ఎంతో స్ఫూర్తినిచ్చిన వరంగల్ కూడ చాలా పాడైంది.

ఇప్పుడు మధ్యతరగతిలో ఏమీ లేదు. ఉన్న తెలంగాణ ఉద్యమం స్టాగ్నేషన్‌కు గురైంది. ఇప్పుడు ఉద్యమం ప్రొడక్టివ్ రూపమెుచ్చేవరకూ కదలదు. అంటే ఉత్పత్తికి సంబంధించినదాంతో ముడిపడి ఉన్న ఉద్యమం రావాలి. 69-70లో సీమాంధ్ర మీద పడి ఆస్తులు నష్టం చేశాం. ఇప్పుడా రూపం తీసుకునే పరిస్థితి లేదు. సామూహిక ఉద్యమం తీసుకురావడమే పరిష్కారం.

పాణి: విప్లవోద్యమం చాలా వరకు తెలంగాణ ప్రాంతానిది కదా. అదేమో ఆధునికపూర్వ భూస్వామ్య సమాజం. ఉద్యమాల వల్ల అవి కొంత బూర్జువా ఆధునిక సమాజాలుగా మారాయి. పాత భూస్వాములు పోయారు. ఒకరకంగా ఆధునికపూర్వ సమాజాలను ఆధునికీకరించేవరకు మనం విజయం సాధించాం. ఫ్యూడల్ సమాజంలో వర్గపోరాటం తేలిక. రాజ్యానికున్న శక్తి తక్కువ కాబట్టి. ఈ రోజున్న ఉద్యమాలు చూస్తే బూర్జువా డిమాండ్ల కోసం జరిగే పోరాటాలు. పాత సమాజం నుండి పరివర్తనను మనవాళ్ళు బాగా రాశారు. ఇప్పుడు రూపొందుతున్న సమాజం, చలనంలో ఉన్న సమాజం గురించి ఏం రాయాలి, ఎలా రాయాలి?

అల్లం రాజయ్య: సాంస్కృతిక విప్లవ సందర్భంలో గ్రేట్ డిబేట్ నడిచింది. అది జరుగుతున్న సమయంలోనే రష్యా పతనమైంది. లెనిన్ నుండి ఇక్కడిదాకా ఏం మార్పు జరిగింది? ప్రపంచ యుద్ధాన్ని ఎదుర్కొంటూ ఇంటికొకరు చనిపోయిన సమాజంలో ఈ మార్పును ఎందుకు పసిగట్టలేకపోయారు? మావో కొంత చేశాడు కాని తర్వాత అక్కడా పతనం దిశగా పోయింది. ప్రజాస్వామిక ఉద్యమాలు లేకుండా కేవలం సాయుధ పోరాటమే మనగలుగుతుందా?

రూపం విషయానికొస్తే గూగీ "మట్టికాళ్ళ మహారాక్షసి" లాంటి నైరూప్య చిత్రకళ తీసుకోవచ్చు. దానికి స్థలకాలాల ప్రత్యేకత ఉండదు. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించకుండా ఒక్కరోజు కూడ ఉండలేం అని గూగీ భావం. అందులో "వారింగా" అన్ని రకాలుగా తెలంగాణ అమ్మలాగా దగాపడినామె. అయితే ఆమె పోరాడే వారింగా. గూగీ గొప్ప రచయిత. కాని పొలిటికల్ రచయిత కాదు. అలాంటి వందల కథలు రాయెుచ్చు. కాని వాటితో ఏం చేయాలి?"

పాణి: వసంతగీతం ఫాం తీసుకున్నామనుకోండి. అది రియలిస్టిక్ ఫాం. నూటికి నూరు శాతం గడ్డు వాస్తవం. అందులో సౌందర్యం కూడా ఉంది. ఆ ఫాంలో ఇప్పుడు రాయెుచ్చా? ఇప్పుడున్న సెజ్‌లు, ఎన్‌కౌంటర్లు వగైరాల గురించి.

అల్లం రాజయ్య: వసంతగీతం కాలంలో ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేదు. ఆ కాలం అలాంటిది. భూస్వామ్య రాజ్యం. ఇప్పుడేమో అంతర్జాతీయ పెట్టుబడి అయిపోయె.

పాణి: నిజమే. ఆ నవల్లో కాంగ్రెస్, హయంగ్రీవాచారి ఫక్తు ఫ్యూడల్. ఇప్పుడు అలా కాదు. కొంత అన్‌సెర్టెనిటీ ఉంది. ఇదీ వాస్తవంలో భాగమే. దీన్ని ఎట్ల రాయాలి?

అల్లం రాజయ్య: క్యాపిటల్‌లో కన్‌ఫ్యూజన్ ఉండదు. కాని మనకే సమాచారం లేదు. అధ్యయనం చేయాలి. మట్టికాళ్ళ మహారాక్షసి కన్నా ఇప్పుడు స్పష్టత ఉంది. కొంచెం ముందుకు పోయింది.

పాణి: మరి ఆన్నా కరేనినా శైలి?

అల్లం రాజయ్య: ఇప్పుడది పనికి రాదు. అప్పుడు సమాజం నిలువనీరులా ఉంది. ఇప్పుడు వేగం పెరిగింది. మానవ సంబంధాల్లో కూడ చాలా మార్పులొచ్చాయి. సమాజపు ప్రవాహాన్ని చెప్పడానికి అది పనికి రాదు. అలాగని లాటిన్ అమెరికన్ శైలీ నప్పదు.

ఈ చర్చ ఆ రాత్రి ముగియనే లేదు. చాలా పరిశ్రమ చేయాల్సిన విషయాలున్నాయనైతే అర్థమయింది.

మిగిలిన తక్కువ సమయాన్ని దృష్టిలో పెట్టుకొని రెండోరోజు ఉదయం కాస్త తొందరగానే సమావేశమయ్యాం. మొదటి కథ ఉదయమిత్ర "ఇసప్పురుగు".

ఉదయమిత్ర "ఇసప్పురుగు":

చిన్నపిల్లలు ఆడుకునే స్థలంలో పాము కనపడడంతో కథ మొదలవుతుంది. భారీ పరిమాణంలో నాగుపామును చూసి అందరూ భయపడుతుంటే ఒక మహిళ సాహసోపేతంగా దాన్ని పట్టుకొని చంపుతుంది. అంత ధైర్యాన్ని ప్రదర్శించే మహిళ భర్త మాట వింటేనే వణికిపోతుంది. విషప్పురుగును చంపగలిగిన స్త్రీ పామువంటి భర్తను కూడా ఎదిరించగలగాలంటూ ఇరుగుపొరుగు అనుకుంటారు. కథపై చర్చ ఇలా సాగింది.

పరిమళ్: కథ చెప్పే పద్ధతి బాగుంది. కథలో భర్తని విషప్పురుగుగా చెప్పారు. ఆయన అలా ఎందుకున్నాడు. ఎలా అయ్యాడు?

అల్లం రాజయ్య: నెరేషన్ చాలా బాగుంది. పల్లెనా, పట్నమా స్థలం స్పష్టంచేయాలి. ఆ అమ్మాయి భర్త ఏ వృత్తి చేస్తున్నాడో చెప్తే అతనెందుకలా ఉన్నడో చెప్పినట్లవుతుంది.

వెంకటకృష్ణ: తెలుగు సాహిత్యంలో పర్యావరణ స్పృహ లేదని చెప్పడానికి ఇది ఉదాహరణ. పాముతో మగవాన్ని పోల్చాల్సిన అవసరం లేదు. ఆమె పాముని ఎదుర్కొన్న ధైర్యాన్ని మగవాని మీద కూడ చూపించి ఉంటే బాగుంటుంది. పామును బతికించాల్సిన పర్యావరణ స్పృహ ఉండాలి.

రుక్మిణి: కథ పెద్దదిగా అనిపించింది. పామును చంపే సన్నివేశం మరీ పెద్దదైంది. అంత ధైర్యమున్న అమ్మాయి భర్తతో దెబ్బలు తినడం బాలేదు. ఎదురుతిరిగి కొట్టే ఉదాహరణలున్నాయి. నాగుపాము చెట్టెక్కినట్టు రాశారు. పసరికపాము, దసరిపాము ఎక్కుతాయని తెలుసు. నాగుపాము చెట్టెక్కదనుకుంటా. మగవాడిని పాముతో పోల్చడం గురించి ఆలోచించాలి.

వెంకట్రాములు: పామును చంపిన ధైర్యాన్నే భర్త దగ్గర ప్రదర్శించలేదు. సమాజం భర్తకు అణిగిమణిగి ఉండాలని నేర్పుతుంది. భర్త అంత దారుణంగా కొట్టడానికి వెనక అతనికున్న ఫ్రస్ట్రేషన్ ఏమిటో చేప్తే బాగుంటుంది.

వరలక్ష్మి: భయాన్ని పాముతో పోల్చడం కొత్తదేం కాదు.

కారా మాష్టారి భయం కథే ఉంది. ఇక్కడ పర్యావరణ స్పృహ అన్న అంశమే రాదు. అయితే కథలో అవగాహనకు సంబంధించిన సమస్య ఉంది. స్త్రీపురుష వైరుధ్యం శతృపూరితమైనది కాదు. కొంత మంది ఫెమినిస్టులు అలా చెప్తారు. మార్క్సిస్టు అవగాహన ప్రకారం అది తప్పు.

బాసిత్: కథ స్పష్టంగానే ఉంది. గతంలో ఉదయమిత్ర పర్యావరణ స్పృహతో గొప్ప కథ రాశారు. ఇక్కడ అంశం అది కాదు. భార్యాభర్తల మధ్య శతృపూరిత వైరుధ్యం ఉన్నట్టు రాశారు. అది సరైంది కాదు.

పాణి: ఫెమినిస్టులు కూడ అలా చెప్పడం లేదు. తెలుగులో ఫెమినిస్టులకు ఆ పరిణతి ఉంది. కథ స్త్రీపురుష సంబంధాల మీద ప్రధానంగా ఫోకస్ చేసింది. కాని ఆ సంబంధాలను చెప్పకుండా శతృపూరిత సంబంధాలని సూత్రీకరించడంతో సమస్య వచ్చింది.

శశికళ: కథలల్లీ, లడ్డూ పాత్రలతో మొదలవుతుంది. పిల్లల గురించిన కథ అనుకున్నా. అయితే ఫోకస్ మారిపోయింది. మన సాహిత్యంలో అభ్యుదయ అంశాలను ఎలివేట్ చేయడానికి ప్రయత్నం చేస్తాం. కానీ పామును చంపడం వంటి ప్రతీకలు సమస్యాత్మకం అవుతాయి. మనం ప్రాణుల పట్ల సున్నితంగా ఉంటాము.

రచయిత స్పందన: పిల్లలు తిరిగే ప్రాంతంలో పాము వస్తే చంపడానికే చూస్తాము. దాని ద్వారా ఆ అమ్మాయి ధైర్యవంతురాలు అని చెప్పదలచుకున్నా. కుటుంబ హింస ఎలా ఉంటుందో చెప్పాలనుకున్నా. ఆదివాసీ స్త్రీలు క్రూరమృగాలతో కొట్లాడి ఇంటికొచ్చి భర్తతో తన్నులు తింటారు. భర్తతో కొట్లాడే లక్షణం ఇంకా రావడం లేదు. అది కూడా వస్తుందని ఒక పాత్ర అంటుంది.

ఇక తర్వాత కథలోకి

పరిమళ్ పేరు పెట్టని కథ:

పరిమళ్ తన కథకు పేరు పెట్టలేదు. కథ ఒక రోడ్డు ప్రమాదం చుట్టూ తిరగుతుంది. ప్రమాదంలో చనిపోయిన కుర్రవాడి తల్లిదండ్రుల శోకం, రోడ్డు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటివి తరచూ జరుగుతున్నాయని ప్రజలు చర్చించుకోవడం, నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని రాజకీయ నాయకులు చేసే హామీల నాటకాలు అన్నీ అతి తక్కువ నిడివిలో చెప్పే ప్రయత్నం చేశారు పరిమళ్. అట్లాగే రాము, శివ అనే విద్యార్థులు అప్పటి వరకు అకెడమిక్ చదువులకే పరిమితమై ఉండి తమ ఊరిలో జరిగిన సంఘటనతో చుట్టూ జరిగే విషయాల్ని గురించి ఆలోచించడం మొదలు పెట్టడం, వాళ్ళ కాలేజీలోనే చదువుకుంటూ విద్యార్థి రాజకీయాల్లో ఉండే రమేశ్‌వైపు చూడడం కథలో ఇంకో పార్శ్వం. ఈ కథ మొదలు పెట్టేటప్పటికే పొరహక్కుల సంఘం శేషయ్యగారు వచ్చి చేరారు. కథలన్నీ శ్రద్ధగా వింటూ ఆయనా చర్చలో పాల్గొన్నారు. పరిమళ్ చదివిన కథపై చర్చ ఇలా నడిచింది.

శశికళ: చిన్న కథ. బాగుంది.

ఉదయమిత్ర: కథను ఎత్తుకోవడం సంఘటనతో ఎత్తుకొని ఉంటే ఇంకా బాగుండేది. కథ నాటకీయంగా ఉంటే బాగుంటుంది. “రోడ్డు” అనేది చాలా పెద్ద కాన్వాస్. దాన్ని తీసుకొని మన కసి అంతా రాయొచ్చు. “సమాజానికే యాక్సిడెంట్ అయ్యింది” అని ఒకచోట అంటారు. అది చాలా బాగుంది.

శేషయ్య: రమేశ్ ప్రస్తావన చివర్లో వచ్చింది. ఆయన పాత్ర కొంత చూపించి ఉంటే బాగుండు. కథ ఇంకా పెంచవచ్చు. నష్టపరిహారం కోసం పోరాటం కూడా చెప్తే బాగుంటుంది.

వెంకటకృష్ణ: రమేష్‌పాత్ర పెంచాలి. కథలో జనం మాట్లాడుకుంటున్నప్పుడు ఆ పాత్ర గురించి ఇంకా కొన్ని విషయాలు తీసుకురావచ్చు. ఏ స్కీమ్‌తో రాయాలనుకున్నారో ముందుగా నోట్స్ రాసుకుని, ఆ నోట్స్ ప్రకారం కథ వచ్చిందా అని సరిచూసుకుంటే కథ బాగా వస్తుంది.

అల్లం రాజయ్య: కథకుండే ఆత్మను పట్టుకోవడం మన వర్క్‌షాప్ కథకులకు తెలిసింది. అది కొంచెం ప్రాక్టీస్ చేస్తే ఇంకా బాగా వస్తాయి. కథ మీట ఎక్కడ నొక్కాలో తెలిస్తే బాగా వస్తుంది. విద్యార్థి రాజకీయాలపై ఇటీవలి కాలంలో కథలు లేవు. రావాల్సిన అవసరం ఉంది.

రవీంద్రారెడ్డి: కథ బాగుంది. ప్రాణం పోవడం అంత తేలిక విషయం కాదు. ఆక్రోశాన్ని ఇంకొంచెం చెప్పాలి. దానికి కారకులు మీరే (రాజకీయ నాయకులు)అని చెప్పగలగాలి.

రుక్మిణి: కథని ఇంకా పెంచాలి. యాక్సిడెంట్‌ను ఎక్కువ స్ట్రెస్ చేయాలి. రోడ్డు గురించి కొంత చెప్పొచ్చు. నాలుగు లేన్లు, ఆరు లేన్ల రోడ్లు వాటి మాయాజాలం చెప్పొచ్చు. అలానే తల్లిదండ్రుల ఆవేదన కూడా.

వెంకట్రాములు: రోడ్డు ప్రమాదం మీద తక్కువ నిడివిలో కథ బాగుంది. ఒక యాక్సిడెంట్ కుటుంబాన్ని ఎలా దెబ్బ తీస్తుందో చెప్పాలి. దీనంతటికీ ప్రభుత్వాన్ని బాధ్యత చేయాలి.

బాసిత్: ఒక కవి కథ రాస్తే పాఠకులకు ఎంత సౌలభ్యమో ఇదో ఉదాహరణ. చిక్కటి కథ. మంచి వ్యక్తీకరణలున్న వాక్యాలున్నాయి.

వరలక్ష్మి: కథ ముఖ్యఉద్దేశం విద్యార్థులు అకెడమిక్ చదువులకు పరిమితం కాకుండా చుట్టూ జరుగుతున్న వాటిని తెలుసుకోవాలని. దానికి రాము, శివ పాత్రల్ని తీసుకున్నారు. వీళ్ళు చలించడానికి చనిపోయిన కుర్రాడితో వీళ్ళకేమైనా సంబంధం ఉన్నట్టు చెప్తే కథకు బలమొస్తుంది. ఆ అబ్బాయి వీళ్ళ దగ్గరి స్నేహితుడు అయితే బాగుంటుంది. రోడ్డును తీసుకొని కథ రాయడం మంచి ఎత్తుగడ. ఎన్ని విషయాలైనా చెప్పొచ్చు. రాజకీయ నాయకులు సందర్శించినప్పుడు జరిగే అల్లరిలో చాలా వ్యక్తీకరణలుంటాయి. అలాంటి సన్నివేశాలను బాగా వాడుకోవచ్చు.

పాణి: రోడ్డు ప్రగతిదాయకం. కథా రచయితకు రెండు సమస్యలున్నాయి. ఒకటి టెక్కును మరమ్మతు చేయడం, రెండు దృక్పథం. రోడ్డును దేనికి సంకేతంగా చూస్తాము అనేదానికి

సంబంధించింది.

రచయిత తన రచనానుభవాలను(నేను, కథ) చెప్తూ కథపై జరిగిన చర్చపై కూడా స్పందించారు. "చిన్నతనంలో నాకు నైపుణ్యంతో చేసే ఏ చేతిపనైనా నచ్చేది. మనుషుల్లో దైన్యం భరించలేను. చదువుకునే రోజుల్లో సాహిత్యం పెద్దగా చదవలేదు. పరిస్థితుల వల్ల తొందరగా ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఎం.ఏ చేశాను. అందులో భాగంగా తెలుగు సాహిత్యం చదివాను. ముందు కవిత్వం రాశాను. వర్క్‌షాపుకు ఉదయమిత్ర సార్ రాలేని పరిస్థితిలో ఆయన కథ నేను తీసుకొచ్చాను. అక్కడ చర్చ నాకు ఆసక్తి కలిగించింది. అక్కడి నుండి వరుసగా వర్క్‌షాపులకు రావడం, కథలు రాయడం చేస్తున్నాను. ఈ కథ విషయానికొస్తే రాము, శివలకు చదువు మీదే ధ్యాసంతా. కాలేజీలో సంఘాలున్నా అంత పట్టించుకోరు. వాళ్ళ ఊర్లో జరిగిన యాక్సిడెంట్‌తో వాళ్ళు రియలైజ్ కావడం చెప్పాను. అకడెమిక్ చదువులతో పాటు చుట్టూ జరుగుతున్న వాటి మీద దృష్టి పెట్టాలనే విషయాన్ని చెప్పాలనుకున్నా."

వెంటనే తర్వాతి కథలోకి వెళ్ళాం.

వెంకటకృష్ణ "కిటికీ":

పొదుపు సంఘంలో పనిచేస్తున్న ఇద్దరు మహిళలు ఒక విషయమ్మీద ఘర్షణ పడతారు. ఇద్దరూ బంధువులే, పక్కపక్క ఇళ్ళ వాళ్ళే. రెండిళ్ళ మధ్య ఒక కిటికీ ఉంటుంది. కొంతసేపు మాటలు లేక బిగుసుకుపోయిన స్థితి నుండి కష్టాల్లో ఉన్న ఒక ఇంటికి కిటికీ గుండా సాయం అందిస్తుంది పక్కింటామె. వాతావరణం మళ్ళీ తేలికవుతుంది. ఈ కథ మీద మంచి చర్చ జరిగింది.

రుక్మిణి: ఎన్ని ఘర్షణలున్నా పేదవాళ్ళలో కష్టాల్లో ఒక ఐక్యత ఉంటుంది. అదే ఈ కథ. కథ చాలా బాగుంది.

రవీంద్రారెడ్డి: ఇరుగుపొరుగు సహకారం చెప్పారు. పాఠకుల్ని ప్రభావితం చేసే అంశం.

శేషయ్య: కథలో సీరియస్ విషయాలూ ఉన్నాయి. కుటుంబాలను స్త్రీలు పోషించడం. మగవాళ్ళు ఏమీ చెయ్యరు. మూడు తరాల నుండి స్త్రీలే కుటుంబాలను పోషించడం కథలో చూస్తాం. వీళ్ళలో గయ్యాళితనం ఉంటుంది. అది వాళ్ళను వాళ్ళు డిఫెండ్ చేసుకోడానికి. కిటికీలుంటే బాగుంటుందని రచయిత చెప్పాడు.

అల్లం రాజయ్య: సహాయాన్ని స్వీకరించడం ఒక్కోసారి వ్యతిరేక దశలో ఉంటుంది. అంటే పక్కింటామెది పైచేయి అవుతుంది. ఈ కథలో అనుకూల దశలో ఉంటుంది. అయితే అబ్బాయి వ్యక్తిత్వం ఎలా ఆలోచిస్తుంది? ఆసక్తికరంగా ఉంటుంది. మానవ సంబంధాల మధ్య ఘర్షణలో స్టేట్ రిఫ్లెక్షన్ ఉంది. ఈ మహిళా గ్రూపుల్ని పెట్టడం, ఆర్థిక లావాదేవీల్లోకి దించడం ప్రభుత్వం ఎందుకు చేస్తోంది? పాత ఫ్యూడల్ సంబంధాల స్థానంలో కొత్త కమాడిటీ రిలేషన్స్ రావడానికి జనాన్ని తయారు చేస్తున్నారు. దొమ్మరాటలో ఒక మహిళ గోడ మీద తిరుగుతూ ఉంటుంది చూడండి. గోడ మీద తిరిగిన మనిషి ఆర్థిక వ్యవహారాల్లోకి రావడం ఒక పరిణామం.

వరలక్ష్మి: చాలా బాగుంది. ఇతివృత్తమూ, కథలో తీసుకున్న ప్రతీకలన్నీ అద్భుతంగా ఉన్నాయి.

బాసిత్: సున్నితమైన కథ. "కిటికీ" అనే పేరులోనే విషయం అర్థమవుతుంది. మానవ సంబంధాలను బాగా ఎలివేట్ చేసిన కథ.

అల్లం రాజయ్య: ఇవాళ రాజ్యం పనిచేస్తున్న కొత్త రూపాల గురించి బాగా అధ్యయనం చేయాలి. మహిళా గ్రూపులు పోరాట ప్రాంతాల్లో ఒకలాగ, మిగతా ప్రాంతాల్లో ఒకలాగ ఉన్నాయి. కుటుంబానికి సంబంధించిన పాత రూపాలు మారిపోతున్నాయి. అన్నీ ఫైనాన్స్ పెట్టుబడి, ఉత్పత్తి సంబంధాలుగా మారిపోతున్నాయి. దీని పరిణామం ఎలా ఉండబోతోంది?

పాణి: కథ బాగా సెన్సిబుల్‌గా ఉంది. ఆర్‌ఎస్‌రావు గారు అనేవారు. ప్రజల మధ్య వైరుధ్యాలేగాక ఐక్యత గురించి కూడ సాహిత్యంలోకి తేవాలి అని. కథలో సహకారమనేది ఇతివృత్తం. అదీ కిటికీ తెర నుండి. మనం గుర్తించాల్సిన విషయమేమిటంటే మహిళల శక్తిసామర్థ్యాలు పెద్ద ఎత్తున బైటికొస్తున్నాయి. భర్తలు కొడుతూ ఉంటే పడుతూ, అనుత్పాదక పనులే చేస్తూ ఉన్న దశ నుండి పైకి రావడం ఒక ముఖ్య పరిణామం.

రచయిత స్పందన: ఈ కథను ఎలా రిసీవ్ చేసుకుంటారో అనుకున్నా. మనం పట్టించుకోనివి గ్రామాల్లో చాలా జరుగుతున్నాయి. ప్రపంచబ్యాంకు నిధులతో గ్రూపులు, ఫైనాన్సింగ్ వగైరా అన్నీ అందరినీ ప్రధాన సిస్టమ్‌లోకి తీసుకురావడం కోసం జరుగుతున్నాయి. ఇందులో ఓటుబ్యాంకు, పొలిటికల్ హమ్‌బగ్ ఉన్నా నిజంగా ఏం జరుగుతోంది అన్న దానిపై దృష్టి పెట్టాలి. ప్రపంచబ్యాంకు సంస్కరణలు మనం చూడకూడదు అని కళ్ళకు గంతలు పెట్టుకున్న పరిస్థితి వామపక్ష బృందాల్లో ఉంది. అలా ఉండకూడదు అని రాశాను. కథలో ఘర్షణ కూడా పొదుపు సంఘంలో నాయకత్వం కోసమే. ఆ ఘర్షణ ఉన్నా ఐక్యత, సహకారం ఉంటుంది. ఎవరు నిర్మాణం చేస్తున్నా అది ఐక్యతకు ఉపయోగపడుతుంది.

ఇక తర్వాతి కథ గురించి.

పాణి "ఆభాస":

పాణి చాలా కాలం తర్వాత కథ రాసుకొచ్చారు. ముందుగా తన కథశీర్షికను వివరించారు. నాయకుడు విలన్‌గా ప్రవర్తిస్తే అలంకరణ శాస్త్రంలో ఆభాస అంటారని చెప్పారు. దాంతో అందరికీ అర్థమయ్యే టైటిల్స్ పెట్టాలి కదా అని కొంత మంది ప్రతిస్పందించారు. కథలో ప్రపంచ జర్నలిస్టుల దినోత్సవం నాడు విలేకర్లు పెట్టిన ఒక మీటింగు గురించి వ్యంగ్యంగా చెప్పుకుంటూ వస్తారు రచయిత. మంత్రి, ఎస్పి తమ అసలు పాత్రలను మరిచి చేసిన ప్రసంగాలను, ఒక నాటకంలా సాగిన ఆ మీటింగును ఈ కథ చిత్రీకరిస్తుంది.

రవీంద్రారెడ్డి: సాధారణంగా ఎస్‌పి, మినిస్టర్ పబ్లిగ్గా కాంట్రడిక్ట్ చేసుకోరు. మినిస్టర్ జర్నలిస్టుల గురించి వెటకారంగా మాట్లాడతాడు. జర్నలిజానికి విలువలు ఉన్నాయి. మినిస్టర్, ఎస్‌పిలపై ఎక్కడా చురక లేదు.

వెంకటకృష్ణ: కథ ఫాం వినూత్నంగా ఉంది. అరుంధతిరాయ్ రాసిన ఒక కథ గుర్తొస్తోంది. లండన్‌లో ఒక పార్టీ గురించి రాపోర్ట్ చేయడమే కథ. ఇలా కూడా కథ రాయొచ్చు.

అల్లం రాజయ్య: కథ ఓకే. గ్రేట్ డిక్టేటర్ గుర్తొస్తుంది. దాని ప్రభావం చాలా గొప్పది.

ఉదయమిత్ర: "ఆభాస" అంటే మామూలు జనాలకు అర్థం కాదు. ఎ డ్రామా అని పెట్టొచ్చు. కథ హాయిగా ఉంది. రీడబిలిటీ ఉంది. చెప్పదలచుకున్నది స్పష్టంగా ఉంది.

వరలక్ష్మి: ఇటీవలి కాలంలో పోలీసు అధికార్లను సభలకు, ఫంక్షన్లకు పిలవడం ఎక్కువైంది. సమాజంలో వాళ్ళ పాత్ర పెరిగింది కదా. వాళ్ళు ఉపన్యాసకులవుతున్నారు. కథల్లో వ్యంగ్యం బాగుంది.

వెంకట్రాములు: కథనాన్ని కథగా మలచడంలో విజయవంతం అయ్యారనిపిస్తుంది. మామూలుగా మంత్రులు బైటపడతారు. అధికారులు అలా ఉండరు. పోలీసు అధికారులు అభ్యుదయవాదుల్లా మాట్లాడడం చూస్తూంటాము.

శశికళ: దృశ్యమానం చేయడంలో విజయం సాధించారు. పాత్రలు కళ్ళముందు కనపడుతున్నాయి.

కిషన్‌జీ ఎన్‌కౌంటర్‌పై రుక్మిణి కథ:

కామ్రేడ్ కిషన్‌జీని ఎంత దారుణాతిదారుణ చిత్రహింసలకు గురిచేసి చంపారో అందరికీ తెలుసు. అన్ని చిత్రహింసలు భరిస్తూ ఆయన ఎంత నిబ్బరంగా రహస్యాలను కాపాడాడో, ఆశయం కోసం ఎంత అనన్యసామాన్యమైన త్యాగం చేశాడో తలచుకుంటే ఎంత ఆశ్చర్యంగా, ఎంత గొప్పగా అనిపిస్తుందో అంత దు:ఖం కలుగుతుంది. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం కరపత్రం చదివి కలిగిన స్పందనతో కథ రాశానని రుక్మిణి అన్నారు. ఇది కథనం మాత్రమే అంటూ కథ చదవడం ప్రారంభించారు. కథ వింటున్నంతసేపూ, విన్నాక చాలాసేపు గుండెలు బరువెక్కాయి. పోలీసులు చిత్రహింసలు పెడుతుంటారు. ఆ కామ్రేడ్ నొప్పిని భరిస్తూ తాను కలిసిన ప్రజలనూ, ప్రదేశాలనూ గుర్తుతెచ్చుకుంటుంటాడు. చివరి శ్వాస వరకు విప్లవాన్నే కలగంటాడు. కథ చదివాక చర్చని ప్రారంభించాలి. కాసేపు మౌనమే ఆవహించింది. అప్పటికే మధ్యాహ్నం ఒంటిగంట దాటడంతో భోజన విరామం తీసుకొని తర్వాత చర్చిద్దామనుకున్నాం. ఈలోగా ఉద్విగ్నత కాస్త తగ్గి ఏమైనా ఆలోచించగలం అనుకొని తినడానికి బయలుదేరాం. అనుకున్నట్లుగానే భోజనం తర్వాత వెంటనే సమావేశం కొనసాగింది. కథపై, హింసను వ్యక్తీకరించే తీరుపై లోతైన చర్చ జరిగింది.

రవీంద్రారెడ్డి: ఈ కథను వర్క్‌షాప్ కోసమే రాసినట్లుంది. మీ పత్రికలో ప్రచురణ కోసం, కొంత మంది పాఠకుల కోసమే రాసినట్లుంది. మామూలు పాఠకులు ఎలా తీసుకుంటారో ఆలోచించాల్సిందే. ఏమైనా విప్లవకారుడిపాత్ర ఇంకా శక్తివంతంగా, డామినేటింగ్‌గా మలచొచ్చు.

శేషయ్య: ఇప్పుడు ఇటువంటి కథలు అవసరం. ఉద్యమం పట్ల మనకున్న ఇమేజ్ ఒకటి. ఒక పదేళ్ళుగా ఉద్యమాన్ని డీలెజిటమైజ్ చేయాలని శత్రువు బలంగా దాడి చేస్తున్నాడు. రచయితలు ఉద్యమనాయకులను బాగా ప్రాజెక్ట్ చేయాలి. కథ చదివాక వీళ్ళు ఇంత గొప్పవాళ్ళా అనుకోవాలి. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే చిత్రహింసలు పెట్టినా శత్రువే ఓడిపోతున్నాడు. కథలో విప్లవోద్యమాన్నంతా రెఫర్ చేసే ప్రయత్నం చేశారు. అలా కాకుండా ఒక ఉద్యమాన్ని ఫోకస్ చేయండి. ఉదాహరణకు లాల్‌ఘడ్. మేధావులు కూడా లాల్‌ఘడ్ ఉద్యమాన్ని దాని గుణాలను గొప్పగా చెప్తున్నారు. ఇబ్బందులున్నా, ప్రమాదాలున్నా ఆయన మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చాడు. ఓపన్ కాకపోతే ఇదంతా ప్రపంచానికి తెలియదు. ఈ మధ్య ఢిల్లీలో జరిగిన మీటింగ్‌లో ఒకరు ఈయన చావు కొనితెచ్చుకున్నాడని అన్నారు. ఇటువంటి వాటిని బద్దలు కొట్టాలి.

వెంకటకృష్ణ: కథ చాలా పెద్దదైపోయింది. హింస ఎక్కువగా ఉంది. ఒక కారెక్టర్‌ను నిర్మాణం చేయడానికి భయం గొలిపే హింస వద్దు. కథలో కంఠస్వరం కూడా ఒకసారి సరిచూసుకోవాలి. రచయిత, పాత్ర జమిలిగా మాట్లాడుతున్నారు.

ఉదయమిత్ర: కథ పేరు స్పృహ అని పెడితే ఎలా ఉంటుందో ఆలోచించండి. ఆదివాసుల గురించి ఎక్కువగా చేర్చి ఉంటే బాగుండేది. మధ్యమధ్య వాడిన కవిత్వ చరణాలు మరీ పాడవయ్యాయి. పోలీసులు ఇంగ్లీషులో మాట్లాడుతుంటారు. అవి అక్కర్లేదేమో. అక్కడ తెలుగు రాసినా నష్టం లేదు. కారెక్టర్‌ను ఉన్నతీకరిస్తూ, పోలీసులను తగ్గించాలి. హింస అంత ఎక్కువగా చూపించడం వల్ల ప్రయోజనం లేదు. క్లుప్తంగా రాస్తే ఒక దృశ్యకావ్యంలాగా నిలబడిపోతుంది.

వెంకట్రాములు: హింసించడం దగ్గర కథ పొడవైనట్లు అనిపించింది. మావోయిస్టు ఉద్యమంలో ఆయనకున్న మాస్ఇమేజ్ ఇంకా బలంగా చెప్పాలి. అసలు ఆయన బెంగాల్ పోయినాకనే ఉత్తరాది మీడియా ఉద్యమం గురించి పట్టించుకున్నది.

శేషయ్య: హింస స్థానంలో మానవత్వాన్ని ఎక్కువగా చూపించడానికి ప్రయత్నం చేయండి. పాఠకులం మనం కాదు. కొత్తగా వస్తున్న తరాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మనం నిరాశలోకి జారిపోతున్నాం. ఈ దశలో త్యాగాన్ని ఎత్తిపడుతూ విశ్వాసాన్ని దృఢతరం చేసేదిగా మన రచన ఉండాలి.

అల్లం రాజయ్య: కిషన్‌జీ చనిపోయాక పెద్దపల్లిలో జరిగిన అనేక విషయాలున్నాయి. దహనం అయిపోయాక జార్ఖండ్ నుండి ఒక బృందం వచ్చి ఆ చితాభస్మం తీసుకున్నారు. వాళ్ళను పోలీసులు అరెస్టు చేశారు. మా కాలంలో ఇలాంటి మనిషి చనిపోతే ఆయన చితాభస్మం తీసుకొని మా ప్రాంతాల్లో చల్లుకుంటే మంచి

జరుగుతుందని వాళ్ళన్నారు. అంతిమయాత్రకు చాలా మంది రావాల్సింది. కిషన్‌జీని అలా చూడ్డానికి చాలామంది ఇష్టపడలేదు. చాలా మందిని పోలీసులు ఆపేశారు కూడా. ఇలాంటి కథ మావోలోళ్ళకు రాయడం సాహసమే. నేనైతే రాయలేను. "69నుండి అంటే 17ఏళ్ళ వయసు నుండి స్నేహితులం. ఆ మృతదేహాన్ని చూస్తే ఎవరోలాగ ఉంది. మానసికంగా ఆయనతో ఇప్పటికీ ఉన్నాం. ఈ కథలో కూడ రచయిత ఇబ్బంది తెలుస్తోంది. చాలా భాగం చెరబండరాజు కవితలు తెచ్చుకొని రాయాల్సి వచ్చింది." ఎంత బాగా రాసినా ఆయన్ని పోర్ట్రెట్ చేయడం అసాధ్యం. కొన్ని వ్యక్తిత్వాలు అలా ఉంటాయి. లెనిన్ గురించి సాహిత్యం లేదు. ఆయనే రాసుకున్న నీలం రంగు నోట్‌బుక్ తప్ప. అట్లాగే మావో గురించి కూడా సాహిత్యం లేదు. కొమురం భీం గురించి రాయగలిగింది ఆయన చరిత్ర. వాళ్ళను చరిత్రలుగానే రాయగలం తప్ప కాల్పనిక సాహిత్యంలోకి తీసుకురావడం కష్టం. రాయాలంటే చాలా కష్టపడాలి. మనల్ని మనం లుప్తం చేసుకుని రాయాలి.

పాణి: మనల్ని మనం లుప్తం చేసుకోవడం చాలా కష్టం. కాని మన ఉద్యమానికి అదవసరం. షంషేర్ రాసిన యోధ కథ ఒక ఉదాహరణ. అత్యద్భుత శిల్పం. హింసను అనుభవించడమెంత కష్టమో దాన్ని రాయడమూ అంతే.

శశికళ: ఇలాంటి కథలు రాయడం చాలా నొప్పితో కూడుకున్నది. ప్రతి వాక్యం హింసను భరిస్తూ రాయాలి. హింసను ఒక్కో జ్ఞాపకంతో అధిగమించడం వంటిది చేస్తే కథకు బలం చేకూరుతుంది.

శకుంతల: (రెండోరోజు మధ్యాహ్నం నుండి ఈమె వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు) పోలీసుల హింస ఎక్కువగా చెప్పినట్లు అనిపించింది.

రచయిత స్పందన: ఆయన అంత హింస ఎలా భరించాడు అనుకుని అప్పటికప్పుడు రాశాను. ఆయన పడ్డ చిత్రహింసలు ఒక్కటే చెప్పకూడదు అన్న ఉద్దేశం ఉంది. ఆయన త్యాగాన్ని ఎత్తిపట్టాలనే రాశాను. కథను తిరగరాసే ప్రయత్నం చేస్తాను.

ఇంక చివరి కథకొచ్చాం. సుభాషిణి వర్క్‌షాపు రాలేని పరిస్థితిలో వెంకటకృష్ణతో తన కథను పంపారు. ఆ కథను వరలక్ష్మి చదివారు.

కథకు పేరు పెట్టలేదు.

సుభాషిణి పంపిన కథ:

యూనివర్సిటీ ట్రెనింగ్ ప్రోగ్రాం కోసం వెళ్ళిన రచయిత కోట్ల రూపాయలు ఖర్చు పెడుతూ జరుపుతున్న శిక్షణా కార్యక్రమాలు ఎవరి ప్రయోజనాన్ని నెరవేరుస్తున్నాయా అని తర్కించుకుంటుంది. ఒక వైపు విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించకుండా ప్రొఫెసర్లకు అరవైదెభై వేలల్లో జీతాలిస్తూ ఇటువంటి కార్యక్రమాల్లో కేవలం ఆడంబరాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసే వైనాన్ని చూసి బాధ పడుతుంది. శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా వాళ్ళకో విచిత్రమైన కథ చెప్పి అందులోని సమస్యకు పరిష్కారం చెప్పమంటారు. దాన్ని ఆలోచించే క్రమంలో ఆమెకు ఒక కల వస్తుంది. విద్యార్థులు, రైతులు, కార్మికులు యూనివర్సిటీపై దండెత్తి ప్రజల డబ్బుతో వాళ్ళు సంపన్నులకు ఊడిగం చేసే అధ్యయనాలు చేస్తున్నారని, కోట్లకు కోట్లు బొక్కుతున్నారని తీవ్ర స్వరంతో నిలదీస్తూ అన్నీ ధ్వంసం చేస్తూంటే ప్రొఫెసర్లంతా భయపడి పరిగెత్తుతుంటారు. టేబుళ్ళ కింద దాక్కుంటుంటారు. ఆమె ఉలిక్కిపడి కలనుండి బైటపడడంతో కథ ముగుస్తుంది.

రవీంద్రారెడ్డి: వ్యవస్థ పట్ల అసంతృప్తిని ప్రతి ఒక్కరూ అనుభవిస్తున్నదే. వైరుధ్యాలను బాగా చెప్పారు.

శశికళ: కథ బాగుంది. యూనివర్సిటీల పరిస్థితి చెప్పింది. వృత్తికి న్యాయం చేయడం ఈ వ్యవస్థలో సాధ్యం కావడం లేదు. అది రచయిత కూడా ఫీలవుతున్నారు.

వెంకట్రాములు: ఇటీవలి ట్రెండ్స్ మీద మంచి కథ రాశారు. కథ వాస్తవాన్ని ఎత్తి చూపింది.

రుక్మిణి: ఒక పరిమితికి లోబడే వస్తువును ఎంపిక చేసుకున్నారు. తాను చూస్తున్నదే చెప్పారు. యూనివర్సిటీ సెమినార్లలోని డొల్లతనాన్ని బాగా చూపించారు. గుహలో చిక్కుకున్న కథ ఉత్సుకతను రేపింది. రచయిత్రి కోరికే కల రూపంలో వ్యక్తమైంది.

అల్లం రాజయ్య: ఇందులో రెండు అంశాలున్నాయి. బ్యూరోక్రసీని తయారు చేసుకోవడం. ఆ ప్లానింగ్ వెనక ఉద్యమాల ప్రభావం. శిక్షణా తరగతుల కోసం బుక్ చేసిన హోటల్ మొదలుకొని అక్కడిచ్చే పుస్తకాల వరకు పకడ్బందీగా ఆర్గనైజ్ చేసే కార్యక్రమాలవి. అందులో మొదటి క్లాస్ సైకాలజీ అయి ఉంటుంది. వ్యక్తుల ప్రవర్తనకు సంబంధించినవి, నాయకత్వ లక్షణాలకు సంబంధించినవి చెప్తారు. అక్కడ తీసుకునే ఏ సమస్యా సామూహిక సమస్య కాదు. ఒక సంక్లిష్ట స్థితిలో ఎవరు ఏ విధంగా డీల్ చేస్తారు అనేది వాళ్ళకు ముఖ్యం. సబ్జెక్ట్ ముఖ్యం కాదు. మీ ప్రవర్తనను బట్టి మీరు పాసయ్యారా లేదా అని చెప్తారు. కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ అని ఉంటుంది. అందులో వ్యక్తులు మాత్రమే పరిష్కరించాలని చెప్తారు. అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన వాళ్ళను తయారు చేయడం కోసం మన నుండి కూడా హరగోపాల్ లాంటి వాళ్ళను తీసుకుంటారు. ఇలాంటి అవగాహన మనకూ ఉంటే మనకు నష్టాలు తక్కువ జరుగుతాయి. వాడు అవలంబించే పద్ధతి చాలా బాగుంటుంది. మనం నేర్చుకోవచ్చు. ఈ కథకొస్తే ఇది ఆధునిక సమాజానికి సంబంధించిన విషయాలను రాసిన మంచి కథ. చిత్రహింసలకు సంబంధించి కూడా మన దగ్గర మంచి సాహిత్యం లేదు. శత్రువు ఏ పద్ధతులు అవలంబిస్తున్నాడో మనకు తెలీదు. మనమెంత వెనకబడి ఉంటామంటే ఇప్పటికీ మన సంస్థల్లో ఫ్యూడల్ నిర్మాణ పద్ధతి ఉంటుంది. ఇది గడ్డు వాస్తవం. సామాజిక కల్లోలాలను మన లోపలికి తీసుకొని తట్టుకొని నిలబడడం నేర్చుకోవాలి. మనం మానసిక శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. పాతతరం రచయితలు సైకాలజీని ఒక పద్ధతి ప్రకారం చదివారు.

ఎప్పుడైనా భావోద్వేగాలు సత్యాన్ని కప్పేస్తాయి. ప్రకృతి వర్ణన, సౌందర్య శాస్త్రాల సౌలభ్యాన్ని రచయిత తీసుకుంటాడు. కాని వాస్తవం అది కాదు కదా.

శేషయ్య: శిక్షణా తరగతుల్ని జాగ్రత్తగా గమనిస్తే అందులో ఉండేది ప్రజాధనం వృథా చేయడమొక్కటే కాదు. వీటి వెనక చాలా కుట్ర ఉంది. 1. వ్యవస్థలోకి ఇముడ్చుకునే పని. 2. టీమ్ మేనేజ్‌మెంట్. ఇది లాభాల దృష్టితో ఉంటుంది. మేనేజ్‌మెంట్ తీసుకునే నిర్ణయాలు ఏకాభిప్రాయాన్ని సాధించేలా ఉండాలని చెప్తారు. కథలో రచయితకు కల వస్తుంది. ఆ కల నిజమవ్వాలని నేను కోరుకుంటున్నా.

ఇప్పుడొస్తున్న సాహిత్యంపై వెంకటకృష్ణ:

ఇటీవలి కాలంలో జరుగుతున్న వర్క్‌షాపుల్లో సమకాలీన సాహిత్యం గురించి ఒక రచయితతో విశ్లేషణ చేయించడం జరుగుతోంది. ఈ వర్క్‌షాప్‌లో ఇప్పుడొస్తున్న కథల గురించి వెంకటకృష్ణ మాట్లాడారు.

ముందుగా జి. ఉమామహేశ్వర్ కథా సంకలనం "పరాయోళ్ళు" పుస్తకాన్ని పరిచయం చేశారు. "ప్రపంచీకరణ ప్రభావంతో పరాయీకరించబడుతున్న సకల మానవాంశాలనూ ఈ కథలు పట్టుకున్నాయి. ఇది మనందరం చదవాల్సిన పుస్తకం." - తర్వాత వివిధ ప్రాంతాల నుండి వస్తున్న కథలను అంచనా వేస్తూ ఆయనకు నచ్చిన కథలను, కథల్లోని కొత్త ధోరణులను గురించి స్థూలంగా చెప్పారు. "కళింగాంధ్ర నుండి మంచి కథలొచ్చాయి. తెలంగాణ నుండి ఎక్కువగా ఉద్యమ నేపథ్యంలో కథలొస్తే, రాయలసీమ నుండి కూడ తెలంగాణ డిమాండ్ న్యాయమైందే అని నాలుగు కథలు రాశాం. కర్నూలు వరదమీదే ఒక కథా సంకలనం వచ్చింది. మల్లీపురం జగదీష్ రాసిన "బాకుబంబారి" ఇటీవలి కాలంలో వచ్చిన మంచి కథ. మన్యం ఆదివాసుల జీవనవిధానంపై రాజ్యం ప్రభావాన్ని రాశారు. ఈ కథ చినుకులో వచ్చింది. చినుకులోనే వచ్చిన ఇంకో గొప్ప కథ శరంశెట్టి కాంతారావు "సమిధలు". సల్వాజుడుం దారుణాలపై విప్లవోద్యమం బైటి నుండి వచ్చిన కథ బహుశా ఇదొక్కటే కావొచ్చు. సతీష్ చందర్ "సిగ్గు", ఓల్డ్ మంక్ కూడా మంచి కథలు. అట్లాగే అరుణతారలో వచ్చిన "నేను, అజిత". ఇప్పుడు గ్లోబలైజేషన్ మీద కథలు తగ్గాయి. ఓబుళాపురం ఇనుప ఖనిజం రవాణా మీద కొన్ని కథలొచ్చాయి. మొత్తం మీద ఈ మధ్య వచ్చే కథలు చాలా వరకు లూజ్‌గా ఉంటున్నాయి. పట్టణ జీవనశైలిలో కథలు ఎక్కువ వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతంలో వచ్చే మార్పులు కథల్లోకి రావాలి. గ్రామీణ ఉపాధి హామీ, పొదుపు సంఘాల వల్ల ఎటువంటి మార్పులు జరుగుతున్నాయో విశ్లేషించాలి. ముఖ్యంగా గ్రామీణ సంస్కృతి, ఆర్థిక మూలాల గురించి నేను రాయాలనుకుంటున్నా. విప్లవోద్యమం వైపు నుండి ప్రాతినిధ్యం వహించే కథలు పెద్దగా రావడం లేదు. దానికోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పాణి: మిడ్కో విప్లవోద్యమంలో సంక్లిష్టమైన స్త్రీ పురుష సంబంధాల కథ రాసింది. అట్లాగే షంషేర్ "యోధ" కథ అసాధారణమైనది.

ఒక మంచి కథకు నమూనా:

చెహోవ్ "బాధ" కథను ఉదయమిత్ర చదివి వినిపించారు. చిన్న కథ ఎలా రాయాలి, అందులో ఎంతో సాంద్రత, మానవ ఉద్వేగాలు ఉండేలా చెహోవ్ ఎలా రాశాడో ఈ కథను వివరిస్తూ చెప్పారు ఉదయమిత్ర. మామూలుగా దృక్పథం కథ చివర్లో ప్రతిఫలిస్తుందనే పాత ముతక ధోరణి ఉంది కాని దృక్పథమనేది వాచ్యంగా రాదని అది ఒక అప్రోచ్‌గా కథ ట్రీట్‌మెంట్ మొత్తంలో కనిపిస్తుందని, దానికి ఉదాహరణ ఈ కథ అని పాణి అన్నారు.

వర్క్‌షాప్‌పై సమీక్ష:

చాలా కాలం విరామం తర్వాత జరిగిన వర్క్‌షాప్ కనుక కాస్త వివరంగానే సమీక్షించుకొని లోటుపాట్లు చర్చించుకున్నాం. ఇటీవలి కాలంలో ఒక క్రమపద్ధతిలో జరుగుతున్న ఈ వర్క్‌షాపుల ఫలితాలను స్థూలంగా అంచనా వేసే ప్రయత్నం చేశాం. వర్క్‌షాప్‌కు మొదటిసారిగా వచ్చిన మిత్రులు కూడా సమావేశం జరిగిన తీరును సమీక్షించారు.

రవీంద్రారెడ్డి: వర్క్‌షాప్ ఉద్దేశం నెరవేరింది. ఒక అవగాహనను, స్ఫూర్తిని కలిగించింది. మంచి కథల్ని ఆస్వాదించే అవకాశం లభించింది. కథల్నే కాకుండా కథాంశాలను కూడా ఇలాగే చర్చించాలి.

శేషయ్య: మెథడాలజీ బాగుంది. అయితే సమయాన్ని దృష్టిలో పెట్టుకొని కొంచెం మార్చుకోవాలి. ఇంత సీరియస్‌గా కృషి చేస్తున్నా ఇది బైటికి రావడం లేదు. వీటిని ప్రచురించాల్సిన అవసరం ఉంది. ఇన్ని రకాల కథలు వస్తున్నాయి, ఈ ఫలితాల గురించి బైటికి తెలియాలి కదా. ఇప్పుడు రాయాల్సిన కథల గురించి ఆలోచించాలి. గ్లోబలైజేషన్‌లో కొన్ని పాజిటివ్ అంశాలున్నాయి. ఏవి ప్రజాస్వామికీకరణకు ఉపయోగపడతాయో చూడాలి. మనమెప్పుడూ ఫలితాల గురించే చెప్తాము. గతంలో కరువు మీద రాసి రాసి కరువు దాడుల దగ్గరికి వచ్చి ఆపేశాము. ఇప్పుడు చేపట్టవలసినవి వేరే ఉన్నాయి. జరుగుతున్న పరిణామాల వల్ల శ్రామికుల మీద, రైతాంగం మీద పడుతున్న ప్రభావాలను అంచనా వేయగలగాలి. మనం పునాదిని పట్టుకుంటున్నామా, ఉపరితలాన్ని పట్టుకుంటున్నామా చూసుకోవాలి. ఈ సారి వర్క్‌షాపుకు ఒక ఆర్థికవేత్తనో, ఒక మనస్తత్వ శాస్త్రవేత్తనో తెచ్చుకోవాలి. సామాజిక శాస్త్రాలు మనకు పరికరాలనిస్తాయి. విషయాలను అర్థం చేసుకోడానికి పనికొస్తాయి. వాల్‌స్ట్రీట్ ఉద్యమం, అన్నాహజారే వంటి సమకాలీన విషయాల్ని చెప్పాలి.

అల్లం రాజయ్య: మొత్తం తొమ్మిది వర్క్‌షాపుల్లో అధ్యయనం కొద్దిగా పెరిగినట్టు కనపడుతోంది. కథ, జీవితం వేరు కాదు. అది మనం చూసే పద్ధతి, అనుభవించే పద్ధతి. లేస్తే

పడుకునేదాకా చూసే ప్రపంచాన్ని వెల్లడి చేయడానికి పరికరాలు కావాలి. మన జీవితానికి సంబంధించి ఎన్ని కోణాల్ని ఆవిష్కరిస్తున్నామో అవన్నీ కథలే. పదేళ్ళ నుండి నేను కథలు రాయడం లేదు. కాని ఈ కాలమంతా అత్యంత క్షోభను అనుభవిస్తున్నా. ఇవాళ కథ మొదలు పెడితే అది నాకూ కొత్తదే. కథ రూపొందే క్రమం చాలా నొప్పితో కూడుకొని ఉంటుంది. అందుకే చాలా మంది కవిత్వాన్ని ఎంచుకుంటారు. కాని రచయితకు కథ రాసిన తర్వాత దొరికేది విప్లవమంత గొప్పగా ఉంటుంది. గ్లోబల్ విప్లవంగా మారుతున్న నేటి సందర్భంలో నాతోపాటు అందరం కథలు రాయాలి. ఇప్పుడు ఇట్లాంటి సమావేశాలు అన్ని రకాల రచయితలు పెట్టుకుంటున్నారు. మన నుండి తీసుకుంటున్నారు. ఇది చాలా ఆరోగ్యకరమైన వాతావరణం. కథా నిలయం మొదలుకొని వర్క్‌షాప్స్ వరకు మొత్తంగా చాలా కృషి జరుగుతున్నది. ఇప్పుడు మనమే కలకందాం. నలభై సంవత్సరాల ఉద్యమానికి గర్వపడుతూ విశాల దృక్పథమున్న ఆచరణతో 670 కోట్ల ప్రపంచ ప్రజల కోసం కలకందాం.

రుక్మిణి: కథ రాయక రెండేళ్ళయింది. ఇన్ని రోజులు రాయకపోవడం క్షంతవ్యం కాదు. రాయడానికి ప్రయత్నిస్తున్నాను.

వరలక్ష్మి: ఇక్కడి కొస్తానే ఇంత తక్కువ మంది వచ్చారేంటని దిగులైంది. రెండు రోజుల తర్వాత చాలా సంతృప్తిగా అనిపిస్తోంది. చాలా మంచి చర్చలు జరిగాయి. ఇప్పటికి కథ తేలేకపోయాను. మళ్ళీ వర్క్‌షాప్‌కు తప్పకుండా కథతో వస్తాను.

వెంకటకృష్ణ: అల్లం రాజయ్యగారు ఏం చెప్తారా అని అన్ని వర్క్‌షాప్‌లకు వస్తుంటాను. నాకు కథలు రాయడంలో మార్క్వెజ్, అల్లం రాజయ్యలు గొప్ప ఇన్‌స్పిరేషన్. ఈ వేదికకు వస్తున్నప్పుడు ఒక మిత్రునిగా చెప్పాల్సిన విషయాలున్నాయనీ వస్తుంటాను. నేను ఒక కిటికీగా ఉండాలనే నా ప్రయత్నం. ఈ వర్క్‌షాప్‌లకు రావడం ఉత్సాహంగా కూడా ఉంటుంది. రాయడానికి విషయాలు, వస్తువులు దొరుకుతాయి. కొన్ని కథలు రూపొందుతాయి. ఇక్కడికొచ్చి ఒక్కరోజు పాల్గొన్నా ఉపయోగంగా ఉంటుందని నాకనిపిస్తుంది. నా కథల్ని బైట ఎంత మెచ్చుకున్నా ఇక్కడ బాగుందని పించుకోవడమే నాకు సంతృప్తిగా ఉంటుంది. వర్క్‌షాప్‌కు మరింత విస్తృతిని సాధించవచ్చు. సామాజిక శాస్త్రవేత్తల నుండి కూడా నేర్చుకోవాల్సి ఉంది. వర్క్‌షాప్‌కు వచ్చాక మన కథ ఏవిధంగా అభివృద్ధి అయిందో చెప్పుకోవాలి. ఒకే అంశం మీద వచ్చిన కొన్ని కథలు తీసుకొని చర్చిస్తే బాగుంటుంది.

ఉదయమిత్ర: తక్కువ మంది రావడం పొడుస్తున్న విషయమే. వర్క్‌షాప్ అంటే పరీక్షలాగే ఫీలవుతాను. క్రమం తప్పకుండా మూడు నెలలకోసారి వర్క్‌షాప్ జరగాలి. ఇతర భాషల్లో వచ్చే సాహిత్యాన్ని సూక్ష్మంగానైనా పరిచయం చేయాలి. స్థానిక రచయితలు, రచనలు పరిచయం చేయాలి.

పరిమళ్: మూడు నాలుగు నెలలకోసారి వర్క్‌షాప్ పెడితేనే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ రెండు రోజులూ విలువైన అభిప్రాయాలు వచ్చాయి. మంచి చర్చ జరిగింది.

శశికళ: ఇంతకు ముందరి వర్క్‌షాప్‌లకూ ఇప్పటికీ అభివృద్ధి స్పష్టంగా తెలుస్తోంది. అవగాహన పెరిగింది. రెండు రోజులూ చాలా లోతైన చర్చలు జరిగాయి. కథల కోసం మనం ఎన్నుకున్న వస్తువులను చూసుకుంటే చాలా విస్తృతి సాధిస్తున్నామని అర్థమవుతుంది. అట్లాగే నా కథ స్థాయి తెలిసింది. ఇతర భాషల్లో కథలు చదువుతున్నాను. మంచి కథల్ని అనువాదం చేస్తున్నాను. డిక్లరేషన్ ఆఫ్ రెవెల్యూషన్ అనే నేపాలీ కథను అనువదించాను. తమిళ్‌లో లక్ష్మి కణ్ణన్ కథలు చదివితే మంచి ఫామ్స్ దొరుకుతాయి. స్థానిక రచయితలను పిలవడం గురించి ప్రస్తావించారు. ఇది మనవాళ్ళ కోసమే అనుకున్నాం కాబట్టి ఎక్కువ మందిని పిలవలేదు.

శకుంతల: నిన్న మిస్సైనందుకు బాధపడుతున్నా. చాలా ప్రోత్సాహకంగా ఉంది. తప్పకుండా కథ రాయడానికి ప్రయత్నిస్తా.

పాణి: తొమ్మిది వర్క్‌షాప్‌లకు గాను రెండు కథలే రాశాను. కాని విషయాలు చాలా తెలుస్తున్నాయి. నాయుడుపేట వర్క్‌షాప్‌లో చర్చ చాలా హైట్స్‌కు పోయింది. అంత కంటే ఇప్పుడు బాగా జరిగింది. నిన్న అన్ని కథల సందర్భంలోనూ మంచి చర్చ జరిగింది.. ముఖ్యంగా నిన్న భోజనం తర్వాత జరిగిన చర్చ బాగా స్ఫూర్తినిచ్చింది. వివిధ అంశాలు, వివిధ రూపాల గురించి అర్థవంతమైన చర్చ జరిగింది. గతంలో వర్క్‌షాప్ కథలతో "కథల పంట" సంకలనం వేశాం. సుమారు 35 కథల్లో 18 ఎంపిక చేసి వేశాం. కాత్యాయిని గారితో ఒకసారి, వేణుతో ఒకసారి వచ్చిన కథలన్నింటిపైనా విశ్లేషణ చేయించాం. ఒకసారైతే "జీవన్మృతులు" అనే కథపై రాత్రంతా చర్చించాం. "తప్పిపోయిన కొడుకు" మీద కూడా అట్లాగే జరిగింది. ఇవి నిజమైన వర్క్‌షాప్‌ల మాదిరే జరుగుతున్నాయి. ఇంకా అభివృద్ధి చేయాలి. ప్రతి వర్క్‌షాపుకు 18 నుండి 20 కథలొస్తున్నాయి. అన్నీ చదవాలని ఆసక్తి ఉంటుంది. కొత్త థీమ్స్ వస్తున్నాయి. రొటీన్ కథలు అసలు లేవు. సామాజికవేత్తలతోటి ఉపన్యాసం కొత్తగా అనుకున్నాం. సాధ్యాసాధ్యాలు చూడాలి. స్థానిక రచయితలనైతే అన్ని చోట్లా భాగస్వాములను చేశాం. ఈ సారి కొంత విరామం తర్వాత కూర్చుంటున్నాం కాబట్టి మనం మాట్లాడుకోవాలని అనుకున్నాం. పైగా అనంతపురంలో చాలా సీనియర్ రచయితలున్నారు. లబ్దప్రతిష్టులు కాబట్టి కొంత ఇబ్బంది ఉంటుంది. అసలు ఆ కంపోజీషన్ చాలా సంక్లిష్టంగా ఉంటుంది.

అంతటితో ముగిశాయి మా చర్చలు. ఈ రెండు రోజులే కాదు, ఇట్లా మూడోసారి మాకు ఆతిథ్యమిచ్చిన సెయింట్ జోసెఫ్ స్కూలు వాళ్ళకు కృతజ్ఞతలు చెప్పినప్పుడు ఎంతో ఆత్మీయంగా ఈ బంధం ఇంకా కొనసాగుతుందని వాళ్ళనడంతో మా వర్క్‌షాపులు కథల్నే కాదు ఇటువంటి మంచి మిత్రుల్ని కూడ ఇస్తున్నందుకు అనంతమైన సంతృప్తితో వెనుదిరిగాం.

పరిచయం

వాస్తవికత, మనోవిశ్లేషణల మేలు కలయిక లేర్మంతోవ్ నవల మనకాలం వీరుడు!

(2)

- ఎన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు

(గత సంచిక తరువాయి)

గెలెన్ జిక్ లోని తన సైనిక పటాలంలోకి చేరడానికి కథానాయకుడు పెచోరిన్ మార్గమధ్యంలోని 'తమాన్' అనే రేవు పట్టణం చేరుకోవడంతో కథ ప్రారంభమవుతుంది. అక్కడ ఓ మురికి కొంపలో బస ఉండి, అక్కడుండే స్మగ్లర్ల వ్యవహారంలో తల దూర్చబోయి, తన సామాను పోగొట్టుకుని కూడా బాధపడక, నిజాయితీపరులైన దొంగల ప్రశాంతతను కలచినందుకు మాత్రం బాధ పడతాడతడు.

చివరికి తన పటాలం చేరిన పెచోరిన్ ఒక దండయాత్రలో పాల్గొని, ఆ పై విశ్రాంతి కోసం కాకసస్ ప్రాంతంలోని 'ప్యాతిగోర్స్క్' అనే పట్నంలో బస చేస్తాడు. అదంతా ఖనిజ జలాలు గల ప్రాంతం. రోగులు ఆరోగ్యం కోసం చాలా ప్రాంతాల్నుంచి అక్కడికొచ్చి, జలం తాగి, జలలో స్నానం చేస్తూ సేదదీరుతూంటారు. జల దగ్గరకొచ్చే అందగత్తెల్తో షోకిల్లా పురుషులు కబుర్లాడుతూ, విలాస జీవితం గడుపుతూంటారు. అటువంటి చోట ముందుగానే అక్కడికొచ్చిన పాత పరిచయస్తుడు "గ్రుష్నీత్స్కీ" అనే కేడెట్, గాయపడి, విశ్రాంతి తీసుకుంటున్నవాడు, పెచోరిన్‌ను పలకరిస్తాడు. పద గుంఫనలతో, ఆలంకారిక శయ్యతో మాట్లాడే గ్రుష్నీత్స్కీ ఆ సమీపంలోంచి వెడుతున్న మేరీ అనే అందగత్తె అయిన రాకుమారిని ఆకర్షించేందుకు, "మై డియర్, నేను మనుషుల్ని ఏవగించు కోకుండా ఉండేందుకుగాను వాళ్ళని అసహ్యించుకుంటాను. లేకపోనట్లయితే, బతుకు వెలపరం పుట్టించే ఫార్సవుతుంది" అంటాడు బిగ్గరగా. అతని ప్రయత్నం ఫలించి మేరీ అతన్ని దీర్ఘంగా చూసింది. అప్పుడు గ్రుష్నీత్స్కీకి సమాధానంగా పెచోరిన్, "మై డియర్, నేను ఆడవాళ్ళని ప్రేమించకుండా ఉండేందుకు వాళ్ళని ఏవగించుకుంటాను. లేకపోయినట్లయితే బతుకు అర్థహీనమైన మెలోడ్రామా అవుతుంది" అంటాడు.

మేరీ రాకుమారి సానుభూతి పొందేందుకు గ్రుష్నీత్స్కీ తన గ్లాసుని కిందికి జార విడిచి, గాయపడ్డ కాలుతో అందుకో లేకపోయినట్లు నటించే సరికి, రాకుమారి దాన్ని తీసి అతనికందించింది. ఈ మాత్రం దానికే రాకుమారి తన్ను ప్రేమిస్తున్నట్లు గ్రుష్నీత్స్కీ భావించాడు.

ఆ ఊళ్ళోనే డాక్టర్‌గా పని చేసే వెర్నర్ అనే అతను పెచోరిన్‌కు మిత్రుడయ్యాడు. ఇద్దరూ అసంబద్ధమైన సంభాషణలు గావిస్తూ సరదాగా కాలక్షేపం చేస్తూంటారు. వారిద్దరి సంభాషణా తరచు ఇలా ఉంటుంది: "నాకు సంబంధించి ఒక్క విషయం గురించి నమ్మకం... ఓ మంచి ఉదయాన రేపో మాపో నేను చనిపోతాను" అంటాడు వెర్నర్. "మీకంటే నేనే మెరుగు. ఒక పరమ గడ్డు నిశీధిలో నాకు జన్మ పొందే దురదృష్టం ఉంది" అంటాడు పెచోరిన్. ఇలా గంభీర వేదాంత విషయాలు చర్చించి, పొట్ట చెక్కలయేట్లుగా నవ్వుకుని, ఓ రోజు సాయంత్రం చక్కగా గడిపామన్న తృప్తిలో విడిపోయేవాళ్ళు. ఓ రోజు వెర్నర్ పెచోరిన్‌తో కావాలంటే అందగత్తె అయిన రాకుమారిని పరిచయం చేస్తానని, ఆమె తల్లి తన పేషెంటేనని చెబుతాడు. ఆడవాళ్ళ పరిచయం సాధించడంలో నిపుణుడైన పెచోరిన్ "నాయకులను లాంఛనంగా పరిచయం చెయ్యడం గురించి ఎప్పుడైనా విన్నారా? వాళ్ళు తమ ప్రియురాళ్లని ఏదో ప్రమాదం నుంచి రక్షించి పరిచయం గావించుకుంటారు" అంటాడు.

ఈ సందర్భంలోనే డాక్టర్, రాకుమారి ఇంట్లో మరో అందమైన స్త్రీని చూశానని చెబుతూ, ఆమెను వర్ణించగానే, ఆమె ఒకప్పుడు తను ప్రేమించిన 'వేరా' కాదుగదా అని అనుమానిస్తాడు పెచోరిన్. గ్రుష్నీత్స్కీ, మేరీ రాకుమారిని అంటిపెట్టుకుని తిరుగుతూ, ఆమె తనని ప్రేమించిందనే భ్రమలో కొట్టుకుపోతూ, తన ప్రేమ వ్యవహారం గురించి పెచోరిన్‌కి వర్ణించి చెబుతూ, వాళ్ళింటికి వెడదామని, ఆమెని పరిచయం చేస్తానని చెప్పినా, పెచోరిన్ అంగీకరించడు. పైగా ఖనిజ జల దగ్గర మూగే గుంపుల దగ్గర రాకుమారికి దూరంగా ఉన్నట్లు నటిస్తూ, తన సంభాషణా చాతుర్యంతో రాకుమారి దగ్గర చేరే ఆరాధకుల్ని తన దగ్గరకు వచ్చేలా చేసుకుని, తద్వారా, ఆమెకు చికాకు కలిగిస్తూ, ఆమె దృష్టిని ఆకర్షించేలా చేస్తాడు. పైగా ఒకసారి ఒక బట్టల దుకాణంలో ఆమె బేరమాడిన పర్షియన్ రగ్గుని అధిక ధరకు తను తీసుకు, ఆమెలో కోపాన్ని రగుల్చుతాడు కూడా. ఇక గ్రుష్నీత్స్కీకి ఒకసారి ప్రేమ పాఠాన్ని నేర్పుతూ ఇలా అంటాడు: "రష్యన్ యువతులు వివాహాపేక్ష లేకుండా కేవలం ఆధ్యాత్మిక ప్రేమ కోసమే అధిక భాగం ఉంటారు అయితే కేవలాధ్యాత్మిక ప్రేమ వెలపరంగా ఉంటుంది. నీ సాహచర్యంలో ఆమెకి ఓ రెండు నిమిషాలు విసుగెత్తితే ఇక నీ పని గోవిందా. నీ ముఖభావం ఆమెకు కుతూహలం రేకెత్తించాలి. నీ సంభాషణ ఆమెకెప్పుడూ సంతృప్తి కలిగించ కూడదు. ఎంతసేపూ ఆమెను నువ్వు ఆందోళన పెడుతూండాలి. నీ కోసం ప్రజాభిప్రాయాన్ని ఆమె ఒకటికి పదిసార్లు ఎదిరించి, దాన్ని త్యాగం అంటుంది. ప్రతిక్రియగా ఆమె నిన్ను చిత్రహింసలు పెట్టడం మొదలు పెట్టి, నిన్ను భరించలేననే దాకా చేరుతుంది. నువ్వామె మీద ఆధిపత్యం సంపాదించ లేకపోతే, ఆమె తొలి ముద్దు కూడా రెండో ముద్దుకి నీకు హక్కు ఇవ్వదు."

ఒక రోజు ఖనిజ జల దగ్గర తన మాజీ ప్రియురాలు వేరా ని కలిశాడు పెచోరిన్. ధనికుడూ, వృద్ధుడైన ఒక జబ్బు మనిషి సెమియోన్‌ని పెళ్ళాడిందామె. అయినా పెచోరిన్‌ని మరిచిపోలేకపోతోంది. ఆమె భర్త మేరీ రాకుమారికి బంధువు. అందువల్ల వేరా భర్తతో పాటు ఇక్కడ మేరీ రాకుమారితో కలిసి ఉంటోంది. తనను చూడ్డానికి ఆ రాకుమారి ఇంటికి రమ్మని, అలాగే ఇతరుల దృష్టిని మళ్ళించేందుకు మేరీని ఆకర్షించమని ఆమె చెప్పిన మాటల్ని పెచోరిన్ ఆమోదించాడు. ఇదొక సరదా కాలక్షేపం అనుకున్నాడు. ఎందుకంటే ఇప్పుడు తను ఎవరినైనా

ప్రేమించడం కాదు కావలసింది, తనను ఎవరైనా ప్రేమించడం కావాలి అతనికి.

తను ప్రేమించిన ఆడవాళ్ళకెప్పుడూ లొంగిపోని సంగతి అతనికే వింతగా అనిపించేది. అందుకు విరుద్ధంగా తనకే వాళ్ళ మీద అధికారం ఉండేది. తన ప్రయత్నం ఏమీ లేకుండా. అందుక్కారణం తను దేన్నీ ప్రత్యేకంగా విలువైందిగా అనుకోక పోవడం వల్లనో, లేదా వాళ్ళ చేతుల్లోంచి అతను జారిపోతాడని వాళ్ళు భయపడినందు వల్లనో తెలీదతనికి.

ఆ సాయంకాలం మేరీ రాకుమారి, గ్రుష్నీత్స్కీ తో పాటు మరి కొందరితో పిక్నిక్‌కు వెడుతుంటే మధ్యలో అక్కడికి చెట్ల చాటు నుంచి హఠాత్తుగా స్వారీ చేస్తూ వచ్చిన పెఛోరిన్‌ని చూసి బందిపోటు దొంగేమోననుకొని రాకుమారి హడలిపోయింది. "భయపడకండి అమ్మాయి గారూ, మీకు తోడుగా ఉండేవాడి కంటే ప్రమాదకరమైన వాణ్ణి కాను" అని వెళ్ళిపోయాడు పెఛోరిన్. "నువ్వామెకు కోపం తెప్పించావు. ఇప్పుడు నువ్వామెను కలుసుకోవడం కష్టం" అని గ్రుష్నీత్స్కీ ఆ తర్వాత పెఛోరిన్‌తో అనేసరికి, "ఇదంతా చెత్త. కావాలనుకుంటే రేపు రాత్రి అక్కడికి రాగలను" అన్నాడు పెఛోరిన్.

వేరా అభ్యర్థన మేరకు రెస్టారెంట్ హాల్లో మేరీ రాకుమారి దగ్గర కెళ్ళి, తనతో 'వాల్ట్జ్' నాట్యం చెయ్యమని పెఛోరిన్ అడగ్గానే, అతనలా అడగడం తన విజయంగా భావించిందామె. నాట్యం చేస్తూనే, తననామె తలబిరుసు మనిషిగా భావించడం సరికాదనే సంగతి రుజువు చెయ్యాలని ఉందని పెఛోరిన్ అనగానే, అది మీకు కొంచెం కష్టం కావచ్చునన్నదామె. "ఎందుకంటే మీరు మా ఇంటికి రారు". అన్నది తిరిగి. "పశ్చాత్తప్తుడైన పాపిని ఎప్పుడూ ఏవగించుకో కూడదు. ఏమంటే, ఒట్టి నిరాశతోటి అతడు మరింత పాపాత్ముడు కావచ్చు" అన్నాడు పెఛోరిన్. ఇంతలో ఓ తాగుబోతు మేరీని అల్లరి చెయ్యాలని చూసినప్పుడు, తననాదుకునే వారెవ్వరూ ఆమెకు కనబడలేదు. అప్పుడు పెఛోరిన్ ఆమె భయం పోగొట్టి, ఆ తాగుబోతు నక్కడినుంచి పంపేశాడు. అనంతరం పెఛోరిన్ తన వాక్చాతుర్యంతో గ్రుష్నీత్స్కీ బండారాన్ని బయటపెట్టేసరికి, తనకతనిపట్ల ఇష్టమేమీ లేదన్నదామె. ఆ మర్నాడు పెఛోరిన్, గ్రుష్నీత్స్కీతో కలసి మేరీ రాకుమారి ఇంటికెళ్ళాడు కానీ, అక్కడ మేరీని పట్టించుకోకుండా వేరాతో మాట్లాడుతూండిపోయేసరికి, ఆమెకు కోపం వచ్చింది.

ఆమె గ్రుష్నీత్స్కీతో విసిగిపోయి ఉండడం వల్ల తనే కల్పించుకుని పెఛోరిన్‌తో మాటలు కలిపి, అతని చమత్కార సంభాషణలకి ఆనందించ సాగింది. మధ్య మధ్య తను ఆమెకు దూరమైనప్పుడల్లా ఆమె బాధపడడాన్ని గమనించాడు పెఛోరిన్. ఆమె తనని ప్రేమిస్తున్నట్లు నిర్ధారించుకుని, తన ప్రవర్తనని విశ్లేషించుకుంటూ తన డైరీలో ఆ రాత్రి ఇలా రాసుకున్నాడు.

'పెళ్ళి చేసుకుందామని అనుకోని పడుచుపిల్ల ప్రేమ కోసం పట్టు విడవకుండా ఎందుకు అన్వేషిస్తాను? యవ్వనారంభ సంవత్సరాల్లో మనల్ని వేదన పెట్టే ప్రేమ కోసం అవిశ్రాంత తపన... ఒక ఆడదాని దగ్గర నుంచి మరో ఆడదాని దగ్గరకు మనల్ని విసురుతుంది. మనల్ని భరించలేని ఆడదాన్ని మనం కలుసుకునే దాకా.. ఉద్రేకాలు ఇక ఎంతమాత్రమూ నా వివేకాన్ని కొల్లగొట్టలేవు... ఆశ అనేది అధికార కాంక్ష తప్ప మరోటి కాదు. ఇతరులలో ప్రేమ, ఆరాధన, భయం అనే అనుభూతుల్ని ప్రేరేపించడం అధికారానికీ, దాని మహోన్నత విజయానికీ తొలి సూచకం కాదూ? ఆనందమంటే ఏమిటి? సంతుష్టి చెందిన అహం. ప్రపంచంలో మరెవ్వరికంటే కూడా నేను అధికుణ్ణని పరిగణిస్తే నేను ఆనందంగా ఉంటాను. ఉద్రేకాలు హృదయపు యౌవన దశలో ఉన్న భావాలు తప్ప మరేం కాదు. అవి మన జీవితాంతం కదిలిస్తాయి అనుకునే వాడు వెర్రి వెంగళాయి. ఎన్నో సౌమ్యమైన నదులు గర్జించే జలపాతాలుగా పుడతాయి. కానీ ఒక్క నది కూడా సముద్రం కడదాకా నురగలు గక్కుతూ ఉండదు..."

ఒకరోజు పెద్ద గుంపుతో పట్టణం బయటనున్న కనుమ దగ్గరకు మేరీ రాకుమారితో పాటు వెళ్ళిన పెఛోరిన్, ఆమెకు తన చిన్ననాటి అనుభవాలను, తనను ఇతరులు ఎలా అపార్థం చేసుకున్నదీ పరమ కరుణ రసాత్మకంగా చెప్పేసరికి, ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆడాళ్ళంతా కనికరం అనే రసానికి లొంగిపోతారని అతనికి తెలుసు. ఆ క్షణం నుంచి ఆమె అతని చేతిని పట్టుకుని విడవకుండా నడిచింది. అది ఆమెకు తొలి స్పర్శ. ఆమె అతనితో ఏదో చెప్పాలనుకుంది గానీ, చెప్పలేకపోయింది.

ముందు అనుకున్న ప్రకారం వేరా తన భర్తతో కలిసి తర్వాతి జల ఉన్న 'కిస్లొవోదస్క్' కి వెళ్ళగా, ఆమె వెళ్ళాక పెఛోరిన్ అక్కడికి వెళ్ళాడు. జల దగ్గర కాకతాళీయంగా ఆమెను కలుసుకున్నట్లు కలుసుకున్నాడు పెఛోరిన్. ఇంతలో మేరీ రాకుమారి బండి అటుగా వస్తుండడం చూసి అతని గుండె వేగంగా కొట్టుకోసాగడం చూసి 'తను ఆమెను ప్రేమించడం లేదు కదా?' అని తనని తానే ప్రశ్నించుకున్నాడు పెఛోరిన్. ఈ సందర్భంలో స్త్రీల పై కవులు రాసిన అతిశయోక్తుల గురించి ఆ రాత్రి తన డైరీలో ఇలా రాసుకున్నాడు: "కవులు కవిత్వం రాయడం మొదలెట్టి, స్త్రీలు వాటిని చదవడం మొదలెట్టిందగ్గర్నుంచి స్త్రీలను దేవతలు అని ఎంత తరుచుగా పిలవడం జరిగిందంటే, అమాయకంగా స్త్రీలు దాన్ని నమ్మేశారు. డబ్బు కోసం ఇదే కవులు 'నీరో' ని దైవాంశ సంభూతుడని ఆకాశంలోకి ఎత్తేసిన సంగతిని మర్చిపోయి..."

కొద్ది రోజులకు ఒక సాయంకాలం సూర్యాస్తమయం అందంగా కనిపించే కొండ ప్రాంతంలోకి ఒక జనం గుంపు బయలుదేరింది. గుంపు చివరన గుర్రాలపై మేరీ, పెఛోరిన్‌లు వెడుతున్నారు. మధ్యలో వారు వేగంగా ప్రవహించే వాగును దాటుతున్నప్పుడు ఆమె తను పడిపోతానేమోనని భయపడినప్పుడు, ఆమెను పొదివి పట్టుకుని అవతలికి చేర్చాడతడు. ఆ ఇబ్బందికర పరిస్థితి నుంచి ఆమె ఎలా బయటపడుతుందో చూడాలనుకున్నాడు. ఆ పరిస్థితి నుంచి తేరుకున్నాక, మీరు నన్ను ద్వేషించనైనా ద్వేషిస్తారు, లేదా ఎక్కువగా ప్రేమించనైనా ప్రేమిస్తారు" అందామె చివరికి. అతను తన మనసులోని మాట చెబుతాడని ఎదురు చూసింది గానీ, అతనేమీ జవాబు చెప్పకపోయే సరికి, "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని నేనే మొదట చెప్పాలేమో?" అంది. "ఆ సంగతి నాకెందుకు?" అని అతననేసరికి, ఆమె ఉద్వేగంతో వేగంగా దౌడు తీయిస్తూ వెళ్ళిపోయింది.

ఆ రోజు సాయంకాలం ఒక ఇంట్లో గ్రుష్నీత్స్కీ, మరికొందరితో కలిసి తనతో ద్వంద్వ యుద్ధానికి పన్నాగం పన్నడాన్ని లోపలికి వెళ్ళబోయిన పెచోరిన్ విని, "వీళ్ళందరికీ తనంటే ఎందుకంత అసహ్యం?" అని ప్రశ్నించుకున్నాడు. ఆ మరుసటి రోజు మేరీ ఇంటికతడు వెళ్ళినప్పుడు, ఆమె అతన్ని ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసుకుందామని అన్నది. అయితే తానామెను ప్రేమించడం లేదని చెప్పి, అక్కణ్ణుంచి వచ్చేశాడు పెచోరిన్.

ఈ ఘట్టం జరిగింతర్వాత పెచోరిన్ తనని తనే అసహ్యించుకున్నాడు. ఏ స్త్రీతో ప్రేమ కలాపం జరిపినా, పెళ్ళి ప్రసక్తి వస్తే ఆ ప్రేమకి నీళ్ళొదులుకుంటున్నాడు తను. ఇతరుల్ని వంచించడమేనా తన పని అని తనని తనే ప్రశ్నించుకుని, సమాధానం తన డైరీలో రాసుకున్నాడు. తన మనసులోని భయం వల్ల అన్నది ఆ సమాధానం. ఎందుకా భయం అంటే, ఒక ముసలావిడ తన తల్లికి చెప్పిన జాతకం ప్రకారం తను ఓ దుష్టురాలైన పెళ్ళాం వల్ల చనిపోతానట! ఆ జ్యోతిషం నమ్మడం వల్లనే తన ఈ ప్రవర్తన! అదీ అసలు విషయం.

ఇది జరిగిన తర్వాత వేరా, పెచోరిన్‌కు ఉత్తరం రాసింది. ఇంట్లో వాళ్ళంతా ఇంద్రజాలిక ప్రదర్శనకు వెడుతున్నారని, వారు వెళ్ళాక తనను కలుసుకొమ్మని. ఆమె చెప్పిన ప్రకారం ఆ ఇంటికెళ్ళి, తెల్లవారు ఝామున ఆ ఇంటినుండి బయట పడుతుంటే, గ్రుష్నీత్స్కీ బృందం అతన్ని పట్టుకోవాలని విఫల ప్రయత్నం చేసింది. ఇది జరిగిన మర్నాడు నాస్తా కోసం హోటల్‌కి వెళ్ళిన పెచోరిన్‌ని, అవమానకరంగా మాట్లాడిన గ్రుష్నీత్స్కీ ద్వంద్వ యుద్ధానికి రమ్మని సవాల్ చేశాడు. ఆ యుద్ధానికి అతడు డా॥వెర్నర్‌ని సహాయకుడుగా పెట్టుకున్నాడు. ఆ యుద్ధంలో గ్రుష్నీత్స్కీ చనిపోయాడు. ఆ యుద్ధానికి ముందు రాత్రి పెచోరిన్ తన జీవిత సంఘటనల్ని తలచుకుని బాధపడుతూ తన డైరీలో ఇలా రాసుకుంటాడు.

"నేనెందుకు బతికాను? ఎందుకోసం పుట్టాను? క్షుద్రకాంక్షల వ్యామోహాలకు నేను లొంగిపోయాను. వాటి కఠోర పరీక్షల నుండి ఇనుము లాగా గట్టిగా, జడంగా బయటికొచ్చాను. కానీ ఉన్నత ఆశల ఆవేశం - జీవితపు అత్యుత్తమ పుష్పం మరి ఎన్నటికీ తిరిగి రానట్టుగా పోయింది. నా ప్రేమ ఎవర్నీ ఎప్పుడూ సుఖపెట్టలేక పోయింది. ఏమంటే నేను ప్రేమించిన వాళ్ళ కోసం ఎన్నడూ ఏదీ త్యాగం చెయ్యలేదు. నేను నా కోసమే ప్రేమించాను. హృదయపు వింత తపనను తృప్తిపరచడం కోసం. బహుశా రేపు చచ్చిపోతాను. కొంతమంది నన్ను గురించి అధ్వాన్నంగా అనుకుంటారు కొందరు మంచిగా. ఉభయులూ తప్పే అవుతారు. దీని తర్వాత బతికే యాతనపడ్డం తగునా? అయినా బతుకుతూనే ఉంటాను - జిజ్ఞాస వల్ల.... ఏదో కొత్తదనాన్ని ఆశిస్తూ...... ఎంత పరిహాసాస్పదం, ఎంత విసుగు!"

ద్వంద్వ యుద్ధం నుంచి తిరిగొచ్చిన పెచోరిన్‌కు వేరా రాసిన ఉత్తరం కనిపించింది. తను అతని కోసం ఎంతో త్యాగం చేసినందు వల్ల, అతను మేరీని పెళ్ళాడకుండా త్యాగం చెయ్యాలని రాసింది వేరా. ఇక అక్కణ్ణుంచి వేరా వెళ్ళే రోజు వచ్చింది. ఆఖరిసారిగా ఆమెను చూద్దామని ఎంతగానో ప్రయత్నించాడు గానీ, అతను పరిగెత్తించిన వేగానికి తట్టుకోలేకపోవడం వల్ల గుర్రం కుప్పకూలి చనిపోవడంతో, చూడలేకపోయాడు. ఆ తర్వాత డా. వెర్నర్ వచ్చి, ద్వంద్వ యుద్ధం గురించి అధికారులకు తెలిసిందనీ, అతన్నక్కణ్ణుంచి పంపేస్తారనీ, తన కూతురి కోసం అతనా ద్వంద్వ యుద్ధం చేశాడని మేరీ రాకుమారి తల్లి భావిస్తోందని చెప్పి, సానుభూతి చూపించి వెళ్లాడు. డా. వెర్నర్ చెప్పిన మాటలూ, అతని చర్య గురించి పెచోరిన్ తన డైరీలో ఇలా విశ్లేషిస్తాడు.

"అది సరిగ్గా మనుషులకి లాగానే ఉంది! వాళ్లంతా ఒక్కటే. ఒక చర్యకి గల దుష్ట పార్శ్వాలన్నిటి గురించీ తెలిసివున్నా, వాళ్ళు దానికి ఆజ్యం పోసి, ఆమోదం తెలుపుతారు.... ఇక వేరే మార్గం లేదని చూసినప్పుడు. తర్వాత చేతులు కడిగేసుకుని పూర్తి బాధ్యతా భారం మోసినవాడి నుంచి అనంగీకారంగా తిరిగి వెళ్ళిపోతారు. వాళ్ళంతా ఒక్కలాగే ఉంటారు. ఎంతో దయ, తెలివి గల వాళ్ళు కూడా."

తనకు పై అధికారుల నుంచి దుర్గంలో హాజరు కావలసిందిగా ఆజ్ఞ వచ్చినప్పుడు, సెలవు తీసుకునేందుకు మేరీ రాకుమారి ఇంటికి వెళ్ళాడు పెచోరిన్. అప్పుడతనితో ఆమె తల్లి, అతన్ని తన కూతురు ప్రేమిస్తోందని, తన సంపదంతా ఆమెదేనని, అతను తన కుమార్తెను అపనింద నుంచి కాపాడాడని, ప్రస్తుతం జబ్బుగా ఉన్న తన కుమార్తెను నిగూఢ శోకం హరిస్తోందని, తాను సంపద వెనకాల పడేదాన్ని కానని, అతని ప్రస్తుత స్థితి గొప్పది కాకపోయినా తన కుమార్తె అతన్ని సుఖ పెడుతుందని చెప్పిందామె. చెబుతూనే దుఃఖించింది. తను మేరీతో మాట్లాడతానని చెప్పి, ఆమె దగ్గరకెళ్ళాడు పెచోరిన్. ఆమెను తాను పరిహాసం చేశాడని, అందువల్ల తననామె ఏవగించుకోవాలని చెప్పాడతను."అందువల్ల మీరు నన్ను ప్రేమించలేరు.." అన్నాడతను. "ఒక వేళ మీరు నన్ను ప్రేమించినా, మీరు ఈ క్షణం నుంచీ నన్ను అసహ్యించుకుంటారు. అసహ్యించుకోరూ?" ప్రశ్నించాడు. ఆమె గుక్క తిప్పుకోలేక, "అసహ్యించుకుంటున్నాను" అని ఆమె అనే సరికి, అక్కణ్ణుంచి వచ్చేశాడు పెచోరిన్.

ద్వంద్వ యుద్ధం చేసినందుకు శిక్షగా పెచోరిన్‌ని కెప్టెన్ మక్సీమ్ మక్సీమిచ్ ఆధ్వర్యంలో ఉన్న కకేషియన్ శ్రేణిలోని ఒక దుర్గానికి బదిలీ చేశారు. అప్పటికింకా పెచోరిన్‌కి నిండా పాతికేళ్ళు కూడా లేవంటే, అతనెంత రాటుదేలిపోయాడో ఊహించుకోవచ్చు. టెరెక్ నదికి ఉత్తరాన ఉన్న దుర్గం అది. ఆ కెప్టెన్‌కి పెచోరిన్ తెగ నచ్చేశాడు. చిత్రమైన మనిషనీ, అతను చెప్పే కథలకు నవ్వలేక పొట్ట చెక్కలయ్యేదని, ఆయన రచయితల్తో అన్నాడు. ఆ దుర్గం చుట్టుపక్కలంతా అనాగరికులైన సర్కేషియన్లుంటున్నారు. వారిలో ఒక రాకుమారుడి పెద్ద కూతురి పెళ్ళికి సైనికాధికారులు అతిథులుగా వెళ్ళారు. రాకుమారుని చిన్న కూతురు 'బేలా'. ఆమె అందం పెచోరిన్‌ని ఆకర్షించింది. అతనూ ఆమెనాకర్షించాడు. ఆ పిల్ల అన్నకి డబ్బన్నా, గుర్రాలన్నా తెగ పిచ్చి. డబ్బాశ చూపిస్తే ఏది కావాలన్నా దొంగిలించి తెస్తాడు. ఆ చుట్టుపక్కల దొంగగా పేరున్న 'కాజ్‌బిచ్' అనేవాడి గుర్రం మహా తెలివైంది. ఆ గుర్రాన్నిస్తానని ఆశ పెట్టి, పెచోరిన్ అతని చెల్లెల్ని ఎత్తుకు రమ్మన్నాడు. ఆ కుర్రాడా పనిని సమర్థంగా చేశాడు. పెచోరిన్ కాజ్‌బిచ్‌ని మభ్యపెట్టి గుర్రాన్ని కాజేసి దాన్ని ఆ కుర్రాడికిచ్చేశాడు.

ఎత్తుకు రాబడ్డ బేలా మొదట పెచోరిన్‌కు లొంగకపోయినా, తర్వాత అతనికి మచ్చికయింది. ఆమె అతనికి లొంగిపోయాక,

విచిత్రంగా అతనామెను నిరాదరించసాగాడు. దీన్ని ప్రశ్నించి కేప్టెన్‌తో పెచోరిన్ ఇలా అంటాడు "నానడవడిక దురదృష్టకరమైంది. ఇతరులకు బాధ కలిగిస్తే నాకూ తక్కువ బాధ కలగదని నాకు తెలుసు. అయితే ఇది వాళ్ళకి ఊరడించడానికని నాకు తెలుసు. కాని వాస్తవం అంతే. నా తొలి యౌవనంలో, నా తల్లిదండ్రుల పెత్తనం నుండి బయట పడ్డాక, డబ్బుతో కొనగల సకల సౌఖ్యాలలోనూ మునిగాను. అవి నాకు మొహం మొత్తించాయి. ఆ తరువాత నాగరిక సమాజంలోనూ మొహం మొత్తింది. నాగరిక మహిళలోనూ మొహం మొత్తింది. బేలా విషయంలో తప్పు చేశాను. ఆమె కోసం నా జీవితాన్ని అర్పించడానికి సిద్ధంగా ఉన్నాను. కానీ ఆమె అంటే విసుగెత్తింది. నా ఆత్మ నాగరిక సమాజం అలవాట్లలో వంగిపోయింది. ఏదీ నాకు తృప్తి కలిగించదు. ఒక్క అవకాశమే నాకు మిగిలిపోయింది. అది ప్రయాణించడం. ఆ ప్రయాణంలోనే ఎక్కడో అసువులు వీడతా"

పాతికేళ్ల పడుచువాడి నోట ఈ మాట వినడం కేప్టెన్‌కు ఆశ్చర్యం కలిగించింది. కొద్ది రోజుల్లోనే బేలాపై కన్నేసిన కాజ్‌బిచ్ ఒంటరిగా ఉన్న ఆమెను ఎత్తుకెళ్ళేందుకు విఫలయత్నం చేసి, చివరికి ఆమెను పొడిచి పారిపోయాడు. ఎన్ని సపర్యలు చేసినా ఫలించక బేలా మరణించింది.

చాలా కాలం గడిచింది. పెచోరిన్ ఆ దుర్గం నుంచి వెళ్లిపోయి సంవత్సరాలు గడిచాయి. ఒక రోజు కేప్టెన్ మక్సీమ్ మక్సీమిచ్ కాయిషౌర్ లోయలో నిండుగా సామాన్లున్న బండితో ప్రయాణిస్తూండగా, రచయిత తిఫ్లిస్ నుంచి తపాలా బండిలో ప్రయాణిస్తూ ఆయనకి తారసిల్లాడు. ప్రయాణాలు చేస్తూ విశేషాలు రాసి పెట్టుకునే రచయిత కేప్టెన్‌తో మాట కలిపి స్నేహం చేసుకున్నాడు. కేప్టెన్ నుంచి సాహసగాథలు విందామని ప్రయత్నిస్తూ ఆ మంచు తుఫాన్‌లో మురికిగా ఉన్న ఒక మజిలీలో ఆశ్చర్యకరంగా టీ కాచి ఇచ్చి, అనుభవాలు చెప్పమని కోరాడు. అప్పుడు కేప్టెన్ పెచోరిన్ గురించి చెబుతూ, బేలా వృత్తాంతం వివరించాడు. తర్వాతి మజిలీలో ఒక గుర్రంబండి నడిపే వాడి ద్వారా పెచోరిన్ అక్కడికి వస్తున్నట్లు తెలుసుకున్న కేప్టెన్‌తో పాటు రచయిత అతన్ని కలుసుకోబోతున్నందుకు సంతోషించారు. మరునాడు ఉదయాన్నే పెచోరిన్ రాక కోసం కాచుక్కూర్చున్న రచయిత, అతని రాక గమనించి, కేప్టెన్‌ని పిలుచుకు రమ్మని పనివాణ్ణి పంపాడు. పెచోరిన్ వచ్చి, కాసేపు విశ్రాంతి తీసుకుని, వెంటనే తిరిగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. ఆ కొద్ది సేపట్లోనే రచయిత పెచోరిన్ అందాన్ని చూసి ముగ్ధుడయ్యాడు. కెప్టెన్ వచ్చేదాకా ఆగమని రచయిత పెచోరిన్‌ని అభ్యర్థించాడు. ఇంతలో కేప్టెన్ మక్సీమ్ పరుగెత్తుకుంటూ వచ్చి, పెచోరిన్‌ను చూసిన ఆనందంతో తడబాటుకు లోనయ్యాడు. ఆ ముసలాయనకు కళ్ళనీళ్ళు తిరిగాయి. ప్రయాణ త్వరలో ఉన్న పెచోరిన్ తాను పర్షియా వెడుతున్నట్లు చెప్పాడు. కొంతసేపు ఆగవలసిందని కేప్టెన్ కోరినా, వీలుకుదరదన్నాడు పెచోరిన్. చాలా విషయాలు చెప్పాల్సిఉందనీ, అడగాల్సినవీ ఎన్నో ఉన్నాయనీ అంటూ, తామిద్దరూ పూర్వం ఎంత సన్నిహితంగా ఉన్నదీ గుర్తు చేసి, ఇప్పుడేం చేస్తున్నారని అడిగాడు కేప్టెన్. అయితే కేప్టెన్ మాటలేవీ పెచోరిన్ పట్టించుకోలేదు. తనకు చచ్చే విసుగ్గా ఉందని బయలు దేరాడు పెచోరిన్. కనీసం భోంచేసి వెళ్ళమన్నా అంగీకరించాడు కాడు. తమ కలయిక ఇలా ఉంటుందని కేప్టెన్ ఊహించలేదు. వెళ్ళిపోతున్న పెచోరిన్‌ని వెంబడించి పరుగులు తీస్తూ ఆగమని, తన దగ్గర అతని కాగితాలు కొన్ని ఉన్నాయని గట్టిగా అరుస్తూ చెప్పినా, పెచోరిన్ వినిపించుకోక, ఆ కాగితాలను మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యమని వెళ్ళిపోయాడు. ఈ నిరాదరణకు పాపం ఆ ముసలాయన నిర్విణ్ణుడయాడు. కళ్ళల్లో నీళ్ళుబికాయి. ఇదంతా గమనిస్తున్న రచయిత కాగితాల సంగతి వినగానే, వాటిని తన కివ్వమని కోరాడు. కేప్టెన్ తన తోలు పెట్టె గాలించి ఒక పది నోట్‌బుక్కుల్ని తీసి, నేల మీద గిరాటేశాడు. వాటిని తన ఇష్టం వచ్చినట్టు ఉపయోగించుకో వచ్చునా అని రచయిత అడిగేసరికి, కావాలంటే అచ్చు వేసుకోమన్నాడా ముసలాయన. "నేనతని చుట్టాన్నా, మిత్రుణ్ణా? ఇద్దరం ఒక వెన్నువాసం కింద చాలా కాలం ఉన్నాం నిజమే. అయితే నేను నానా గోత్రీకుల మధ్య ఉన్నాను" అన్నాడు కేప్టెన్. కేప్టెన్ మనసు మార్చుకోక ముందే రచయిత ఆ నోట్‌బుక్కుల్ని పట్టుకుని వెళ్ళిపోయాడు. ఇది జరిగిన కొంత కాలానికి పెచోరిన్ పర్షియా నుండి వెనక్కు వచ్చేస్తూండగా చనిపోయిన సంగతి రచయితకు తెలిసింది. అప్పుడు రచయిత ఆ నోట్ బుక్కుల్ని పరిశీలిస్తే, అవి పెచోరిన్ డైరీలన్న సంగతి బయటపడింది. వాటిలో పెచోరిన్ తనలోని బలహీనతల్ని నిర్దాక్షిణ్యంగా బయట పెట్టుకోవడం చూసి, అతడు నిజాయితీ పరుడని రచయితకు అర్థమైంది. అందువల్ల పాఠకులకు ఎంతో కొంత మంచి చేద్దామన్న ఉద్దేశంతో ఆ డైరీల్లోని కొన్ని భాగాలను ప్రచురించి, ఆ పుస్తకానికి 'మనకాలం వీరుడు' అన్న పేరు పెట్టాడు. అలా పేరు పెట్టడాన్ని పాఠకులు కటువైన అధిక్షేపంగా భావించవచ్చును గానీ, అది తనకు తెలీదంటాడు రచయిత. ఇదీ నవలలోని కథ క్లుప్తంగా.

లేర్మొంతోవ్‌నీ, అతని నవలనీ అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలకు సమాధానం చెబుతూ, మహా విమర్శకుడు, ప్రజాస్వామ్యవాదీ అయిన బెలిన్‌స్కి పెచోరిన్ గురించి ఇలా రాశాడు. "దురహంకారీ, దుష్టుడు, క్రూరుడు, నైతికభ్రష్టుడు... అని నీతి ప్రౌఢవిహారులు ఏక కంఠంతో అనవచ్చు. మీరు సబబే పెద్ద మనుషులారా, కానీ ఎందుకు మీకు బాధ? ఎందుకు మీకు కోపం? అతని పాపానికి మీరతన్ని నిందించడం లేదు. మరి మీకే అవి బోలెడన్ని ఉన్నాయి, మీ పాపాలు మరీ అప్రతిష్టకరమైనవి. కానీ వాటి గురించి ధైర్యంగా కుండ బద్దలుకొట్టినట్టు చెప్పడం ఉందే, దానికి.." లేర్మొంతోవ్ నవలని స్వేచ్ఛాయుత ఆలోచనలకి గొప్ప దర్పణంగా, విస్తృత సాంఘిక ధృక్పథానికీ మొత్తం ఒక తరం రుజాగ్రస్తతకి రూపంగా పెచోరిన్ పాత్రని రష్యన్ విప్లవ ప్రజాస్వామిక విమర్శకులు అభినందించారు.

పెచోరిన్ వ్యక్తిగత స్వేచ్ఛ కోసం ప్రయత్నించాడు. తను ద్వేషించిన ఉన్నత వంశీకుల సమాజాన్ని విచ్ఛిన్నం చెయ్యడంగా, తన కంటే చాలా తగ్గులో ఉన్న ప్రజల నుంచి వేర్పాటుగా దాన్నతను అర్థం చేసుకున్నాడు. అతను తనలోకి తనే ముడుచుకు పోయి, విషాదభరిత ఏకాంతంలో నాశనం అయిపోయాడు. విద్వేషంతో కూడిన ప్రపంచంలోకి పోరాడే సాధనం అతనికి లేకుండా పోయిందని ప్రముఖ రష్యన్ సాహిత్య విమర్శకుడు ఆంద్రోన్నికోవ్ చెప్పాడు.

"మనకాలం వీరుడు లాంటి కాముకుణ్ణి ఆదర్శంగా చెయ్యడం కొంతమందికి నిజంగా కష్టం కలిగింది. ఇది నిజంగా ఒక చిత్రణే కానీ, ఒక ప్రత్యేక వ్యక్తిది కాదు. అయ్యలారా! మన తరం దోషాలన్నిటినీ

పుస్తక పరిచయం

గతితార్కిక భౌతికవాదం

- ఐరా గొలోబిన్

స్వేచ్ఛానువాదం: కొడవటిగంటి రోహిణీప్రసాద్

(గత సంచిక తరువాయి...)

5

అమెరికాలో సంయుక్త రాష్ట్రాల్లో తత్వశాస్త్రపు మార్క్సిస్ట్ లెనినిస్ట్ చరిత్ర

(ఒక్క అమెరికా సంయుక్త రాష్ట్రాల తత్వశాస్త్రపు చరిత్రనే మార్క్సిస్ట్ లెనినిస్ట్ పద్ధతిలో విశ్లేషించడం అవసరమనీ, తక్కిన దేశాలకది వర్తించదనీ కాదు; అటువంటి ప్రయత్నం ఇతర దేశాల విషయంలో జరగలేదు)

అణగారిన వర్గాలూ, అణచబడిన దేశాలూ ప్రాథమిక సామాజిక సత్యాలను అన్వేషించడం మానవు. స్వాతంత్ర్యం కోసం ఎన్ని కష్టాలు పడినా, జరుగుతున్న సంఘటనల తెర వెనక ఏమవుతోందో గమనిస్తూ, అనవసర, ప్రత్యేక విషయాలను లక్ష్యపెట్టకుండా, లోతైన సామాన్య సత్యాలను కనిపెట్టే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయి. ఈ వర్గాల స్వాతంత్ర్య పోరాటాలని బలపరిచి, మార్గదర్శనం చెయ్యగలిగిన తాత్వికసత్యాలు కూడా ఈ ప్రయత్నాల్లో భాగమే. పాలకవర్గాల చరిత్రలో మాత్రం ఇటువంటి ఆలోచనలూ, చర్యలూ అన్నిటినీ అణిచెయ్యడం మామూలే; ఒకవేళ వాటిని ప్రస్తావించినా, వాటికి వక్రభాష్యాలూ, నిందలూ తప్పవు. ఇన్ని పరిమితులున్నప్పటికీ, ఈ ప్రయత్నాల గురించి మనకు తెలిసి నమ్మదగ్గ ఆధారాల్లో, ఆకరాల్లో అనేకచోట్ల కొన్ని వివరాలు మాత్రమే లభ్యమౌతున్నాయి. వీటిద్వారా అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజల పోరాట చరిత్రను పునర్నిర్మించడం వీలవుతుంది.

రైతులూ, చేతిపనివారూ, తమ తమ ఇతర వృత్తులలో ఉత్పాదన చేసేవారూ అందరిదీ ముఖ్యపాత్రే అయినప్పటికీ, వలసయుగంలో అమెరికా ఆర్థికప్రగతి ఎక్కువగా బత్తెం కూలీల, బానిసల, అర్ధ భూస్వామ్య నౌకర్ల శ్రమపైన ఆధారపడింది. వలసవచ్చిన వారిలో కొందరు (ముఖ్యంగా వారి సంతానం) సంఘంలో పెటీ బూర్జువా, బూర్జువా తరగతుల్లో పైకి రాగలిగారు. అయితే నల్లవారూ, అమెరికా ఆదిమ తెగలూ, మెక్సికో జాతులూ, ఆసియావాసుల్లో అధిక సంఖ్యాకులకు మాత్రం దేశవ్యాప్తంగా వర్గపీడన తప్పలేదు, దానితో వారి పోరాటమూ ఆగలేదు.

ఈ అల్ప సంఖ్యాకుల, మొత్తం కార్మికవర్గపు సాహిత్యం, సామెతలూ, పాటలూ, పోరాటాలూ అన్నిటిలోనూ కొన్ని దృక్పథాలు కనిపిస్తాయి. ఇవన్నీ సమాజం, మానవజీవితం, ఆలోచనా విధానాల గురించి స్పష్టంగానూ, భావగర్భితంగానూ వ్యక్తపరిచినటువంటివి. నిరక్షరాస్యత ఒక సమస్యేగాని లోతైనా ఆలోచనాశక్తికి అది పెద్ద ప్రతిబంధకం కాదు.

"ఏవో కొన్ని అరుదైన సందర్భాల్లో తప్ప అమెరికాలోని తత్వశాస్త్ర అధ్యయనమంతా విద్యారంగానికే పరిమితం".[49] అయితే స్వయంశిక్షితులైన కొందరు తత్వవేత్తలు మాత్రం కొంతవరకూ భౌతికవాద, గతితార్కిక వైఖరి కలిగి ఉండేవారు. వైజ్ఞానిక ధోరణి ఉన్నా, లేకపోయినా "మొదటి నుంచీ తాత్విక ఆలోచనలూ, భావాలూ, ప్రతిపాదనలూ అమెరికా చరిత్రను మలచడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి".[50]

ప్రజాకవి వాల్ట్ విట్‌మన్ రచనల వల్ల ప్రజాస్వామిక

కలిపి కూర్చిన చిత్రం ఇది. మనిషన్నవాడు అంత దుర్మార్గంగా ఉండడని మీరనుకోవచ్చు. కానీ విషాద కథల్లోని, ప్రేమ కథల్లోని దుష్టుల ఉనికిని మీరు విశ్వసించినప్పుడు పెచోరిన్ లాంటివాడు ఉన్నాడని మీరెందుకు నమ్మరు? ఇంతకంటే భయంకరమైన, ఏవగింపు కలిగించే పాత్రలని మీరు అభినందించ గలిగినప్పుడు, ఈ పాత్ర పట్ల అది కల్పితమైనదైనా మీరెందుకు కనికరంగా ఉండరు?

దీనివల్ల నీతి ఏమాత్రమూ లబ్ధి పొందదని మీరంటారు. క్షమించండి. నేనంగీకరించను. జనాలని జీర్ణకోశాలు చెడిపోయేట్టు తినిపించిన తీపి పదార్థాలు చాలు. ఇప్పుడు చేదు మందులూ, కఠోర సత్యాలూ కావాలి. అయినా మానవుల్లోని చెడుగుల్ని సంస్కరించేందుకు గాఢంగా వాంఛిస్తున్నాడనే గొప్ప కాంక్ష ఈ రచయితకి ఉందని మీరు భావించకూడదు. భగవంతుడు అలాంటి మొరటుతనం నుండి అతన్ని కాపాడుగాక! ఆధునిక మానవుణ్ణి తను చూసినట్లు చిత్రించడమే అతనికి సంతోషం కలిగించింది. తన దురదృష్టం వల్ల మీ దురదృష్టం వల్ల ఆధునిక మానవుడు అతనికి అలానే తరచుగా కనిపించాడు. వ్యాధిని నిర్ణయించడం జరిగింది. చాలు, దీన్ని ఎలా నయం చెయ్యాలా అన్నది పరమాత్ముడికే ఎరుక!" అంటాడు నవల ముందు మాటలో లెర్మొంతోవ్.

నిజానికి ఈ మాటలు 170 సంవత్సరాల కిందట రచయిత రష్యన్ సమాజం గురించి చెప్పినా, ఇప్పటికిప్పుడు కొన్ని చిన్న చిన్న మార్పులూ చేర్పులతో మన సమాజానికీ వర్తిస్తాయి. నేటి మన సమాజానిక్కూడా తీపి పదార్థాలు కాదు, చేదు మందులు కావాలి! పెచోరిన్ లాంటి పాత్రల సృష్టి వందలాది జరగాలి. వ్యంగ్య, అధిక్షేప నవలల, కథల ఆవశ్యకత నేడు మరింత ఎక్కువైంది. భ్రష్టు పట్టి కుళ్ళి కంపు గొడుతున్న ఈ సమాజానికి చికిత్స చెయ్యడానికి. మరి మనకు లెర్మొంతోవ్ లాంటి రచయితలున్నారా?

(అయిపోయింది)

ఉద్యమాల మీద చెప్పుకోదగ్గ భౌతికవాద, గతితార్కిక ప్రభావం ఉండింది. "గడ్డి పరకలు" అనే తన కవితలో విట్‌మన్ అంటాడు.

"ప్రశ్నించ సాహసించనిక దాన్ని,
యదార్థత నాకు ఆమోదం
ఆద్యంతం రంగరించిన భౌతికవాదం
రూఢీ అయిన విజ్ఞానానికి జయం కలగాలి
ఖచ్చితమైన ప్రయోగాలు పెంపొందాలి"[51]

హెగెల్ గతితర్కాన్ని గురించిన తన వ్యాఖ్యానంలో (హెగెల్ తత్వశాస్త్రానికి జె. గోస్టిక్ రాసిన టీక గురించిన వ్యాఖ్యానం) విట్‌మన్ మేధావిగా గాంభీర్యాన్నీ, తన భావాలపై గతితర్కం ప్రభవాన్నీ ప్రదర్శిస్తాడు.

"మనిషి మనసులో అతి గంభీరమైన భావన ఒకటుంటుంది. ఒక వంక నేను అనే మానవ సహజమైన అవగాహనా, భావాలూ, అంతరాత్మా, మేధావులకు కలిగే ఆనందమూ ఇలాంటివింకా ఎన్నెన్నో ఉంటే, మరొకవంక నేను కానిది అంటే మొత్తం వస్తుగతంగా కనబడుతున్న భౌతిక విశ్వాంతరాళమూ, దాని సూత్రాలూ, వీటన్నిటికీ అవతల స్థల, కాలాల్లో ఏముంటుంది వగైరా ప్రశ్నలన్నీ ఉంటాయి. వీటినెలా సమన్వయించి వివరించడం, వీటి మధ్యనున్న సంబంధం ఎటువంటిది, అనే ప్రశ్నలకు సమాధానం పైనే విజ్ఞానమూ, కళలూ, దేశదేశాల ఆకాంక్షలూ, మొదలైనవన్నీ ఆధారపడి ఉంటాయి... ఈ అంశాల గురించి ఇప్పటివరకూ జి.ఎఫ్. హెగెల్ అంత బాగా పూర్తి వివరణ ఇచ్చినవారెవరూ లేరు"52.

విట్‌మన్ చెప్పేవాటిలో సమన్వయభావనా, సర్వస్వాన్నీ పరిగణించడం, వ్యతిరేకశక్తులను విడదీయరానివిగా భావించడం మొదలైన అంశాలున్నాయి. వీటన్నిటికీ నిర్మాణాత్మక ఆధారాలూ, మూలకారణాలు హెగెల్ సూత్రాల ద్వారా లభిస్తాయి, అవన్నీ సాకల్యాన్ని, వ్యతిరేక శక్తుల సంఘర్షణ ద్వారా కలిగే స్వయంచలనాన్నీ గురించినటువంటివి.

"అన్నిటికన్నా ముఖ్యమైనదేమిటంటే హెగెల్ వివరణ సంఘర్షణ అనేదాన్ని గతితర్కానికి నమూనాగా అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది... విట్‌మన్ చెప్పిన ప్రజాస్వామిక సమన్వయానికి ఇది తగిన తత్వధోరణి"[53].

టూకీగా చెప్పాలంటే (బ్రూక్ ఫాం తదితర ఆదర్శ కమ్యూనిస్ట్ సమాజాలను స్థాపించిన) ట్రాన్సెండెంటలిస్ట్‌లనబడే అధిగమనవాద తాత్వికులు వాస్తవాలనుకాక, బూర్జువా వాస్తవాలను అధిగమించే ప్రయత్నం చేశారు. "ట్రాన్సెండెంటలిస్ట్‌లది ఏదో ప్రత్యేక సిద్ధాంతవాద వైఖరి కాదు; భావరహితమైన వ్యాపార సంస్కృతి ఒత్తిడి కారణంగా మనసున కలిగే ఆక్రోశం".[54] ("భావరహితమైన" అనే పదం తాత్వికపరంగా కాక నీతిపరంగా వాడబడింది. మెటీరియలిజం అంటే భౌతికవాదం, భావరహితం అనే రెండు అర్థాలు "భౌతికవాదం, ఆదర్శవాదం" అనే మూడో అధ్యాయం మొదట్లో వివరించబడ్డాయి) వీరికి ప్రముఖ అనుయాయి అయిన రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ఇలా రూఢీగా అన్నాడు. "నేను సోషలిస్టుల ఉదారభావనలనీ, వారి సిద్ధాంతాల గొప్పతనాన్నీ, వాటి ప్రోత్సాహానికి తోడ్పడే ఉత్సాహాన్నీ నిజంగా గౌరవిస్తాను.[55]

శాస్త్రాల్లో గతితర్కానికెటువంటి స్థానం ఉందో అతను చెప్పాడు. "నక్షత్రాలను వివరించే ఖగోళశాస్త్రమూ, సంఖ్యలను వివరించే గణితశాస్త్రమూ, స్వభావాలను వివరించే రసాయనశాస్త్రమూ ఉన్నట్టే శాస్త్రాలకు శాస్త్రం ఒకటుంది అదే గతితర్కం. అది నిజానికీ, అబద్ధానికీ విచక్షణ తెలిపే మేధ".[56]

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో సోషలిజం వేళ్ళూనుకున్నది పంతొమ్మిదో శతాబ్దపు తొలి రోజుల కార్మికవర్గ పోరాటాల్లోనూ, సంఘాన్ని సంస్కరించి ఆదర్శవంతమైన సోషలిస్ట్ సమాజాలను నెలకొల్పే ప్రయత్నాల్లోనూ. 1848 నాటి అనుభవజ్ఞులైన జర్మన్ (జోసెఫ్ వెడర్‌మేయర్ తదితర) విప్లవకారుల రాకతోనూ, 1905 రష్యా విప్లవం తరవాత వలసవచ్చిన వారితోనూ సోషలిజం బలపడి, శాస్త్రీయరూపంలో దర్శనమిచ్చి వికాసం చెందింది. మొత్తం మీద "అమెరికా తత్వధోరణికి నిరంతరం కొత్త జీవాన్నీ, దిశనూ ఇచ్చినది కెరటాల్లా వలసవచ్చిన ప్రజలే".[57]

కార్మికతత్వవేత్త అయిన జోసెఫ్ డియెట్జెన్ హెగెల్‌ను అధ్యయనం చెయ్యకుండానే గతితర్కంలో అద్భుతమైన కృషి చేశాడు. ఒక సోషలిస్ట్ ప్రచురణకు సంపాదకుడుగా 1888లో అతను హేమార్కెట్ సమ్మెలో బలి అయిన వారి తరపున వాదించాడు. The Positive Outcome of Philosphy, Philosophical Essays అనే తన రచనలూ, అనేక ఉపన్యాసాల ద్వారా డియెట్జెన్ గతితార్కిక భౌతికవాదంలోని ముఖ్యాంశాలకు కార్మికులలో ఆదరణ కల్పించాడు. ఎడ్వర్డ్ బెలమీ సోషలిస్ట్ సమాజం గురించి రాసిన Looking Backward అనే నవల కూడా బాగ ప్రాచుర్యం పొందిందనేది గమనార్హం.

వైజ్ఞానిక తత్వశాస్త్రం గతితార్కిక భౌతికవాదం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో బాగా వేళ్ళూనుకుని ఉన్నటువంటిది. దాని చరిత్ర తప్పక లిఖించబడుతుంది. జ్ఞానవికాసం కలిగించే అటువంటి చరిత్ర వెలువడడానికీ, సోషలిస్ట్ ధోరణి కలిగిన కార్మికవర్గపు ఆవిర్భావానికి సంబంధం ఉంటుంది.

49. Howard Mumford Jones, American Humanism: Its Meaning for World Survival, p.24.
50. Werkmeister, A History of Philosophical Ideas in America, p.3.
51. Quoted in Parrington, Main Currents in American Thought, Vol.3, p.81.
52. Quoted in Schneider, A History of American Philosophy, p.162.
53. Ibid., p. 163.
54. Miller, The American Transcendentalists, p.ix.
55. Ibid., p.17.
56. Seldes, Great Quotations, p.237.
57. Schneider, A History of American Philosophy

(ఇంకా ఉంది)

కథ

(అరుణతార ఏప్రిల్-జూన్ 2010 సంచికలో ఈ కథ కొంత భాగం మాత్రమే అచ్చయింది. పొరపాటుకు చింతిస్తూ ఆ కథను పూర్తిగా మళ్లీ ఇక్కడ మీ కోసం - సం.)

శిక్ష

- మిడ్కో

బోసినవ్వులతో ఒక్కో అడుగూ వేసుకుంటూ వస్తున్నాడు సన్ను. వాడిప్పుడిప్పుడే నడక నేరుస్తున్నాడు. పగలంతా నిద్రపోయి లేచి అమ్మ దగ్గర కడుపు నిండా పాలు తాగినందుకేమో, ముఖం ఎప్పటికంటే మరింత ప్రశాంతంగా, సంతోషంగా ఉంది. సాయంకాలపు నీరెండలో దిశమొలతో ఉన్న వాడి చామన ఛాయ దేహం మెరిసిపోతోంది. దేన్నో పట్టుకోబోతున్నట్టు, ఒక చేయిని ముందుకు చాచి ఒక్కో అడుగు వేసుకుంటూ వస్తున్నాడు. వాడికి ప్రతి అడుగూ ఒక పెద్ద విజయంలాగే ఉంది. ఆ విజయ గర్వంతో కళ్లు మెరుస్తున్నాయి. వాడినలా చూస్తుంటే ఎవరిలోనైనా వాత్సల్యం పొంగకుండా ఉండగలదా?

అందుకే తమ పాకలోని మంచంలో కూర్చొని ఉన్న బోక్లు తన కేసి వస్తున్న సన్నును చూసి చేతులు చాచాడు.

బోక్లు చేతులు చాచడం చూసి, సన్ను కేరింతలు కొడుతూ మరింత వడిగా అడుగులు వేయసాగాడు.

సన్ను తన దాకా వచ్చేదాకా బోక్లు నిలువలేకపోయాడు. చేతులలాగే చాచి ఉంచి మంచంలోంచి లేచి పాక బయటకు వచ్చి రెండడుగులు వేశాడు. మరొక్క క్షణమైతే ఆ బుజ్జిగాడిని రెండు చేతులతో పైకెత్తి, రెండు బుగ్గల్నీ ముద్దాడి, గుండెలకు హత్తుకునే వాడే! కానీ ఇంతలో సయ్యిమంటూ వచ్చింది సన్ను వాళ్లమ్మ గులారీ. సన్నును టకీమని లేపి చంకలో వేసుకొని, "నీ పాపిష్టి చేతులతో వాన్నెప్పుడూ ముట్టుకోకు" అని కోపంగా అంటూ పక్కనే ఉన్న తన ఇంటివైపు సర సరా అడుగులేసింది.

తన స్వేచ్ఛను హరించి జబర్దస్తీగా ఎత్తుకున్నందుకేమో సన్ను ఏడుపు లంకించుకున్నాడు.

హతశుడయ్యాడు బోక్లు. మొహం నల్ల బడింది. అప్పుడే పాక పక్కనే ఉన్న తమ ఇంట్లో నుంచి గుమ్మంలోకి వచ్చిన బోక్లు భార్య కన్ని, పాకలోనే మరో మంచంలో కూర్చొని ఉన్న బోక్లు తల్లి అడిమే చూశారాదృశ్యాన్ని.

"ఈ గులారీ ఎప్పుడే ఇంతే. ఈయనను చూస్తేనే కళ్లల్లో నిప్పులు పోసుకుంటుంది" అంది కోపంగా కన్ని.

"ఛ! ఊరుకో ఆ పిల్ల విన్నదంటే మళ్లీ గొడవలయి పోతయి" అడిమే.

"గొడవలకు భయపడి ఎన్ని రోజులిలా నోర్మూసుకొని ఉండాలి? ఆమె ఏమన్నా పడాల్నా?" కోపమూ నిష్టూరమూ కలగలిసి పోయాయి కన్ని గొంతులో.

"నోరు మూసుకునే ఉండాలి. తప్పు చేసిన వాళ్లం పడాల్సిందే. ఏదో ఇలానన్న ఊళ్లో ఉండనిచ్చారు. దానికి మనం సంతోషపడాలింకా..."

'కన్నిలో కోపం దిగిపోవడం మొదలయింది. "తప్పు ఒప్పుకున్నాడుగా. అంత పెద్ద పంచాయితీలో ఆయన్ని క్షమించాలనీ, అందరూ ఎప్పటిలాగా ఆయన్ని తమలో కలుపుకోవాలనీ తీర్పు చెప్పారుగా... దళం వాళ్లు కూడా ఆయనతో మంచిగానే ఉంటున్నారుగా..."

"కలుపుకోవాలని చెప్పారులే ...చెప్పగానే అందరూ అన్నీ మరిచిపోయి కలుపుకుంటారా? పాపం ఆ పిల్ల ఎంత గోస పడింది."

బోక్లు తిరిగివచ్చి మంచంలో వాలిపోయి కళ్లు మూసుకున్నాడు. భార్యా తల్లి మాట్లాడుతున్న మాటలు అతని చెవుల్లో పడుతూనే ఉన్నాయి.

అతన్నలా చూస్తుంటే ఆడవాళ్లిద్దరి హృదయాలు బాధతో మూల్గాయి.

"బాధ పడకు నాయనా. కొన్ని రోజులు ఓర్చుకోవాలి ఇవన్నీ. రోజులు గడుస్తున్నకొద్దీ అందరూ మర్చిపోతారు..." అంటూ ఓదార్చసాగింది తల్లి.

యాంత్రికంగా అక్కడ్నుంచీ కదిలి ఇంటి పనుల్లో పడింది కన్ని. నెలక్రితం జరిగిన పంచాయితీలో గులారీ గట్టిగా మాట్లాడిన మాటలు ఇప్పటికీ ఆమెకు చెవుల్లో వినబడుతూనే ఉన్నాయి.

* * *

"వీళ్లను బతకనియ్యడమా? వీళ్లే జుడుం గూండాలను వెంట బెట్టుకొని వచ్చింది. వీళ్లు లేకపోతే జుడుం వాళ్లు మన ఊరికి అంత నష్టం చెయ్యగలిగేవాళ్లే కాదు.." కోపంతో ఊగిపోతున్నాడు పొజ్జాల్.

"నిజమే కానీ ఇప్పుడు తప్పు ఒప్పుకుంటున్నారుగా..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు అడమాల్. అడమాల్ అక్కడి జనతన సర్కార్ అధ్యక్షుడు.

అతని మాటలను పూర్తి చేయనీయకుండానే అందుకుంది గులారీ. "ఏందన్నా నువ్వు చెప్పేది? చేసిందంతా చేసి, ఇప్పుడు తప్పయింది అంటే సరిపోయిందా? వీళ్లను బతుకనిచ్చుడా? నరికి పోగులు పెట్టినా పాపం లేదు..." ఆవేశంతో కందిపోయిందామె మొహం.

"అవును వీళ్లను బతకనిచ్చేది లేదు చంపాల్సిందే..." కమ్లి.

"అవును చంపాల్సిందే!" అనేక మంది గొంతుల్నుంచి వచ్చిందా మాట. అందరిలోనూ ఆవేశం రగులుతోంది.

అది దండకారణ్యంలోని భైరంగఢ్ ప్రాంతంలోని పొట్టెం గ్రామం. దాదాపు నూటా యాభై ఇండ్లున్నాయా ఊళ్లో. ఊరికి కుడివైపున ఉన్న మామిడి చెట్ల వద్ద ఆ గ్రామస్తులే కాక ఆ జనతన సర్కార్లో ఉన్న మరో నాలుగు గ్రామాల ప్రజలు ఓ అయిదారు వందల మంది గుమిగూడారక్కడ. ఆగస్ట్ మొదటి వారం కనుక ఆకాశం మబ్బు పట్టి

ఉంది. మధ్యాహ్నం భోజనాలు కానిచ్చి పంచాయితీకి వచ్చారందరూ.

న్యాయశాఖ బాధ్యురాలు జైని పంచాయితీని నడిపిస్తోంది.

ప్రజలంతా అర్ధ చంద్రాకారంలో కూర్చుని ఉన్నారు. చిన్న చిన్న రాళ్ల మీదనో, కర్ర పేళ్లమీదనో కూర్చున్నారు కొందరు. మరి కొందరు తమ చెప్పులనే కింద వేసుకొని కూర్చున్నారు. కొందరు మాత్రం నిలబడే ఉన్నారు. వాళ్లకు ఎదురుగా బోక్లు, మంగాల్‌లు తలవంచుకొని కూర్చున్నారు. వాళ్లకి కుడివైపున అడమాల్‌తో పాటు మరికొందరు జనతన సర్కార్ సభ్యులూ, గెరిల్లా దళ సభ్యులూ ఉన్నారు. ఎడమ వైపు బోక్లు, మంగాల్‌ల కుటుంబ సభ్యులు కూర్చొని ఉన్నారు. జైని నిలబడే ఉంది.

"నిజమే వీళ్లు ఘోరమైన తప్పులే చేశారు. కానీ వీళ్లంతట వీళ్లు ఆ తప్పులు చేయలేదు. ప్రభుత్వం ఒక పథకం ప్రకారం జుడుంను తెచ్చింది. జుడుం నాయకులూ, పోలీసు ఆఫీసర్లు వీళ్ల చేత ఆ తప్పులు చేయించారు..."

ఇంకా వివరించబోతున్న అడమాల్ మాటలకు అడ్డం పడుతూ "వాళ్లు చేయిస్తే వీళ్ల బుద్ధేమయింది? అసలు వీళ్లు జుడుంలో ఎందుకు చేరారు? అప్పుడు మన మాట కాదని వెళ్లారు. మళ్లీ ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని వచ్చారు?" ఆవేశంగా అన్నాడు సోమాల్.

"తెల్సో తెలియకో, భయానికో భక్తికో చాలా మంది జుడుంలో చేరారు. ఇప్పుడు తప్పు తెల్సుకొని వస్తున్నారు. తప్పు తెల్సుకున్న వారిని మనం క్షమించాలి కదా..." మరో జనతనా సర్కార్ సభ్యుడు జుగ్రు.

"తెలియక పోవడం ఏముంది? కమిటీ వాళ్లు మీరంతా మీటింగు చేసి చెప్పారు కదా..." గులారీ.

"మనం చెప్పినా గానీ అప్పటి పరిస్థితి ఎలా ఉంది? శత్రువు పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేశాడు కదా. ఆ ప్రచారాన్ని చాలా మంది నమ్మారు..." జుగ్రు.

"జుడుంలో కలిస్తే కల్సారు. కల్సి ఏమన్నా మామూలుగా ఉన్నారా? ఎస్.పి.ఓ.ల్లో చేరారు. ఎన్నిసార్లు మ ఊరి మీద దాడులు చేయించారు? ఎన్ని ఇళ్లను తగుల బెట్టారు. ఎన్ని పంటలను నాశనం చేశారు? ఎందర్ని చంపారు? ఎంత మంది ఆడవాళ్లను బలాత్కారం చేయించారు?" ఆవేశం ఆగడం లేదు సోంవారీకి.

"మనూళ్లో అయిదుగురు ప్రాణాలను నిలువునా తీశారు. అయిదుగురు ఆడవాళ్లను బలాత్కారం చేశారు..." ఇడిమే అందుకుంది.

ఇడిమే ఆ మాటలంటున్నప్పుడు గులారీ, కమ్లి, ఐతేల్లో ఒకేసారి కోపమూ, దుఃఖమూ ముంచుకొచ్చాయి. వాళ్లు ముగ్గురూ అత్యాచారానికి గురయ్యారు. మరో ఇద్దరు యువతులు ఆ పీడకల నుంచి పారిపోవడానికి ఊరు వదిలి లోతట్టుగ్రామాల్లోని తమ బంధువుల ఇండ్లల్లో ఉంటున్నారు.

"సల్వాజుడుం దాడుల్లో మనూరికి చాలా నష్టమే జరిగింది. గానీ వీళ్లు స్వయంగానైతే ఎవర్నీ చంపలేదనీ, బలాత్కారం చేయలేదని మనకు తెల్సు కదా..." అడమాల్.

"వాళ్లు స్వయంగా చంపకపోవచ్చు. కానీ వీళ్లు తీసుకువచ్చిన మూకనే కదా అవన్నీ చేసింది..." సోంవారీ.

నిలబడి ఉన్న జైని అటు ఇటు కదులుతూ ప్రజల వాదనలూ వాళ్ల హావభావాలూ పరిశీలించసాగింది. ఆమెక్కూడా నిజానికి దోషులను విడిచిపెట్టకూడదని బలంగా ఉంది. అలా వాదిస్తున్న వారితో చేరి తన వాదనలు కూడా గుప్పించాలని ఉంది. కానీ న్యాయశాఖకు బాధ్యురాలిగా ఉన్న తను తన వ్యక్తిగత వాదనలను వినిపించడానికి వేదిక అది కాదని తెలుసుకనుక తనను తాను బలవంతంగా నిగ్రహించుకుంటోంది.

కమిటీ సభ్యులు ఎంత చెప్పినా ప్రజలు సమ్మతించక పోవడంతో దళ కమాండర్ మంగ్తు లేచి నిలబడ్డాడు. అతను ఉపన్యాస ధోరణిలో మాట్లాడ్డం మొదలు పెట్టాడు.

"కామ్రేడ్స్! ఒకసారి నేను చెప్పేది వినండి, విని ఆలోచించండి... సల్వాజుడుం మొద్దలైన కొత్తలో ప్రజల్లో భయాందోళనలు విపరీతంగా ఉండేవి. ఆ భయాన్ని మరింత పెంచుతూ దాని గురించి విపరీతమైన ప్రచారం ఉండేది. ఇక్కడ నక్సలైట్లను పూర్తిగా రూపుమాపుతామనీ, ఇవ్వాల కాకపోతే రేపైనా ప్రజలందరూ శిబిరాల్లో చేరాల్సిందేననీ... ఇలా ప్రచారం జరిగినప్పటికీ చాలా మంది ప్రజలు ధైర్యంగానే నిలబడ్డారు. ఈ గడ్డను వదిలి వెళ్తే తమకు బతుకు లేదనుకున్నారు. కాబట్టి చావో బతుకో ఇక్కడే ఉండి పోవాలనుకున్నారు. కానీ కొందరు భయపడ్డారు. కొందరు అయోమయంలో పడ్డారు. ఇక్కడ ఉంటే అనవసరంగా చచ్చిపోతాం కదా అనుకున్నారు. పార్టీ కూడా తుడిచిపెట్టుకుపోవడమో, లేదంటే ఇక్కడి నుండి రిట్రీట్ అయిపోవడమో జరుగుతుందనుకున్నారు. దానితో జుడుంలో చేరిపోయారు. జుడుంలో చేరిన తర్వాత ఇక వాళ్లకు స్వేచ్ఛేం ఉంటుంది? వాళ్లు ఎస్.పి.ఓ.ల్లో చేరమంటే ఎస్.పి.ఓ.ల్లో చేరాల్సిందే, గూండాల్లో చేరమంటే గూండాల్లో చేరాల్సిందే. కొందరు ఇష్ట పూర్వకంగానే చేరవచ్చు. కానీ కొందరు బలవంతంగా అయిష్టంగానే చేరారు. కానీ వాళ్లు భయపడ్డట్టు పార్టీ ఇక్కడ తుడిచిపెట్టుకుపోలేదు. మన ప్రతిఘటన పెరిగింది. అంతేకాదు జుడుంలో చేరినవాళ్లు తిరిగి తమ గ్రామాలకు రావాలని మనం పిలుపునిచ్చాం. దానికి తోడు శిబిరాల్లో అత్యాచారాలను భరించలేకపోయారు. అక్కడి రోత బతుకుపై ఏవగింపు పుట్టింది. దానితో చాలామంది సరిగ్గా ఆలోచించడం మొదలుపెట్టారు. తిరిగి వచ్చి ఇక్కడే పి.ఎల్.జి.ఎ. రక్షణలో బతకాలనుకుంటున్నారు. ఇదొక మంచి పరిణామం. మొదట పొరపాటు చేసినా దాన్ని దిద్దుకోవడానికి సిద్ధపడుతున్నారు. మన పార్టీపై మన పోరాటంపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి సూచిక ఇది. మరి ఇటువంటి ప్రజలను మనం కలుపుకోవాలా దూరం చేసుకోవాలా? మనం కలుపుకు రావల్సిన వాళ్లను దూరం చేసుకోవడం ఉద్యమానికి నష్టమా? కాదా? అయితే జుడుంలో చేరి మరీ విచ్చలవిడిగా హత్యలూ, అత్యాచారాలూ చేసిన వారిని క్రూరంగా ప్రవర్తించిన వారినీ క్షమించాలని మనం అనుకోవడం లేదు. బోక్లు, మంగాల్‌లు ఎస్.పి.ఓ.ల్లో చేరారు. నిజమే! మూడు నెలలు పనిచేశారు. జుడుం మూకను మన గ్రామాల్లోకి తీసుకువచ్చారు. ఆ సమయాల్లో జుడుం మూక ఇక్కడ హత్యలూ, అత్యాచారాలు చేశారు. కానీ స్వయంగా వీళ్లయితే చేయలేదు. శిబిరంలో కూడా ప్రజల్ని కొట్టారు గానీ మరీ క్రూరంగా ప్రవర్తించినట్టు, హత్యలూ, అత్యాచారాలు చేసినట్టు మనకు రిపోర్టు లేదు. మన పిలుపుకు స్పందించి వచ్చారు. పైగా వీళ్లు చేరారే గానీ వీళ్ల కుటుంబాలు ఇక్కడే మనతోనే ఉన్నాయి. సంఘంలో

పనిచేసినపుడు కూడా వీళ్ల నడవడిక మంచిగా ఉండింది. వీళ్ల మీద ఎవరికీ ఏ వ్యతిరేకత లేదు కదా. వాళ్లు చేసిన తప్పును ఒప్పుకుంటున్నారు. కనుక వాళ్లను క్షమించి వదిలేస్తే మంచిదని పార్టీ అభిప్రాయం, జనతన సర్కార్ అభిప్రాయం కూడా అదే. మన పిలుపుకు స్పందించి వచ్చిన వారిని మనం చంపితే ఇంకెవరైనా శిబిరాలను వదిలి రావడానికి సిద్ధపడుతారా అనేది కూడా ఆలోచించండి. మా అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని మరోసారి మీరు సరిగా ఆలోచించి మీ నిర్ణయం తెలియజేయండి'' అంటూ అందరినీ పరిశీలనగా చూస్తూ నిలబడ్డాడు.

మంగ్తు మాటలు కొందరికి సబబుగానే అన్పించాయి. వారిలో ఆవేశం స్థానంలో ఆలోచన మొదలైంది. కానీ కొందరు మాత్రం ఆమోదించలేక పోతున్నారు. గులారీకి కూడా మంగ్తు మాటలు నచ్చలేదు.

"మీకేం మంగ్తు దాదా మీరలాగే చెప్తారు. వీళ్లు మిమ్మల్నేం చేయలేదు కదా. వాళ్లు కొట్టింది మమ్మల్ని, చంపింది మమ్మల్ని, కరాబ్ చేసింది మమ్మల్ని'' నిష్టూరమూ కోపమూ దుఃఖమూ కలగలసి జీరపోయిందామె గొంతు.

సమాధానంగా మంగ్తుకు నోట మాట రాలేదు. గాయపడ్డట్టుగా ఆమె వైపు చూశాడు.

"మరీ అంత అన్యాయంగా మాట్లాడకు గులారీ. మన బాధ, పార్టీది కాదా? మన కోసం కాకపోతే పార్టీ ఎందుకున్నట్టు?" అడమాల్.

గులారీ ఆ మాటలందే కానీ అనేసిన మరు క్షణమే "అయ్యో అలా అనకుండా ఉండాల్సింది. మంగ్తు దాదా ఎంత బాధ పడుతాడో" అనుకుంది.

అలా మాట్లాడినందుకు మనసులో పశ్చాత్తాప పడింది గానీ వాళ్లను చంపాలనే ఆమె నిర్ణయం కించిత్తు కూడా మారలేదు. రెండు నెలల క్రితం బోక్లు, మంగాల్‌లు తీసుకువచ్చిన జుడుం మూక తన చేతిలోని నెలల పసివాన్ని లాగిపారేసి తనను అత్యాచారం చెయ్యడాన్ని ఆమె ఎలా మరిచిపోగలదు? ఆ రోజు పక్కనే తన బిడ్డ కేరు కేరుమని గొంతు చిట్లేలా ఏడ్వడం, తన పెనుగులాట... అదంతా ఆమెకింకా పచ్చిపుండు లాగే ఉంది.

"ఎస్.పి.ఓ.ల్లో చేరినా గానీ మామూలుగా ఉంటే విడిచిపెట్టినా ఏం కాదు గానీ, వీళ్లు కర్రె ఉంగాల్ గాడితో రాసుకుపూసుకు తిరిగారుగా. వాడెంత పాపిష్టోడు. వాడితో అంత మంచిగా ఉన్నారంటే ఇక వీళ్లు ఎన్ని పాపిష్టి పనులు చేసి ఉంటారో మనం ఆలోచించాలి..." గంగాల్.

కర్రె ఉంగాల్ పేరు వినగానే పుండు మీద కారం చల్లినట్టయింది గులారీతో సహా చాలా మందికి. వాడు తనతో పశువులా ప్రవర్తించడం, మిగతా వారిని కూడా పశువుల్లా పురిగొల్పడం... మరో సారి జుగుప్స పాకింది గులారీకి.

కర్రె ఉంగాల్ ఇక్కడ ఉద్యమం బలపడేంత వరకూ భూస్వామిగా ఉన్నాడు. పరమ క్రూరుడు. ఉద్యమం అతని కోరలు పీకేసింది. అప్పటి నుండీ అదను కోసం ఎదురు చూస్తూ అణగిమణగి ఉన్నాడు. ఇప్పుడు మళ్లీ జుడుంలో పడగ విప్పాడు. పొట్టెంకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే జాంగ్లా రాహత్ శిబిరంలో ఉంటూ గ్రామాల మీద దాడుల్లో చురుగ్గా పాల్గొంటూ పరమ క్రూరుడైన సల్వాజుడుం నేతగా పేరు గాంచాడు.

"నువ్వేమయినా చెప్పు మంగ్తు దాదా. వాళ్లను ఉంచేదిలేదు" గులారీ గొంతు స్థిరంగా ఉంది. మరికొందరు ఆమె మాటను వక్కాణించారు.

మంగ్తు మాటలు విని అందరూ వాళ్లను వదిలేద్దామంటారేమోనని భయపడుతున్న జైని, వాళ్ల మాటలు విని "హమ్మయ్య" అనుకుంది. సంతోషాన్ని ఆమె మొహం దాచలేక పోతోంది.

"కామ్రేడ్స్ మీ కసిని నేనర్థం చేసుకోగలను. మీరు పొందిన బాధ నుంచి మీకా కసి పుట్టడం సహజమే. కానీ ఈ విషయాన్ని మనం వ్యక్తిగతంగా తీసుకోవద్దు. పార్టీ వైఖరిని ముందుకు తీసుకు పోవాలని ఆలోచిస్తే మంచిది. జుడుం నాయకులను చంపాలనేది, జుడుం శిబిరాల్లో చేరిన సాధారణ జనం తిరిగి వస్తే క్షమించాలనేది, అలాగే ఎస్.పి.ఓ.లు గూండాలుగా పనిచేసినప్పటికీ క్రూరంగా ప్రవర్తించని వాళ్లు వాళ్లంతట వాళ్లే లొంగిపోతే వాళ్లను క్షమించాలనేది మన పార్టీ వైఖరి కదా. వీళ్లు కూడా గైడ్స్‌గా పని చేశారు. ఇండ్లను తగులబెట్టారు... ప్రజలను కొట్టారు... కానీ ఎవర్నీ చంపలేదు. అత్యాచారం చెయ్యలేదు. కర్రె ఉంగాల్‌కు సన్నిహితంగా ఉన్నారు అది వాళ్లు కూడా ఒప్పుకున్నారు కదా. వీళ్లు సంఘంలో పనిచేశారు కాబట్టి చంపుతారేమోనని భయపడి వాడిని కొంచెం మంచి చేసుకున్నామని. ఇప్పుడు వీళ్లను చంపితే మనం మన పార్టీ వైఖరికి వ్యతిరేకంగా ప్రవర్తించినట్టు అవుతుంది..." మంగ్తు.

"ఏమో వీళ్లు నిజంగా మారే వచ్చారో లేదంటే ఆ కర్రె ఉంగాల్ గాడు ఏమన్న ప్లాను ప్రకారం వీళ్లను పంపాడో..." కమ్లి.

"లొంగిపోతే ఏం చేయమని మనం ప్రకటించేప్పటికి ఇలా కూడా నాటకం ఆడుతున్నారేమో..." ఐతే

"అలా ఏమన్నా మోసం చేసే ఉద్దేశం ఉంటే మనం పరిశీలించుకుందాం. ఇక్కడ కమిటీ ఉంది... మిలీషియా ఉంది... ప్రజలున్నారు... వీళ్ల ప్రతి చర్యను గమనిస్తూ ఉండాలి. వాళ్లను పూర్తి స్వేచ్ఛగా వదిలెయ్యం కదా. కొన్ని షరతులు పెడుతాం. ఏ ఊరికి వెళ్లొద్దనీ... కొత్తవాళ్లెవరితో మాట్లాడొద్దనీ..."

"అవును అలా షరతులు పెడితే బాగానే ఉంటుంది..." అని ఒకరంటే మరి కొందరు "అవునవును..." అన్నారు.

"సరే చంపలేదు... కానీ ప్రజల్నైతే కొట్టారుగా... ఇండ్లనైతే తగుల బెట్టారుగా... మరీ ఏ శిక్ష ఉండొద్దా?" అని ఒకరనేప్పటికి "అడునడును ఉత్తిగనే ఎలా వదిలేస్తాం?" అన్నారు మరి కొందరు.

కొద్ది సేపట్లో అక్కడంతా గోలగోలగా తయారైంది. మాటలన్నీ కలగాపులగంగా కలిసి పోతున్నాయి. ఎవరేం అంటున్నారో అర్థం కావడంలేదు.

జైనికి తన బాధ్యత గుర్తొచ్చింది. "కామ్రేడ్స్ గోల గోల చెయ్యొద్దు ఒకరి తర్వాత ఒకరు మాట్లాడండి " అని రెండు మూడు సార్లు అరిచేప్పటికి గొడవ కాస్త సద్దుమణిగింది.

"చంపకున్నా గాని ఏమన్న శిక్ష అయితే ఉండాల్సిందే ..." అని ఒకరంటే "అవును ఉండాల్సిందే" అన్నారు మరికొందరు కోరస్‌గా.

అరే మంగ్తు దాదా మాటలు వీళ్ల మీద బాగానే పనిచేశాయి. ఇప్పటిదాక చంపాల్సిందే అన్న వాళ్లు ఇప్పుడు ఒక మెట్టుదిగి చంపకున్నా గనీ ... అంటున్నారు విచారంగా అనుకుంది జైని.

"ఏం శిక్ష వేద్దామో చెప్పండి" అంది నీరసంగా.

"బాగా కొట్టి వదిలేద్దాం..."

"అవునవును కొట్టి వదిలేద్దాం..."

"కొట్టి వదిలెయ్యడమా... వీళ్లేదు చంపాల్సిందే..." అన్న గులాబీ మాటలకు మరి కొన్ని గొంతులు గట్టిగా మద్దతునిచ్చాయి.

జైనికి నీరసం ఎగిరిపోయింది. మళ్లీ వాతావరణం గోల గోలగా తయారయింది.

మళ్లీ జైని, రెండు మూడుసార్లు అరిచి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. ఇక పంచాయితీని ముందుకు తీసుకుపోదల్చిందామె. కొంచెం పక్కకు వెళ్లి మిగతా కమిటీ సభ్యులను దగ్గరికి పిల్చి గుస గుసలాడింది. మళ్లీ అందరి ఎదుటకు వచ్చింది.

బోక్లు, మంగాల్‌లు పంచాయితీ మొదలైనప్పటి నుంచీ తల నేలకేసే కూర్చున్నారు. ఒక రకమైన నిర్లిప్తత ఆవరించింది వాళ్లను. వాళ్ల కుటుంబ సభ్యుల మొహాలు మాత్రం దీనంగా ఉన్నాయి. చంపాలని వాదిస్తున్న వాళ్లకేసి "అయ్యో కొంచెం కనికరించండి" అన్నట్టు చూస్తున్నారు. బోక్లు, మంగాల్‌ల కేసి "అయ్యో వీళ్లేమయిపోతారో..." అన్నట్టు చూస్తున్నారు.

"సరే కామ్రేడ్స్. విషయమైతే అందరికీ స్పష్టంగానే అర్థమైంది. అందరూ అన్ని రకాల వాదనలు విన్నారు. ఇకిప్పుడు మెజారిటీ నిర్ణయం ప్రకారం చర్య తీసుకుందాం. కొందరు చంపాలంటున్నారు.. మరి కొందరు కొట్టి వదిలెయ్యాలంటున్నారు. కాబట్టి చంపాలనే వాళ్లు చేతులెత్తండి..." అందామె అన్ని వైపులా చూపుల్ని తిప్పుతూ ప్రజల్ని పరిశీలనగా చూస్తూ.

బోక్లు, మంగాల్‌ల మొహాల్లో ఏ భావమూ వ్యక్తం కావడంలేదు. ఇప్పుడు పైకి లేచే చేతులు తమ చావు బతుకులను నిర్ణయిస్తాయని తెల్సినప్పటికీ నిర్లిప్తంగా ఉండి పోయారు. నిండా మునిగాక... అన్నట్టుంది వాళ్ల పరిస్థితి. వాళ్ల కుటుంబ సభ్యుల ముఖాల్లో మాత్రం భయం స్పష్టంగా తొంగిచూసింది. ఊపిరి బిగబట్టారు వాళ్లు.

దిగ్గున పైకి లేచాయి అనేక చేతులు. జైని లెక్క పెట్టడం మొదలు పెట్టింది. అప్పటికీ బోక్లు, మంగాల్‌లు తలెత్తి చూడలేదు. వాళ్ల కుటుంబ సభ్యులు మాత్రం నెమ్మదిగా తలలెత్తి లేచిన ఆ చేతులవైపు ఆందోళనగా చూశారు. అవి చేతుల్లా కన్పించలేదు వాళ్లకి. బోక్లు, మంగాల్‌ల మెడల మీదికి ఉరకబోతున్న కత్తుల్లాగా కనబడ్డాయి.

జైని లెక్క పెట్టడం ముగించి "ఇప్పుడు కొట్టి వదిలెయ్యాలనే వాళ్లు ఎంత మందో చేతులెత్తండి" అంది. చంపాలన్న చేతులు సగం కంటే తక్కువే ఉన్నాయని అర్థమై అసహనంగా ఉందామెకు.

మిగిలిన అన్ని చేతులూ పైకి లేచాయి. ముందు ఎత్తిన చేతుల కంటే ఇవి ఎక్కువ కనబడ్డంతో దోషుల కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

తప్పదు కాబట్టి జైని అయిష్టంగా లెక్క పెట్టింది.

"ఇప్పుడు కొట్టకుండా, చంపకుండా వదిలెయ్యాలి అనే వాళ్లు చేతులెత్తండి" అంది ఇంకెవ్వరూ మిగిలి లేనట్టున్నారు అనుకుంటూ.

ఒక్క చేయి కూడా లేవలేదు.

జైని యాంత్రికంగా తన కమిటీ సభ్యుల దిక్కు అడుగులేసింది. మంగ్తు, అడమాల్, జుగ్రు తదితరులు కూడా వాళ్లతో చేరారు. అందరూ కాసేపు తర్జన భర్జన పడ్డారు. తర్వాత జైని చెప్పడంతో మిలీషియా సభ్యులు వెళ్లి ఓ రెండు వెదురు కర్రలను నరికి తెచ్చి ఇద్దర్నీ కొట్టడం మొదలు పెట్టారు.

జనాన్ని కొట్టనిస్తే చంపుతారని మంగ్తు హెచ్చరించడం వల్ల కొట్టే పనిని మిలీషియా వాళ్లకు అప్పజెప్పిందామె. ఆ మిలీషియా వాళ్లకు మంగ్తు ముందే జాగ్రత్తలు చెప్పాడు. మరీ ఎక్కువగా కొట్టవద్దని. మంగ్తుకసలు వాళ్లను కొట్టడం ఇష్టం లేదు. అలా కొడితే వాళ్లలో వ్యతిరేకత వస్తుందని అతని ఉద్దేశం. కానీ ప్రజా కోర్టు నిర్ణయానికి అతనూ తల వంచాడు. వాళ్లను చంప కూడదనే పార్టీ వైఖరిని మెజారిటీ ప్రజల చేత ఆమోదింప జేయడమే ఒక విజయంగా అతను భావించాడు.

మిలీషియా వాళ్లు కొట్టడం మొదలు పెట్టగానే ఆవేశం ఆగని జనంలోంచి కొందరు పరిగెత్తుకుంటూ వెళ్లి వాళ్ల చేతుల్లోని కర్రలు లాక్కొని కొట్టడం మొదలు పెట్టారు. మరి కొందరు మరిన్ని కర్రలను తీసుకు వచ్చి కొట్ట సాగారు. కొందరు పిడికిళ్లతో గుద్దసాగారు. మరి కొందరు కాళ్లతో తన్న సాగారు. అలా అక్కడ ఒక గుంపు తయారైంది. దోషుల కుటుంబ సభ్యుల్లో కొంత మంది లేచి ఆ గుంపు చుట్టూ తిరుగుతూ "ఇంక చాలు కొట్టకండి... చచ్చిపోతారు" అని వేడుకోసాగారు. మరి కొందరు కుటుంబ సభ్యులు మాత్రం కదలకుండా అలాగే కూర్చుండిపోయారు విచారంగా. ఆ మాత్రం శిక్ష వాళ్లకు ఇక ఎలాగూ తప్పదన్నట్టుగా.

మంగ్తు చెప్పిన జాగ్రత్తలేవీ జైనికి గుర్తు రావడంలేదు. అలాగే చూస్తూ నిలుచుంది. మంగ్తు పురమాయింపుతో అడమాల్ వచ్చి ఆ దెబ్బలను ఆపాడు.

* * *

చిన్నబోయిన మనసుతోనే వంట పూర్తి చేసింది కన్ని. చీకటి పడుతూనే పొయ్యి వెలుతురులో అందరూ భోజనాలు చేశారు.

అన్యమనస్కంగానే తిన్నట్టు చేసి కడుక్కున్న చేతుల్ని భుజం మీది తువ్వాలకు తుడుచుకుంటూ ఇంటి ముందటి పాకలోకి వెళ్తున్న బోక్లుకు మంగాల్ వస్తూ కనిపించాడు.

"ఏరా పొద్దు పోయాక వచ్చావు? " అన్నాడు మంచంలో కూర్చుంటూ.

బోక్లు పక్కనే కూర్చుంటూ "ఊరికనే ఏం తోచక వచ్చానులే..." అని కాసేపు నిశ్శబ్దంగా ఉండి "పొద్దుండగా వద్దామంటే... ఆ చివరి నుండి ఈ చివరి వరకూ రావాలి గదా... వస్తూంటే ఎంతో మంది ఎదురు పడుతారు... ఎవరూ పలకరించరు... చూసి మొఖం తిప్పుకుంటారు. లేకుంటే ఈసడింపుగా చూస్తారు... కొందరైతే తిట్లు మొదలు పెడుతారు... అందుకే పగలు వీధిలోకి రావాలంటే భయమైతుందిరా... అటునుండి అటే చేన్లోకి వెళ్లి వస్తున్నా అంతే ..." నిట్టూర్చుతూ అన్నాడు మంగాల్.

"ఏం చేస్తాంరా ఊరంతా వెలివేసినట్టు చూస్తుంది మనల్ని అలాగైపోయింది మన బతుకు..." భారమైన మనసులోంచి వస్తున్న బోక్లు మాటలు మరింత భారంగా ఉన్నాయి.

మీరనవసరంగా బాధ పడకండి నాయనా. నాలుగు రోజులు

ఎలాగో భరించండి అన్నీ సర్దుకుంటాయి..." ఓదార్పుగా అంటూ పక్కనే ఉన్న మంచంలో ఓ చింపిరి గుడ్డ పరుచుకొని ఒరిగింది అడిమే.

"ఏం నాలుగు రోజులు! పంచాయితీ జరిగిపోయి నెల రోజులైంది. అయినా పరిస్థితి ఏం మారలేదు..." బోక్లు.

ఈ బాధలేమీ పట్టనట్టుగా ముగ్గురు పిల్లలూ వచ్చి మంచంలో పడుకుండిపోయారు.

"ఆ ఉంగాల్ గాడి మాయమాటలు విని మనం జుడుంలో చేరితిమి. లేకుంటే మంచో చెడో కష్టమో నష్టమో ఊరందరితో పాటు మనం ఉండే వాళ్లం కదా.." మంగాల్.

"ఇప్పుడనుకొని ఏం లాభమన్నా. వాడు మిమ్మల్ని కల్సాడని తెలియగానే నేను చెప్పలేదా? వాని మాటలు మీరు వినొద్దని. చావైనా బతుకైనా ఊరందరితో పాటు మనం ఉందామని. మీరు విన్నారా? ఊరంతా ఏట్లో కొట్టుకుపోనీ మీరు మాత్రం మంచిగా ఉందామనుకున్నారు. ఇప్పుడేమయిందీ..." ఉక్రోశంగా అంది కన్ని పిల్లల మీద దుప్పటి కప్పుతూ.

ఆమె మాటల్ని అంగీకరిస్తున్నట్టు ఇద్దరూ కాసేపు మౌనం వహించారు.

"బుద్ధి లేక వాని మాట విన్నాం. జుడుంలో కల్సి అటే ఉండి పోవాలని మేం అనుకోలేదు. అట్లా అనుకుంటే మిమ్మల్ని కూడా రమ్మనే వాళ్లం. కానీ ఒకసారి లొంగిపోయి శిబిరంలో పేరు రాయించుకుంటే ఇక ఆ తర్వాత ఇంటికి వచ్చినా జుడుం వాళ్లు ఏమీ అనరని మాకా ఉంగాల్ గాడు చెప్పాడు. కానీ తీరా వెళ్లి పేరు రాయించుకున్నాక లొంగిపోయారు కనుక ఇప్పుడు తిరిగి వెళ్తే నక్సలైట్లు చంపుతారని చెప్పి అక్కడే ఉంచేశాడు... ఇక వాడు ఆడించినట్టల్లా ఆడాం..." మెల్లగా చెప్పుకుపోతున్నాడు మంగాల్.

ఇవేవీ కన్నికి కొత్త విషయాలు కావు. భర్త ఆమెకు ఎన్నోసార్లు చెప్పిన విషయాలే. కాసేపు మౌనంగా నిలబడి మంచంలో పడుకున్న చిన్నపిల్లను భుజానేసుకొని ఇంట్లోకి నడిచింది.

కాసేపటికే అందరూ నిద్రలోకి జారిపోయారు. బోక్లు, మంగాల్‌లు మాత్రం మాట్లాడుకుంటూనే ఉన్నారు.

"నాకు ఒక్కోసారి మంచో చెడో అక్కడే ఉండిపోయినా బాగుండు అన్పిస్తోంది. ఈ వెలి బతుకు భరించలేనట్టుగా ఉందిరా..." బోక్లు.

"ఛ ఏదో ఒకసారి దారి తప్పినం. అంత మాత్రాన తప్పుడు దారిలోనే ఉండిపోతామా?"

"కానీ అందరూ మనల్ని ఎలా చూస్తున్నార్రా? పురుగుల కంటే హీనంగా చూస్తున్నారు..."

"అవుననుకో..."

అర్ధరాత్రి దాటిపోయినా ఇద్దరూ అలా మాట్లాడుకుంటూనే ఉన్నారు. తాము అనుభవిస్తున్న బాధను వెళ్లగక్కుకుంటూ ఉన్నారు.

* * *

"అప్పుడే చంపి పారేస్తే పీడాబోయేది. మేం ఎంత మొత్తుకున్నా విన్నారా మీరు?" అడమాల్‌ని ఉద్దేశించి అంటోన్న గులారీ మొహంలో ఆవేశమూ, అసహనం, అసహాయత కలగలసి ఉన్నాయి.

మంచంలో కూర్చొని ఉన్న అడమాల్ బదులివ్వలేదు, తలా ఎత్తలేదు.

"వాళ్లు మారిపోయినం అని కల్లబొల్లి మాటలు చెప్పేస్తే వీళ్లు అమాయకంగా నమ్మారు..." కుమ్లి.

"ఏదో ఎత్తు వేసుకుని వచ్చుంటారు కానీ మనం వాళ్లను పూర్తిగా నమ్మలేదుగా, ఓ కన్ను వేసి ఉంచామాయే. అందుకనే ఇక లాభం లేదనుకొని చెక్కేశారు..." సోమాల్.

"ఇప్పుడు మళ్లెన్ని దుర్మార్గాలు చేస్తారో..."

"మనం వాళ్లను గట్టిగా వ్యతిరేకించినం. చంపాలని కూడా గట్టిగా మాట్లాడినం... అందుకని మన మీద పగ బట్టినా పడుతారు..." కుమ్లి.

"ఛ చేతికి దొరికిన వాళ్లను వదిలేస్తిమి. ఇంక మళ్లా దొరకమంటే దొరుకుతారా.." గులారీ.

"నాక్కూడా అప్పుడు వాళ్లను చంపేస్తే మంచిదని ఉండే కానీ ఏం చేస్తాం అందరి మాటలు విని వదిలేస్తిమి..." అనకుండా ఉండలేక పోయింది జైని.

అలా ఆ యింటి ముందు గుమి కూడిన దాదాపు వంద మంది తలో మాట అనసాగారు. ఇంతలో జుగ్రు వచ్చాడు. పక్క ఊరికి పని మీద వెళ్లి వస్తున్న అతనికి దారిలోనే విషయం తెల్సింది. అందరూ బోక్లు ఇంటి వద్దే ఉన్నారని తెల్సి సరాసరి అక్కడికే వచ్చాడు. వస్తూనే మంచంలో అడమాల్ పక్కనే కూలబడుతూ మిట్ట మధ్యాహ్నపు ఎండకు పట్టిన చెమటను టవల్‌తో తుడుచుకుంటూ "ఎప్పుడు పారిపోయారు?" అనడిగాడు. అప్పటికే అతనికి దాదాపు విషయం తెల్సినప్పటికీ వివరంగా మళ్లీ తెల్సుకోవాలని.

"వాళ్లనే అడుగు" అన్నాడు ఇంటి ముందటి చెట్టు కింద బిక్కు బిక్కు మంటూ కూలబడి ఉన్న కన్ని, అడిమేల వైపు కళ్లతోనే చూపిస్తూ అడమాల్.

"పారిపోతారని మీకేం అనుమానం రాలేదా కన్నీ..." ఆమె మొహంలోకి పరిశీలనగా చూస్తూ జుగ్రు.

నెమ్మదిగా తలెత్తి జుగ్రు కేసి క్షణం పాటు చూసిందామె. మళ్లీ తలదించుకుంది. ఆమెసలు ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉంది. దగాపడిన ఆమె హృదయం బండబారినట్టయింది. ఆమెకెవరికీ మొఖం చూపించాలని కూడా లేదు. కానీ మాట్లాడక తప్పని స్థితి.

"రాత్రి అన్నం తిన్నాక మంగాల్ వచ్చాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ ఇక్కడ్నే ఈ మంచంలో కూర్చుండి పోయారు. అత్త ఆ మంచంలో పడుకుంది. ఇద్దరు పిల్లలు ఈ మంచంలో పడుకున్నారు. నేను, చిన్నపిల్ల లోపల పడుకుండిపోయాం. నడిజాము దాటిపోయాక మూత్రానికని లేచి వస్తే బయట మంచం ఖాళీగా ఉంది. నాకేం అనుమానం రాలేదు..." అంటూ కన్నీళ్లు బొట బొటా రాల్చింది. అతని మీదుంచిన విశ్వాసం దెబ్బ తిన్న వేదన ఆమె మొహాన్ని కమ్మేసింది. కొంగుతో కళ్లూ, మొహమూ తుడుచుకుంటూ జీరపోయిన గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ "దొడ్డికేమన్నా వెళ్లాడేమో అనుకున్నా... మళ్లా వెళ్లి పడుకుండిపోయాను. తెల్లారి లేచి చూస్తే కూడా కనబడలేదు. అత్తను అడిగిన తను తెలియదంది. ఎక్కడికి వెళ్లాడబ్బా అనుకున్నం ఇద్దరం. వస్తడేమో చూద్దాం అనుకున్నాం. జావ తాగే వేళకు కూడా

రాకపోయేసరికి అడమాల్ అన్న దగ్గరికి అత్తను పొమ్మని చెప్పిన..." ఇంక చెప్పే శక్తి లేనట్టు ఆగిపోయిందామె.

"రాత్రి అప్పుడప్పుడు మెలుకువ వచ్చినప్పుడు మాటలు వినబడుతూనే ఉన్నాయి. మళ్లెప్పుడో మెలుకువ వచ్చేప్పటికి మాటలు వినబడలేదు. వీడు లోపలికి పోయి పడుకున్నడేమో అనుకున్న... ఇంత పని చేస్తాడని అనుకోలేదు..." దుఃఖం ముంచుకొచ్చి అడిమే మాటలు ఆగిపోయాయి.

తమ ఇంటి ముందు అంత మంది ఎందుకు గుమికూడారో, తల్లీ, నాయనమ్మ ఎందుకలా ఉన్నారో, కొంచెం కొంచెం అర్థమయినట్టే ఉంది ఆరేడేళ్ల కన్ని కొడుకులిద్దరికీ. తల్లి పక్కనే బిత్తర చూపులు చూస్తూ కూర్చున్నారిద్దరూ. ఏడాదినార్ధమున్న చిన్న పిల్లకు అంతా గోలగోలగా ఉన్న ఆ వాతావరణం నచ్చకనేమో మాటి మాటికీ ఏడవసాగింది. ఆ పాప ఏడ్చినప్పుడల్లా నాయనమ్మ ఒడిలోకి తీసుకొని జోకొట్టసాగింది. కొన్ని నెలల క్రితం వరకూ అందరూ ఎంతో ముద్దు చేసే ఆ పాపాయిని ఇప్పుడెవరూ ముట్టుకోవడం లేదు.

"మీకేం అర్థం కాలేదా? ఈ రెండు మూడు రోజుల నుండీ ఏమన్నా తేడా కనబడిందా తనలో?" జుగ్రు.

"లేదన్నా మాకేమీ అర్థం కాలేదు. మంచిగానే ఉన్నాడు..."

"మంగాల్ వచ్చినప్పుడు ఏం మాట్లాడుకున్నారు? మీరు విన్నారా?"

"ఊళ్లో ఎవరూ మనల్ని నమ్మడంలేదని బాధపడుతూ మాట్లాడుకోవడం మాత్రం విన్నామన్నా... తర్వాత ఏం మాట్లాడుకున్నారో తెలియదు... ఈయనకైతే నిన్నటిదాకా ఇటువంటి ఆలోచన ఉన్నట్టే లేదు..." చెప్పి మళ్లీ తలదించుకుంది కన్ని.

ఆ మంగాలే ఏమేమో చెప్పి ఉంటాడు... కొడుకు పైన చిరు నమ్మకం రెప రెప లాడుతోంది అడిమేలో.

"ఏదో నమ్మిద్దామని వచ్చాం గానీ ఎవరూ నమ్మేట్టు లేరనే విషయం పూర్తిగా అర్థమయి ఉంటుంది. ఇక ఇక్కడ ఉన్నా లాభం లేదు అనుకొని ఉంటారు..." సోంవారి.

"మీకేం విషయం తెల్సినా దాచకండి నిజం చెప్పండి..." సోమాల్.

మరి కొందరు కూడా "అఉను చెప్పండి... మీకసలు తెలియకుండా ఎలా ఉంటుంది? " అన్నారు.

"ఇంత కంటే మాకే విషయం తెలియదన్నా మమ్మల్ని నమ్మండి..." భోరుమంది కన్ని. అంత వరకూ నొక్కి పడుతూ ఉన్న దుఃఖం కట్టలు తెంచుకుంది. అడిమే కూడా గట్టిగా ఏడవడం మొదలు పెట్టింది. తల్లీ, నాయనమ్మ అంతలా ఏడవడం చూసి పిల్లలూ తల్లి మీద పడిపోయి బెదిరిపోయినట్టు ఏడవసాగారు.

"ఛ! ఊరుకో అక్కా నిన్ను మేం నమ్ముతున్నాం. ఊరుకో..." చటుక్కున తన చంకలో ఉన్న పిల్లాడిని నేల మీద దింపేసి కన్ని ఎదురుగా కూలబడి ఆమెను దగ్గరకి తీసుకుని సముదాయిస్తూ అంది గులారీ. కన్నినలా దైన్యంగా చూస్తుంటే గులారికెలాగో ఉంది. "వాడిని పెళ్లి చేసుకున్న ఖర్మానికి ఇలా అందరి ముందు తలదించుకోవాల్సి వచ్చింది" అనుకుంది. ముందు కన్ని, గులారీలిద్దరూ మంచి నేస్తాలే. బోక్లు జుడుంలో చేరినప్పటి నుంచి గులారీ కన్నితో ముభావంగా ఉంటోంది. పంచాయితీ తర్వాత ఇద్దరి మధ్య మాటలే లేకుండా పోయాయి. గులారీ ఓదార్చడం చూసి మరికొందరు కూడా ఓదార్పుగా మాట్లాడసాగారు. మరి కొందరు పిల్లల్ని దగ్గరికి తీసుకొని ఊరడించసాగారు.

ఇంకొందరు మాత్రం అపనమ్మకంగా చూడ సాగారు. "నిజంగా వీళ్లకేం తెలియదా? తెలియకుండానే ఉంటుందా?" అనుకోసాగారు.

కన్ని బాధతో తన బాధను పోల్చుకుంది గులారీ. తను అత్యాచారానికి గురైయింది. కానీ తన భర్త తనను అక్కున చేర్చుకున్నాడు. ఊరి ప్రజలు తనకు అండగా నిలిచారు. తనెవ్వరి ముందూ తలవంచుకోలేదు. కానీ కన్ని పరిస్థితి... కష్టసుఖాల్లో తోడుగా ఉండాల్సిన భర్త ఆమెను నట్టేట్లో ముంచి వెళ్లాడు. అతను చేసిన నేరానికి ఆమె తలవంచుకుంది. అన్నింటికంటే ఇబ్బందికరమైంది... కొందరిలోనైనా ఆమె పట్ల అపనమ్మకం ఉంటుంది. ఆనాడు ఆ చేదు సంఘటనను ఎదుర్కున్నప్పుడు తానెంత దురదృష్టవంతురాలు అనుకుంది. కానీ కన్నితో పోల్చితే తానెంత అదృష్టవంతురాలు... ఇక్కడ కన్ని ఏడున్నట్టే అక్కడ మంగాల్ భార్య కూడా ఏడుస్తుందేమో...అనుకుంది గులారీ.

* * *

"నిజం మామా! నీకబద్ధం చెప్తామా?" ఇక్కడ ఉండీ ఉండీ విసుగుపుట్టి ఓసారి ఊరు చూసొద్దమని పోయినం. పిల్లల్ని చూడాలని కూడా మనసు పీకింది. అంతేగానీ అక్కడ్నే ఉండి పోదామని అనుకోలేదు మామా. అక్కడ్నే ఉండి పోవాలనుకుంటే మళ్లీ ఎందుకు వస్తాం?" అన్నాడు బోక్లు ఎదురుగా బెంచీ మీద కూర్చొని ఉన్న కర్రె ఉంగాల్‌తో.

"మా సంగతి నీకు తెలియనిదేముంది మామా? నీకబద్ధం చెప్తామా?" మంగాల్.

అరగంట నుండి ఆ ముగ్గురి మధ్య మాటలు నడుస్తున్నాయి. అప్పటికి ఉంగాల్‌కు బోక్లు, మంగాల్‌ల మాటల మీద నమ్మకం కుదరసాగింది.

"మరైతే ఈ మాట నాతో ముందే ఏడ్చి ఉండొచ్చు కదర్రా..."

"చెప్తే నువ్వు పోనీయవని చెప్పకుండానే వెళ్లాం..."

"మీ మొహం! మీరు చెప్పింది నేనయితే నమ్ముతా గానీ రానేదారు నమ్మొద్దూ.."

"నువ్వే ఎలాగైనా చెప్పాలి మామా రానేదారుకు... "

"సరే నేను నచ్చ జెప్తా గానీ మీరయితే అక్కడికి వెళ్లిన తర్వాత ఏమేం చేశారో, మీకు ఎవరెవరు కల్సారో... అన్నీ వివరంగా చెప్పాలి."

సమాధానంగా రెండు తలలూ ఊగాయి.

"మరి మళ్లీ ఇలా పారిపోరు కదా..."

"ఇంక బుద్దొచ్చింది మామా. ఒక వేళ మేం పోయినా మమ్మల్ని ఊర్లో ఎవరూ నమ్మే పరిస్థితి లేదులే... ఇప్పుడే చంపకుండా వదిలేయడం గొప్పే. అక్కడ భయపడుతూ, అందర్నీ బతిమాలుతూ బతకడం కంటే ఇక్కడే హాయిగా బతకొచ్చు..."

"మరి ఈ సారన్నా పెళ్లాం పిల్లలను తీసుకురాలేదెందుకురా.."

"ఆడోళ్లు ఎంత జెప్పినా వినలేదు మామా.. నక్సలైట్లు చంపుతారని భయపడుతున్నారు..." మంగాల్.

"మీరు రాకపోతే మేం ఇక్కడ్నే ఎవర్నైనా పెళ్లి చేసుకుంటాం అని చెప్పినా వినలేదు మామా... ఇక మా దారి మేం చూసుకోవాల్సిందే..." బోక్లు.

"ఈ మాట నేనెప్పుడో చెప్పిన కదరా. హాయిగా పెళ్లిళ్లు చేసుకొమ్మని మీరే మా పెళ్లాలు వస్తారు వస్తారు అని చెప్పుకొచ్చారు..."

"వస్తారనే అనుకున్నం మామా..."

"సరే మరి పోదాం పదండి పోలీస్ స్టేషన్‌కు. థానేదారుతో మాట్లాడుదాం. అయితే మిమ్మల్ని వెంటనే మళ్లా ఎస్.పి.ఓ.లుగా చేర్చుకోక పోవచ్చు. అయినా నారాజ్ కావొద్దు. ఇక్కడ్నే క్యాంపులో అందరితో పాటు ఉండిపోండి..." అంటూ బర్మార్ భుజానికేసుకొని లేచాడు ఉంగాల్.

* * *

"ఇదిగో మామా మాంసం... తిని చూడు.." ఇంటి ముందున్న బెంచీ మీద కూర్చున్న ఉంగాల్ చేతిలో కాల్చిన మాంసం చుట్టి ఉన్న చిన్న ఆకుల మూటను పెడ్తూ అన్నాడు మంగాల్. మంగాల్ వెంటే బోక్లు కూడా ఉన్నాడు. బోక్లు చేతిలో విల్లు బాణాలున్నాయి. మంగాల్ చేతిలో గొడ్డలీ గులేర్ ఉన్నాయి.

విల్లు బాణాలతో పక్షులను జంతువులను వేటాడుతారు. అయితే పక్షులను కొట్టడానికి బాణాలు వేరుగా ఉంటాయి. పక్షులను బాణాలతోనే కాకుండా గులేర్‌తో కూడా కొడుతుంటారు. ఉడుతలు వగైరా చెట్టు తొర్రల్లో దూరితే ఆ చెట్టును నరికైనా వాటిని పట్టుకుంటారు కనుక వేటలో గొడ్డలిని కూడా ఉపయోగిస్తారు.

"ఏం మాంసంరా ..." ఉంగాల్ మొహం చాటంతయింది.

"పిట్ట మాంసం.."

వాళ్ల సమాధానం కోసం చూడకుండానే ఆత్రంగా మూటను విప్పి ఓ మాంసం ముక్కను చేతిలోకి తీసుకొని నోట్లో వేసుకున్నాడు.

గబ గబా నములుతూ "భలే ఉందిరా" అంటూ మరో ముక్కను చేతిలోకి తీసుకున్నాడు.

ఆదివాసీలు సాధారణంగా మాంస ప్రియులు. అయితే ఉంగాల్‌కు విపరీతమైన పిచ్చి అని చెప్పుకోవాలి. ఆ పిచ్చిని తీర్చుకోవడానికి తమ ఊళ్లో ఉన్నప్పుడు వేటలోనే ఎక్కువ కాలం గడిపేవాడు. రాహత్ శిబిరంకు వచ్చేశాక మనుషుల వేటకే సమయం సరిపోవడం లేదు, ఇంక పక్షుల, జంతువుల వేటను ఎలా చేస్తాడు? ఒక వేళ చేయాలనుకున్నా లోతట్టు అడవిలోకి మునుపటిలా ఒక్కడు వెళ్లాలంటే భయం. శిబిరం ఉన్న రోడ్డుకు కొంచెం అటూ ఇటూనే చేయాలి. శిబిరంలో ఉన్న ఎంతో మంది రోడ్డుకు అటూ ఇటూ వేట కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కనుక అక్కడ ఏమైనా దొరకడం చాలా అరుదు. ఉంగాల్ శిబిరంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాల్లోకి దాడులకు వెళ్లినప్పుడు మేకలూ, పందులూ, కోళ్లూ, బాతులూ... వగైరా ఎత్తుకొచ్చి తింటూనే ఉన్నాడు. మాంసం తినని రోజులు చాలా అరుదుగా ఉంటాయి. కానీ రక రకాల పిట్టల మాంసాన్నీ, చేపల్నీ ఆకుల్లో చుట్టుకుని కాల్చుకొని తినడంలో, పీతల్ని నిప్పుల్లో కాల్చుకొని తినడంలో ఉండే రుచే వేరు. చాలా రోజుల తర్వాత ఆ రుచిని ఆస్వాదిస్తున్నాడు ఉంగాల్. మరో రెండు ముక్కలను తిని మిగిలిన ముక్కలను పట్టుకొని లోపలికి వెళ్లాడు. ఆ నాలుగు ముక్కలను కల్లుతో నంజుకొని తినాలనే కోరికతో.

బోక్లు, మంగాల్‌లు వెను తిరిగారు.

ఆ రోజు నుంచీ బోక్లు, మంగాల్‌లు తరచూ సాయంత్రం పూట ఉంగాల్‌కు ఆకుల్లో చుట్టి కాల్చిన మాంసమో, చేపలో, నిప్పుల్లో కాల్చిన పీతలో తీసికెళ్లడం, ఉంగాల్ లొట్టలేసుకుంటూ తినడం మామూలై పోయింది. ఇంట్లో వండిన మాంసం ఉన్నా వీళ్లు తీస్కెళ్లిన దాన్నే ఇష్టంగా తినేవాడు.

ఒకరోజు బోక్లు చేతి నుండి ఆకు మూటను అందుకుంటూ "ఏరా వేట బాగా చేస్తున్నారే..." అన్నాడు.

"మాకేం పనుంది మామా... పనేం లేకుండా ఊరికనే ఎలా కూచుంటాం? అందుకనే అలా తిరిగేసి వస్తున్నాం..." బోక్లు.

"మీరేమో మమ్మల్ని ఎస్.పి.ఓ.లుగా తీసుకోక పోతిరి..." నిష్టూరంగా మంగాల్.

"మీకేం భయం లేదు. ఈ నెల వెళ్లిపోయి ఫస్టు తారీఖు రానీయండి, మిమ్మల్ని ఎస్.పి.ఓ.లుగా చేర్పిస్తా నేను. నా మాట కాదనే వాడెవ్వడిక్కడ..." మాంసం ముక్క నములుతూ అన్నాడు.

బోక్లు, మంగాల్‌ల మొహాలు వెలిగిపోయాయి. "మాకు తెలుసు మామా. నీ మాట కాదనే ధైర్యం ఇక్కడ ఏ పోలీసోడికీ లేదనీ... నీకే మా మీద దయ కలగట్లేదనుకుంటున్నాం"

గర్వంగా నవ్వుతూ మిగిలిన మాంసాన్ని తీసుకొని ఇంట్లోకి వెళ్లిపోయాడు ఉంగాల్.

మరుసటి రోజు సాయంత్రం బోక్లు, మంగాల్‌లు కాలువ వైపు వెళ్లసాగారు. అప్పటికి వాళ్లు మళ్లీ శిబిరంలో చేరి రెండు నెలలు కావొస్తోంది.

"ఏరా ఎక్కడికి బయల్దేరారూ? " ఎదురుపడ్డ ఉంగాల్ అడిగాడు.

"పీతలు పడుదామని వెళ్తున్నాం మామా.."

"రాత్రిపూట అయితే బాగా దొరుకుతాయి కదరా..."

"ఇప్పుడు కూడా ఫర్వాలేదు మామా..."

ఒక్క క్షణం ఆలోచించి "సరే నేను కూడా వస్తాను పదండిరా ఈ రోజు..." అన్నాడు.

"ఏం మామా పీతలు పట్టాలని సరదాగా ఉందా? ఏంటి?" నవ్వుతూ అన్నాడు బోక్లు.

"ఉందదార మరి ఎన్ని రోజులాయే వాటి జోలికి పోక.."

"సరే పోదాం రా మామా... ఈ రోజు పుల్లు దొరుకుతాయి. అత్తను మంచిగా పులుసు పెట్టమను..."

ముగ్గురూ నవ్వుకుంటూ కాలువ కేసి సాగారు.

కాలువ సమీపించగానే తమ చేతుల్లోని విల్లు బాణాలు గొడ్డలీ ఓ పెద్ద చెట్టుకు ఆనించి పెట్టి రాళ్లు లేపుతూ ఒడుపుగా పీతలు పట్టసాగారు మంగాల్, బోక్లు.

ఉంగాల్ సరదా పడి వచ్చాడే గానీ పీతలు పట్టకుండా వాళ్ల వెనుక వెనుక తిరుగుతూ చూడసాగాడు. ఇంతలో మంగాల్ ఓ పెద్ద బండరాయిని కొంచెం లేపి మోకాలు మీద వంగి దాని కింద పీత కోసం చేయి పెట్టాడు. రెండు మూడు క్షణాల తర్వాత "ఒరే బోక్లూ ఈ బండను కాస్త ఎత్తు... కింద పెద్ద పీత ఉంది" అనరిచాడు. పెద్ద

పీతను పట్టబోతున్న సంతోషం ఆయన మొహంలో కనబడుతోంది. బోక్లు వెళ్లి తన రెండు చేతులతో బండను ఎత్తబోయాడు గానీ పట్టు దొరకలేదు.

"ఇంకొంచెం ఎత్తు నా చేతులింకా లోపలికి పోవాలి. లోపలుంది పీత..."

"అబ్బ బండ చాలా పెద్దగా ఉంది. పట్టు దొరకడం లేదు. మామా కొంచెం నువ్వు గూడ వచ్చి ఓ చేయివేసి చూడు..." అరిచాడు బోక్లు.

ఉంగాల్ భుజానికున్న బర్మార్‌ను ఓ రాయికానించి వచ్చి వంగి రెండు చేతులతో బండను పట్టుకున్నాడు.

"ఇంకొంచెం కిందికి పట్టుకో మామా నేను పైన పట్టుకుంటా..."

ఉంగాల్ తల మరి కొంచెం వంచి తన చేతుల్ని కిందికి పోనిచ్చాడు.

బండను పట్టుకున్న బోక్లు చేతులు నెమ్మదిగా వదులుకాసాగాయి.

* * *

పిల్లలూ, ముసలివాళ్లూ తప్ప పొట్టెం గ్రామస్తులు దాదాపుగా ఊరికి కుడివైపునున్న మామిడి చెట్ల దగ్గర పొద్దున్నే జమయితున్నారు. సూర్యోదయమై ఎంతో సేపు కాలేదు. నవంబర్ నెల కావడంతో ఇంకా చలిగానే ఉంది. కానీ అక్కడ చేరిన వాళ్లెవరూ చలిని పట్టించుకోవడం లేదు. ఏవో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. సమిష్టి పంటను కోయడానికి అందరూ అక్కడ జమయితున్నారు. జుడుం విధ్వంసం నడుమనే తమ ప్రాణాల్ని పణంగా పెట్టి రక్షించుకున్న పంట చేలను కనులనిండుగా చూసుకుంటున్నారు. అభివృద్ధి కమిటీకి చెందిన భీమాల్ తదితరులు అక్కడ జమయిన వారిని బృందాలుగా విభజిస్తున్నారు. ఇంకాసేపయితే అందరూ పక్కనే ఉన్న పంట చేలోకి దిగేవాళ్లే.

ఇంతలో "మిలీషియా వాళ్లు వస్తున్నారే..." అన్నారెవరో.

"ఎవర్నో పట్టుకొస్తున్నట్టుంది..." అన్నారు ఇంకొకరు.

"అరె బోక్లు, మంగాల్‌లు కదూ..,"

కొద్ది క్షణాలు ఎవరికీ నోట మాట రాలేదు. తర్వాత చిన్నగా కలకలం బయలు దేరింది.

"దొరికారు దొంగలు!" సోమాల్.

"ఇంక తప్పించుకోలేరు!" భీమాల్.

అడమాల్ గుంపు లోంచి ముందు కొచ్చి నిలబడ్డాడు. బోక్లు, మంగాల్‌లను అడమాల్ ఎదుట నిలబెట్టారు మిలీషియా వాళ్లు.

"ఎక్కడ దొరికారు?" అడిగాడు అడమాల్.

"ఊళ్లోకి వస్తుంటే పట్టుకున్నాం..."

కాసేపు ఏం మాట్లాడాలో తోచలేదు అడమాల్‌కు. అనేక ఆలోచనలు గజిబిజిగా మెదిలాయి బుర్రలో. ఆవేశం ముంచుకొచ్చిందతనికి. ఆ రోజు పంచాయితీలో ప్రజలంతా చంపాలని కోరుకున్నా అందరికీ నచ్చజెప్పి వాళ్లను వదిలేసినందుకు ఆ తర్వాత తామంతా ప్రజల ముందు తల వంచుకున్న విషయం గుర్తొచ్చింది.

అడమాల్ నోట్లో నుంచి మాట బయటకు రాకముందే అక్కడున్న వాళ్లంతా తలో మాటా అనడం మొదలు పెట్టారు.

కన్ని కూడా ఆ గుంపులో ఉంది. ఆమెకు భర్తను చూడగానే కాళ్లు వణికాయి. గుండె దడ దడలాడింది. అక్కడ నిలబడలేక ఆ గుంపుకు కొంచెం ఎడంగా జరిగి కూలబడిపోయింది.

మంగాల్ భార్య కూడా అక్కడ ఉండవల్సింది కానీ ఆమె ముందు రోజే పక్క ఊరికి వెళ్లింది.

గుంపులో క్షణ క్షణానికి ఆవేశం పెరుగుతోంది. ఎన్ని మాటలన్నా వాళ్లకు సంతృప్తి కలగడం లేదు. చేతలకు సిద్ధం కాసాగారు.

ఓ రెండు దెబ్బలు వాళ్ల వంటి మీద పడనే పడ్డాయి.

"ఆగండాగండి... ముందు కొంచెం మాట్లాడనీయండి..." అడమాల్ అడ్డం వచ్చాడు.

"వాళ్లతో ఇంక మాటలేంది చంపి పారేస్తే పోతుంది!" కుమ్లి.

"అంతే చంపాల్సిందే ఇంక వాళ్లతో మాట్లాడేదేముంది?" ఒకేసారి చాలా మంది అన్నారు.

"అరె! కాసేపాగుతారా లేదా?" గట్టిగా కసిరాడు జుగ్రు.

"ఆ మేమాగుతాం, మీరు వాళ్లతో మాట్లాడుతారు, వాళ్లేవో కథలు చెప్తారు, మీరు నమ్ముతారు..." ఆవేశమూ, నిష్టూరమూ, వ్యంగ్యమూ కలగలసి పోయి గులారీ గొంతు వణుకుతోంది.

"అంతే వాళ్లతో మాట్లాడితే కథలు చెప్పక ఇంకేం చెప్తారు?" ఎర్రగా కంది పోయింది ఐతే మొహం.

కన్ని మనసంతా అల్లకల్లోలం కాసాగింది. చంపుతారా? చంపుతారా? తన కళ్ల ముందే చంపుతారా? అయ్యో చంపొద్దని ఏ మొహం పెట్టుకొని బతిమిలాడాలి? శరీరమంతా కంపిస్తోందామెకు.

కొంత మంది కన్ని దిక్కు కుతూహలంగా చూస్తున్నారు. గులారి కన్ని వైపు చూసి వెంటనే మొహం తిప్పుకుంది. ఆమెనలా దైన్యంగా చూడ్డానికి మనస్కరించలేదామెకు. ఈ రెండు నెలల్లో గులారీ కన్నిల మధ్య స్నేహం మునుపటి కంటే మరింత బలపడింది. గులారీ కన్నికి అన్ని విధాల అండగా నిలబడింది. మొదటి పంచాయితీ తర్వాత తన భర్త ఇంట్లో ఉన్న నెల రోజుల్లో అతన్ని ఈసడించుకుంటోందని గులారీపై కన్నికి అప్పుడప్పుడు కోపం వచ్చేది. కానీ ఈ మధ్య కాలంలో గులారీ స్నేహ హృదయాన్ని మరింతగా అర్థం చేసుకుందామె.

"వింటున్నారుగా జనమంతా ఏమంటున్నారో? చెప్పండి మరి ఏం చేయాల్నో మిమ్మల్ని..." అడమాల్.

"మేం చెప్పేది కాస్సేపు వినండి తర్వాత ఏమైనా చేయండి..." అన్నాడు బోక్లు ప్రాధేయపడుతున్నట్టుగా.

"చూడు ఇప్పుడిక కథలు చెప్తారు..." అంది కుమ్లి గులారీతో.

అఉనన్నట్టుగా తల ఊపింది గులారీ. ఆమె చూపులు మాత్రం వాళ్లిద్దరి పైనుంచి కదలల్లేదు.

"మేం పోయినం గానీ ఎస్.పి.ఓ.లుగా చేయలేదుగా..." అంటారేమో ఐతే గుసగుసగా.

"ఎస్.పి.ఓ.లుగా చేయలేదంటే వాళ్లు చేయనిస్తే వీళ్లు చేయలేదా ఏంటి? వాళ్లే ఇయ్యలేదు ఎస్.పి.ఓ. ఉద్యోగం" అన్నాడు సోమాల్ గట్టిగానే.

"ఎస్.పి.ఓ.లుగా చేయక పోతే ఏంటీ? ఉంగాల్‌తో రాసుకొని పూసుకొని తిరిగిన విషయం మనకు తెలియదనుకుంటున్నారేమో పాపం..."

"చెప్పండి మరి" అంటూ అడమాల్ అందర్నీ నిశ్శబ్దంగా ఉండమని సైగ చేశాడు.

"మేం అనవసరంగా భయపడీ, కర్రె ఉంగాల్ గాడి మాటలు విని చాలా తప్పు చేశాం. కానీ నిజంగానే ఆ తప్పు తెల్సుకొని అక్కడి నుండి పారిపోయి వచ్చాం. చంపకుండా వదిలేశారు గానీ మమ్మల్ని ఎవరూ నమ్మలేదు. మమ్మల్ని వెలివేశారు. అందుకని మీరందరూ మమ్మల్ని నమ్మాలంటే ఏం చేయాలా అని ఆలోచించాం..." కాసేపు ఆగాడు బోక్లు.

"అందరూ నమ్మాలంటే మళ్లీ పారిపోవాలి..." కుమ్మి వ్యంగ్యానికి కొందరు నవ్వారు.

"పారిపోవడమే కాదు కర్రె ఉంగాల్ గాడితో రాసుకు పూసుకు తిరుగాలి... వాడికి కమ్మగా మాంసం గింసం కాల్చిపెట్టాలి..." అందించింది ఐతే.

ఆ నాలుగు మాటలూ మాట్లాడి బోక్లు మంగాల్‌కేసి చూశాడు. ఆ చూపులనందుకొన్న మంగాల్ తన భుజానికున్న చేతి సంచీని ఎడమ చేతిలోకి తీసుకొని కుడిచేతిని సంచిలోకి పోనిచ్చి బయటకు తీశాడు.

అంతే! మాట్లాడ్డానికో, తిట్టడానికో తెరిచిన వాళ్లందరి నోళ్లు అలాగే తెరుచుకొని ఉండిపోయాయి. అందరి కళ్లూ పెద్దవయ్యాయి. ఊపిరి తీయడం మరిచిపోయారందరూ.

మంగాల్ చేతిలో తల! మనిషి తల!!

దాన్ని పక్కనే ఉన్న ఓ బండరాయి మీద పెట్టాడతను.

"కర్రె ఉంగాల్ తల..." అన్నారెవరో.

"నిజమే... నిజమే..." సంతోషం పట్టలేక అరుస్తున్నారు చాలామంది.

"మమ్మల్ని మీ అందరికీ దూరం చేసిన వాడు వీడే ... మన ఊరిని సర్వ నాశనం చేసింది వీడే... అందుకే చంపేశాం. ఇప్పటికన్నా మమ్మల్ని నమ్మండి..."

"ఎట్ల ఎట్ల చంపార్రా..." రెండు చేతులతో ఇద్దరి భుజాల్ని ఒకే సారి చరుస్తూ అడిగాడు అడమాల్. సంతోషం పట్టలేకపోతున్నాడతను. వాన్ని చంపాలని పి.ఎల్.జి.ఎ. చేసిన ఎన్నో ప్రయత్నాలు విఫలమయ్యాయె మరి.

"మాతో పాటు పీతలు పట్టడానికి వచ్చాడు. రెండు నెలల నుంచి అవకాశం కోసం చూస్తున్నాం. రాయిని పట్టుకోమన్నాం పట్టుకోగానే గొడ్డలి తీసుకొని ఒక్క దెబ్బతో తలను తెంచాం..." అని బోక్లు చెప్పగానే అడమాల్ ఇద్దరికీ చేతులు కల్పాడు. వెంటనే అందరూ వరసగా వచ్చి చేతులు కల్పారు. కొందరైతే కౌగిలించుకున్నారు.

సంతోషం పట్టలేని కొందరు ఎగరడం మొదలు పెట్టారు.

కన్నికైతే కలా నిజమా అన్నంత సంభ్రమంగా ఉంది. "అక్కా రారా... బావకు చేయి కలుపు" గులారీ నిండుగా నవ్వుతూ పిలిచింది కన్నిని.

కన్ని కొత్త పెళ్లి కూతురిలా సిగ్గుపడింది.

"లే వదినా... లేచి చేతులు కల్పు" కుమ్మి కన్ని భుజాలు పట్టుకొని లేవదీసింది.

కన్ని నవ్వూ సిగ్గూ కలిసిన మొహంతో తడబడుతున్న అడుగులతో వచ్చి ఇద్దరికీ చేతులు కలిపింది.

విషయం తెల్సి ఊళ్లోని ముసలి వాళ్లూ పిల్లలూ అందరూ వచ్చి అక్కడ చేరారు.

కేరింతలూ కోలాహలంతో అక్కడంతా ఓ పండుగ వాతావరణంలా ఉంది.

"మరి కర్రె ఉంగాల్ గాడిని ఊరికనే వదిలేస్తామా? వాడు చేసిన తప్పుల గురించి పంచాయితీ చేయొద్దూ..." అన్నాడు సోమాల్ బండమీదున్న తలను వేలెత్తి చూపిస్తూ.

"అడునడును చేయాల్సిందే..." అన్నారందరూ ముక్త కంఠంతో.

"సరే మరి అందరూ కూర్చొండి. ఒక్కొక్కరు వచ్చి వాడు చేసిన తప్పులు చెప్పాలి..." అన్నది జైని సరదాగా నవ్వుతూ.

అందరికీ ఏదో తమాషాలా అన్పించింది. ఒక్కొక్కరు కూర్చుంటూ "కూర్చోండి... కూర్చోండి..." అంటూ పక్కనున్న వాళ్లను కూడా కూర్చోబెట్టసాగారు.

"ఆ ఇప్పుడు ఒక్కొక్కరు వచ్చి వాడు చేసిన తప్పులు చెప్పాలి..." జైని.

ఒక ముసలమ్మ లేచి "వాడు మావి రెండు మేకలను ఎత్తుకు పోయాడు..." అంది. అందరూ నవ్వారు. ఆమె చేతిలో ఓ కర్ర పెట్టి "నువ్వు నాలుగు దెబ్బలు వేయి..." అంది నవ్వుతూనే జైని.

ఆ ముసలమ్మ నవ్వుతూ నాలుగు దెబ్బలు వేసింది.

"మావి నాలుగు కోళ్లు ఎత్తుకు పోయాడు..." అందొక యువతి..

"నువ్వొక దెబ్బ వేయి"

"మా యిల్లు తగుల బెట్టాడు..."

"చేతికొచ్చిన మా నాలుగెకురాల పంటను తగులబెట్టించాడు..."

"నా కొడుకును కొట్టాడు..."

"నా కొడుకును ఎత్తుకపోయి శిబిరంలో పెట్టి చంపేశాడు..."

"నా భర్తను చంపాడు..."

"నా బిడ్డ బతుకును ఆగం చేశాడు..."

"నా బిడ్డను బట్టలిప్పి ఉరికించాడు..."

ఇప్పుడా పంచాయితీ వాళ్లకు తమాషాగా అన్పించడంలేదు. లోలోపలి వాళ్ల బాధంతా తన్నుకుని వెలికి వస్తోంది. కొందరు కన్నీళ్లు పెడుతున్నారు. కొందరు కసిగా పళ్లు నూరుతున్నారు.

ఆ తలను కర్రతో కొడుతున్నారు... కాళ్లతో తంతున్నారు... నేల మీద దొర్లిస్తున్నారు... దానిపై ఉమ్మేస్తున్నారు. అయినా వాళ్ల కసి తీరడం లేదు.

"ఇక ఆపండి" అని అడుమాల్ రెండు మూడు సార్లు గట్టిగా అరవడంతో ఆపేశారు.

"ఈ తలను తీసుకుపోయి రోడ్డు మీద వేసిరండి. పోలీసులు తీసికెళ్లిపోతారు..." అని జైని అనడంతో మిలీషియా కమాండర్ దాన్ని తీసి తిరిగి సంచీలో వేశాడు.

ఎందుకో గులారీకి కన్నివైపు చూడాలనిపించింది. గులారీ తల తిప్పి చూసేప్పటికి కన్ని పున్నమి పూసిన కన్నులతో భర్తకేసి చూస్తోంది.

చాలా రోజుల తర్వాత గులారీ పెదాలపై మనోహరమైన చిరునవ్వు విచ్చుకుంది.

(దండకారణ్యంలోని భైరంగఢ్ ప్రాంతంలో 2007 నవంబర్‌లో జరిగిన సంఘటన ఆధారంగా...)

కథ

నిరీమిల

- యామిని

దుమ్‌‹‹... మ్‌‹‹... మ్‌‹‹...

శబ్దానికి ఉలిక్కిపడి లేచింది నిరీమిల. పక్కనే పడుకున్న భర్తను చూసింది. పగలంతా కాయకష్టం చేసి ఉండడంతో ఆదమరిచి నిద్రపోతున్నాడు. మంచం మీద నుంచి నిదానంగా లేచింది. ముందుగదిలోకొచ్చింది. అత్తలేచి కూర్చుంది. అత్త లోగొంతుతో ఏంటే? అంటే దగ్గరగా వచ్చి 'నేనే' అని సమాధానమిచ్చింది.

'ఏందే ఆ చప్పుడు?' అత్త

'అదేనత్తా! నాక్కూడా...' అంటూ ఆగింది.

అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా బయటికి వచ్చింది. చుట్టూ చిమ్మ చీకటి ఊరంతా ప్రశాంతంగా అనిపించింది. మినుకు మినుకు మంటూ నక్షత్రాల వెలుతురు. పైకి చూసింది. జాము చుక్కలు చక్కగా నడినెత్తినుంచి కిందికి ఉన్నాయి. అంటే సమయం 3గం. అవుతుందన్నమాట.

నిరీమిల మళ్ళీ పైకి చూసి పక్కింటి సోమ్లు ఇంటికి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళింది. వెళ్తూ వెనక్కి తిరిగి చూసింది. ఏం లేదు. వర్షాకాలం ఊపందుకోవడంతో ఇళ్ళల్లో నెగళ్ళు రాజుకుంటున్నాయి. సోమ్లు దాదా ఇంట్లో నుండి చిన్నగా మంట వెలుగుతోంది. సోమ్లు చప్పుడుకు లేచినట్టున్నాడు. నెగడు దగ్గర కూర్చోని కట్టెలను ఎగదోస్తూ, కదలికలను వింటున్నాడు. నిరీమిల వాకిట్లోంచి తలుపు దగ్గరకు వెళ్ళింది. తలుపు తెరిచే ఉంది.

'దాదా! దాదా!...' అంటూ పిలిచింది.

ఆడగొంతును పసిగట్టి 'ఎవరు పాపా' ఇవతలికి వచ్చి

'నేనే నే... నిరీమిలను'

'చప్పుడు విన్నవేందే?' సోమ్లు

'ఊ‹‹... ఏమైయ్యుండచ్చో?' నిరీమిల

'అదే! నేను కూడా విని ఇదిగో ఈడుకొచ్చి కూర్చున్నాను' సోమ్లు

'స్వప్నం కాదు కదా!' నిరీమిల

'నేను కూడా అదేననుకుంటున్నా' సోమ్లు

ఒక్కసారిగా సూర్యమన్న, జానకీ దీదీల రూపం కళ్ళముందు కదలాడింది.

'సరేగానీ! నువ్వింక లేట్ చేయమాక. వాళ్ళేగనక అయితే ముందు మన ఇళ్ళనే చుట్టుముడుతారు. నేను ముందుకెళ్ళి చూసొస్తా' అంటూ నిప్పు దగ్గరి నుంచి లేచి లుంగిని బిగించి కట్టాడు. మూలన ఉన్న బడుగాను తీసుకొని 'ఇదిగో సుక్కిని తీసుకొని ఆ జొన్నచేలో దాక్కో' అన్నాడు. వీళ్ళ మాటలకు లేచిన భార్యకు విషయం చెప్పాడు. పక్కనే కంటినిండా నిద్రపోతున్న 9 సంవత్సరాల సుక్కిని లేపాడు. 'ఏయ్ సుక్కి! అత్తెంట పోవే!' అంటూ పురమాయించాడు. తెలియని నిద్రతో సుక్కి కళ్ళు నలుపుకుంటూ 'ఊ‹‹... ఊ‹‹...' అంటూ నిలబడింది. సోమ్లు భార్య మంగ్లి పరాస్‌తో (పరాస్ అంటే సొరకాయ బుర్ర - సొరకాయను ఎండబెట్టి దాన్ని గుండ్రంగా ఉన్నవైపున రంధ్రం చేసి నీళ్ళు తోడుకోవడానికి అనువుగా ఇక్కడ ఉపయోగిస్తారు.) నీళ్ళు తెచ్చి సుక్కి కళ్ళు తుడిచింది. కానీ సుక్కికి నిద్రమత్తు వదలలేదు. మంగ్లి శాలువాను సుక్కి భూజం మీద వేసింది. నిద్రమత్తు వదలని సుక్కి తడబడే అడుగులు వేస్తూ నిరీమిల వెంట నడిచింది.

సోమ్లు రెండిళ్ళవతలకు వెళ్ళాడో లేదో బూట్లు టకటక లాడిస్తూ, పెద్దపెద్ద అంగల శబ్దం వినిపించింది. గబుక్కున దగ్గరలో ఉన్న పెద్ద మామిడి చెట్టు వెనక్కి వెళ్ళాడు. ఆ పెద్ద పెద్ద ఆకారాలు లైట్లను అటు, ఇటు తిప్పుతున్నాయి. ఆ లైట్ల ఫోకస్ పడ్డ ఎద్దులు భయపడి తాళ్ళు తెంచుకొని పరుగందుకున్నాయి. సోమ్లుకి భయం ఎక్కువైంది. "ఆ లైట్ల వెలుతురు నామీద పడుతుందేమో! పడిందంటే నా పనయినట్టే" నని భయంతో మరీనక్కి కూర్చున్నాడు. ఆ ఆకారాలు భయంకరంగా చప్పుడు చేసుకుంటూ తిన్నగా నిరీమిల ఇంటి వైపు సాగాయి.

'ఏయ్‹‹... ఎవరు లోపల?' గద్దింపు

మళ్ళీ 'ఏయ్‹‹... మిమ్మల్నే' బూటు కాళ్ళతో తలుపును ఒక తన్ను తన్నే టప్పటికీ అది కాస్తా ఫెటాలున విరిగిపడింది. విరగడం వెంటనే 4 కాళ్ళు ముందుకు రావడం ఒకేసారి జరిగింది. వచ్చిన ఆ నాలుగు కళ్ళు ఇంటినంతా వెతికాయి. నిరీమిల కనబడలేదు. నిరీమిలను అరెస్ట్ చేసి చితకబాదుడు బాదాలని వచ్చారు. కానీ అది కనపడకపోయేటప్పటికీ భర్త, అత్తలను గద్దించడం మొదలు పెట్టారు.

"ఏయ్‹! ముసలిదానా ఎక్కడే అది?"

"..."

'ఏరా! ఎక్కడరా అది?' గద్దింపు. దానితో పాటే పెడీమని దెబ్బ. గూబ మీద పడేటప్పటికీ గూబ గుయ్యిమంది. ఒకడు ఎగిరొచ్చి డొక్కలో తన్నే టప్పటికీ అంతే కూలబడి పోయాడు భర్త.

'లేవరా! లేగు' కాలితో తన్నులు.

లచ్చు లేవడానికి ప్రయత్నిస్తుంటే మళ్ళీ పిడిగుద్దులు. అడ్డం పడిన అత్తను జుట్టు పట్టుకొని ఈడ్చి అవతలికి విసిరేప్పటికీ తలగోడకు గుద్దుకొని అంతే పడిపోయింది. దిమ్మెక్కిన తలను

పట్టుకొని లేచి 'కొట్టొద్దండయ్యా అని ఎంత మొత్తుకున్నా కర్ర విరిగేంత వరకు కొట్టారు. కర్ర విరిగినాంక ఆ కర్రను 'ఛీ' అంటూ విసిరేశాయి ఆ మూకలు. వీళ్ళను కొట్టే వాళ్ళు కొడుతుంటే, మరో ఎనిమిది మంది లోపలంతా ముదియాల్ కోలి (ధాన్యం నిల్వ చేసుకునే గది) నంతా వెదికారు. ఆ ముదియాల్ కోలిలో ఉన్న వడ్లు, మినుములు, ఉలవలు, కోహల బియ్యాన్ని చెల్లా చెదరు చేశారు. బియ్యంలో ఇంటిముందున్న ఇసుకను తెచ్చి కలుపుతూ విరగబడినవ్వుతున్నారు. నవ్వుతూ నవ్వుతూ సంచులన్నీ వెతికారు. పాత జోర (సంచి) లో ఉన్న నాలుగు వేల రూపాయలను ఒకడు బయటికి తీసి జేబులో పెట్టుకోబోయాడు. బియ్యంలో మందు కలుపుతున్న మరొకడు కళ్ళు ఇంతవి చేసుకొని చూశాడు.

మరొకడు వెనక్కి వచ్చి 'ఏయ్... ముసలిదానా! రేపు నీ కోడలిని తెచ్చి సరెండర్ చేయిస్తే సరి! లేదంటే చూస్తారుగా మా తడాఖా! ఏయ్... కుర్రకుంకా... ఆడదాన్ని అదుపులో పెట్టడం నేర్చుకో!'' అంటూ కాలితో ఒక తన్ను తన్ని ముందుకు వెళ్ళిపోయాడు.

మేకలు, కోళ్ళు అరుపులు వినిపిస్తున్నాయి. 'అయ్యో! దొంగనాకొడుకులు ఇవన్నీ దోచుకుపోతున్నారని మనసు విలవిల్లాడిపోతోంది.

లచ్చుకు కళ్ళంతా బైర్లు కమ్మాయి. లేచే ఓపిక లేదు. గానీ కొంచెం కొంచెం అటు ఇటు కదులుతున్నాడు. తల్లివంక చూశాడు. స్పృహలేదు. శవంలా పడి ఉన్న తల్లిని చూస్తుంటే భోరున ఏడుపొస్తోంది. పక్కనే ఉన్న నీళ్ళ కుండలో నీళ్ళు తెచ్చి ముఖం మీద చల్లుదామంటే ఒళ్ళంతా నుజ్జు నుజ్జు అయిపోయింది. కళ్ళ నుండి కన్నీళ్ళు ధారలా కారుతున్నాయి. ఆరుగాలం కష్టపడి సంపాదించినదంతా బూడిద చేశారు. ఇంకేముంది మాకు? తన్నులు, గుద్దులు ఉన్నదంతా తుడిచి పెట్టుకుపోయారు. అసలు ఇదంతా దీని వల్లనే జరిగింది. దీనికంతటికీ నిరీమిల కారణం. దానికి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి రావడంలేదు. ఇల్లె గుల్లయినా దానికి లెక్కలేదు. ఇలాగే ఉంటే మమ్మల్ని కూడా చంపేస్తారు. అందుకే దాని కాళ్ళు విరగొట్టి ఇంట్లో నన్నా కూర్చోబెట్టాలి. లేదంటే ఇంట్లోంచి వెళ్ళగొట్టాలనుకుంటూ కొంచెం ఓపిక తెచ్చుకొని లేవడానికి ప్రయత్నిస్తున్నాడు.

పోలీసులు వెళ్ళిపోయాక ఒక్కొక్కళ్ళే వచ్చి లచ్చును లేపి కూర్చోబెట్టి రాత్రి మిగిలిన జావ ఉంటే తాగించారు. స్పృహతప్పి పడి ఉన్న ముసలమ్మ మొఖం మీద నీళ్ళుచల్లారు. ఆమె తెప్పరిల్లింది. లేపి కూర్చోబెట్టి కొన్ని నీళ్ళు తాగించి చిందర వందరగా ఉన్న సామానును సర్దుతున్నారు. తలా ఒకమాట మాట్లాడుతున్నారు. అసలు దాని వల్లనే కదా, ఇదంతా ఏదో మీటింగ్ అంటే ఏం కాదుగానీ ఈ స్థూపాల గొడవ దానికెందుకంట. పక్కింటి సుకియారి.

'అదే వొదినా! ఆ పిల్ల చెపితే వినదు కదా! నిన్న కూడా పొద్దున్నుంచి సాయంత్రం దాకా అక్కడే' మంగ్తే.

ఇంతలో జొన్న చేల్లోంచి లోపలకు అడుగు పెట్టింది నిరీమిల. అందరూ ఒకేసారి తనవైపు చూపు చూసి మొఖం పక్కకు తిప్పుకున్నారు. అత్త దగ్గరకు వెళ్ళింది. ఆమె కూడా అంతే ఉంది. తమ ఈ స్థితికి తనే కారణమన్నట్లు వారి చూపులు చెపుతున్నాయి. చెల్లాచెదురుగా పడేసిన సామాను సర్దుతుంటే సుకియారి అందుకొంది.

'నీవ్వింక ఇంటిపట్టున ఉండవే! చూడు ఇల్లు ఎలా గుల్ల చేశారో! వీళ్ళను చూడవే! దెబ్బ పడని చోటే లేదు ఈ శరీరాల మీద' .

'అవునే పిల్లా! సంఘంలో ఉన్నావ్‌గా, ఎప్పుడో నీకు తీరిక ఉన్నప్పుడు పనులు చూద్దువు గానీ...' మంగ్తే.

అలా తలా ఒకమాట తననే అంటున్నారు. వాళ్ళు అంటున్నప్పుడు ఎదురు మాట్లాడాలనుకుంది గానీ మౌనంగానే తన పని చేసుకుంటూపోతోంది.

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం...

నిరీమిల చలాకీగా ఉంటుంది. సన్నగా చామన ఛాయ రంగుతో విప్పారిన కళ్ళతో చూడముచ్చటగా ఉంటుంది. అందరిలో ఏదో ఒక కళ ఉన్నట్లే నిరీమిల కళ్ళు చూడగానే ఆకట్టుకుంటాయి. తేటగా, ఎప్పుడు ఏదో వెతుకుతున్నట్లు ఉంటాయి. మొదటిసారి నేను నిరీమిలను చూసినపుడు నన్ను ఆకట్టుకొంది నిరీమిల కళ్ళు. ఆపై ఆమె వాక్చాతుర్యం. సింపుల్‌గా, సూటిగా, నిక్కచ్చిగా మాట్లాడే స్వభావం. మొదట ముభావంగా ఉన్నా, నా పరిచయం పెరిగిన కొద్దీ చనువుగా ఉండేది. అప్పటికే ఆమె గ్రామ కె.ఎ.ఎం.ఎస్. బాధ్యురాలు. మామూలు సభ్యురాలు కాదు. ఒక యాక్టివిస్ట్. అక్కడున్న సర్కార్ న్యాయ శాఖలో ఒక సభ్యురాలు. మొదట అభినందించింది మహిళా సంఘ బాధ్యురాలిగా పరిచయమైనప్పుడు. ఎప్పటిలాగే ఆ రోజు కూడా మా కమాండర్ సర్కారు మీటింగ్ వేద్దామంటే 'సరే'! అని తయారయ్యాను.

సాయంత్రమయింది. టీ తాగి మీటింగ్ దగ్గరకు వెళ్ళాను. నా కళ్ళు అక్కడ కూర్చున్న నిరీమిల మీద పడ్డాయి. చూడగానే నవ్వుతూ 'లాల్ సలామ్' అంటూ చేయి కలిపింది. ఆశ్చర్యపోతూ ప్రతిగా నా చేయి అందించాను. నా ఆశ్చర్యాన్ని గమనించిన మా కమాండర్ 'నిరీమిల సర్కారులో కూడా ఉంది. ఇందాకే వచ్చింది గానీ నువ్వు పడుకొని ఉండడంతో లేపలేదు.' అని పేజీలు తిప్పుతున్నాడు సర్కారు ఎజెండా రాయడానికి. 'సూటబుల్ పర్సనే' అని మనసులో అనుకున్నాను. రెండుపనుల్లో ఇష్టంగా... బాధ్యత పడుతూ... తన అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా మాట్లాడుతూ అందరి మన్ననలు అందుకోవడం. ఎందరికో కొద్దిమందే ఇలా ఉంటారు కదా అనిపించింది.

* * *

2010, జూలై నెల. వర్షాకాలం ఊపందుకోవడంతో మళ్ళీ పనులు ప్రారంభమయ్యాయి. నిరుడు కూలగొట్టిన స్థూపాన్ని పునర్నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ గ్రామ ప్రజలు. ఆ పనుల్లో ఉండగానే... ఒక రోజు ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిళ్ళపై స్థూపం రోడ్డు మీదుగా వచ్చారు. ఆ మోటారు సైకిళ్ళ వాళ్ళు

నిర్మాణమవుతున్న స్థూపాన్ని, అక్కడున్న నిరీమిలను ఎగాదిగా చూస్తూ ముందుకు వెళ్ళి పోయారు. నిరీమిల వాళ్ళను అంతగా పట్టించుకోలేదు. వాళ్ళు ముందుకు వెళ్ళి నట్లే వెళ్ళి రిటన్ వచ్చేశారు. స్థూపం వరకు బండిని స్లోగా రానిచ్చి మరోసారి నిరీమిలను అంతే చూస్తూ స్పీడ్‌గా వెళ్ళిపోయారు. నిరీమిల కను చూపుమేర చూస్తుండిపోయింది. సాయంత్రమయింది. ఇంకా పని మిగిలే ఉంది. మిగతాది రేపు చూద్దాంలే! అనుకొంటూ ఇంటి కొచ్చింది.

ఆ రోజు మధ్యాహ్నం ఆ ఊరి పటేల్, గామతల్ ఇంకా కొద్ది మంది సియాన్‌లు 'ఇంకా ఎంత దాకారా! అయినా ఆడోళ్ళదే రాజ్యమై పోయింది' అని మాట్లాడుకోవడం లచ్చు చెవిన పడింది. వెంటనే ఇంటికొచ్చాడు. తల్లికి చెపుదామని మనసులో అనుకుంటూ ఆవేదన పడుతున్నాడు. ఊరి పెద్దలే ఇలా మాట్లాడుతుంటే ఒక రకంగా భయం అలుముకుంది లచ్చుకు.

రాత్రయ్యింది. ముగ్గురూ అన్నం దగ్గర కూర్చున్నారు. నిరీమిల ఇద్దరికీ చెరోదొప్ప (ఆకులతో తయారు చేసిన గిన్నె) అందించింది. కూరను చిన్న చిన్న దొప్పల్లో పెట్టి ముగ్గురికి పంచింది. మౌనంగా తింటున్నారు తప్పితే దించిన తల ఎత్తడం లేదు. నిరీమిలనే అది ఇది కల్పించుకొని మాట్లాడుతోంది. వాళ్ళు ముక్త సరిగా ఆ... ఊ... అంటూన్నారేగానీ మాటలు కలపడం లేదు. నిరీమిలకు విషయం అంతుపట్టక

"ఏంటి? ఈ రోజలా ఉన్నారు?"

'...'

"ఎందుకలా ఉన్నారు?" మళ్ళీ.

'ఎందుకా, నువ్వాస్థూపాలు, మీటింగ్‌లని ఊర్లు పట్టుకొనో తిరగక పోతే ఇంటిపట్టున ఉండరాదా?' అత్త.

"మీటింగ్‌లంటే సరేలే అనుకున్నాముగానీ స్థూపాల దగ్గర కూడా నువ్వే మగరాయుడిలా తిరుగకపోతే ఏంటట. ఊళ్ళో తల ఎత్తుకోలేకుండా చేస్తున్నావ్, ఎక్కడ చూసినా నీ చర్చే. నిరుడు కూడా ఇంతే. అసలే చుట్టు పక్కల పరిస్థితి చూస్తున్నదే కదా! పోలీసులు రాని రోజంటూ లేదు. ఎప్పుడో ఇల్లుగుల్ల చేసేంత వరకు నీకు బుద్ధిరాదనుకుంటా" నిరుడు పోలీసుల దెబ్బలు చవి చూసి ఉ[illegible]బట్టి గట్టిగానే నిలదీశాడు.

ఎమ్మదిగా 'ముందు నుంచి చేస్తున్నదేకదా!' నిరీమిల.

"ముందు నుంచి ఉన్నదే కానీ, ముందుకి ఇప్పుడుకి పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఎప్పుడు ఏ క్షణాన ఆ మూకలు వస్తారోనని భయంగా ఉందే పిల్లా! మీటింగ్‌లకు పోవద్దనడం లేదుగానీ, ఊళ్ళో అంత మంది ఉండగా నీ వొక్కదానివే నెత్తి మీదేసుకోవడం, రేపు ఏదన్నా అయితే మనకేగా జరిగేది. మాకు మాత్రం పార్టీ అంటే ఇష్టం లేక కాదు. మనమా ముగ్గురం. మనకా ముందు వెనుక ఎవరూలేరు. ఉన్న ఆ రెండెకరాల పొలం సాగు చేసుకోవడం - తినడం అనుకోకుండా మనకేదన్నా అయితే రెండు కాళ్ళల్లో ఒక కాలు విరిగినట్టే" అత్త.

"ఊరు ఊరంతా మన గురించే మాట్లాడుతున్నారు. భార్యను అదుపులో పెట్టుకోలేక పోతున్నానని. అందరి ముందు మా పరువు తీస్తున్నావ్!" అంటూ అన్నం పూర్తిగా తినకుండా చేయి కడుక్కొని బయటికెళ్ళిపోయాడు లచ్చు. భర్త మాటలకు నివ్వెరపోయింది నిరీమిల. పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటి కెళ్ళి పోయాడు. కొడుకు అన్నం తినకుండా వెళ్ళి పోయాడన్న బాధతో తల్లి కూడా లేచి వెళ్ళి పోయింది. వెళ్ళి వాకిట్లో ఉన్న మంచం వాల్చుకుంటుంటే దగ్గర కెళ్ళి పిలిచింది నిరీమిల. ససేమిరా తిననంది అత్త. లోపలికి వచ్చింది. తనూ తినకుండా చేయి కడుక్కొని ఎక్కడి సామాను అక్కడ సర్దింది. ఏం చేయాలో అర్థం కాలేదు నిరీమిలకు. వదే వదే వాళ్ళన్నవి చెవుల్లో రింగుమంటున్నాయి. వారిని ఏవో భయాలు వెంటాడుతున్నాయని అనిపించింది. పార్టీ అంటే వ్యతిరేకత లేదుగానీ శత్రువంటే భయం... తను ఆ పనుల్లో ఉంది గాబట్టి తమను, ఇంటిని ఏదన్నా చేస్తారేమోనని ఆందోళన. నిర్బంధం పెరిగినప్పుడు ఆందోళన పడడం మధ్య తరగతి స్వభావం, సహజం కూడా. శత్రువు ఈ వర్గాన్ని లోబర్చుకోవడానికి, భయ పెట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తాడు. ప్రస్తుతం చేస్తున్నది కూడా అదే. ఆ రోజు కె.ఎ.ఎం.ఎస్. మీటింగ్‌లో కా. పార్వతి చెప్పనే చెప్పింది." మన పార్టీని, సంఘాలను, ప్రజలను అణచివేయడానికి శత్రువు రకరకాల ఎత్తుగడలు తీసుకు వస్తున్నాడు. మన వాళ్లే మనల్ని వ్యతిరేకించే విధంగా, మన పని మీద నీళ్ళు చల్లే పద్ధతిని చూడా నేర్పుతున్నాడు. ఇది చేత కాదన్నప్పుడు అణచివేత. సంఘ నాయకుల, ప్రజల అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్స్... ఇవన్నీ గ్రీన్‌హంట్ అభియాన్‌లో భాగమే. అందుకే ఈ నిర్బంధాన్ని ఇంట్లో వాళ్ళకు అర్థం చేయిస్తూ, రహస్యంగా పని చేస్తూ, ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడం ద్వారానే అమరుల ఆశయాలను ముందుకు తీసుకుపోగలుగుతాం".

అవును... అందరం బతకాలంటే పోరాటం తప్పదు. 'పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ళు తప్ప' ర్యాలీల్లో తీసిన నినాదం గుర్తుకు వచ్చింది.

ఇవన్నీ ఆలోచిస్తూ ఎప్పటికి నిద్రపట్టిందో తెలియదు.

* * *

సోమారు ఇంటి దగ్గర్నుంచి టకటక బూట్ల శబ్దంతో పోలీసులు నిరీమిల ఇంటికి వచ్చి దభీమని తలుపును తన్నారు. పడుకొని ఉన్న లచ్చును లేపి కొట్టుకుంటూ "ఎక్కడరా, నీ పెళ్ళాం? ఎవరింట్లో ఉందిరా? ఎవడి దగ్గర..." అనరాని మాటలతో కొట్టుకుంటూ ఈడ్చుకు పోతున్నారు. ఒకటే తన్నులు, గుద్దులు. ముక్కునుంచి నోటినుండి రక్తం కారుతోంది. కాళ్ళను ఈడ్చుతూ, కుదేస్తూ ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్ళు నుజ్జు నుజ్జు చేస్తుంటే తల్లి ఏడుస్తూ, నెత్తినోరు కొట్టుకొంటూ "నా బిడ్డను వదలండయ్యా" అంటూ వెనకాల పడింది. ఆమెను ఈడ్చి కొట్టేటప్పటికీ అంతే స్పృహతప్పి పోయింది. కాసేపటికి తేరుకొని చుట్టూ చూసింది. ఏం జరిగిందో గుర్తుచేసుకొంది. పోలీసులను తిట్టుకుంటూనే కుంటి నడకతో, సత్తువ లేక వంగిన నడుముతో ఏడుస్తూ ఊరి మలుపు వరకు వెళ్ళింది. మలుపు దగ్గర కాచుకున్న జీబు స్టార్ట్ అయ్యి లచ్చును ఎత్తుకుపోతుంటే "అయ్యా! నా బిడ్డను వదలండయ్యా"

అంటూ దణ్ణం పెడుతూ ఏడ్చింది. జీబు కనుచూపు మేర కనబడే వరకు గుండె పగిలేలా ఏడ్చింది. తల కొట్టుకుంటూ అక్కడే కూలబడింది. సుకియారి, మంగ్తేలు పరుగు పరుగున వచ్చి లేవదీయబోతుంటే వాళ్ళ మీదపడి "నా కొడుకే"! అంటూ నెత్తి బాదు కుంటుంటే ఇద్దరికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

పమిట చెంగుతో కళ్ళను అద్దుకొంటూ 'పదవ్వా పోదాం' అంటూ చెరోవక్క చేతుల్ని పట్టుకొని నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు.

"నేను రానే! నా కొడుకును ఎత్తుకుపోయారు. ఏం చేస్తారో....... ఓరిదేవుడా!" అంటూ శోకండాలు పెట్టింది. ఎందుకంటే అప్పటి వరకు ఇలా అరెస్ట్ చేసిన వాళ్ళను జైల్లో పెట్టడమో, చంపడమో చేస్తున్నారని విని ఉన్నది.

'వస్తాడులే! రావే పోదాం! కన్నీళ్ళను తుడుచుకుంటూ ఇద్దరూ బలవంతంగా నిలబెట్టారు.

'నేను రానే! నా కొడుకును ఏం చేస్తారో' చేతులతో గుండెను బాదుకుంటూ 'అసలు దీనికంతటికీ కారణం అదే. దాన్ని చేసుకున్న కాన్నుంచి మాకీ తిప్పలు తప్పడం లేదే. ఏం చేయనురా బాబో' పెద్దగా ఏడుపు లంకించుకొని నెత్తి బాదుకొంది.

నిదానంగా ఆమెను ఇంటి దగ్గరకు తీసుకొచ్చారు. సుకియారి అవ్వను పట్టుకొంటే మంగ్తే కొట్టంలో మంచం వాల్చి దండెం మీద వేలాడుతున్న పాత శాలువాను పరిచి అవ్వను పడుకోబెట్టింది. సుకియారి ఇంట్లోకి వెళ్ళి జావ కోసం వెతికింది. జావలేదు. గబగబా తనింటి కెళ్ళింది. ఒక బురఖానిండా జావ, రెండు దొప్పలు తీసుకొంది. అంతే స్పీడ్‌గా వచ్చి మంచం దగ్గరే కూర్చుని బురఖాలోని జావ దొప్పలోకి వంచుతూ 'అవ్వా! ఈ వేడి జావ తాగవే! కొంచెమంత తాగవే! లే! లే!' అంటూ బలవంతం చేసింది.

'ఏయ్! మంగ్తే! దాన్ని నిదానంగా కూర్చోబెట్టవే' సుకియారి.

మంగ్తే అవ్వను కూర్చోబెట్టింది. అవ్వ ఏడ్చి ఏడ్చి ఉండడంతో గొంతు బొంగురుపోయి నొప్పి పెడుతోంది. కొంచెం తాగుదామని నోటిదగ్గర పెట్టుకుందో లేదో నిరీమిల వస్తూ ఉండడాన్ని చూసింది. అంతే ఛీవుక్కున ముఖం పెట్టేసి 'ఇది నా ఇంట్లో ఉన్నంత కాలం ఇంతే! ఇది నా ఇంట్లోకి రావద్దు. నిరుడు నా ఇల్లుగుల్ల చేశారు. ఇప్పుడు నా కొడుకును లేకుండా చేసింది ఛీ... ఏం బతుకే నీది? నా ఇంట్లో అడుగు పెట్టొద్దుపో ఇక్కడ్నుంచి' ఆవేశం, ఏడుపు కలగలసిన అరుపుతో.

అవాక్కయ్యి నిలబడింది నిరీమిల.

'ఏంటీ ఇంకా నిలబడ్డావ్! నా ఇంట్లో అడుగు పెట్టావంటే ఊరుకోను' అంటూ సూరులో ఉన్న బడుగాను తీసుకొని ముందుకు రాబోయింది.

'ఊరుకో అవ్వా! ఊరుకో' మంగ్తే, సుకియారిలు.

'ఏంటే ఊరుకొనేది. మన పనులు కావే అంటే విన్నదా? దీన్ని కట్టుకున్న పాపానికి వాడు ఆ మూర్ఖుల చేతిలో ఎంత ఇబ్బంది పడుతున్నాడో? మా ఇబ్బందులు నీ కెందుకే? పో... అక్కడికే...' గట్టిగా అరిచి ఏడుస్తూ మంచంలో కూలబడింది అవ్వ.

నిశ్చేష్టురాలై చూస్తుంది నిరీమిల. నిత్యం ఇటువంటి సంఘటనలెన్నో చూస్తున్నది. ఆ బాధితులను ఓదార్చుతున్నది. అలాంటి తనకు ఈ రోజు ప్రత్యక్ష అనుభవం ఎదురైంది. తన కర్తవ్యం ఏంటి? అనేక విధాలా ఆలోచించిన నిరీమిల ధైర్యాన్ని కూడదీసుకొని అత్తను ఓదార్చాలని అడుగు ముందుకు వేసింది. అంతే ఘొల్లుమంటూ అరిచి లేని సత్తువను తెచ్చుకొంటూ మంచానికి ఆనించిపెట్టుకొన్న బడుగాను అందుకొంది అత్త. ఆమె కోపం చూసిన నిరీమిల ముందుకు వెళ్ళలేక పోయింది. చిందర వందరైన సామానును సర్దుదామని ఇంట్లోకి వెళుతుంటే,

'ఏయ్ ఎక్కడికి పోయేది?' గట్టిగా రోదిస్తూ.

నిరీమిల అడుగు అక్కడే ఆగిపోయింది. ఇంకా ఎందుకే నా ఇంట్లో?... పో... అని లేచి నిలబడింది. సుకియారి, మంగ్తేలు వారిస్తున్నా వినడం లేదు. వారు కూడా జరుగుతున్న దాన్ని భయంగా చూస్తున్నారు.

బయటినుంచే ఇంట్లోకి కలియచూసింది నిరీమిల. జావ కుండ పగిలిపోయి జావ ఒలికిపోయి ఉంది. ఒలికి పోయిన జావ మీద ఈగలు జుమ్‌ఁఁ... మంటూ ముసురుకుంటున్నాయి. ఇక్కడ సామాను అక్కడ, అక్కడ సామాను ఇక్కడ ఇష్టం వచ్చినట్లు గిరాటేశారు. అక్కడ ఉన్న చిందర వందర సామాను, భర్తను కొట్టిన గుర్తులను, భర్త పెనుగులాటను చెపుతున్నాయి. నూకలను చిల్లర చిల్లరగా చల్లేశారు. ఒక్కొక్క వస్తువు వంక చూస్తూ నిలబడింది. లోపలకు వెళదామని మనసు ఆరాట పడుతోందిగానీ అత్త సందివ్వడం లేదు. కిందికి చూసింది. నిదానంగా అడుగు వెనక్కి వేసి అక్కడ్నుంచి కదిలింది. కదిలింది గానీ మనసు పరి పరి విధాలా ఆలోచిస్తుంది.

'ఎక్కడికని వెళ్ళాలి? ఎవరి దగ్గరికని వెళ్ళాలి?' తనలో తనే

సోమ్లు దాదా ఇంటికి వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేరు. పనులకు పోయారు. లోపలకు వెళ్ళి గోడవారగా కూర్చుంది. కొడుకును పోలీసులు పట్టుకు పోయారనే బాధతో అత్తనన్ను అన్ని మాటలన్నది గానీ నిజంగా నేనంటే ప్రేమ లేదా? నేను ఈ ఇంట్లో అడుగుపెట్టినప్పటి నుంచి కన్న తల్లి కన్నా ఎక్కువగా చూసిందే! ఎప్పుడూ పల్లెత్తు మాట కూడా అనలేదే! పార్టీ అండ కావాలి గానీ పార్టీ పనులు చేయవద్దనే కదా! ఆమె ఉద్దేశ్యం. మా కుటుంబానికి పార్టీ చేసిన సహాయం మరచిపోయిందా? లేదా పార్టీ అవసరం ఇంక లేదనుకుంటుందా? గత పరిస్థితి కళ్ళముందు ప్రత్యక్షమవుతుంటే...

అత్త, మామలకు నాలుగు ఎకరాల పొలం ఉంది. అడవి దగ్గరలో ఉండడం వలన ఏ పంట వేసినా కోతుల నుంచి రక్షించుకోవడం వారి దినచర్యగా ఉండేది. మామ ఉన్నప్పుడు పగలు, రాత్రనే తేడా లేకుండా చేను దగ్గరే కావలి ఉండేవాడు. తిండి, నిద్ర అన్నీ అక్కడే. ఎప్పుడో ఒకసారి ఇంటికి వస్తూపోతూ ఉండేవాడు. పగలు కోతుల బెడద, రాత్రి పందుల బెడద. ఎంత కావలి ఉన్నా వాటి పని అవి కానిచ్చేవి. అందుకే అవి తినగా

మిగిలింది వీరికి దక్కేది. అలా ఉంటున్న క్రమంలో రిజర్వ్ అంచునే ఉందని ఫారెస్ట్ వాళ్ళు ఒత్తిడి చేయడం, డబ్బులు అడగడం మొదలుపెట్టారు. ఎదురు మాట్లాడిన మామను కొట్టారు. ఒక రోజు రాత్రికి రాత్రే వచ్చి మామను కొట్టి పంచెలో దాచుకున్న డబ్బులను ఊడబీకి హెచ్చరించి వెళ్ళారు.

అదే సమయంలో అనుకోకుండా పార్టీ అక్కడికి వచ్చింది. పరుగు పరుగున వాళ్ళ దగ్గరకు వెళ్ళి గోడు వెళ్ళబోసుకున్నారు అత్త, మామలు. వెంటనే ఫారెస్ట్ వాళ్ళకు కబురు పంపించారు. ముందు రాలేదు. తర్వాత వచ్చారు. చుట్టు పక్కల ప్రజలందర్నీ పిలిపించారు. ప్రజల తీర్పుమేరకు ఫారెస్ట్ వాళ్ళకు దేహశుద్ధి చేసి పంచాయితీ చేసి వీళ్ళ భూమిని వీళ్ళకప్పగించారు. అప్పట్నుంచి పార్టీ అంటే ఎనలేని విశ్వాసం కలిగింది ఆ కుటుంబానికి. తర్వాత మామ కాలం చేశాడు. మామ కాలం చేశాక అత్త పార్టీ వాళ్ళను అడిగి ఊరికి అందుబాటులో పడావు పడిన రెండు ఎకరాల భూమి ఉంటే దాన్ని బాగు చేసి సాగు చేసుకుంటున్నారు. ఆ రోజు వాళ్ళు ఆ మాత్రం సహాయం చేయబట్టే ఈ రోజు ఇట్లా బతుకుతున్నాం. వాళ్ళే కనుక భూమి ఇప్పించకపోతే ఇప్పుడసలు తినడానికి నూకలెలా వచ్చేవి? 'కొడుకు' బాధతో ఇవన్నీ మరచిపోయిందా?

వక్కారి గాయతల్ కొడుకు బలవంతంగా తన్నెత్తుకుపోయినప్పుడు ఊరిపెద్దలు ఏమని తీర్పు ఇచ్చారు? 'ఆ పిల్లగాడు ఇష్టపడుతున్నప్పుడు పోతే తప్పేముంది?' అని సెలవిచ్చారు. తనకు ఇష్టం లేదంటుంటే పెద్దలు పెద్దల తరహాలో తీర్పు చెప్పినప్పుడు కాదని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చిన వెంటనే గాయతల్ కొడుకు ఎత్తుకు పోవడానికి వస్తే దాక్కొంది. ఒకటి కాదు, రెండు రోజులు కాదు......చాలా రోజులు జరిగింది. ఇంటి దగ్గర ఉంటే ఎప్పుడో ఒకసారి వచ్చి పట్టుకు పోతారని భయపడి పక్కూర్లో కొన్ని రోజులు ఉంది. ఆ ఊర్లో ఉంటున్న క్రమంలో కూడా తనని పట్టుకుపోవడానికి సంతకు పోయే దారిలో అటకాయించేవారు. ఏదో ఒక సమయంలో ఎత్తుకుపోతారని భయపడి పార్టీతో తన సమస్యను పంచుకొంది. పార్టీ అక్కడ సర్కారుకు బాధ్యత అప్ప చెప్పింది. తర్వాత పార్టీ సహాయంతో సర్కారు వాళ్ళు పంచాయితీ చేసి గాయతల్ కుటుంబాన్ని గట్టిగా హెచ్చరించింది. వాళ్ళ పెత్తనానికి అడ్డుకట్టవేశారు. అప్పడ్నుంచి నిరీమిల క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ (కె.ఎ.ఎం.ఎస్) లో పని చేస్తూ ఉంది. గ్రామ సంఘం నుండి ఏరియా మహిళా సంఘటన్, సర్కార్‌లో న్యాయశాఖ బాధ్యురాలిగా ఎదిగింది. ఆ సమయంలోనే తనకు నచ్చినతన్ని పార్టీ సలహామేరకు పెళ్ళి చేసుకుంది.

ఇవేకాదు. పార్టీ వచ్చాక వాస్తవంగా చెప్పాలంటే మా బతుకుల్లో మార్పు వచ్చింది. వెనుక బడి ఉన్న ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. తునికాకు రేట్ల పెంపకం, చెరువులు తవ్వించడం, కూరగాయల పెంపకం, అధిక ఉత్పత్తి తీయించడం, పశుపాలన, విద్య, వైద్యం......ఒకటా? రెండా? ఎన్నెన్నో. ఈ రోజు ప్రజలకు ఏదైతే అవసరమో దాన్ని గుర్తించి, ప్రజల జీవనవిధానంలో పెనవేసుకుపోయింది పార్టీ. అందుకే గ్రీన్‌హంట్ అభియాన్. ఇది మొదలైనప్పటినుండి ఎంతమంది అమాయకులను వారి తూటాలకు బలిచేశారో? విచ్చలవిడిగా చేస్తున్న ఈ బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపేదెలా? ఈ దుర్మార్గాలను సామూహికంగానే నిలదీయాలి. దాని కోసం అందరిని కూడగట్టాలి. అవును కూడగట్టాలి. అనుకొంటూ స్థిరమైన నిర్ణయానికి వచ్చింది.

* * *

నిరీమిల కబురు అందుకున్న ప్రజలందరూ గుమిగూడారు. పటేల్ గాయతల్ కూడా వచ్చిన వాళ్ళల్లో ఉన్నారు. చివరిగా కూర్చుని గొణుక్కుంటున్నారు. ఏం మాట్లాడుతోందని ఆత్రుత ఒక వైపు, ఇలా జమయ్యి ఉన్నప్పుడే ఆ మూర్ఖులు వచ్చి పిట్టల్లా కాల్చేస్తే.......అనే ఆందోళన మరోవైపు ఆ మొఖాల్లో ప్రస్ఫుటమైంది. నిరీమిల ఇద్దరు యువకులను పిలిచింది. రెండు వైపులా సెంట్రీపెట్టింది. మధ్య మధ్యలో చెక్ చేస్తుండమని సోమ్లు దాదాకు చెప్పింది.

'ఏం చేద్దామని' జనంలో పెట్టింది నిరీమిల.

'ఏం చేసేటట్లు లేదే' ఒక దీదీ.

'మొగుడ్ని పోలీసులు పట్టుకుపోతే దీనికేంటే ఈసమెత్తు బాధ కూడా లేదే. పైగా అందర్ని పిలిచింది' గుంపులో నుండి.

'ఎంత నిమ్మళంగా ఉందో?' మరొకరు.

వాళ్ళు, వీళ్ళు మాట్లాడుతున్నవి స్పష్టంగా వినపడక పోయినప్పటికీ మొత్తానికి తననే అంటున్నారని అర్థమైంది నిరీమిలకు. అసలు విషయం బయటపెట్టింది.

ఒకటి స్టేషన్‌కు వెళ్ళి లచ్చును విడిపించుకు రావడం.

రెండు స్థూపం కట్టడం.

అందరూ అవాక్కయ్యారు. ఎవరూ పెదవి విప్పడం లేదు. అందర్ని కలియ తిరిగి చూసింది. మధ్య మధ్యలో సోమ్లు దాదా, పక్కూరి సంతు కల్పించుకొని మాట్లాడుతున్నారు. కానీ జనం నుంచి స్పందన రావడం లేదు. భయపడుతున్నారు. గ్రీన్‌హంట్ భయం.

'నే పోతున్నా ఎద్దుల్ని వదలాలే!' సుఖమిత్తి లేచింది.

'అయ్యింది చాలు! ఇంక మా వల్ల కాదు' రాజు బత్తి.

'ఏం చేద్దాం నిరీమిల, మాకు భయమేస్తుందే' హీరాలాల్

"ఆ రోజు ఏమన్నారో విన్నావా? వెళ్తూవెళ్తూ మీ ఇళ్ళను కూడా కాల్చేస్తామన్నారే!" సుఖ్‌లాల్.

చివరి నుండి పటేల్, ఇంకా చాలులే! ఇప్పుడేవీ తలపెట్టినా మననెత్తికే అంటుకొంటుంది.

పటేల్ నోటి నుండి మాట రావడం ఆలస్యం. అందరూ వెంటనే వంతు పలికారు. ఒక వేడి నిట్టూర్పు. వాళ్ళ ధోరణిని మార్చడానికి ఇలా ప్రశ్నించింది నిరీమిల. "మనమేమీ చేయలేమని చేతులు ముడుచుకుంటే రోజుకొకర్ని పట్టుకెళ్ళరా? ఊరు మిగులుతుందా?"

"..."

మనం చేసేదేమీ లేదంటే ఎలా? ఏం చేయలేకపోతే వాళ్ళు రావడం ఆగుతుందనుకుంటున్నారా? ఎంత మాత్రం ఆగక వాళ్ళ ఆగడాలు ఇంకా ఎక్కువవుతాయి. ఇంకా మనకు భయం పెరుగుతుంది. మనకోసం పనిచేస్తున్న, మనం పెట్టింది తింటూ మనకు 'నిజాలను' తెలియజెప్పిన వారిని పిట్టల్లా కాల్చి చంపుతుంటే మనం ఏం చేయలేమా? ఆలోచించండి. సంఘాల్లో పనిచేస్తున్న వారిని పట్టుకొని అరెస్ట్ చేస్తే వారి విడుదల కోసం మనం ఏం చేయలేమా?

"ఏం సుఖబత్తి! మనం ఏం చేయలేమా? ఆ దుకాణంవోడు నీ గంగకు సరైన పైసలు ఇవ్వనంటే తన్ని పైసలు ఇప్పించిన రోజును మరచిపోయావా?"

"ఏం హీరాలాల్ దాదా! ప్రతి సంవత్సరం మనం కాయకష్టం చేసి తునికాకు కోస్తే సరైనరేటు ఇవ్వకుండా బలిసిన కాంట్రాక్టర్లు 'చక్కర్లు' కొడుతుంటే వాళ్ళ మెడలు వంచి మన కష్టానికి ఫలితం ఇప్పించిన రోజులను మరచి పోదామా?"

ఏం బాబాయ్ (పటేల్ నుద్దేశించి) ఫారెస్టోళ్ళు భూములు గుంజుకుంటే మన భూములను మనకిప్పించిన రోజులను మరచి పోదామా? వేటిని మరచిపోదాం? ఎన్నెన్ని మరచి పోదాం? ఆ రోజు కనుక వారే లేకుంటే మన బతుకులు మారేవా? చెప్పండి. ఏ మాత్రం మార్పు వచ్చేది కాదు. ప్రతి పనిలో తపన పడేది మన కోసమే. త్యాగం చేసేది మన కోసమే. అంత త్యాగం చేస్తున్నప్పుడు మనం వారికి స్థూపాలు కట్టించలేమా? ఆ స్థూపాల రూపంలో రెండు నిముషాలు వారిని స్మరించుకోలేమా? పోలీసులు వస్తారు. కూలుస్తారు. ఎన్నిసార్లు కూలిస్తే అంతకు మించి కడతాం. అరెస్ట్ చేస్తే విడిపించేదాకా పోరాడుదాం. భయపడుతూ ఉంటే ఇంకా భయపెడతారు. ఎదురు తిరిగితే తోక ముడుస్తారు ఎంత కాలమని బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుదాం? సమస్య అందరిది. అందరం బాధ్యత పడుదాము. అంటూ ఆవేశంగా మాట్లాడుతూ అక్కడున్న వారి నందరినీ ఉత్తేజితులను చేసింది. ఒకరిద్దరు అలాగే 'చేద్దామనడం' తో అందరిలో కదలిక వచ్చింది. అప్పటికే ప్రజలను వెనక్కు లాగడానికి పటేల్, గాయతల్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలే అడ్డు కట్టవేశారు. అట్లా అరగంట చర్చ తర్వాత అంతా ఒక స్థిర నిర్ణయానికి వచ్చాక రెండు బ్యాచీలు ఏర్పడ్డాయి. ఒకటి లచ్చును తీసుకొచ్చే బ్యాచ్, రెండు స్థూప నిర్మాణ బ్యాచ్.

అక్కడ్నుంచే ఒక సైన్యం లాగా మహిళలంతా కలిసి నిరీమిల భర్త విడుదల కోసం బయల్దేరారు. మరొక బ్యాచ్ స్థూప నిర్మాణ పనులను మొదలు పెట్టింది. తెల్లారితే జులై 28 ఇప్పటికిప్పుడు సిమెంటుతో కడుదామంటే సమయం కూడా లేదు. అందుకే అందరితో మాట్లాడిన పిదప 'మరమట్టు' (మర అంటే చెట్టు. మట్టు అంటే స్థూపం - అంటే చెట్టు మొద్దును మంచిగా చెక్కి స్థూపం ఆకారం చేస్తారు) కట్టించు దామనే నిర్ణయానికి వచ్చారు. అనుకున్నదే తడవుగా దాదాలు మొద్దును నరకడానికి వెళ్ళారు. చీకటి పడేంత వరకు చెక్కుతూనే ఉన్నారు. మొత్తానికి అనుకున్న విధంగానే స్థూప నిర్మాణం పూర్తయ్యింది. ఆ రాత్రి రెండు వైపుల సెంట్రీకి అనుమానం వచ్చింది. అనుమానం కాదు నిజమే. ఎవరివో రెండు ఆకారాలు ముందుకు వస్తున్నట్టు గమనించిన సెంట్రీ 'ఎవరు?' అని గద్దించే టప్పటికీ కాలికి బుద్ధి చెప్పారు.

జులై 28 తెల్లారింది. బారులు తీరిన జనం మిన్నంటే నినాదాలతో ర్యాలీగా స్థూపాన్ని చేరుకున్నారు. అమర వీరుల పాటలు ఉత్తేజ కరమైన ఉపన్యాసాలతో సభ ముగుస్తుండగా...

తూర్పు దిక్కున దిక్కులు పిక్కటిల్లేలా నినాదాల హోరుతో అంతా అటువైపు చూశారు. 'కా. పటేల్ సుధాకర్ రెడ్డి అమర్ హై, కా. జానకీ దీదీ అమర్ హై, కా. కమల, కా. పార్వతి, పోగు, అంజు, మంగ్లి, కా. కిషోర్, కా. విక్రమ్ అమర్ హై, అమరుల ఆశయాలను కొనసాగిద్దాం! గ్రీన్‌హంట్ అభియాన్‌ను ఓడిద్దాం!' నినాదాల హోరు మోగుతోంది. పిల్లా, పాప, ముసలి, ముతక అందరూ పిడికిలి బిగించి నినాదాలకు గొంతు కలుపుతుంటే, నిరీమిల నినాదాలు ఇస్తూ ఎత్తిన చేతుల మధ్యలో నుంచి తిన్నగా చూస్తే... చూసిన మొఖం కనపడింది. నినాదాలను ఆపకుండా తదేకంగా చూసే... అత్త 'తనా? కాదా?' అన్నట్లు పరికించి చూసింది. నిజమే అత్తే. ఏమాత్రం సందేహం లేదు. తన గొంతుకు వంతు కలుపుతుంది.

ఒక వైపు కన్నకొడుకు ప్రేమ... మరొకవైపు పార్టీ అండతో ఇలా బతుకుతున్న పరిస్థితి. ఈ రెండు రకాల ఆలోచనలతో రాత్రంతా సతమతమైంది అత్త. తొలినాళ్ళల్లో కా. సుఖదేవ్ దాదా చూపిన ప్రేమ, ఇచ్చిన అండ, చెప్పిన రాజకీయాలు పై చేయి అయ్యి ఆమెను అమరుల స్థూపం దిశగా అడుగులు వేయించాయి. రాత్రంతా ఆమె పడిన ఘర్షణ తెలియని నిరీమిల అత్త గొంతులోని ఉత్తేజాన్ని చూసి ఆనందం పట్టలేక పోయింది.

దూరంగా మహిళా సైన్యం గుంపుగా వస్తూ ఉంది. నినాదాలు ఇచ్చుకొంటూ సూటిగా స్థూపం దగ్గరకు వస్తోంది. గుంపు దగ్గర కొచ్చే కొద్దీ మొఖాలు స్పష్టంగా కనపడుతున్నాయి. గుంపు మధ్యలో నుండి భర్త 'అక్రమ అరెస్టులను ఖండించండి' 'గ్రీన్‌హంట్ అభియాన్‌ను ఓడిద్దాం!' నినాదాలు. నిరీమిల సంభ్రమాశ్చర్యాలకు లోనయింది. కలా? నిజమా? అని తేరిపార చూసింది. నిజమే! అత్త, భర్తలు అలా కళ్ళముందు కదలాడేటప్పటికీ సంతోషం పట్టలేక పోయింది. ఆ ఆనందంతో నినాదాలు...

"అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతినాపలేరు!"

"సమైక్య శక్తితో గ్రీన్‌హంట్ అభియాన్‌ను ఓడిద్దాం!"

(నిత్యం పోలీసు దాడులు అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న సమయంలో సంఘాలను, ప్రజలను ధైర్యంగా ముందుకు నడిపిస్తూ, అనుకున్న లక్ష్యాన్ని సాధించిన నిరీమిల పట్టుదలకు స్పందించి....

ఈ కథ రాసి చదివి వినిపించినప్పుడు తమదైన సలహాలు, సూచనలు అందించిన కామ్రేడ్స్‌కు విప్లవాభినందనలు తెలుపుతూ...)

కథ

చైతే

- ఎన్.డి.

అతను ఉరుకుతున్నాడు. కుంగిపోతున్న తన నవనాడుల్లోని అణువణువుల్లోంచి తన శక్తినంతా బొట్టు బొట్టుగా పిండుకుంటూ అతను ఉరుకుతున్నాడు. ప్రపంచంలో మరి దేని ఉనికినీ గుర్తించనట్టు, ఉన్నా వాటితో తనకేం సంబంధం అన్నట్టు అతను ఉరుకుతున్నాడు. అతను ఆమెకేసి ఉరుకుతున్నాడు.

అతని కాళ్లకు అడ్డం వచ్చిన బండలూ, రాళ్లూ పిండి పిండి అయిపోతున్నాయి. అతని వేడి నిట్టూర్పులకు తాళలేక అడవిలోని చిగురుటాకులన్నీ అల్లాడిపోతున్నాయి. ఎగసిపడ్తున్న అతని గుండెలు భూమిని అదిరిస్తున్నాయి.

దు:ఖం మనిషి రూపం దాల్చినట్టుగా ఉన్న ఆమె అతని కోసమే ఎదురు చూస్తున్నట్టుగా దయగా చేతులు చాచి అతన్ని ఆహ్వానిస్తూ నిలుచుని ఉంది. కొండంత అల విరిగిపడ్డట్టు ఒక పెద్ద కన్నీటి బిందువై అతను ఆమెను చుట్టుకుని ఆమె శరీరాన్ని నిలువెల్లా తడిపేశాడు. అగ్నికీలల్లాంటి అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆమెను దహించి వేస్తున్నాయి.

మెల్లగా అతన్ని తననుండి విడిపించుకుని, అతని రెండు భుజాల్నీ పట్టుకుంది. అతను నిలబడలేకపోతున్నాడు. అతని శరీర ప్రకంపనలకు చెట్లు వణికిపోతున్నాయి.

ఆమె కరుణ వాత్సల్యపూరితమైన తన చూపులతో అతని ముఖాన్ని సాంత్వనగా నిమిరింది.

"మన చైతేని ఒంటరిగా పట్టుకుని, గొంతు కోసి..."

సర్పసాక్షుల్లాంటి ఆమె కనులు తమకన్నీ తెలుసునన్నట్టుగా గంభీరంగా అర్ధ నిమీలితాలై ఉన్నాయి. వాటిలోని ఎర్రని జీరల్ని చూసిన అతను ఇక మాటలు రానట్టుగా ఆమె ఒడిలో కుప్పకూలాడు. ఆమె అతన్ని మెల్లగా లేపి, అతని భుజం చుట్టూ తన చేతిని వేసి, అలాగే అతన్ని పొదువుకుని నడిపించుకుని తీసుకెళ్లింది.

అతను ఆ దృశ్యాన్ని ఇక చూడలేనన్నట్టుగా అరచేతుల్తో తన ముఖాన్ని కప్పుకున్నాడు. తన విషాద నయనాల్ని అతనికేసి తిప్పి, అతని చేతుల్ని విడదీసి, చుబుకాన్ని పైకెత్తి, కన్నీటి కొలనులైన అతని కళ్లల్లో తన ప్రతిబింబాన్ని చూపిస్తూ,

"సరిగా చూడు, ఇక్కడ పడి ఉన్న ఆ నగ్నదేహం నాదే, గుర్తుపట్టావా? దశాబ్దం క్రితం అది ఒక చైతన్యపు హోరై నా దేహంలో కలగలిసిపోయింది. ఉత్తర్ బస్తర్‌నుండి మాడ్‌కు ప్రవహించి దండకారణ్య క్షితిజం పై 'ప్రభాత'మై అది ఉదయించడాన్ని నువ్వు ప్రతి రోజూ చూస్తూనే ఉండింటావు. అత్యాచారం చీకటిని కప్పి వాళ్లు శాశ్వతంగా గుంకేలా చేయాలనుకున్నది ఆ 'ప్రభాతా'న్నే. రోజూ దేశం నలుమూలల నుండీ ఎన్నో పాయలు నాలో కలగలసి ప్రవహిస్తూ ఉంటాయి. నా నగ్నదేహాన్ని అడ్డుకట్టగా వేసి వాళ్లు అడ్డుకోవాలనుకున్నది ఆ ప్రవాహాన్నే."

అతను నిశ్శబ్దంగా ఆ దేహం ముందు మోకరిల్లాడు.

ఆమె అతని పై తన సజల నేత్రాలని వర్షిస్తూ,

"అలా కొద్దిగా నీ చూపుల్ని పైకి జరుపు. అక్కడ వేటు కనిపిస్తోందా? అది పడింది నా గొంతు మీదే. దాని చిరపరిచితమైన నాదం మూడు దశాబ్దాలుగా మహిళా విముక్తికై నేను వేసిన పొలికేకలో ప్రతిధ్వనించడం నీవు చెవొగ్గి వినే ఉంటావు. మాడ్ భూమిని రక్షించుకోవాలని నేను ఇచ్చిన పెనునినాదంలోని దాని పదునైన శృతిని నీ చెవులు పసిగట్టే ఉంటాయి. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతం చేయాలని నేను ఎలుగెత్తి పాడిన పాటల్లో 'లలిత'ంగా వినిపించిన ఆ మృదుస్వరం నిన్ను పులకింపజేసే

మార్క్సిజం లెనినిజం మావోయిజం

స్టడీ నోట్స్



వెల : రు. 50/-

న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు :

మైత్రి బుక్ హౌజ్ విజయవాడ,
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్, నవోదయ పబ్లిషింగ్ హౌస్,
కాచిగూడ, హైదరాబాద్, సహచర బుక్‌మార్క్స్, హైదరాబాద్,

ఉంటుంది. ఆ నా గొంతునే వాళ్లు మూగబరచాలనుకున్నది. ఆ గొంతులోని ప్రతిఘటన స్వరాన్నే వాళ్లు తెగ్గొట్టాలనుకున్నది, గ్రహించావా?"

అతను భూమిని కౌగిలించుకుంటున్నట్టుగా నేల మీదకు వంగి రక్తంతో తడిచిన ఆ మట్టిని దోసిళ్లకెత్తుకున్నాడు. ఆమె అతని ముందు మోకాళ్ల పై కూచుని అంజలిలా పట్టిన అతని చేతుల్ని తన చేతుల్తో కప్పుతూ,

"చూశావా, ఎంత ఎర్రగా ఉందో నా రక్తం. భూమి పై రాలిన మొదటి చినుకుకంటే, ఆదిమ మంచు ఖండం నుండి కరిగిన మొదటి నీటి బిందువుకంటే, ఈ సమస్త విశ్వంలో జన్మించిన మొదటి బిడ్డకంటే కూడా స్వచ్ఛమైనదీ, పవిత్రమైనదీ, ప్రాచీనమైనదీ అమరమైన నా ఈ రక్తమే. వేల ఏళ్లుగా నువ్వు ఈ రక్తాన్ని చూస్తూనే వస్తున్నావు. స్పార్టకస్ శిలువ మేకుల పై అంటిన ఆ ఎర్రని మరకల్ని నీవు మరవాలన్నా మరవలేవు కదూ. నైలు నదీ తీరాన, పారిస్ నగర బ్యారికేడ్ల పై, స్టాలిన్‌గ్రాడ్ శిథిలాల్లో, టాటూ నది వంతెన గొలుసుల పై, తెలంగాణ మైదానాల్లో... ఒక చోటనేంటి, ఎల్లెడలా నేను ఈ ప్రపంచానికి పదే పదే జన్మనిచ్చినప్పుడల్లా ఈ రక్తం చిందడం నీకు గుర్తుండే ఉంటుంది. వాళ్లు ఈ మట్టిలో ఇంకించి విలుప్తం చేయాలనుకున్నది నా ఈ జీవనదీ ప్రవాహాన్నే. పరికించి చూడు, ఈ మట్టిలో నా రక్తం లిఖించిన ప్రపంచ భవితవ్యం కనిపిస్తుంది"

అతను తన శ్రమైక జీవన కరుకు చేతుల్లోకి పరాగాల మృదుత్వాన్నంతా చేర్చుకుని, ఓ పువ్వులా ఆ దేహాన్ని ఎత్తుకుని ఆర్ద్రంగా తన గుండెలకదుముకున్నాడు. ఆమె లాలనగా తన చేతుల్ని చాచింది. అతను దాన్ని ఆమె చేతుల్లో పెట్టాడు. ఆమెను స్పర్శించగానే అది నవజాత శిశువై ఆమె గుండెల్ని కరుచుకుంది. ప్రపంచంలోని మాతృత్వమంతా చనుబాలధారై ఆ శిశువు నోటిలోకి ప్రవహించింది.

కన్నీటి చారికలు ఎండిన అతని బుగ్గల్ని మార్దవంగా నిమురుతూ ఆమె అతని ముఖాన్ని ముద్దాడింది. మరుక్షణం విడివడి దృఢంగా చేయి కలుపుతూ,

"చూశావు కదా, వాళ్లు నన్ను చంపలేకపోయారు, చంపలేరు కూడా, ఎందుకంటే వాళ్లు నన్ను చంపాలనుకున్న ప్రతీసారీ చైతేలు తమ ప్రాణాలను నా ప్రాణాలకు అడ్డు వేస్తారు"

తన అమృత సంతానాన్ని పొత్తిళ్లలో పొదువుకుని ఆమె వెనుతిరిగింది. అతను నిటారుగా నిల్చుని అనల ప్రవాహంలా తరలిపోతున్న వారిరువురికీ శిరస్సు వంచి నమస్కరించాడు. అతని చేయి పిడికిలై పైకి లేచింది. అతని పెదాలు

"కామ్రేడ్ చైతే అమర్ రహే"

అని ఉచ్చరిస్తున్నాయి.

(రుషికి ఆర్తిగా)

(17.08.2010న దండకారణ్య ప్రెస్ (ప్రభాత్ పత్రిక) కి చెందిన సీనియర్ ఎసి సభ్యురాలు కామ్రేడ్ చైతే (లలిత మడావి)ని ఒంటరిగా చిక్కించుకుని, అత్యాచారం చేసి, గొంతు కోసి చంపి, ఆమె అర్ధనగ్న దేహాన్ని పడవేసి పోయారు శత్రు ఏజెంట్లు. ఇదే నెట్‌వర్క్ 2010 భూంకాల్ దినాన (ఫిబ్రవరి 10) కుమిలి అనే వ్యవసాయ కార్యకర్తను ఇలాగే గొంతు కోసి, అత్యాచారం జరిపి, చంపేసి నగ్నదేహాన్ని పడవేసి పోయింది. ఈ పద్ధతిలో మహిళల హత్యలు గ్రీన్‌హంట్‌లో భాగంగా జరుగుతున్నవే. చైతే హంతకుల్లో నలుగురినీ, కుమిలి హంతకుల్లో ఒకడినీ పిఎల్‌జిఎ గెరిల్లాలు పట్టుకొని ప్రజాకోర్టులో ప్రవేశపెట్టగా, ప్రజలే వారికి మరణశిక్షను అమలు జరిపారు.)

రచనలకు ఆహ్వానం

అరుణతార అనేక ఇబ్బందుల మధ్యనే విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేస్తోంది. విరసం అధికార పత్రికగా ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడి ప్రగతిశీల విలువలను నిలబెట్టడంలో సోదర సాహిత్య, రాజకీయ, సామాజిక పత్రికలతోపాటు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెచ్చరిల్లిన ఈ తరుణంలో విప్లవోద్యమంతోపాటు అనేక ప్రజా ధిక్కార స్వరాలు, నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక సంబంధాలను, విలువలను, ప్రజా ఆకాంక్షలను పాలకవర్గ విధానాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు తమ వనరుల నుంచి, స్థావరాల నుంచి విస్థాపనకు గురవుతున్నారు. ప్రజల సహజీవన సంస్కృతి మీద దారుణమైన అణచివేత కొనసాగుతోంది. ఆదివాసుల పోరాటాల మీద రాజ్యం అతి పెద్ద స్థాయిలో యుద్ధం ప్రకటించిన సందర్భంలో మనం ఉన్నాం. అణగారిన ప్రాంతాలు, కులాలు, మహిళలు, మత మైనార్టీలు తీవ్ర అభద్రతలోంచే ఆత్మగౌరవం కోసం, న్యాయమైన ఆకాంక్షల కోసం పెనుగులాడుతున్నారు. ఈ సంఘర్షణను తెలుగు సృజనాత్మక సాహిత్యం అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది. మారుతున్న ఈ సామాజిక సందర్భాన్ని తెలుగు రచయితలు గతం కంటే శక్తివంతంగా వివిధ ప్రక్రియల్లో ప్రజానుకూల చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఈ వ్యక్తీకరణలకు, విశ్లేషణలకు అరుణతార మరింతగా వేదిక కావాలని మా ఆకాంక్ష. కథ, కవిత్వం, పాట, విమర్శ, పుస్తక సమీక్ష, అనువాదాలతోపాటు విశాల ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగంలోని ఏ విషయం మీదైనా రచనలు పంపండి. సాహిత్య, కళా సిద్ధాంత, భావజాలపరమైన వాదాలను, విమర్శలను, వివిధ భాషా సాహిత్యాల్లోంచి ప్రగతిశీల రచనలను అనువాదం చేసి పంపించండి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద, ఉద్యమాల మీద విశ్లేషణలు, నివేదికలు పంపించండి. రాజ్యహింసా రూపాల మీద వ్యాసాలు పంపండి. అమరులైన ప్రజా ఉద్యమ కార్యకర్తలు, బుద్ధిజీవులు, రచయితలపై స్మృతి వ్యాసాలు పంపించండి.

మీ రచనల వల్లే అరుణతార తాను నిర్దేశించుకున్న సాహిత్య, సాంస్కృతిక కర్తవ్యాలను, ప్రజా ఉద్యమ బాధ్యతలను మరింత శక్తివంతంగా నిర్వర్తించగలుగుతుంది. మీ రచనల వల్లే పత్రిక ప్రమాణాలు మరింత బలోపేతమవుతాయి. పత్రికలో వస్తున్న రచనల మీద ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, విమర్శలను రాసి మా కృషిని మెరుగులు దిద్దండి. అన్ని రకాలుగా మీ నుంచి సహకారాన్ని కోరుతూ...

- సంపాదకుడు

విప్లవ జనతన సర్కార్లను అన్ని విధాల ఆదుకోండి!
గ్రీన్‌హంట్ దాడులను ఖండించండి!

విప్లవాభిమానులారా, మిత్రులారా, కామ్రేడ్స్,

గత కొద్ది సంవత్సరాలుగా భారత దోపిడి పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి అండదండలతో భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించేందుకు గ్రీన్‌హంట్ పేరుతో క్రూరమైన దాడులకు పూనుకుంటున్నాయి. అమెరికన్ సామ్రాజ్యవాదులు రూపొందించిన ఎల్ఐసీ వ్యూహంలో భాగంగా సాగిస్తున్న బహుముఖ దాడి ఇది. ఈ మధ్యకాలంలో ఉన్నత స్థాయి నాయకత్వాన్ని కోల్పోయి విప్లవోద్యమం తీవ్రమైన నష్టాలకు గురైన విషయం మీ అందరికీ తెలిసిందే. ప్రస్తుతం భారత సైనిక బలగాలను శిక్షణా స్కూళ్ల ఏర్పాటు సాకుతో దండకారణ్యంలో మోహరించి వాటికి 'ఆత్మరక్షణ' పేరుతో దాడులు చేసే అధికారాలు కూడా ఇచ్చారు. జనతన సర్కార్లు నిర్మితమైన దండకారణ్యంలో శత్రువు భారీ విధ్వంసాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ 'సర్వం విధ్వంసం' గత ఏడేళ్లుగా నిరవధికంగా కొనసాగుతూ వస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీర్ఘకాల పథకంతో కుట్రపూరితంగా ప్రారంభించిన సల్వాజుడుం కాలంలో మొదలైన ఈ విధ్వంసం ఆదివాసీ ప్రజల ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. వాళ్ళు రోజంతా ఎంతో ప్రయాసకు ఓర్చి అనేక ప్రమాదాల మధ్య ఏరుకునే అటవీ ఉత్పత్తులను జుడుం ధ్వంసం చేసింది. అంతంత మాత్రంగా పండే వాళ్ల పంటలను సైతం జుడుం నాశనం చేసింది. ఇండ్లు తగులబెట్టింది. వ్యవసాయ పనిముట్లను పనికి రాకుండా చేసింది. చివరకు విత్తనాలు కూడా మిగలకుండా కాల్చి బూడిద చేసింది.

జుడుం అధ్యాయం ముగిసీ ముగియక ముందే గ్రీన్‌హంట్ దాడి మొదలైంది. ఇది మరింత దారుణంగా కొనసాగుతున్నది. సాముహిక హత్యలు, అత్యాచారాలు అనేకం జరిగి పోతున్నాయి. పోలీసుల రహస్య హంతక ముఠాలు విప్లవ కార్యక్రమాలను అడ్డుకోవడానికి అనేక విధాల కుట్రలకు పాల్పడుతున్నాయి. చివరకు జనతన సర్కార్‌కు చెందిన వ్యవసాయ కార్యకర్తలను హత్య చేయడమే కాకుండా ప్రజా ఉపాధ్యాయులను, ప్రజా వైద్యులను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. విప్లవ ప్రజలలో భయానక వాతావరణాన్ని సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రజలు తమ జీవన్మరణ పోరాటాల ద్వారా నిలబెట్టుకుంటున్న ప్రజా రాజ్యాధికార అంగాలను మొగ్గలోనే చిదిమివేయాలని శత్రువు రోజురోజుకూ దాడులను ముమ్మరం చేస్తున్నాడు. శత్రువు ప్రధానంగా సైనిక దాడుల్ని కొనసాగిస్తూనే బూటకపు అభివృద్ధి కార్యక్రమాలను (ఆర్థిక సంస్కరణలను) ముమ్మరం చేస్తున్నాడు. సమగ్ర యాక్షన్ పథకం పేరుతో 60 మావోయిస్టు ప్రభావిత జిల్లాలో 13 వేల కోట్ల రూపాయల్ని కుమ్మరిస్తూ రోడ్లు, వంతెనలు, భవనాలు వగైరా నిర్మించడానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగాయి. ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేయడం ద్వారా మావోయిస్టు ఉద్యమాన్ని లేకుండా చేస్తామని ప్రకటిస్తున్నారు. మరోవైపు దండకారణ్య వ్యాప్తంగా మోహరించబడిన ప్రభుత్వ సాయుధ బలగాలు 'ప్రజల హృదయాల్ని గెల్చుకోవడం' కోసం అనేక బూటకపు సంస్కరణ కార్యక్రమాలు చేపడుతున్నాయి. వీటిని సివిక్ యాక్షన్ ప్రోగ్రాం అని వ్యవహరిస్తూ పల్లెపల్లెనా వారంతపు సంతలలో, రోడ్లపైనా, ఎక్కడ బడితే పోలీసులు, అర్ధసైనిక బలగాలు ప్రత్యక్షమవుతూ వీటి అమలుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర సాయుధ బలగాలు ఎవరికి వారే ఈ కార్యక్రమాల్ని జనంపై రుద్దుతున్నారు. గిన్నెలు, మందులు, బట్టలు, సైకిళ్లు, ఒకటేమిటి.... అనేక రకాల వస్తువులు ఉచితంగా పంచుతున్నారు. మాకు అవసరం లేదని జనం వ్యతిరేకిస్తే బలవంతంగా అంటగడుతున్నారు. నిజానికి వాళ్ళు రెండు లక్ష్యాలతో వీటిని తెస్తున్నారు. ప్రజల్లో నుండి తమకు ఇన్‌ఫార్మర్లను తయారుచేసుకోవడం, విప్లవోద్యమం వైపు పోకుండా దోపిడి ప్రభుత్వం వైపు జనాన్ని ఆకర్షించడం, అయితే దీన్ని ప్రజలు తిరస్కరిస్తున్నారు.

ప్రజలు శత్రువు కొనసాగిస్తున్న క్రూరమైన దాడుల మధ్యనే తమ జనతన సర్కార్‌ను నడుపుకుంటున్నారు. తమ పిల్లల చదువుకోసం, వైద్యం కోసం చందాలు జమ చేసి నిధులు సమకూర్చుకుంటున్నారు. తమకు దొరికిన దాంట్లో నుంచి కొంత తమ సర్కార్‌కు అనే ఉన్నతమైన సమష్టి భావనతో వాళ్లు వ్యవహరిస్తున్నారు. జనతన సర్కార్ చేపట్టే అన్ని కార్యక్రమాలలో పెద్దెత్తున పాల్గొంటూ తమ శ్రమశక్తిని వెచ్చిస్తున్నారు. వ్యవసాయ దిగుబడులను పెంచుకోవడానికి, సగటు ఉత్పాదకతలో మెరుగుదల సాధించడానికి గత ఏడాది నుంచి భూముల చదును కార్యక్రమాలను క్యాంపెయిన్ల ద్వారా కొనసాగిస్తున్నారు. గత సంవత్సరం నిర్వహించిన మూడు వారాల క్యాంపెయిన్‌లో ప్రజలు ఐదు లక్షలకు పైగా పని దినాలలో వందలాది ఎకరాల భూములను చదును చేసుకున్నారు. పదుల కొద్ది చెరువులను మరమ్మతు చేసుకొని నూతనంగా కూడా కొన్ని నిర్మించుకున్నారు. దోపిడీ ప్రభుత్వాలు గత 64 ఏళ్లలో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ముందుకు తెచ్చిన 'వికాస' కార్యక్రమాలు అంతిమంగా ప్రజల వినాశనానికే దారితీశాయన్నది ఈనాడు దేశవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న సెజ్‌లు, భారీ పరిశ్రమలు, భారీ డ్యాంలు, మైనింగ్ పనులు, వాటికోసం కొనసాగుతున్న విధ్వంసకర సైనిక - సంస్కరణ కార్యక్రమాల ద్వారా స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితిలో విప్లవ ప్రజానీకాన్ని, వాళ్లు నిర్మించుకుంటున్న విప్లవ జనతన సర్కార్లను ఆర్థికంగా, హార్దికంగా ఆదుకోవల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

విప్లవాభిమానులారా, మిత్రులారా, కామ్రేడ్స్,

సల్వాజుడుం కాలంలో మీరిచ్చిన తోడ్పాటు అమూల్యమైనది. మా పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి అండగా నిలిచి మీరు ధైర్యంగా దోపిడీ ప్రభుత్వ జుడుం దాడులను ఎండగడుతూ, దాని నిజస్వరూపాన్ని బైటపెట్టడంలో చాలా కృషి చేశారు. ప్రజల నైతిక స్థైర్యాన్ని పెంచడానికి మీరు లీగల్‌గా చేయగలిగినదంతా చేశారు. చివరకు రాజ్యం చేస్తున్న దారుణాలను వాళ్ల రాజ్యాంగం ప్రకారమే, వాళ్ల సుప్రీంకోర్టే తప్పు పట్టేలా మీరు నిజాలను ప్రజల ముందుంచారు. నేటి భారత ప్రజాతంత్ర విప్లవోద్యమంలో మీ వంతు పాత్రను మీరు నిర్వహిస్తున్నందుకు విప్లవాభివందనాలు. గ్రీన్‌హంట్ దాడులను తిప్పికొట్టడానికి కూడా మీరు చేస్తున్న కృషి ప్రశంసనీయమైనది. గ్రీన్‌హంట్ రెండవ దశగా చెబుతూ ప్రభుత్వం మొదలుపెట్టిన దాడిలో చింతల్‌నార్ హత్యాకాండను, ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించి ప్రజలకు అండగా నిలబడ్డారు. భవిష్యత్తులో కూడా మా న్యాయమైన విప్లవోద్యమాన్ని సమర్థిస్తూ అండగా నిలబడతారని ఆశిస్తున్నాం. ఈ సంవత్సరం ఇక్కడి విప్లవ జనతన సర్కార్ చేపట్టిన వలభై చదును ప్రజా క్యాంపెయిన్‌కు అన్ని విధాల తోడ్పడాలనీ, ఆర్థికంగా, హార్దికంగా సహాయాన్ని అందించాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం. ఇక్కడి పిల్లల చదువు కోసం, వైద్యం కోసం కూడా మీరు శక్తి వంచన లేకుండా తోడ్పాటును అందిస్తారని విశ్వసిస్తున్నాం. పాదార్థిక సహాయాలతో పాటు శక్తి మేరకు చందాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

విప్లవాభినందనాలతో...

విప్లవ జనతన సర్కార్ సన్నాహక కమిటీ

దండకారణ్యం

మార్చి, 2012

KLVA101M 158

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
• RNI Regn.No.21152/72 • Published on 24/04/2012 290 - Jan-Feb, 2012

ఆదివాసీల జీవితం, పోరాటం - బుద్ధిజీవుల పాత్ర అనే అంశంపై
యాన్ మిర్డాల్‌తో ఫిబ్రవరి 3న జరిగిన చర్చాగోష్ఠి దృశ్యాలు



Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002,
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M158
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	101
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	narmda
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good